అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
బుధవారం 23-10-2024
సంపుటి : 10 | సంచిక : 294 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

రూ.9 లక్షల కోట్లు హాం ఫట్

సెన్సెక్స్ 930 పాయింట్ల పతనం
అన్ని రంగాలు నేల చూపులు



ముంబయి : అమ్మకాల వెల్లువతో దలాల్ స్ట్రీట్ మరోమారు కుప్పకూలింది. మంగళవారం బీఎస్ఈ సెన్సెక్స్, ఎన్ఎస్ఈ నిఫ్టీలు ఒక్క శాతం పైగా విలువ కోల్పోయాయి. ఉదయం లాభాల్లోనే ప్రారంభమైన సూచీలు.. కాసే పట్లోనే నష్టాల్లోకి జారుకున్నాయి. ఆ తర్వాత ఏ దశలోనూ కోలుకోలేదు. ఒక్క ... 13లో



'ఒకే దేశం - ఒకే ఎన్నిక' విధానంతో దేశ సమైక్యతకు ప్రమాదమని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీ.వీ.రాఘవులు హెచ్చరిం చారు. సీపీఐ(ఎం) హైదరాబాద్ సెంట్రల్ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో రాఘవులు ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో అధ్యక్ష తరహా పాలన తెచ్చేందుకు వీలుగా ముందుగా 'ఒకే దేశం - ఒకే ఎన్నిక' నినాదాన్ని తెచ్చారని చెప్పారు. అలాంటి పాలన కోసం కార్పొరేట్లు, హిందుత్వవాదులు ఒక్కటయ్యారని తెలిపారు. దీన్ని అమలు చేసేందుకు పార్లమెంటులో హాజరైన సభ్యుల్లో నాలుగింట మూడొంతులు లేదా మొత్తం సభ్యుల్లో మూడింట రెండొంతుల మంది మద్దతు అవసరమని తెలిపారు. సంఖ్యాబలం లేకపోయినప్పటికీ బీజేపీ ఇదే నినాదాన్ని మాత్రం ప్రజల్లోకి తీసుకెళ్తున్నదనీ, తద్వారా ప్రజలను, ఇతర రాజకీయపార్టీలను ఈ విధానానికి అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నిస్తున్నదని వివరించారు.

అధ్యక్ష తరహా పాలన కోసమే..

'ఒకే దేశం - ఒకే ఎన్నిక'పై సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీ.వీ.రాఘవులు

ఈ విధానంతో దేశ సమైక్యతకు ప్రమాదం
కార్పొరేట్లు, హిందుత్వవాదుల కోసమే నిర్ణయాలు
ప్రజల్లోకి వెళ్లి వివరించాలంటూ పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'ఒకే దేశం ఒకే ఎన్నిక' విధానం ప్రజాస్వామ్యానికే ప్రమాదమని సీపీఐ(ఎం) నేత బీవీ రాఘవులు అన్నారు. 2014లో అధికారంలోకి రాకముందు బీజేపీ మ్యానిఫెస్టోలో ఈ అంశాన్ని పొందుపరిచారనీ, 2017లో సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) వేసి నివేదిక ఇప్పించుకున్నారని గుర్తుచేశారు. 2018లో లా కమిషన్ ద్వారా మరోసారి నివేదిక, నిటిఆయోగ్ ద్వారా ఎలా చేయవచ్చో మరోసారి, ఇలా ప్రతి సందర్భంలో ప్రజల్లో ఆ విధానంపై చర్చ ఉండేలా జాగ్రత్త పడుతున్నారని తెలిపారు. ఈ విధానానికి అనుకూలంగా ప్రజలను ఒప్పించేందుకు బీజేపీ చెబుతున్న కారణాలు సహేతుకంగా లేవని విమర్శించారు. ఒకేసారి ఎన్నిక నిర్వహించినా ఖర్చు తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఎన్నికల ... 3లో

జీవితపు చరమాంకంలో ముంజేతి కర్ర ఆసరా లేకుండా అడుగేయని పండుటాకుల నుంచి మొదలుకుని అప్పుడే కండ్లు తెరిచిన పసిపాపల వరకూ.... బంగారు భవిష్యత్ కోసం కలలు కంటున్న యువతరం నుంచి మొదలుకుని కష్టాలనూ, కన్నీళ్లనూ దిగమింగుకుని బతుకు జట్కాబండీ లాగుతున్న సగటు జీవి వరకూ... అందరిలో ఏదో తెలియని భయం... ఎప్పుడేం జరుగుతుందోననే ఆందోళన. "మూసీ పునరుజ్జీవం" పేరిట సర్కార్ చేపట్టిన ప్రాజెక్ట్ తమను ఎక్కడ రోడ్డున పడేస్తుందేమోననే భయాందోళనల్లో నదీ పరివాహక ప్రాంత ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఎప్పుడొచ్చి అధికారులు తమ ఇండ్లను కూల్చుతారోననే భయం నిత్యం వారిని వెంటాడుతున్న నేపథ్యంలో.. నాగోల్ నుంచి బహదూర్‌పురా వరకు మూసీ నదీ తీరంలో పర్యటించిన 'నవతెలంగాణ' క్షేత్రస్థాయి పరిస్థితులపై అందిస్తున్న సమగ్ర కథనం.

మూసీ కన్నీళ్లు

పునరుజ్జీవం పేరిట నది ప్రక్షాళనకు సర్కార్ నిర్ణయం

మొదటి భాగం

పరివాహక ప్రాంత ప్రజల తరలింపునకు యత్నాలు
స్వచ్ఛందంగా వెళుతున్న నదీ గర్భంలోని బాధితులు
రివర్‌బెడ్ నివాసితుల్లో భిన్నాభిప్రాయాలు
ససేమిరా అంటున్న బఫర్‌జోన్ నివాసితులు
ఇప్పటికే పలు ప్రాంతాల్లో ఇండ్ల తొలగింపు
భయాందోళనలో పరివాహక ప్రజలు



ఊరగొండ మల్లేశం

మూసీ ఒక సుందరమైన నది. చారిత్రక హైదరబాద్ నగరానికి తలమానికంగా విరాజిల్లింది. అయితే అదంతా ఒకప్పుడు. ఇప్పుడు దేశంలోనే అత్యంత కలుషితమైన నదిగా మారింది. నగరం మధ్యనుంచి దాదాపు 55 కిలోమీటర్లు ప్రవహిస్తున్న ఈ నది కాలుష్య మయంగా మారడం వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ మసకబారుతున్నదనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతున్నది. ఈ క్రమంలో దీన్ని పూర్తిగా మార్చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. లండన్‌లోని థేమ్స్, సియోల్ లోని చియోంగ్ జియోన్ నదీ లాగా మూసీని ... 14లో

మా శవాల మీదుగా మూసీని ప్రక్షాళన చేయండి



ప్రభుత్వం మా శవాల మీద మూసీ ప్రక్షాళన చేయాల్సిందే తప్ప ఇక్కడి నుంచి కదిలేది లేదు. పట్టా భూమి కొనుగోలు చేసి ఇల్లు కట్టుకున్నాం. అప్పటి అధికారులు ఎందుకు రిజిస్ట్రేషన్ చేశారు? ఎందుకు విద్యుత్, వాటర్ కనెక్షన్ ఇచ్చారు? అధికారు లు అప్పుడే నిరాకరిస్తే ఇవ్వే డబ్బులు పెట్టి ఫ్లాట్ కొనుక్కునేవాళ్లం. తప్పంతా సర్కార్ కాడ పెట్టుకుని ఇప్పుడు కూల్చు తామంటే ఎట్ల. ప్రభుత్వం సమాధానం చెప్పాలి.

- ప్రేమలత గౌడ్, గృహిణి, మారుతీనగర్, నాగోల్

పునరావాసం తర్వాతే నిర్వాసితుల్ని తరలించాలి



ఎండి.అబ్బాస్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

మూసీ నదీ తీరంలో నివసించే పేదలకు పునరావాసం కల్పించిన తర్వాతే వారిని అక్కడి నుంచి తరలించాలి. బాధితులకు ప్రత్యామ్నాయం చూపకుండా ఖాళీ చేస్తే ఊరుకునే ప్రసక్తి లేదు. దశా బ్దాలుగా ఈ నదీ తీరంలో ఆవాసం ఉంటున్న వారిలో పేదలు, మధ్య తరగతి వారే ... 14లో

బీఎస్ఎన్ఎల్‌కు కాషాయ లోగో

ఆవిష్కరించిన కేంద్రం

ఫైబర్ నెట్‌తో 500 లైవ్ టీవీ ఛానళ్లు

రంగుమార్చటంపై ప్రతిపక్షాల ఆగ్రహం

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగ టెల్కో భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) లోగో మారింది. మంగళవారం న్యూఢిల్లీలో బీఎస్ఎన్ఎల్ నూతన లోగో సహా కొత్తగా ఏడు సర్వీసులను కేంద్ర టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా లాంచనంగా ప్రారంభించారు. వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు వీలుగా స్పామ్ మెసేజ్‌లతో పాటు స్కామ్ కాల్స్‌ను ఆటోమేటిక్‌గా గుర్తించేందుకు బీఎస్ఎన్ఎల్ ఏర్పాట్లు చేస్తోంది. తన ఫైబర్ ఇంటర్నెట్ వినియోగదారుల కోసం నేషనల్ వైఫై రోమింగ్ సేవలను ప్రారంభించింది. దీంతో అదనపు చార్జీలు లేకుండా బీఎస్ఎన్ఎల్ హాట్‌స్పాట్స్‌లలో హైస్పీడ్ సేవలను పొందేందుకు అవకాశం కల్పించింది. ఫైబర్ ఇంటర్నెట్ కలిగిన వినియోగదారులు ఏకంగా 500లకు పైగా లైవ్ ఛానల్స్, పే టీవీ ఆప్షన్‌లతో కూడిన సేవలు పొందవచ్చు. టీవీ స్ట్రీమింగ్ కోసం వినియోగించే డేటా నెలవారీ ఇంటర్నెట్ డేటా పరిగణనలోకి రాదని బీఎస్ఎన్ఎల్ స్పష్టం చేసింది. ఆటోమెటెడ్ కియోస్కుల ద్వారా సిమ్ కార్డ్‌లను సులభంగా కొనుగోలు చేయడానికి, అప్‌గ్రేడ్ చేసుకోవడానికి వీలు కల్పిస్తోంది. ప్రయివేటు టెల్కోలు రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్‌లకు ధీటుగా ఇప్పటికే తక్కువ టారీఫ్‌ల్లో సేవలందిస్తున్న బీఎస్ఎన్ఎల్ సమీప రోజుల్లోనూ ఎలాంటి రీచార్జీ ధరలను పెంచే యోచన లేదని స్పష్టం చేయడం విశేషం. అయితే బీఎస్ఎన్ఎల్ లోగోను కాషాయరంగులోకి మార్చటం పట్ల ప్రతిపక్షాలు, వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.





'ప్రయివేటీకరణ'తో
మహిళలకు ముప్పు

దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి
సమానత్వానికి మనుధర్మం చేటు

మహిళలు అభ్యుదయభావాల దిశగా నడవాలి :
ఐద్వా రాష్ట్ర 4వ మహాసభలో జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే

నవతెలంగాణ-ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలతో మహిళలకు ముప్పు పొంచి ఉందని ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే హెచ్చరించారు. దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆర్థిక భారాలు ఎందుకు పెరుగుతున్నాయో ఆలోచించాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం క్లబ్‌లో మంగళవారం ప్రారంభమైన అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలకు హాజరైన ధావలే ప్రసంగించారు. ప్రభుత్వాలు ఏ రకమైన విధానాలు తీసుకుంటు న్నాయి? నిరుద్యోగులు, అసంఘటిత రంగ కార్మికుల సమస్యలు ఏంటి? ప్రభుత్వాలు ప్రజలపై ఎలాంటి భారాలు మోపుతున్నాయి? ప్రజా బాహుళ్యంలో ఉన్న సంఘంగా మహిళల ... 3లో

ఉద్యోగుల ఉద్యమబాట

28న సీఎం, సీఎస్‌కు కార్యాచరణ అందిస్తాం

నవంబర్ 2న జిల్లాల కలెక్టర్లకు లేఖ ఇస్తాం
7 నుంచి ఉమ్మడి జిల్లాల్లో సమస్యల సాధన సదస్సులు
జనవరి 30న రాష్ట్రవ్యాప్తంగా మానవహారం
26న క్యాబినెట్‌లో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి
పెండింగ్‌లో ఐదు డీఏలు ఎప్పుడూ లేవు
దీపావళి కానుకగానైనా ప్రకటించాలి
సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగ జేఏసీతో చర్చించాలి :
ఉద్యోగ జేఏసీ చైర్మెన్ జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ శ్రీనివాసరావు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమస్యల సాధన కోసం తెలంగాణ ఉద్యోగ జేఏసీ ఉద్యమ కార్యాచరణను ప్రకటించింది. పెండింగ్‌లో ఉన్న డీఏలు ప్రకటించాలనీ, వివిధ రకాల బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేసింది. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరింది. ఈనెల 26న జరిగే క్యాబినెట్‌లో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని విజ్ఞప్తి చేసింది. ఈనెల 28న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారిని కలిసి ఉద్యమ కార్యాచరణను అందించాలని నిర్ణయించింది. వచ్చేనెల రెండున అన్ని జిల్లాల జేఏసీల ఆధ్వర్యంలో ఆయా జిల్లాల కలెక్టర్లకు కార్యాచరణ లేఖను అందించాలని ... 13లో

ఎన్ఐసీకి ధరణి

రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
25న బదలాయింపుపై ఆయా సంస్థలతో సమావేశం
భూ సమస్యలకు త్వరలో పరిష్కారం :
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



వివరాలు 6లో..

రూ.49 కోట్లతో
అసెంబ్లీ పునరుద్ధరణ పనులు

అగాఖాన్ ట్రస్ట్‌కు అప్పగింత
బీఆర్ఎస్‌కు ఇంకా బుద్ధి రాలేదు :
మంత్రులు కోమటిరెడ్డి, శ్రీధర్‌బాబు విమర్శ

వివరాలు 13లో..



సెబీ చీఫ్ మాధబికి
కేంద్రం క్లీన్‌చిట్

అదానీ గ్రూప్ సహా పలు కంపెనీలతో పరస్పర విరుద్ధ ప్రయోజనాలు

హిండెన్‌బర్గ్ రిపోర్టు..ఉద్యోగుల నిరసనలపై మోడీ సర్కార్ నీళ్లు

న్యూఢిల్లీ : పలు కార్పొరేట్ సంస్థలతో అంటకాగుతూ పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు పాల్పడ్డారని తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజీ బోర్డు ఆఫ్ ఇండియా ... 13లో



ఏసీబీ వలలో
మున్సిపల్ కమిషనర్

రూ.20వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ కె.ఆదిశేషు

నవతెలంగాణ- పెబ్బేరు

అవినీతికి అలవాటు పడ్డ అధికారి ఏసీబీ వలలో పడ్డారు. వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ కె.ఆదిశేషు.. కాంట్రాక్టర్ నుంచి రూ. 20వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు ... 13లో



ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనాలి

స్పష్టం చేసిన ప్రధాని మోడీ

అవసరమైతే సాయానికి సిద్ధమని వెల్లడి
కజన్‌లో బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో పుతిన్‌తో భేటీ

వివరాలు 6లో..

అకాల వర్షాలతో విలవిల

కొనుగోలు కేంద్రాల్లో తడిసి ముద్దయిన వరి

పిడుగుపాటుకు ఒకరు మృతి 5లో..

మానవాళిపై వ్యాధుల పంజా

సరిహద్దులు చెరిపేస్తూ వ్యాప్తి | ఊతమిస్తున్న ఘర్షణలు, యుద్ధాలు

ప్రపంచంలో నేటికీ నాలుగైదు వందల కోట్ల మంది ప్రజలకు అత్యవసర ఆరోగ్య సేవలు అందుబాటులో లేవని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కుండబద్దలు కొట్టింది. వివిధ దేశాలలో లక్ష మంకీపాక్స్ కేసులు వెలుగు చూశాయని, కనీసం 200 మంది ప్రాణాలు కోల్పోయారని 'యూరోపియన్ సెంటర్ ఫర్ డిసీజ్ ప్రివెన్షన్ అండ్ కంట్రోల్' తెలపడంతో ఈ సంవత్సరం ప్రారంభంలో డబ్ల్యూహెచ్ఓ ప్రజారోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడు వివిధ దేశాలను వ్యాధులు పట్టిపీడిస్తున్నాయి. సూడాన్‌లో కలరా విలయతాండవం చేస్తోంది. దీని బారిన పడిన పదిహేను వేల మందిలో 473 మంది చనిపోయారు. తాజాగా ఓ కొత్త కోవిడ్ వేరియంట్ వచ్చిపడింది. అది ఇప్పటికే 27 దేశాలలో వ్యాపించింది. వందలాది మందిపై ప్రభావం చూపుతోంది.

ఔషధాలకూ లొంగడం లేదు

వాతావరణ మార్పులతో మరింత ప్రబలం
తొలగని మంకీపాక్స్ ముప్పు
'కోవిడ్' పాఠాలు నేర్వని పాలకులు, ప్రజలు



న్యూఢిల్లీ : బాక్టీరియా, వైరస్‌లు, ఫంగీ, పారాసైట్స్ వంటి సూక్ష్మజీవులు ఔషధాలకు లొంగని పరిస్థితిని వైద్య పరిభాషలో యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) అంటారు. ఈ పరిస్థితి ప్రపంచవ్యాప్తంగా మానవ ఆరోగ్యానికి పెను ముప్పు కలిగిస్తుంది. ప్రపంచ దేశాలలో సంభవిస్తున్న మరణాలకు ప్రధాన కారణం ఏఎంఆర్‌యేనని జనవరిలో దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు కూడా వెల్లడించింది. 2050 నాటికి ఏఎంఆర్ కారణంగా కోటి మంది ప్రాణాలు కోల్పోతారని హెచ్చరించింది. 2050 నాటికి వాతావరణ మార్పుల కారణంగా 1.45 కోట్ల మరణాలు సంభవిస్తాయని, ప్రపంచానికి ఆర్థికంగా 12.5 ట్రిలియన్ ... 5లో



వక్ఫ్ బిల్లుపై వాగ్వాదం

జేపీసీలో టీఎంసీ ఎంపీ, ప్రతిపక్ష నేతల నిలదీత

గ్లాస్ పగులగొట్టిన టీఎంసీ సభ్యుడువేళ్లకు గాయం
ఆయనపై ఒకరోజు సస్పెన్షన్ వేటు బీజేపీ నేత అభిజిత్ గంగోపాధ్యాయతో, కళ్యాణ్ బెనర్జీ ఘర్షణ

వివరాలు 3లో..

దళితుల అభ్యున్నతికి పాటుపడేది కమ్యూనిస్టులే

- సామాజిక న్యాయం కోసం ఉద్యమించాలి
- జనవరి 5 నుంచి హైదరాబాద్‌లో ఏఐడీఆర్‌ఎం జాతీయ మహాసభలు : సన్నాహక సమావేశంలో కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

దేశానికి స్వాతంత్రం వచ్చి 77 ఏండ్లు పూర్తి చేసుకున్నా అట్టడుగు వర్గాలైన దళితుల అభ్యున్నతి కోసం రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు ఇప్పటికీ వారికి అందడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు అన్నారు. వారి హక్కులు, అభ్యున్నతి కోసం పాటుపడేది, కొట్లాడేది కమ్యూనిస్టులేనని చెప్పారు. అఖిల భారత దళిత హక్కుల పోరాట సమితి (ఏఐడీఆర్‌ఎం) జాతీయ రెండో మహాసభల సన్నాహక సమావేశాన్ని ఆ సంఘం నాయకులు కె యేసు రత్నం అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్ రాజ్ బహదూర్ గౌరు హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ రాజ్యాంగం ప్రతి మనిషికీ ఓటు హక్కు కల్పించడం మహత్తరమైనదని అన్నారు. సమ న్యాయకల్పనలో ప్రభుత్వాల కృషిలో లోపం కనిపిస్తున్నదని విమర్శించారు. తరతరాలగా అణచివేత, అంటరానితనం, వివక్షత, దోపిడీ, పీడనాల కింద నలిగిపోతున్న అట్టడుగు వర్గాలైన దళితుల అభివృద్ధి లక్ష్యంగా దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం కోసం ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యా వైద్య వ్యాపారాన్ని రద్దు చేయాలనీ, అవినీతికి వ్యతిరేకంగా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ప్రకృతి సంపద ప్రజలకే దక్కాలని పోరాడాలని కోరారు. ఏఐడీఆర్‌ఎం జాతీయ రెండో మహాసభలు హైదరాబాద్‌లో వచ్చే ఏడాది జనవరి ఐదు నుంచి ఏడో తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దళితులకు కనీస రక్షణ కరువవుతున్నదని విమర్శించారు. మోడీ ప్రధాని అయ్యాక సుమారు రెండు లక్షల దాడులు జరిగినట్టు కేంద్ర సామాజిక న్యాయ శాఖ ప్రకటించిందని గుర్తు చేశారు.



ఉన్ని బ్లాంకెట్లు నెలకోసారి శుభ్రం

ఆర్టీఐ ప్రశ్నకు రైల్వే మంత్రిత్వ శాఖ సమాధానం

న్యూఢిల్లీ : రైళ్లలో ఏసీ కోచ్ ప్రయాణీకులకు అందించే బ్లాంకెట్లను ఎన్ని సార్లు ఉతుకుతారని సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రిత్వ శాఖ సమాధానమిచ్చింది. ప్రయాణీకులకు అందించే లైనిన్‌ను.. వారు ఉపయోగించిన ప్రతిసారీ శుభ్రపరుస్తామని పేర్కొన్నది. అయితే, అందుబాటులో ఉన్న సామర్థ్యం, లాజిస్టిక్స్ ఏర్పాట్లకు కట్టుబడి ఉన్ని దుప్పట్లు మాత్రం కనీసం నెలకోసారి, ప్రధానంగా రెండు నెలలకోసారి ఉతుకుతారని వివరించింది. దూరం వెళ్లే రైళ్లలోని హౌజ్‌కీపింగ్ స్టాఫ్ కూడా ఇదే విషయాన్ని వెల్లడించింది. నెలకోసారి బ్లాంకెట్లను ఉతుకుతామని చెప్పింది. మరకలు, వాసన వచ్చినపుడు మాత్రమే ఎక్కువసార్లు ఉతుకుతామని వివరించటం గమనార్హం. బ్లాంకెట్లు, బెడ్‌షీట్లు, పిల్లో కవర్లకు ప్యాసింజర్ల నుంచి చార్జీ రూపంలో ఏమైనా వసూలు చేస్తారా అని అడిగిన ప్రశ్నకు భారత రైల్వే సమాధానమిచ్చింది. "ఇదంతా రైలు ఛార్జీల ప్యాకేజీలో భాగం. గరీబ్‌రథ్, దురొంతో వంటి రైళ్లలో పిల్లో, బెడ్‌షీట్లు వంటివి టికెట్ల బుకింగ్ సమయంలో చేసుకున్న ఎంపిక ఆధారంగా చేసే అదనపు చెల్లింపులతో పొందొచ్చు" అని వివరించింది.

'దుర్వాసన, మరకలుంటేనే లాండ్రీ సర్వీసుకు'

దురంతో వంటి పలు రైళ్లలోని హౌజ్‌కీపింగ్ స్టాఫ్ మాత్రం రైల్వే లాండ్రీ విషయంలో వాస్తవాలను పంచుకున్నది. "ప్రతి ట్రిప్ తర్వాత, లాండ్రీ సర్వీస్‌కు ఇవ్వటానికి దుప్పట్లు, పిల్లో కవర్ల(లైనిన్)ను బండిల్స్‌గా కడతాం. దుప్పట్ల విషయంలో, వాటిని శుభ్రంగా మడతపెట్టి, కోచ్‌లో పెడతాం. దుర్వాసన రావటం కానీ, ఆహారం మరకలు ఉంటేనే మేము వాటిని లాండ్రీ సర్వీసుకు పంపుతాం" అని హౌజ్‌కీపింగ్‌స్టాఫ్ వివరించటం గమనార్హం. దుప్పట్లను శుభ్రం చేసే విషయంలో ఎలాంటి పర్యవేక్షణా లేదని పలు ట్రైన్లలో పదేండ్ల పాటు పని చేస్తున్న హౌజ్‌కీపింగ్‌స్టాఫ్‌కు చెందిన ఒక వ్యక్తి చెప్పాడు. "నెలకు రెండు సార్లు దుప్పట్లు ఉతుకుతారన్న గ్యారెంటీ లేదు. చాలా సందర్భాల్లో, దుర్వాసన, తడితనం, ఇతర ఏవైనా మరకలు కనబడితేనే ఆ దుప్పట్లను మేము ఉతకటం కోసం పంపిస్తాం. కొన్ని సందర్భాల్లో ప్యాసింజర్ ఫిర్యాదు చేస్తే మేము వెంటనే శుభ్రమైన బ్లాంకెట్‌ను అందజేస్తాం" అని సదరు వ్యక్తి వివరించటం గమనార్హం.

'ఉన్ని దుప్పట్ల వాడకం వద్దు'

ఉన్ని దుప్పట్ల వినియోగాన్ని ఆపాలని ఎన్విరాన్‌మెంట్ అండ్ హౌజ్‌కీపింగ్ మేనేజ్‌మెంట్ (ఈఎన్‌హెచ్‌ఎం) రిటైర్డ్ సీనియర్ అధికారి ఒకరు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "దుప్పట్లు బరువుగా ఉంటాయి. వాటిని సరిగ్గా ఉతకటం కష్టం. ఇకనైనా భారత రైల్వే తప్పకుండా ఈ బ్లాంకెట్ల వాడకాన్ని ఆపాలి" అని వివరించారు.

రైల్వే లాండ్రీలలో కాంట్రాక్టు సిబ్బంది

దేశంలో భారత రైల్వేకు 46 డిపార్ట్‌మెంటల్ లాండ్రీలు, 25 బూట్ లాండ్రీలు ఉన్నాయని ఆర్టీఐ ప్రశ్నకు సంబంధిత మంత్రిత్వ శాఖ సమాధానమిచ్చింది. డిపార్ట్‌మెంటల్ లాండ్రీలలో భూమి, వాషింగ్ మెషిన్లు వంటివి భారత రైల్వేకు చెందినవేననీ, అయితే అందులో పని చేసే సిబ్బంది మాత్రం కాంట్రాక్టు బేసిస్‌లో పని చేస్తారని భారత రైల్వే సీనియర్ అధికారులు కొందరు తెలిపారు. అలాగే, బూట్ లాండ్రీలలో భూమి భారత రైల్వేకు చెందినదైతే.. వాషింగ్ పరికరాలు, సిబ్బంది మాత్రం ప్రయివేటు పార్టీ లేదా సంబంధిత కాంట్రాక్టర్‌కు చెందినవారుంటారని వివరించారు.



జార్ఖండ్ బీజేపీలో ముసలం

టిక్కెట్ల కేటాయింపుపై అసమ్మతి

- బంధుప్రీతిపై వెల్లువెత్తిన ఆరోపణలు
- పలువురి రాజీనామా

రాంచీ : వారసత్వ రాజకీయాలకు తాను వ్యతిరేకమంటూ గొప్పలు చెప్పుకునే బీజేపీకి జార్ఖండ్‌లో 'బంధుప్రీతి' సెగ తగులుతోంది. పార్టీ టిక్కెట్ల కేటాయింపులో నేతల బంధువులకు పెద్దపీట వేశారంటూ ఆరోపణలు వెల్లు వెత్తుతున్నాయి. ముగ్గురు మాజీ ముఖ్యమంత్రుల కుటుంబ సభ్యులకు టిక్కెట్లు దక్కడంపై పలువురు నేతలు మండిపడుతున్నారు. ఇతర పార్టీలనుండి వచ్చిన వారికి, లోక్‌సభ ఎన్నికలలో పోటీచేసి ఓడిపోయిన వారికి బీజేపీ టిక్కెట్లు ఇవ్వడం వారికి రుచించడంలేదు. దీంతో ఇప్పటికే కొందరు నేతలు పార్టీకి గుడ్‌బై చెప్పేశారు.

ఫిరాయింపుదారులకు పెద్దపీట

జేఎంఎం వ్యవస్థాపకుడు శిబు సొరేన్ కోడలు సీతా సొరేన్ లోక్‌సభ ఎన్నికలకు ముందు బీజేపీలో చేరారు. జంతారా లోక్‌సభ స్థానం నుండి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి పరాజయం పాలయ్యారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి మధుకోడా భార్య గీతా కోడా, సమీర్ ఓరాన్ లోక్‌సభ ఎన్నికలలో ఓటమి చవిచూసినా వారికి శాసనసభ ఎన్నికలలో పోటీ చేసేందుకు అవకాశం ఇచ్చారు. మాజీ ముఖ్యమంత్రి చంపయ్ సొరేన్ సన్నిహితుడైన లోబిన్ హేమ్‌బ్రమ్ జేఎంఎంకు రాజీనామా చేసి బీజేపీలో చేరితే ఆయనకు కూడా టిక్కెట్ దక్కింది. ఎన్సీపీ మాజీ నాయకుడు కమలేష్ సింగ్, కాంగ్రెస్ మాజీ నేతలు మంజు దేవి, సన్నీ టొప్పో కూడా బీజేపీ టిక్కెట్లు పొందారు.

రాజీనామాల పర్వం

ఈ పరిణామాలపై బీజేపీలో తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం చెలరేగుతున్నాయి. 2014 శాసనసభ ఎన్నికలలో ముఖ్యమంత్రి హేమంత్ సొరేన్‌ను ఓడించిన బీజేపీ నాయకుడు లోయిస్ మరాండీ పార్టీకి రాజీనామా చేసి జేఎంఎంలో చేరారు. చంపయి సొరేన్, ఆయన కుమారుడు...వీరిద్దరికీ ఎందుకు టిక్కెట్లు ఇవ్వాలని పార్టీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు సందీప్ వర్మ ప్రశ్నించారు. శాసనసభ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ఆయన సూచన ప్రాయంగా చెప్పారు. బీజేపీకే చెందిన లక్ష్మణ్ తుడు, బస్కో బెస్రా, గణేష్ మహలీ, కునాల్ సారంగి వంటి నాయకులు పార్టీని వీడి జేఎంఎం తీర్థం పుచ్చుకున్నారు.

పార్టీలో కొంత అసంతృప్తి ఉండడం సహజమేనని బీజేపీ రాష్ట్ర సహ-ఇన్‌ఛార్జ్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ సమర్థించుకున్నారు. కాగా ఇక్కడ కొసమెరుపేమిటంటే జేఎంఎం, కాంగ్రెస్ పార్టీలు కూడా నేతల బంధువులకు టిక్కెట్లు ఇచ్చాయి.

మహారాష్ట్రలో బీజేపీకి షాక్

పవార్ గూటికి చేరిన నవీ ముంబయి నేత

ముంబయి : మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల వేళ బీజేపీకి ఎదురు దెబ్బ తగిలింది. బీజేపీ నవీ ముంబయి జిల్లా అధ్యక్షుడు సందీప్ నాయక్ మంగళవారం పార్టీకి రాజీనామా చేసి శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీలో చేరారు. బేలాపూర్ శాసనసభ స్థానం నుండి పోటీ చేసేందుకు సందీప్‌కు బీజేపీ టిక్కెట్ నిరాకరించింది. సిట్టింగ్ ఎమ్మెల్యే మందా మాత్రేని మళ్లీ బరిలో దింపింది. దీంతో ఆగ్రహించిన సందీప్ పార్టీ ఫిరాయించారు. ఆయన బేలాపూర్ స్థానం నుండే పోటీ చేసే అవకాశాలు ఉన్నాయి. నవీ ముంబయి ప్రాంతంలో సందీప్ కుటుంబానికి మంచి పట్టుంది. అయితే సందీప్ తండ్రి గణేష్ నాయక్‌కు నవీ ముంబయిలోని అయిరోలీ స్థానాన్ని బీజేపీ కేటాయించింది. సందీప్‌ను బుజ్జగించి పార్టీలో కొనసాగేలా చేసేందుకు బీజేపీ నాయకత్వం చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

'ప్రయివేటీకరణ'తో మహిళలకు ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

ముందున్న సవాళ్లు ఏంటి? పరిశీలించాలని సూచించారు. దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సమానత్వానికి విఘాతం, ధరల పెరుగుదల, నిత్య సమస్యలన్నింటికీ మూల కారణాలు ఏంటో తెలుసుకోవాలన్నారు. సింగరేణి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ పనిచేస్తున్నదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలతో మహిళలకు ముప్పు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రాజ్యాంగం స్త్రీ, పురుష సమానత్వాన్ని సూచిస్తుంటే.. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ల మనుధర్మం దీనికి భిన్నంగా ఉంటుందన్నారు. బ్యాంకు ఉద్యోగాల నియామక సమయంలో గర్భిణులను పరిగణనలోకి తీసుకోవద్దని కేంద్ర ప్రభుత్వ రంగ బ్యాంకులు జారీ చేసిన సర్క్యులర్‌కు వ్యతిరేకంగా ఐద్వా పోరాటం చేసిందని గుర్తు చేశారు. ఫలితంగా ఆ ఉత్తర్వులు రద్దయ్యాయని అన్నారు. మొదటి కాన్పుకే ప్రసూతి సెలవులు ఇస్తామనడాన్ని సైతం ఐద్వా వ్యతిరేకించి.. సత్ఫలితాలను సాధించిందని తెలిపారు. తెలంగాణలో కులదురహంకార హత్యలు పెరుగుతుండటంపై ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల్లో మూఢనమ్మకాలు పెరుగుతున్నాయని, మోడీ ప్రధాని అయ్యాక స్త్రీలు తిరోగమన దిశలో పయనిస్తున్నారని చెప్పారు. దళిత, గిరిజన మహిళలపై దాడులు పెరిగాయని అన్నారు. మహిళల ముందు అనేక సవాళ్లు ఉన్నాయని తెలిపారు. పితృస్వామిక విధానాలకు వ్యతిరేకంగా మహిళలను అభ్యుదయం వైపు మళ్లించాలని సూచించారు. అభ్యుదయ భావాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. మహిళలకు చేరువయ్యేలా ఐద్వా



విధానాలు ఉండాలని సూచించారు.

రణ నినాదమై ఐద్వా ముందుకు కదలాలి : మాజీ ఎంపీ మిడియం బాబూరావు

రణ నినాదమై ఐద్వా ముందుకు కదలాలని మాజీ ఎంపీ మిడియం బాబూరావు పిలుపునిచ్చారు. ఆహ్వాన సంఘం తరపున మహాసభల్లో ఆయన స్వాగతోపన్యాసం చేశారు. ఐద్వా పోరాట ఫలితంగా సింగరేణిలో మహిళలకు స్థానం లభించిందని తెలిపారు. గని ప్రాంతం నుంచే కొండపల్లి దుర్గాదేవి వంటివారు తమ కార్యకలాపాలు కొనసాగించారని చెప్పారు. అశ్వారావుపేట ప్రాంతంలో తయారయ్యే న్యూస్ ప్రింట్ కాగితం తయారీకి కావాల్సిన చిత్తు కాగితాల సేకరణలో 90శాతం మహిళలే ఉన్నారని అన్నారు. సమాన పనికి సమాన వేతన చట్టం అమలు కావడం లేదన్నారు. ఉద్యమ గడ్డను విచ్ఛిన్నం చేసేందుకు పాలకవర్గాలు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఏడు మండలాలను వేరు చేశాయని తెలిపారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ ఇప్పటికీ మహిళలపై వ్యతిరేక వైఖరితోనే వ్యవహరిస్తున్నాయని చెప్పారు. అల్ట్రాసోనోగ్రఫీ సాంకేతికతతో ఆడపిల్లని తెలిస్తే గర్భవిచ్ఛిత్తికి పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయోధ్యకు ఇచ్చే ప్రాధాన్యత భద్రాద్రి రామునికి లేదన్నారు. కారణం ఇక్కడి రాముడు అణగారిన వర్గాల దేవుడు కావడమేనని చెప్పారు.

మహిళల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివక్ష : రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి విమర్శించారు. స్త్రీని రెండో తరగతిగా చూస్తూ సమాన అవకాశాలు కల్పించడం లేదన్నారు. ఆశాలు, అంగన్వాడీలు, మధ్యాహ్న భోజన వర్కర్లకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రూ.26 వేల కనీస వేతనం కూడా అమలు చేయడం లేదన్నారు. ప్రయివేటు సంస్థల్లో పని చేస్తున్న వారికి మెటర్నిటీ లీవ్స్ అమలయ్యేలా ప్రభుత్వ చర్యలు ఉండాలని కోరారు. దేశంలో 15 కోట్ల ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉంటే మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని 8000 కోట్లకు తగ్గించిందని తెలిపారు. తొలగించిన వారిలో అత్యధికులు మహిళలే ఉన్నారని చెప్పారు. గత పదేండ్లలో స్త్రీ, పురుషుల మధ్య ఆర్థిక అసమానతలు ఎక్కువయ్యాయని చెప్పారు. మహిళలపై హింస నానాటికి పెరుగుతోందన్నారు. రోజుకు 88 లైంగికదాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన ఆహారం లేక 50 శాతం మంది మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారని తెలిపారు. దేశంలో 76శాతంగా ఉన్న వ్యవసాయ కూలీల్లో అత్యధికులు మహిళలేనని తెలిపారు. ఆరు గ్యారంటీల్లో భాగంగా మహిళలకు భద్రత కల్పించాలన్నారు. పోర్న్ వీడియోలు, డ్రగ్స్, మద్యాన్ని నియంత్రించాలని డిమాండ్ చేశారు.

మహాసభల ప్రారంభానికి ముందు ఐద్వా సీనియర్ నాయకురాలు బత్తుల హైమావతి జెండా ఆవిష్కరించారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగలక్ష్మి సంతాప తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. మల్లు స్వరాజ్యం, కొండపల్లి దుర్గాదేవి, లక్ష్మీ దేవమ్మ, కుంజా కృష్ణకుమారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఐద్వా జాతీయ అధ్యక్షులు, కోశాధికారి ఎస్ పుణ్యవతి, ఉపాధ్యక్షురాలు సుధా సుందర్ రామన్, తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు బుగ్గవీటి సరళ, టి. జ్యోతి, కేఎన్ ఆశాలత, రాష్ట్ర సహాయ కార్యదర్శి మందలపు జ్యోతి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు డి. సీతాలక్ష్మి, ఆఫీస్ బేరర్స్ మాచర్ల భారతి, అనురాధ, మహేశ్వరి, గీత, రత్నమాల, లక్ష్మమ్మ, శశికళ, వినోద, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్ష తరహా పాలన కోసమే..

(మొదటి పేజీ తరువాయి)

ప్రవర్తనా నియమావళి అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకంగా మారితే అందరి సమ్మతితో దాన్ని సవరించుకోవచ్చని సూచించారు. పరిపాలనా సౌలభ్యానికి పలుమార్లు జరిగే ఎన్నికలు ఆటంకం కాదన్నారు. ఒకేసారి ఎన్నికలంటే ప్రజలెన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వాలను కాలం ముగియకముందే మోడీ రద్దు చేస్తారా? మధ్యలో కూలిపోతే మళ్లీ ఎన్నికలు నిర్వహించకుండా గవర్నర్ ద్వారా పరోక్షంగా పాలిస్తారా? ఒకేసారి ఎన్నికలు జరిగితే జాతీయ అంశాలు మాత్రమే పరిగణనలోకి తీసుకుని స్థానిక ఎన్నికల్లోనూ ఓట్లు వేయాలా? అని ఆయన ప్రశ్నించారు. కేవలం రాష్ట్రాలకున్న హక్కులను హరించి పెత్తనం చెలాయించేందుకే ఈ విధానం ఉపయోగపడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పెత్తనపు పోకడలు ఖలిస్తాన్ లాంటివి రావడానికే తప్ప సమాఖ్య భావనకు ఉపయుక్తం కాదని హితవు పలికారు. సమాఖ్య రాజ్యంలో రాష్ట్రాల పరిధిలోని అంశాలను సైతం లెక్క చేయకుండా కేంద్రం చట్టాలు చేస్తున్నదనీ, వాటిని ఇలా బలహీనపరిస్తే ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చని తెలిపారు. 'ఒకే దేశం – ఒకే ఎన్నిక', ఒకే పన్ను, ఒకే భాష, ఒకే మతం, ఒకే జాతి, ఒకే భోజనం (శాఖాహార భోజనం), ఒకే రేషన్ కార్డు, ఒకే రకమైన పోలీస్ డ్రెస్ వంటివి



కేవలం స్వదేశీ, విదేశీ పెట్టుబడిదారులకు సరుకులు దేశవ్యాప్తంగా అమ్ముకునేందుకే ఉపయోగపడతాయి తప్ప... ప్రజలకు, ప్రజాస్వామ్యానికి కాదని తేల్చిచెప్పారు.

ఇలాంటి చర్యలు తిప్పికొట్టటం ద్వారా ప్రజాస్వామ్యం, సమైక్యతను, దేశ ఐక్యతను రక్షించుకోవాలని రాఘవులు ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడుకోవాలని సూచించారు. గతంలో ఇలాంటి విధానం తెచ్చేందుకు మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ప్రయత్నించినా నాడు వామపక్షాలు, ప్రాంతీయ పార్టీలు బలంగా ఉండి తిప్పి కొట్టాయని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రాంతీయ పార్టీల అవకాశవాదం కూడా బీజేపీ కుట్రలకు ఉపయోగపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికలంటే ప్రజాస్వామ్యం కోసమనీ, అయితే ఆ ప్రజాస్వామ్యమే అభివృద్ధికి అడ్డు అంటూ ప్రజాస్వామ్యానికి, అభివృద్ధికి మధ్య బీజేపీ పోటీ పెడుతున్నదని తప్పుపట్టారు. ప్రజాస్వామ్యంతో కూడిన అభివృద్ధి కావాలని డిమాండ్ చేశారు. ఒకే దేశం – ఒకే ఎన్నిక విధానాన్ని వ్యతిరేకించి, రాజ్యాంగ విలువలను కాపాడుకునే శక్తులన్నింటిని కలుపుకుంటూ ప్రజలను చైతన్యవంతులను చేయాలని పిలుపునిచ్చారు. శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ కేంద్ర కమిటీ పిలుపులో భాగంగా అక్టోబర్15 నుంచి నవంబర్ 15 వరకు నెల రోజుల పాటు 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రమాదంపై రకరకాల రూపాల్లో ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సిటీ సెంట్రల్ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు మహేందర్, ఎం.శ్రీనివాస రావు, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా కార్యదర్శిగా

కందూరి చంద్రశేఖర్



నవతెలంగాణ-కామారెడ్డి

సీపీఐ(ఎం) కామారెడ్డి జిల్లా కార్యదర్శిగా కందూరి చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇటీవల నిర్వహించిన కామారెడ్డి జిల్లా మహాసభల్లో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన జిల్లా కార్యదర్శిగా కందూరి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులుగా ఎస్.వెంకట్‌గౌడ్, మోతీరాం, కొత్త నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులుగా రవీందర్, సురేష్ గొండ, ముదాం అరుణ్, రేణుక, ఖలీల్, అజయ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కామారెడ్డి జిల్లాలో పార్టీని బలోపేతం చేసి ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని తెలిపారు. వాటికి వ్యతిరేకంగా ప్రజలను ఏకతాటిపైకి తెచ్చి సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

దేవాలయాలపై రాజకీయం చేయొద్దు

- 'ముత్యాలమ్మ' ఘటనపై సీరియస్‌గా ఉన్నాం : మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని రాజకీయ నేతలు, ఆయా సంస్థల నాయకులెవ్వరూ దేవాలయాలపై రాజకీయం చేయొద్దని దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ విజ్ఞప్తి చేశారు. దేవుడు అందరికీ దేవుడేనని పునరుద్ఘాటించారు. మంగళవారం ఈ మేరకు ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. చారిత్రాత్మకమైన హైదరాబాద్ నగరం మతసామరస్యతకు, సర్వమతాల సంరక్షణకు నిలయం అని గుర్తుచేశారు. ముత్యాలమ్మ విగ్రహ ధ్వంసం ఘటనను రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నదని స్పష్టం చేశారు. ఘటన జరిగిన వెంటనే నిందితులను అరెస్టు చేశామనీ, మోండా మార్కెట్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 14న 234/2024 కింద ఎఫ్ఐఆర్‌ను పోలీసులు నమోదు చేసినట్టు వివరించారు. నేరస్తులకు చట్టపరంగా కఠిన శిక్ష పడేలా చూస్తామని భరోసానిచ్చారు. సంఘటన జరిగిన వెంటనే అక్కడికి దేవాదాయ శాఖ అధికారులను పంపించి సమగ్రంగా పరిశీలించినట్టు తెలిపారు. ఘటన తర్వాత నిర్మాణ సంబంధిత పనులు కూడా చేపట్టారని పేర్కొన్నారు. బుధవారం దేవాదాయ శాఖ ముఖ్యకార్యదర్శి ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శిస్తారని వెల్లడించారు. ఈ ఘటనలో కొంతమంది అల్లరి మూకలు చేరి, మతసామరస్యతకు భంగం కలిగేలా చేస్తున్నాయనీ, కొన్ని పార్టీలు రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నాయని ఆరోపించారు. ప్రతిపక్షాలు ఈ అంశాన్ని రాజకీయం చేయడం సహేతుకం కాదని హితవు పలికారు. ఇటువంటి ఘటనల పట్ల దేవాదాయ శాఖ అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానిక ప్రజలు ఐక్యంగా ఉండి ప్రార్థనామందిరాలపై దాడులు జరగకుండా చూడాలనీ, హైదరాబాద్ నగర మత సామరస్యతను కాపాడాలని పిలుపునిచ్చారు.

వక్ఫ్ బిల్లుపై వాగ్వాదం

జేపీసీలో టీఎంసీ ఎంపీ, ప్రతిపక్ష నేతల నిలదీత

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వక్ఫ్ బిల్లుపై సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సమావేశంలో వాగ్వాదం చోటు చేసుకుంది. టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ అనుచిత ప్రవర్తనకు పాల్పడటంతో ఆయనను కమిటీ నుంచి ఒక రోజు సస్పెండ్ చేశారు. వక్ఫ్ (సవరణ) బిల్లు-2024పై బీజేపీ నేత జగదాంబిక పాల్ అధ్యక్షతన మంగళవారం నాడు పార్లమెంట్ అనెక్స్ బిల్డింగ్‌లో జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సమావేశమైంది. ఒడిశా-కటక్‌కు చెందిన జస్టిస్ ఇన్ రియాలిటీ, పంచశాఖ ప్రచార్ ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు, సలహాలు స్వీకరించేందుకు కమిటీ ఈ సమావేశం ఏర్పాటు చేసింది. పలువురు రిటైర్డ్ న్యాయమూర్తులు, లాయర్లు తమ అభిప్రాయాలు చెబుతుండగా, బిల్లుకు సంబంధించి మీరు ఏం చెప్పదలుచుకున్నారని టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ సహా పలువురు ప్రతిపక్ష నేతలు నిలదీశారు. కళ్యాణ్ బెనర్జీ అభ్యర్థనను జేపీసీ చైర్మెన్, బీజేపీ లోక్‌సభ ఎంపీ జగదాంబిక పాల్ తిరస్కరించారు. ఆయన మాత్రం తనను మాట్లాడేందుకు అనుమతించాలని పట్టుబట్టారు. దీనిపై బీజేపీ నేత అభిజిత్ గంగోపాధ్యాయ అభ్యంతరం వ్యక్తం చేశారు. బెనర్జీ పదే పదే మాట్లాడాలని డిమాండ్



చేయడంపై బీజేపీకి చెందిన అభిజిత్ గంగోపాధ్యాయ్ ప్రశ్నించడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. గంగోపాధ్యాయ, బెనర్జీ ఇద్దరూ ఒకరిపై ఒకరు దుర్భాషలాడుకున్నారు. దీంతో బెనర్జీ కోపంతో అక్కడున్న గ్లాస్ వాటర్ బాటిల్‌ను విసిరేశారు. దీంతో ఆయన బొటనవేలు, చూపుడువేలుకు గాయమైంది. వెంటనే కళ్యాణ్ బెనర్జీని ప్రథమ చికిత్స కోసం ఎంఐఎం చీఫ్ అసదుద్దీన్ ఓవైసీ, ఆప్ నేత సంజయ్ సింగ్ బయటకు తీసుకువచ్చారు. దీంతో సమావేశం కాసేపు వాయిదా పడింది.

టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీని సస్పెండ్ చేయాలని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే ప్రతిపాదన పెట్టగా, తొమ్మిది మంది సభ్యులు ప్రతిపాదనకు అనుకూలంగా ఓటు వేశారు. మరో ఎనిమిది మంది ప్రతిపాదనను వ్యతిరేకించారు. గంగోపాధ్యాయతో సహా కొంతమంది బీజేపీ ఎంపీలు బెనర్జీని జేపీసీ నుంచి పూర్తిగా సస్పెండ్ చేయాలని కోరినట్టు తెలిసింది. అయితే ఆయనపై ఒక్కరోజు సస్పెండ్ వేటు వేశారు. పగిలిన అద్దాన్ని విసిరే ప్రయత్నంలో తన చేయి కోసుకుందని బెనర్జీ పేర్కొనగా, చైర్మెన్ వైపు గాజు గ్లాస్‌ను విసిరినట్టు బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే వక్ఫ్ సవరణ బిల్లును అధికార పార్టీ తీసుకువచ్చినట్టు ఆయన ఆరోపించారు. ముస్లిం వర్గాన్ని ఆ బిల్లుతో టార్గెట్ చేసినట్ట పేర్కొన్నారు. ఆ సమయంలో బీజేపీ నేతలు ఆ బిల్లును సమర్థించారు. వక్ఫ్ ఆస్తుల నిర్వహణ విషయంలో సంస్కరణలు అవసరం అన్నారు. డిజిటలైజేషన్, ఆడిటింగ్, లీగల్ ఫ్రేమ్‌వర్క్ అవసరం ఉంటుందని బీజేపీ సభ్యులు వాదించారు. వక్ఫ్ బిల్లు సవరణపై ఇప్పటి వరకు జేపీసీ కేవలం ఢిల్లీలోనే 15 సమావేశాలు నిర్వహించింది. మరో ఐదు సమావేశాలను ఇతర నగరాల్లో ఏర్పాటు చేసింది.

21మందితో కాంగ్రెస్ తొలి జాబితా

రాంచీ: జార్ఖండ్ శాసనసభకు పోటీచేసే 21మంది అభ్యర్థుల తొలి జాబితాను కాంగ్రెస్ సోమవారం రాత్రి విడుదల చేసింది. 18మంది సిట్టింగ్ శాసన సభ్యులకు మళ్లీ టిక్కెట్లు కేటాయించింది. మండు, హజారీబాగ్, జమ్‌షెడ్‌పూర్ ఈస్ట్ స్థానాలలో మాత్రం అభ్యర్థులను మార్చింది. ఆర్థిక మంత్రి రామేశ్వర్ ఓరాన్ లోహార్దగా ఎస్టీ స్థానం నుండి పోటీ చేస్తారు. ఆయన గతంలో పీసీసీ అధ్యక్షుడుగా వ్యవహరించారు. సీనియర్ నేత అజయ్ కుమార్ జమ్‌షెడ్‌పూర్ ఈస్ట్ నుండి బరిలో నిలుస్తారు. గతంలో ఆయన జమ్‌షెడ్‌పూర్ ఎంపీగా పనిచేశారు. పార్టీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, పలువురు సీనియర్ నేతలు అభ్యర్థుల జాబితాపై చర్చించారు. జార్ఖండ్‌లో రెండు దశలుగా శాసనసభ ఎన్నికలు జరుగుతాయి. వచ్చే నెల 13, 20 తేదీలలో పోలింగ్ నిర్వహిస్తారు. నవంబర్ 23న ఫలితాలు ప్రకటిస్తారు.

69 ఏండ్లు వెనక్కి!

- పాలస్తీనాలో రెట్టింపైన దారిద్ర్యం
- 2.5 లక్షల ఆహార ట్రక్కులు నిలిపివేత
- గాజాలో 45మంది మృతి
- హిజ్బుల్లా ఆర్థికమూలాలే లక్ష్యంగా దాడులు



గాజా, బీరుట్ : పాలస్తీనా భూభాగంలో ఈ ఏడాది దారిద్ర్యం రేటు రెట్టింపై 74.3శాతానికి చేరిందని ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) పేర్కొంది. మానవ వికాసానికి సంబంధించిన కీలక అంశాలను సమీక్షించే మానవ వికాస సూచిక (హెచ్‌డిఐ)ని విడుదల చేశారు. దీని ప్రకారం 69ఏళ్ళ సుదీర్ఘ కాలంలో సాధించిన ప్రగతి అంతా ఒక్కసారిగా తుడిచిపెట్టుకుపోయిందని, 1955నాటి పరిస్థితులకు పడిపోయిందని యుఎన్‌డిపి అంచనా వేసింది. ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో పరిస్థితి 16ఏండ్లకు పూర్వం ఎలా వుండేదో అలా వుందని పేర్కొంది. గాజాలోకి మానవతా సాయం రాకుండా ఇజ్రాయిల్ అడ్డుకుంటోందని గాజాలోని ప్రభుత్వ మీడియా కార్యాలయం పేర్కొంది. ఏడాది క్రితం దాడులు ఆరంభమైన తర్వాత ఇప్పటివరకు దాదాపు రెండున్నర లక్షల సహాయ ట్రక్కులను నిలిపివేసిందని పేర్కొంది. ఆకలితో అలమటించి చనిపోవాలన్నదే ఇజ్రాయిల్ వ్యూహంగా వుందని, అందుకే ఆహారం, పాలు, ఇతర పోషక పదార్ధాలను లోపలకు రాకుండా అడ్డుకుంటోందని విమర్శించింది. దాడులు ప్రారంభం కాకముందు గాజాలోకి ప్రతి రోజూ దాదాపు 500 ట్రక్కుల సహాయం వచ్చేది. తక్షణమే గాజాలోకి మానవతా సాయం అందేలా చూడాలని యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ చీఫ్ ఫిలిప్ లాజారిన్ కోరారు. మంగళవారం ఉదయం నుండి జరిగిన దాడుల్లో 45మంది మరణించారని, వీరిలో 37మంది ఉత్తర గాజాలో మరణించారని దీంతో గత 48గంటల్లో గాజాలో మరణించిన వారి సంఖ్య 115కి చేరగా, 487మంది గాయపడ్డారని ఆరోగ్య శాఖ వర్గాలు తెలిపాయి. మరోవైపు బీరుట్‌లోని రఫిక్ హరిరి యూనివర్శిటీ ఆస్పత్రికి సమీపంలో ఇజ్రాయిల్ జరిపిన దాడిలో 13మంది మరణించారు. 57మంది గాయపడ్డారని లెబనాన్ ఆరోగ్య శాఖ వెల్లడించింది.

బీరుట్ ఆస్పత్రి భూగర్భంలో హిజ్బుల్లా రహస్య బంకర్

బీరుట్‌లో అల్ సహెల్ ఆస్పత్రి కిందన నిర్మించిన రహస్య బంకర్‌లో హిజ్బుల్లా లక్షలాది డాలర్ల నగదు, పెద్ద మొత్తంలో బంగారం నిల్వ చేసిందని ఇజ్రాయిల్ మిలటరీ వెల్లడించింది. అయితే తక్షణమే ఆ బంకర్‌పై దాడి చేసే ఆలోచన లేదని పేర్కొంది. అయితే ఆస్పత్రిని ఖాళీ చేయిస్తున్నట్లు లెబనాన్ ప్రభుత్వం తెలిపింది. ఈ నేపథ్యంలో లెబనాన్ ఎంపి, ప్రస్తుతం బంకర్ వుందని పేర్కొంటున్న అల్ సహెల్ ఆస్పత్రి డైరెక్టర్ ఫది ఆలమ్ మీడియాతో మాట్లాడుతూ ఇజ్రాయిల్ తప్పుడు ఆరోపణలు చేస్తోందని, కావాలంటే లెబనాన్ ఆర్మీ ఆస్పత్రిలో పర్యటించవచ్చని, రోగులు, ఆపరేషన్ థియేటర్లు తప్ప ఇక్కడ ఇంకేమీ లేవని చెప్పారు. బీరుట్‌లోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రికి సమీపంలో సోమవారం రాత్రి జరిగిన దాడిలో నలుగురు మరణించారు.

హిజ్బుల్లా ఆర్థిక మూలాలపై దాడులు

కాగా హిజ్బుల్లా ఆర్థిక వనరులే లక్ష్యంగా దాడులను ఉధృతం చేస్తున్నట్లు ఆర్మీ ప్రకటించింది. హిజ్బుల్లా ఆర్థిక విభాగమైన అల్ ఖర్డ్ అల్ హసన్‌కి చెందిన 30 స్థావరాలపై ఆదివారం రాత్రి, సోమవారం దాడులు జరిపినట్లు ఇజ్రాయిల్ చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్ హెర్జి హలెవి తెలిపారు. ఇంకా ఈ దాడులు కొనసాగుతాయని చెప్పారు.

హిజ్బుల్లా ఆర్థిక విభాగ చీఫ్‌ను చంపేశాం

హిజ్బుల్లా గ్రూపునకు ఆర్థిక వ్యవహారాలు చూసే కమాండర్‌ను సిరియాలో మట్టుబెట్టినట్లు ఇజ్రాయిల్ ఆర్మీ ప్రకటించింది. కమాండర్ పేరును వెల్లడించలేదు. హిజ్బుల్లా యూనిట్ 4400 కొత్త కమాండర్ అయిన ఆ వ్యక్తి ఇరాన్ చమురు అమ్మకాల ద్వారా వచ్చిన నిధులను హిజ్బుల్లాకు బదిలీ చేసే వ్యవహారాలు చూస్తారని ఆర్మీ ప్రతినిధి రియర్ అడ్మిరల్ డేనియల్ హగారి ఒక ప్రకటనలో తెలిపారు. కొద్ది గంటల క్రితమే ఆ వ్యక్తిని తుదముట్టించామని చెప్పారు. ఈ యూనిట్‌కు గతంలో కమాండర్‌గా వున్న మహమ్మద్ జాఫర్‌ను కూడా అక్టోబరు తొలి వారంలో జరిపిన దాడుల్లో చంపేశామని ఆ ప్రకటన పేర్కొంది.

మానవజాతి పురోగమన యాత్రలో పుస్తకాలు, పత్రికలు, ఎంతో మహత్తర పాత్ర వహించాయి -ముల్కరాజ్ ఆనంద్

సంపాదకీయం

'అసలు' మిగిలే ఉంది



అనుకున్నట్టే వాంగ్‌చుక్ తన దీక్ష విరమించారు. అనుకున్నట్టే కేంద్రం ఒక మెట్టు దిగింది. హెూంశాఖ సహాయ మంత్రిని చర్చలకు పంపుతానంది. మోడీ, షాలతోనే చర్చిస్తానన్న వాంగ్‌చుక్ బృందం తమ పట్టు సడలించింది. పదహారు రోజుల దీక్ష అంకం ముగిసింది. ఈ దీక్ష విరమిస్తూ వాంగ్ చుక్ "తాను మరోసారి దీక్ష బూనాల్సిన స్థితి రాదనే ఆశిస్తున్నా"నన్నాడు. అదే జరగాలని ఆశిద్దాం.

అక్కడ, అంటే లడఖ్‌లో ఉద్యమిస్తున్నది ఒక వ్యక్తి కాదు. కాబట్టి, ఒక వ్యక్తితోనో, పార్టీతోనో చర్చలు కాదు. మో-షా బృందానికి ఆర్టికల్ 370 రద్దు చేసినంత తేలికగా ఈ సమస్య పరిష్కారమయ్యేలా లేదు. ఇప్పటికే

> **అందుకే, 370 అధికరణం రద్దు కోసం 2019లో మోడీ బృందం నయానా, భయానా చాలామందిని లొంగదీసుకుంది. కాని నేడు ఈ ఉద్యమం లేవనెత్తిన కీలక సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందా? 370 ఆర్టికల్ రద్దును ఉపసంహరించాలనే పార్టీల కూటమి నేడు జమ్ము-కాశ్మీర్‌లో అధికారంలో ఉంది. ఇప్పటికే వారి క్యాబినెట్ ఆ డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. ఆ సమస్య ఎలా ఉన్నా లడఖ్‌కు రాష్ట్ర హెూదా కల్పించాలనే న్యాయ సమ్మత డిమాండ్‌ను ఆమోదించడం మోడీ సర్కార్‌కు తప్పనిసరి.**

లడఖ్ బౌద్ధ సంఘాల కో-కన్వీనర్ డోర్జే లాక్రుక్ 'తమ నాలుగు పాయింట్ల ఎజెండా నుండి వెనక్కి తగ్గేదేలే' అని ప్రకటించారు. కొందర్ని కొన్నిసార్లు మోసం చేయొచ్చుగానీ అందర్నీ అన్నిసార్లూ మోసం చేయలేరన్న నానుడి భారతీయ జనతా పార్టీకి ఎంత తొందరగా అర్థమైతే లడఖ్‌కు అంత మంచిది. లడఖ్ రెండు స్వయం ప్రతిపత్తిగల ప్రాంతాల సమూహం. అవి లేహ్ అపెక్స్ బాడీ, కార్గిల్ డెమోక్రటిక్ అలయెన్స్‌లు. జమ్ముకాశ్మీర్ ప్రజల సంస్కృతి వేరు, లడఖ్ ప్రజల సంస్కృతి వేరు. మతం వేరు. మనోభావాలు వేరు.

2019లో ఆర్టికల్ 370 రద్దు సందర్భంలో లడఖ్‌లో విస్తృత చర్చ జరగలేదు. ప్రజల ఆమోదం లేదు. కొందరు వ్యక్తుల ఆమోదం తీసుకుని లడఖ్‌ను ప్రత్యేక కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పాటుచేశారు. 'లోక్‌నీతి' సర్వే ప్రకారం కాశ్మీర్ లోయలో దాదాపు ప్రజలంతా 370 అధికరణ రద్దును వ్యతిరేకిస్తున్నారు. హిందువులు మెజారిటీగా ఉన్న జమ్మూలో 40శాతం మంది ప్రజలు ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తున్నారు. అత్యధిక మంది 370 ఆర్టికల్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారని లోక్‌నీతి సర్వే పేర్కొంది. లడఖ్‌లో కొందరైనా వ్యతిరేకించక పోవడానికి కారణం నాటి జమ్ముకాశ్మీర్ శాసనసభలో మెజారిటీ జమ్మూ-కాశ్మీర్ వారే ఉండటంవల్ల తమ ఆకాంక్షలు నెరవేరడం లేదని భావించారు. కానీ, కేంద్ర పాలిత ప్రాంతమైన తర్వాత కేంద్రమే పాలిస్తుందని పసిగట్టలేకపోయారు.

మొన్నటితో వాంగ్‌చుక్ నిరవధిక దీక్ష ముగిసినా ఆయన లేవనెత్తిన పర్యావరణ సమస్యలు అలానే ఉన్నాయి. 'పర్యావరణం' పెట్టుబడిదారీ విధానానికి విలోమాను పాతంలో ఉంటుంది. అందుకే అనేక పశ్చిమదేశాల్లో పర్యావరణ వేత్తలు, గ్రీన్స్ మూవ్‌మెంట్ సోషలిస్టు, కమ్యూనిస్టులతో కలిసి ఉద్యమిస్తున్నారు. ఇది వాంగ్‌చుక్ వంటి వారి దృష్టిలో ఉందా అనేది పరిశీలించుకోవాలి. అక్కడి పర్యావరణాన్ని దెబ్బతీసేలా ఖనిజ నిక్షేపాలను తవ్వనిస్తారా, లేదా చూడాలి. ఇజ్రాయిల్ బంధం గట్టిగా బిగిసిపోయినాక ఆయుధాలు, మందుగుండు తయారీలో లడఖ్‌లో విస్తారంగా దొరికే గంధకం (సల్ఫర్)ను అదానీ హస్తగతం కాకుండా మోడీ సర్కార్ నియంత్రిస్తుందా? లడఖీయుల ప్రధాన డిమాండ్ వారికి రాష్ట్ర హెూదా లేదా ఆరవ షెడ్యూల్లో చేర్చాలనే డిమాండ్లు కీలకమైనవి. మిగతా దేశమంతాలాగానే ఉపాధి సమస్య వారికీ ప్రధానం. 370 అధికరణం రద్దుచేసి తమ జీవిత లక్ష్యం నెరవేరినట్లు ఆర్ఎస్ఎస్, బీజేపీలు 2019 నుండీ చంకలు గుద్దుకుంటున్నాయి.

కాని నేడు ప్రజల నిత్య జీవిత సమస్యలను ముందుకు తెచ్చింది వాంగ్ చుక్ బృందం. ఏడాదంతా మంచు దుప్పటి పరుచుకునుండే ప్రాంతంలో పశువులకు అవసరమైన పచ్చిక మైదానాలు, మనుషులకు (పశువుల్తో సహా) మంచినీరు అందించడం కీలకమైంది. 370 రద్దుతో 'స్కీయింగ్' (మంచులో ఆడే ఆటల) కోసం భారత పెట్టుబడిదార్లు ఇప్పటికే వెంపర్లాడుతున్నారు. వెరసి, ఇవన్నీ ఆ ప్రాంత పర్యావరణాన్ని ధ్వంసం చేస్తాయని ఆ ఉద్యమం ఆరోపిస్తోంది.

అందుకే, 370 అధికరణం రద్దు కోసం 2019లో మోడీ బృందం నయానా, భయానా చాలామందిని లొంగదీసుకుంది. కాని నేడు ఈ ఉద్యమం లేవనెత్తిన కీలక సమస్యల పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందా? 370 ఆర్టికల్ రద్దును ఉపసంహరించాలనే పార్టీల కూటమి నేడు జమ్మూ-కాశ్మీర్‌లో అధికారంలో ఉంది. ఇప్పటికే వారి క్యాబినెట్ ఆ డిమాండ్‌ను పునరుద్ఘాటించింది. ఆ సమస్య ఎలా ఉన్నా లడఖ్‌కు రాష్ట్ర హెూదా కల్పించాలనే న్యాయ సమ్మత డిమాండ్‌ను ఆమోదించడం మోడీ సర్కార్‌కు తప్పనిసరి.

గాజాపై ఇజ్రాయిల్ అమానుష దాడి-భారత్ మౌనం


జోయాహసన్

అక్టోబర్ 7, 2024 నాటికి గాజాపై ఇజ్రాయిల్ అమానుష దాడి ప్రారంభించి సంవత్సరకాలం అయింది. గాజా స్ట్రిప్‌పై దాడుల్లో సుమారు 42వేల మంది ప్రజలు చనిపోయారు. ఈ హృదయం లేని యుద్ధంలో, గాజాలో పౌరులు, మహిళలు, పిల్లలు బలిపశువులు అయ్యారు. వెస్ట్ బ్యాంకులో, దాడుల వల్ల లెబనాన్‌కు సంబంధించిన 16,705 మంది పిల్లలు మృతిచెందారు. ఇది ఏడాది కాలంలో జరిగిన ఘర్షణల్లో అతిపెద్దది. ఇజ్రాయిల్ దాడులకు వ్యతిరేకంగా అమెరికా, ఐరోపాలతో పాటు, వాటి వెలుపల ఉన్న నగరాలలో కూడా కోట్లమందీ ప్రజలు ప్రజలు, సామూహికంగా భారీ ప్రదర్శనలు నిర్వహించారు. దీనివలన ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా, ఆ తరం ప్రజల్లో రాజకీయ చైతన్యం కలిగించింది, దాంతో ఇది ఆ కాలంలోనే గొప్ప సమస్యగా ముందుకొచ్చింది.

నేడు ఈ అమానుషమైన చర్యలపై, భారతదేశంలో ఆశించిన ప్రతిస్పందన కొరవడింది. ఈ యుద్ధం ఇజ్రాయిల్‌పై హమాస్ చేసిన భయంకరమైన దాడి వల్ల 1200 మంది ఇజ్రాయిల్ పౌరులు చనిపోవడం, 200 మందికి పైగా పౌరులను హమాస్ బందీలుగా చేసినందుకు ప్రతీకారంగా ఇజ్రాయిల్ చేస్తున్న దాడిగా పరిగణిస్తున్నారు. దానికి ప్రతీకారంగా, ఇజ్రాయిల్ చేపట్టిన క్రూరమైన దాడి, అనేకసార్లు తమ స్థావరాలను నుండి, ఆవాసాల నుండి, పాలస్తీనీయులను తరిమించేయడమనేది ఆందోళన కలిగించే అంశం. ఇది ఏమాత్రం అంగీకారయోగ్యం కాదు. ముఖ్యంగా ప్రపంచంలోనే, వలసవాద వ్యతిరేక పోరాటానికి నాయకత్వం వహించిన అతి పెద్దదేశంగా, అనేక దేశాలు తమ తమ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాల్లో, భుజం భుజం కలిపి నిలబడిన దేశం మనది. ఒకప్పుడు భారతదేశం పాలస్తీనాకు, నిజమైన స్నేహితునిగా ఉంది. పాలస్తీనా, పీపుల్స్ లిబరేషన్ ఆర్గనైజేషన్ (పీఎల్‌ఓ)ను గుర్తించిన మొట్టమొదటి అరబ్‌యేతర దేశంగా ఉన్న భారతదేశం, నేడు ఇజ్రాయిల్‌కు, దాని శ్రేయోభిలాషి అయిన అమెరికాకు, సన్నిహితంగా వ్యవహరిస్తున్నది. పాలస్తీనాలో జరుగుతున్న సంఘటనలు, పరిణామాల పట్ల భారత్‌లో నిరంతర నిరసనలు గాని, వారి బాధల పట్ల బహిరంగ విచారంగానీ, ఆందోళనలుగానీ లేవు. ఇతర దేశాలలో ప్రదర్శించబడిన కనీస స్థాయి నిరసనలు, ఆగ్రహం మన దేశ ప్రజలు వెలిబుచ్చలేదు. కేరళలోని మల్లపురం, కోజికోడ్‌లలో రెండు పెద్ద ఊరేగింపులు నిర్వహించారు. ఇవి కాకుండా కోల్‌కత్తా, చెన్నయ్‌లలో కొద్దిపాటి నిరసనలు జరిగాయి. ఇతర రాష్ట్రాల్లో అవి కూడా లేవు. ఇజ్రాయిల్ పాలస్తీనా పట్ల ప్రవర్తిస్తున్న తీరుపై ఇండియా ఎలాంటి ఆగ్రహాన్ని గాని, నిరసనలు గాని తెలియజేయడానికి సిద్ధంగా లేదని దీని వల్ల అర్థమవుతుంది.

భారత ప్రభుత్వం నిస్సందేహంగా, నిరసనలను అరికట్టడమే గాక, అనేక సందర్భాలలో వాటిని నిషేధించింది. గాజాలో జరుగుతున్న పరిణామాలపై, ప్రజల నిరసనలను



అడ్డుకునేందుకు చాలా చురుకుగా వ్యవహరిస్తున్నది. గాజాలో జరుగుతున్న మారణహోమానికి వ్యతిరేకంగా, మద్దతునిస్తూ, నిరసనలు తెలిపే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. పాలస్తీనీయుల జెండాలను ప్రదర్శించడంపై, సామాజిక మాధ్యమాల్లో పాలస్తీనా అనుకూల అంశాలను ఉంచడంపై, నిషేధం విధించింది. కానీ కీలకమైన అంశాలపై, వీధులలో వెల్లువెత్తుతున్న ఇదేవిధమైన నిరసనలను అడ్డుకునే ప్రయత్నం చేయడం లేదు. పాలస్తీనా సమస్యపట్ల మితవాద హిందూత్వకు ఉన్న విధానపరమైన చిన్నచూపే, ఇజ్రాయిల్ జియోనిస్టులకు మద్దతు పలికే అనుకూల విధానాలు, ఈ సమస్య పట్ల వారికి ఎలాంటి స్పందన లేకపోవడానికి కారణం. పాలస్తీనీయులకు మద్దతునిచ్చే స్థాయి నుంచి భారత్ ఇజ్రాయిల్‌కు దాదాపు షరతులు లేని మద్దతునిచ్చే స్థాయికి చేరుకుంది. ఈ మద్దతు గాజా సంక్షోభాన్ని అత్యధిక భారతీయులు చూసే విధానంలో త్వరితగతిన మార్పు వచ్చింది. భారత్‌లో సమూలంగా మారిన రాజకీయ వాతావరణంలో పాలస్తీనీయులపై హింసాకాండ పట్ల, గతంలో మాదిరిగా ఉద్వేగపూరితమైన స్పందన లేదు.

అయితే అంత మాత్రం చేత, సానుభూతి అసలే లేదని అర్థం కాదు. కానీ, గాజాలో సంక్షోభం దాని పట్ల భారతదేశపు స్పందన ఈ ముఖ్యమైన వాస్తవాన్ని సూచిస్తుంది. హిందూ జాతీయవాదం ఉద్దేశపూర్వకంగా పాలిస్తీనా సమస్యను ముస్లిం సమస్యగా చూస్తున్నది. దీనర్థం, ఈ సమస్యకు ఎలాంటి మద్దతైనా, ఒక కమ్యూనిటీని బుజ్జగించినట్లుగా నిందమోపబడవచ్చుననే అభిప్రాయంతో భారతప్రభుత్వం ఉంది. ప్రతిపక్ష నాయకులు, వ్యక్తిగతంగా పాలస్తీనాకు మద్దతుగా మాట్లాడినప్పటికీ, ఏ ప్రతిపక్ష పార్టీ కూడా, ఈ సమస్య విషయంలో స్పష్టమైన వైఖరి తీసుకోలేదు. కేవలం వామపక్ష పార్టీలు మాత్రమే ఇజ్రాయిల్‌ను స్పష్టంగా ఖండించాయి. కొన్నిచోట్ల నిరసన ప్రదర్శనలు కూడా చేశాయి. నిరసనలతో పాటు బహిష్కరణ, పెట్టుబడుల ఉపసంహరణ, ఆంక్షలు విధించే ప్రచారాలకు కూడా మద్దతు ప్రకటించాయి. భారతదేశంలో కేవలం పార్టీలే కాక, పౌరసమాజం కూడా ఈ దారుణాల పట్ల మౌనం వహించింది. ఈ స్పందన లేకపోవటానికి, దేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రభావం క్షీణించటం, అభివృద్ధి చెందుతున్న ప్రపంచంతో పాటు ఇతరులలో కూడా ప్రాపంచిక విషయాల పట్ల ఆసక్తి తగ్గడానికి కారణమని చెప్పవచ్చు. అమెరికా పట్ల రాజకీయ ఆసక్తి పెంపొందడం, అమెరికాతో సన్నిహిత సంబంధాలను పెంపొందించుకునేందుకు భారత ప్రభుత్వం అన్ని విధాల ప్రయత్నాలు చేయడంతో, రాజకీయ ఆసక్తి అమెరికాపై కేంద్రీకృతమైంది. చైనాకు శక్తివంతమైన ప్రత్యామ్నాయశక్తిగా భారత్‌ను చూడటం, తదితర అంశాలు తోడ్పడుతున్నాయి. భారత్‌ను ప్రపంచ ప్రత్యామ్నాయ శక్తిగా ప్రచారం చేయడంపై అమెరికా ఆసక్తి చూపుతున్నది.

దేశాల సోపాన క్రమంలో, భారతదేశ స్థానాన్ని గూర్చి, లోతుగా శ్రద్ధ వహించే ఉన్నత, మధ్యతరగతి వర్గాలకు ఇది చాలా ముఖ్యమైనది. ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే, గత సంవత్సర కాలంగా సహజంగానే, మీడియాలో వార్తలను కుదించడంతో పాటు, దేశంలోని టెలివిజన్ ఛానల్స్ అన్నీ కూడా, ఇజ్రాయిల్, గాజా సంఘటనలపై పూర్తి సమాచారాన్ని ఇస్తున్నప్పటికీ, ఎక్కువ శాతం ఇజ్రాయిల్‌కు అనుకూలమైన దృక్పథంతోనే ఇస్తున్నాయి. తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నామనే పేరుతో ప్రధాన రాజకీయ సమస్యలను పక్కదారి పట్టించే ప్రయ త్నం జరుగుతున్నది. మారుతున్న వైఖరికి మద్దతునిస్తున్న ఉన్నత వర్గాలకు, ఇది అనుకూలమైనది. పాలస్తీనాపైనే కాక, ఈ వైఖరి సంఘర్షణలకు దారితీసే వలసవాదం, వలస పాలన అనే రెండు సమస్యలను విస్మరిస్తుంది. దీనిస్థానంలో, కేంద్ర సమస్యగా, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడే అధికారిక వర్గపు, మార్గానికి ఎక్కువ మద్దతు లభిస్తున్నది. దీని ఫలితంగా సరిహద్దుల నుండి ఉగ్రవాద దాడులకు మనం బాధితుల మైనందున భారత దేశం దీనికి మద్దతునివ్వాలి. కానీ పాలస్తీనా సమస్య, అక్టోబర్ 7న ప్రారంభం కాలేదు. దానికి విస్తృతమైన చారిత్రక నేపథ్యం ఉంది. కానీ పాశ్చాత్యదేశాలేకాక, అదేవిధంగా భారతీయులైన ఉదారవాద, మితవాద సమర్థకులు, పైవిషయాన్ని అంగీకరించరు. స్థిర నివాసుల వలసవాదం వల్ల, ఆక్రమణల కారణంగా ఈ సమస్య ఏర్పడిందనే వాస్తవం విస్మరించ బడింది. 1948లో పాలస్తీనీయులను, వారి మాతృభూమి నుండి హింసాత్మకంగా గెంటివేయడం, జాతి నిర్మూలనా పద్ధతులు, దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ హింసాత్మక సంఘటనలకు కారణమని అంగీకరించడానికి వారు ఇష్టపడక పోవడాన్ని సూచిస్తుంది. హమాస్ దాడి సాకుతో, అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ పశ్చిమాసియాను, నియంత్రించడానికి ఉపయోగపడింది. ముస్లిం ప్రపంచంలో వారి తిరుగులేని ఆధిపత్యానికి అవసరమైన అవకాశం దొరికింది.

అయితే ఇటీవల కాలంలో భారతదేశం ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటించినా, పాలస్తీనీయుల దుస్థితి పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. ఇంతకంటే ఏమీ లేదు. ఈ మార్పు ఇజ్రాయిల్‌తో భారతదేశానికి పెరుగుతున్న సాంకేతిక, రక్షణ, వాణిజ్య సంబంధాలలో సహకారాన్ని సూచిస్తుంది. 1999లో పాకిస్తాన్‌పై భారత్ నిర్వహించిన కార్గిల్ యుద్ధ సమయంలో, ఇజ్రాయిల్ ఇండియాకు సైనిక సహాయం అందించినప్పటి నుండి రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడ్డాయి. వాటి రక్షణ, గూఢచారి వ్యవస్థలను భారతదేశంలో ఉన్న వ్యవస్థలతో, అమెరికా అనుసంధానం చేయడం వల్ల భారత దేశంతో రాజకీయ అనుబంధాన్ని మరింత పెంచడానికి ఒక ముఖ్యమైన సాధనంగా పనిచేసింది. అనతి కాలంలోనే, ఒక వ్యూహాత్మక సంబంధంగా మారింది. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేసిన భారీ హింసాకాండ దిగ్భ్రాంతి కరం. ఇజ్రాయిల్ అమానుషత్వం పట్ల, చట్ట విరుద్ధమైన ఆక్రమణలు, జాతి ప్రక్షాళన గురించి మనం ఆగ్రహం చెందకపోతే టీవీల్లో, సామాజిక మాధ్యమాల్లో, ప్రత్యక్షంగా చూసిన దాని ఆధారంగా మనం కూడా నిజమనుకునే అవకాశం ఉంది. దాన్ని ఉదార వాద నిర్మాణానికి సంబంధించిన నైతిక నిర్మాణం అని భావించి నట్లయితే, మానవహక్కుల మనుగడే ప్రమాదంలో పడుతుంది.

> **భారతదేశంలో కేవలం పార్టీలే కాక, పౌరసమాజం కూడా ఈ దారుణాల పట్ల మౌనం వహించింది. ఈ స్పందన లేకపోవటానికి, దేశంలో సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రభావం క్షీణించటం, అభివృద్ధి చెందుతున్న ప్రపంచంతో పాటు ఇతరులలో కూడా ప్రాపంచిక విషయాల పట్ల ఆసక్తి తగ్గడానికి కారణమని చెప్పవచ్చు. అమెరికా పట్ల రాజకీయ ఆసక్తి పెంపొందడం, అమెరికాతో సన్నిహిత సంబంధాలను పెంపొందించుకునేందుకు భారత ప్రభుత్వం అన్ని విధాల ప్రయత్నాలు చేయడంతో, రాజకీయ ఆసక్తి అమెరికాపై కేంద్రీకృతమైంది. చైనాకు శక్తివంతమైన ప్రత్యామ్నాయశక్తిగా భారత్‌ను చూడటం, తదితర అంశాలు తోడ్పడుతున్నాయి. భారత్‌ను ప్రపంచ ప్రత్యామ్నాయ శక్తిగా ప్రచారం చేయడంపై అమెరికా ఆసక్తి చూపుతున్నది.**

> **ఇటీవల కాలంలో భారతదేశం ఇజ్రాయిల్‌కు మద్దతు ప్రకటించినా, పాలస్తీనీయుల దుస్థితి పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. ఇంతకంటే ఏమీ లేదు. ఈ మార్పు ఇజ్రాయిల్‌తో భారతదేశానికి పెరుగుతున్న సాంకేతిక, రక్షణ, వాణిజ్య సంబంధాలలో సహకారాన్ని సూచిస్తుంది. 1999లో పాకిస్తాన్ పై భారత్ నిర్వహించిన కార్గిల్ యుద్ధ సమయంలో, ఇజ్రాయిల్ ఇండియాకు సైనిక సహాయం అందించినప్పటి నుండి రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత బలపడ్డాయి. వాటి రక్షణ, గూఢచారి వ్యవస్థలను భారతదేశంలో ఉన్న వ్యవస్థలతో, అమెరికా అనుసంధానం చేయడం వల్ల భారతదేశంతో రాజకీయ అనుబంధాన్ని మరింత పెంచడానికి ఒక ముఖ్యమైన సాధనంగా పనిచేసింది. అనతి కాలంలోనే, ఒక వ్యూహాత్మక సంబంధంగా మారింది.**

('హిందూ' సౌజన్యంతో)

అనువాదం: మల్లెంపాటి వీరభద్రరావు,
9490300111

మహిళలు, పిల్లలపై లైంగికదాడులు అడ్డుకోవాలి


'బేటీ బచావో' అనే నినాదాన్ని అపహాస్యం చేసేలా దేశంలో మహిళలు, బాలికల మీద లైంగికదాడులు, హత్యలు వేగంగా పెరిగి పోతున్నాయి. చాలా సందర్భాల్లో బాధితులు ముందుగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారినే వేధించడం, బలాత్కరించటం, హత్య చేయడం కూడా జరుగుతున్నది.

బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే అధికం

భారత దేశంలో ఇప్పుడు రోజుకు 86 లైంగికాడులు, గంటకు 49కి పైగా నేరాలు జరుగుతున్నాయి. ఇవి ప్రధానంగా బీజేపీ పాలనలోని ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో జరుగుతున్నాయి. టి.ఎం.సి పాలనలోని బెంగాల్‌లో కూడా మహిళల పైన, పిల్లలపైన భయంకరమైన లైంగికదాడులు సంభవించాయి. కర్నాటకలో బీజేపీ కూటమికి చెందిన బలమైన ఒక రాజకీయ పార్టీ ఎంపీ (తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయాడు) వందలాది మంది మహిళల పైన లైంగికదాడులు చేయడమే కాక వాటిని చిత్రీకరించి వేధిస్తున్నట్లు బయటపడింది. బలైన వారిలో అనేకమంది ఆయన పార్టీకి చెందినవారే.

బెంగాల్‌లో వెల్లువెత్తిన నిరసనలు

ఇలాంటి ఘటనలపైన అక్కడక్కడ నిరసనలు కొనసాగుతున్నాయి కానీ వాటి ప్రభావం పెద్దగా వుండటం లేదు. పశ్చిమ బెంగాల్‌లో డాక్టర్‌పై అమానుష లైంగికదాడి,



హత్యకు వ్యతిరేకంగా ప్రజ్వరిల్లిన నిరసన ఉద్యమం ఒక్కటే ఇందుకు మినహాయింపుగా ఉంది. ప్రభుత్వ ఆసుపత్రులలో డాక్టర్లు ప్రారంభించిన నిరసనకు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో వేలాది మంది స్త్రీపురుషుల మద్దతు లభించింది. దారు ణాన్ని అడ్డుకోవడంలోనూ విఫలమవటమే కాక తర్వాత నేరస్తులను కాపాడడానికి కూడా సిద్ధమైన రాష్ట్ర ప్రభుత్వ పాత్రను ఈ నిరసన ఉద్యమం ఎండగట్టింది. పశ్చిమ బెంగాల్‌లో ప్రజ్వరిల్లిన ఈ మహా నిరసన నుంచి మన కామ్రేడ్లు నేర్చుకోదగిన అనేక పాఠాలు ఉన్నాయి. అన్ని చోట్లా కూడా కొన్ని ఉమ్మడి అంశాలు కనిపిస్తాయి. అత్యధిక చోట్ల ఇలాంటి ఘటనలలో పోలీసులు చేయవలసింది చేయకపోగా బాధితు రాలు, కుటుంబ సభ్యుల ఫిర్యాదులను పూర్తిగా పెడచెవిన పెడుతున్నారు. దాంతో దుండగులు మరింత చెలరేగిపోయి వేధింపులకు దిగడం, లైంగికదాడులకు తెగబడడం కూడా జరుగుతున్నది.

నేరస్తులకు పోలీసులు, ప్రభుత్వ అండ

ఇలాంటి సందర్భాల్లో మరో ఉమ్మడి లక్షణం ఏమంటే నేరస్తులు పాలక పార్టీకి చెందిన వారైతే రక్షణ కల్పించడం, చర్య తీసుకోకుండా వదిలివేయటం జరుగుతుంది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇది సర్వసాధారణ వ్యవహారంగా ఉంది. ఉత్తరప్రదేశ్‌లో ఒక మైనర్ బాలికపై లైంగికదాడికి పాల్పడిన బీజేపీ ఎమ్మెల్యేని అరెస్ట్ చేయడానికి హైకోర్టు, సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో అమ్మాయిలపై అత్యాచారానికి పాల్పడిన బీజేపీ మీడియా సెల్ ప్రతినిధులు ముగ్గురుని విద్యార్థుల ఆందోళన తర్వాతే అరెస్ట్ చేశారు. అయితే వారిని కొద్ది మాసాల తర్వాత మళ్లీ వదిలిపెట్టారు. మరోవైపున నిరసన తెలిపిన ఆ విద్యార్థులను మటుకు బహిష్కరించి చదువుకునే అవకాశం లేకుండా చేశారు. బిల్కిస్ బానోపై సామూహిక లైంగికదాడి కేసులో..కేంద్రం, గుజరాత్ ప్రభుత్వం సిగ్గు మాలిన పాత్ర వల..నిందితులకు పదేపదే బెయిల్ ఇప్పించడమే కాక శిక్ష నుండి మినహాయింపు కల్పించి విడుదల చేయటం చూశాం. అనేకమంది అమ్మాయిలపై లైంగికదాడులకు, హత్యలకు పాల్పడిన బాబా రామ్ రహీంను హర్యానా ప్రభుత్వం పదేపదే బెయిల్‌పై విడుదల చేస్తూ హిందీ రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీకి ప్రచారం చేసేందుకు ఉపయోగించుకుంటున్నది.

మీడియాలో అనుచిత ధోరణి

చాలా సందర్భాల్లో ఇలాంటి ఘటనలను బయటకి తీసుకురావడంలో ముఖ్య పాత్ర వహించే మీడియా కూడా తప్పు చేస్తుంటుంది. వీటిని నివేదించే సందర్భంలో లైంగిక దురహంకారం, పురుషాధిక్య ధోరణులు, అవమానకర భాషతో ఈ నేరం జరగడానికి బాధితులే కారణ మనీ అర్థం వచ్చేలా చేస్తుంది. సమాజంలో వ్యక్తులు బాధ్యతాయుత స్థానంలోని ప్రజాప్రతినిధులు, పోలీసులు, అధికారుల ప్రకటనలకు ప్రాధాన్యతనివ్వడం ద్వారా ఈ పని జరుగుతుంది.

దేశవ్యాపిత ఉద్యమం

మహిళలు, పిల్లలపై పెరుగుతున్న ఈ హింసకు గల కారణాలను అరికట్టడం కోసం.. ఈ అంశంపై ఉద్యమం సాగించాలని.. సెప్టెంబర్‌లో జరిగిన సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సమావేశం దేశ వ్యాపితంగా పార్టీ శాఖలన్నిటికీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా జరిగిన అమానుషాలపై కేంద్రీకరించడంతో పాటు బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన, తప్పులకు, పౌరబాట్లకు కారణమైన పోలీస్ అధికారులు, ప్రభుత్వ బాధ్యులను శిక్షించడం వంటి డిమాండ్లను కూడా జతచేయాలి. రాష్ట్ర ప్రభుత్వం ఈ వ్యవహారంలో కుమ్మక్కై ఉంటే దాన్ని కూడా పూర్తిగా బహిర్గతం చేయాలి. ఈ ఘటనలను మీడియా నివేదించే తీరును నిశితంగా పరిశీలిస్తుండాలి. బలికి బయటపడిన బాధితులకు, బాధిత కుటుంబాలకు తోడుగా నిలవాలి. వారికి న్యాయం జరిగేలా చూసేందుకు కృషి చేయాలి.

(అక్టోబర్ 16 'పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

బీమా రంగంలో కార్పొరేట్ అనుకూల మార్పులు


బి.వెంకట్రావు

దేశంలోని పౌరులందరికీ 2047 నాటికి ఇన్సూరెన్స్ అందించడమే లక్ష్యమని మాస్టర్ సర్క్యులర్ (12 జూన్ 2024) విడుదల సందర్భంగా 'ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా' (ఐ.ఆర్.డి.ఎ.ఐ) చెప్పింది. కానీ ఈ సర్క్యులర్‌లో పేర్కొన్న అంశాలు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. లాభనష్టాల దృష్టితో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఇండియా (ఎల్.ఐ.సి)ని చూడకూడదు, దేశంలోని మారుమూల ప్రజలకు కూడా బీమా సౌకర్యం కల్పించాలి, ప్రజల డబ్బు ప్రజలకే చెందాలి, ఇన్సూరెన్స్ అంటే దీర్ఘకాలిక పెట్టుబడి, ప్రజాసంక్షేమం ప్రధానం అనే ప్రధాన ఉద్దేశాలతో 1956లో ఎల్.ఐ.సి ఏర్పాటైంది..

ఐ.ఆర్.డి.ఎ.ఐ ఏర్పాటు నేపథ్యం

భారతదేశంలో 1991లో ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాలను ఆసరా చేసుకొని ఇన్సూరెన్స్ మార్కెట్‌లో ఉన్న లాభాలను సొంతం చేసుకోవడానికి ప్రయివేట్ వ్యాపారస్తులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చారు. దీని ఫలితంగానే కేంద్రం 1999లో ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐ.ఆర్.డి.ఎ.ఐ) ఏర్పాటు చేసింది. అంతకు ముందే టెలికం రంగంలో సంస్కరణల కోసం టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (టి.ఆర్.ఎ.ఐ) 1997లో ఏర్పాటయింది.

ఇవి నిజంగా స్వతంత్ర సంస్థలేనా?

ఇవి పేరుకు మాత్రమే స్వతంత్ర సంస్థలు. ఆచరణలో మాత్రం కేంద్ర ప్రభుత్వ కీలుబొమ్మలు. ట్రాయ్ అమల్లోకి వచ్చిన తర్వాత టెలికం రంగంలో అతి పెద్ద సంస్థగా ఉన్న ప్రభుత్వ రంగ బి.ఎస్.ఎన్.ఎల్‌ను నాశనం చేసి ఆ స్థానాన్ని అంబానీ కంపెనీ అయిన జియో ఎలా ఆక్రమించిందో మనం ప్రత్యక్షంగా చూస్తున్నాము. ఇన్సూరెన్స్ రంగంలో కూడా ఐ.ఆర్.డి.ఎ.ఐ పెత్తనం కొనసాగితే అంతిమంగా ఎల్.ఐ.సి పరిస్థితి కూడా బి.ఎస్.ఎన్.ఎల్ మాదిరిగానే మారిపోతుంది. ఐ.ఆర్.డి.ఎ.ఐ మాస్టర్ సర్క్యులర్‌తో ఎల్.ఐ.సిలో ముఖ్యంగా వచ్చిన పలు మార్పుల గురించి తెలుసుకోవాల్సి వుంది. ప్రాచుర్యం పొందిన అన్ని పాలసీల కనీస బీమా రూ.ఒక లక్ష నుండి రూ.రెండు లక్షలకు పెంచారు. అదేవిధంగా ప్రీమియం రూ. ఒక లక్షకు రూ.300 నుండి రూ.500 వరకు పెరిగింది.

సరెండర్ విలువ పెంపు, గడువు తగ్గింపు

ఇది ఎల్.ఐ.సి ఏర్పాటు సందర్భంగా పెట్టుకున్న ప్రాథమిక నియమంగా వున్న 'దీర్ఘకాలిక పెట్టుబడి' అనే సూత్రానికి పూర్తిగా విఘాతం కలిగించేది. ఇప్పటి వరకు ఎల్.ఐ.సిలో పాలసీ తీసుకున్న వారు తమ డబ్బును దీర్ఘకాలం పాటు ఎల్.ఐ.సి లో కొనసాగించేందుకు మానసికంగా సిద్ధపడి పాలసీ తీసుకునేవారు. ఒకవేళ ఏదైనా అత్యవసరమైతే లోన్ తీసుకునే వారు తప్ప సరెండర్ చేసుకోవడానికి ఇష్టపడేవారు కాదు. కానీ ఇప్పుడు ఐ.ఆర్.డి.ఎ.ఐ నిబంధనను అనుసరించి ఏడాది తర్వాత పాలసీ రద్దు చేసుకున్నా కూడా కట్టిన డబ్బులో ఎక్కువ మొత్తం పాలసీదారుడికి చెల్లించాలన్న నిబంధన ఎల్.ఐ.సి సంస్థను స్థిరమైన అభివృద్ధి నుండి ఒడిదుడుకుల వైపు నెడుతుంది.

ఏజెంట్లపై ప్రత్యక్ష దాడి

ఫస్ట్ ప్రీమియం కమిషన్ తగ్గుతుంది. 35 నుండి 28 శాతానికి తగ్గించారు. రెన్యువల్ కమీషన్‌లో ఐదు శాతం పెంచారు. సరెండర్ విలువ పెంచి ఒక సంవత్సరం తర్వాత సరెండర్‌కు అవకాశం ఇచ్చి నాలుగైదు సంవత్సరాలలో కమీషన్ పెంచడమంటే దీన్ని ఎంతమంది పొందగలరు. మరో రెండు శాతం కమీషన్ ఆరవ సంవత్సరం ప్రీమియం చెల్లించిన తర్వాత ఇస్తామం టున్నారు. ఇది కూడా రూ.5 లక్షల సమ్ అస్యూర్డ్ ఆ పైన పాలసీలకి మాత్రమే వర్తిస్తుంది. అంటే ఆలోపు పాలసీలకు రెండు శాతం కమీషన్ వుండదని అర్థం.

ఏజెంట్ల మెడపై కత్తి

క్లా బ్యాక్ ఆఫ్ కమీషన్ అనేది విదేశాలలో ఇప్పటికే అమలులో ఉంది. ఇన్సూరెన్స్ రంగంలో 'క్లా బ్యాక్ ఆఫ్ కమీషన్' అంటే 'బీమా ఏజెంట్ లేదా బ్రోకర్ ఒక పాలసీపై వారు సంపాదించిన కమీషన్‌లో కొంత భాగాన్ని లేదా మొత్తాన్ని బీమా కంపెనీకి తిరిగి చెల్లించాలి". ఇందువల్లనే ఐ.ఆర్.డి.ఎ.ఐ దీని గురించి ఎక్కడా స్పష్టత ఇవ్వలేదు. కానీ సెంట్రల్ ఆఫీస్ మార్కెటింగ్ విభాగపు సూచనల మేరకు చర్యలు వుంటాయని మాత్రమే పేర్కొంది. ఇది ఏజెంట్లను మోసగించటమే.



> **క్లా బ్యాక్ ఆఫ్ కమీషన్ అనేది విదేశాలలో ఇప్పటికే అమలులో ఉంది. ఇన్సూరెన్స్ రంగంలో 'క్లా బ్యాక్ ఆఫ్ కమీషన్' అంటే 'బీమా ఏజెంట్ లేదా బ్రోకర్ ఒక పాలసీపై వారు సంపాదించిన కమీషన్‌లో కొంత భాగాన్ని లేదా మొత్తాన్ని బీమా కంపెనీకి తిరిగి చెల్లించాలి". ఇందువల్లనే ఐ.ఆర్.డి.ఎ.ఐ దీని గురించి ఎక్కడా స్పష్టత ఇవ్వలేదు. కానీ సెంట్రల్ ఆఫీస్ మార్కెటింగ్ విభాగపు సూచనల మేరకు చర్యలు వుంటాయని మాత్రమే పేర్కొంది. ఇది ఏజెంట్లను మోసగించటమే.**

ఎల్.ఐ.సి పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరికి కారణం?

1991 నుండి ప్రారంభమైన నూతన ఆర్థిక విధానాల ప్రధాన లక్ష్యం ప్రయివేటు రంగాన్ని ప్రోత్సహించడం. కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇది ప్రయివేటీకరణ దశ దాటి కార్పొరేటీకరణ స్థాయికి చేరింది. ఫలితంగా అన్ని రంగాలలో ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేసి కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయడమే ప్రభుత్వం పని అయినట్లుగా కేంద్ర ప్రభుత్వ విధానాలు కొనసాగుతూ వచ్చాయి.

పంచభూతాలతో సహా రైల్వే, విమాన, పోర్టులు, బొగ్గు, స్టీల్ అన్నింటినీ కార్పొరేట్లకు దోచి పెడుతున్నారు. అందులో భాగంగానే ఐ.ఆర్.డి.ఎ.ఐ ని శిఖండిలా అడ్డుపెట్టుకొని ఎల్.ఐ.సి ని నాశనం చేసి ప్రయివేటు కార్పొరేట్ కంపెనీలకు ఎల్.ఐ.సి ని, బీమా మార్కెట్ మొత్తాన్ని కట్టబెట్టడానికి కేంద్ర ప్రభుత్వం వెనుక వుండి కథ నడిపిస్తున్నది.

ప్రభుత్వ దూకుడుకు అడ్డుకట్ట వేయలేమా!

ఈ ప్రభుత్వ ఉద్దేశపూర్వక కుట్రను ఎదుర్కోవాలంటే ఏజెంట్లు, ఉద్యోగులు పాలసీదారుల సహకారంతో ప్రభుత్వం తన నిర్ణయాలను వెనక్కి తీసుకునే విధంగా ఉద్యమాలు చేపట్టాలి. మూడు రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని దేశ రాజధానిలో రైతులు చేసిన పోరాటం, ఏపీలో వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం గత 1400 రోజుల నుండి అక్కడి కార్మికులు చేస్తున్న పోరాటంలా ఎల్.ఐ.సి ఏజెంట్లు కూడా పట్టుదలతో పోరాటం చేయాలి. అప్పుడు మాత్రమే ఎల్.ఐ.సిని కాపాడుకోగలం. అందుకు ఎల్.ఐ.సి ఏజెంట్లు అందరూ సన్నద్ధం కావాల్సిన అవసరమున్నది.

చెంగిచెర్ల కబేళా టెండర్లు రద్దు

- రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థించిన హైకోర్టు
- తీర్పు పట్ల సీపీఐ(ఎం) హర్షం
- కొత్త టెండర్లు పిలవాలి
- రూ. 15 కోట్ల బకాయిలు వసూలు చేయాలి
- తాత్కాలిక లీజు పేరుతో జరిగిన దోపిడీపై విచారణ జరపాలి : సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం



నవతెలంగాణ-సిటీబ్యూరో

చెంగిచెర్ల కబేళా టెండర్లను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల సీపీఐ(ఎం) హర్షం వ్యక్తం చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తమ పార్టీ నాయకుడు వక్ఫ్ బోర్డు మాజీ చైర్మెన్ మహమ్మద్ సలీంకు టెండర్ దక్కేలా టెండర్ షరతులను తయారు చేసి అతిచౌకగా కట్టబెట్టేందుకు ప్రయత్నం చేసిందని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ టెండర్‌ను రద్దు చేయగా మహ్మద్ సలీం హైకోర్టుకు వెళ్లారని గుర్తు చేశారు. అయితే టెండర్ రద్దును సమర్థిస్తూ కొత్త టెండర్లు వేయాలని హైకోర్టు అక్టోబర్ 13, 2024న తీర్పు ఇచ్చిందని తెలిపారు. కబేళా నిర్వహించిన అనుభవం గత 25 ఏండ్లలో 12 ఏండ్లు ఉండాలని టెండర్‌లో పెట్టిన నిబంధన కారణంగా సలీమ్ అండ్ కంపెనీ తప్ప మరో కంపెనీ పోటీలో నిలవకుండా పోయాయని పేర్కొన్నారు. దాంతో అతి తక్కువ ధరకే టెండర్ దక్కించుకునే ప్రయత్నం చేశారని తెలిపారు. నగరంలోని అంబర్‌పేట్, రామ్నాస్ పుర, బోయగూడా కబేళాలు తక్కువ వైశాల్యంలో తక్కువ సామర్థ్యం ఉన్నప్పటికీ ప్రభుత్వానికి ఏటా ఒక్కో కబేళా నుంచి కోటిన్నర నుంచి రెండు కోట్ల వరకు ఆదాయం వస్తోందని తెలిపారు. 35 ఎకరాల విశాల ప్రాంతంలో అత్యంత సామర్థ్యం కలిగిన చెంగిచెర్ల కబేళా 30 ఏండ్ల కాంట్రాక్ట్ పొంది, ఏటా లైసెన్స్ ఫీజు రూ. 2.60 కోట్ల తక్కువ మొత్తానికే సలీమ్ అండ్ కంపెనీకి కట్టబెట్టే ప్రయత్నం చేశారని పేర్కొన్నారు. చెంగిచెర్ల కబేళా మాంసం ఎగుమతి కేంద్రంగా సలీం అండ్ కంపెనీకి భారీగా లాభాలు తెచ్చిపెడుతున్నప్పటికీ కారుచౌకగా కొట్టేసే ప్రయత్నం జరిగిందని తెలిపారు. మేడ్చల్ జిల్లా చెంగిచెర్ల ప్రాంతంలో ఆధునిక కబేళాను 2008లో ఏర్పాటు చేశారని, 2008లో నాటి ప్రభుత్వం పదేండ్లపాటు కబేళా నిర్వహణను మహమ్మద్ సలీమ్ అండ్ కంపెనీకి అప్పజెప్పిందని తెలిపారు. ఏటా రూ. 1.45కోట్లు చెల్లించేలా ప్రతి ఏటా 5 శాతం పెంచేలా ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. అయితే (అగ్రిమెంట్) ఒప్పంద కాలం 2018 జులైతో ముగిసినప్పటికీ కొత్త టెండర్ పిలవకుండా గత బీఆర్ఎస్ ప్రభుత్వం సలీం అండ్ కంపెనీకి పాత రేటుతోనే అతి చౌకగా తాత్కాలిక లీజు పేరుతో అక్రమంగా కేటాయించిందని విమర్శించారు. లోకాయుక్త తీవ్రంగా మందలించడంతో టెండర్ వేయడానికి గత ప్రభుత్వం సిద్ధపడిందని తెలిపారు. 2023లో పీపీపీ మోడల్‌లో 30 ఏండ్ల కాలానికి రూ. 25 కోట్లతో పునరుద్ధరణ, నిర్వహణ, తిరిగి అప్పగింత పద్ధతిలో (ఆర్‌వోఎంటీ) టెండర్ వేసింది. కానీ అందులో పెట్టిన షరతులు మమ్మద్ సలీమ్ అండ్ కంపెనీకి అనుకూలంగా తయారు చేయడంతో పోటీలో మరో కంపెనీ నిలవకుండా చేశారని పేర్కొన్నారు. ఈ తాత్కాలిక లీజు కేటాయింపులపై గత ఆరేండ్లుగా సీపీఐ(ఎం) నగర కమిటీ అనేక ఫిర్యాదులు చేసినట్టు చెప్పారు. లోకాయుక్తలో కేసు ఫైల్ చేసిందని, విజిలెన్స్ శాఖ విచారణ జరిపిందని తెలిపారు. తాత్కాలిక లీజు ప్రభుత్వానికి భారీగా నష్టం చేస్తున్నదని విజిలెన్స్ నివేదిక ఇచ్చిందని పేర్కొన్నారు. జరిగిన నష్టాన్ని సలీమ్ అండ్ కంపెనీ నుంచి రాబట్టాలని ఆ శాఖ సిఫారసు చేసిందని తెలిపారు. ఏటా రూ. 4.30 కోట్ల బకాయిలతో సహా చెల్లించాలని గొర్రెల మేకల సహకార ఫెడరేషన్ సంస్థ సలీం అండ్ కంపెనీకి నోటీసులు జారీ చేసిందని తెలిపారు. అయినప్పటికీ నేటికీ ఎలాంటి చెల్లింపులు చేయలేదని, ఆరేండ్ల కాలానికి సలీం అండ్ కంపెనీ ప్రభుత్వానికి రూ.15 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. గత ఆరేండ్లలో తాత్కాలిక లీజు పేరుతో కేటాయింపులపై విచారణ జరపాలని, బకాయిలను వెంటనే వసూలు చేయాలని, కొత్త టెండర్ల ప్రక్రియను వెంటనే మొదలు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అకాల వర్షాలతో విలవిల



నవతెలంగాణ-లింగంపేట్/నాగిరెడ్డిపేట్

అకాల వర్షాలతో అన్నదాతలు విలవిలలాడుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలోనే కొన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభమైనా తూకం మాత్రం వేయడం లేదు. మరోపక్క మంగళవారం కురిసిన అకాల వర్షానికి పిడుగుపడి ఒకరు మృతి చెందారు. మరొకరికి గాయాలయ్యాయి.

కామారెడ్డి జిల్లాలోని అన్ని గ్రామాల్లో దాదాపు వరి కోతలు ఊపందుకున్నాయి. అన్నదాతలు వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి ఆరబెడుతున్నారు. ఈ సమయంలో మంగళవారం లింగంపేట్, నాగిరెడ్డి మండలాల్లో భారీ వర్షం కురిసింది. కోతకు వచ్చిన ధాన్యం రాలిపోగా.. ఆరబెట్టిన ధాన్యం తడిచి ముద్దయింది. లింగంపేట్ మండలంలోని పరమల్ల, శెట్టిపల్లి పోల్కంపేట్ కన్నాపూర్, పోతాయపల్లి అయ్యపల్లి కన్నాపూర్ గ్రామాల్లో ధాన్యం రాశులు నీటితో తడిచి ముద్దయ్యాయి. వేలాది క్వింటాల్లా ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పరమల్ల గ్రామంలో వర్షపు నీటిలో ధాన్యం కొట్టుకుపోయింది. కొనుగోలు కేంద్రాలన్నీ బురదమయమయ్యాయి. కాగా పలు చోట్ల ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోగా.. మరికొన్ని చోట్ల అట్టహాసంగా ప్రారంభించినా తూకాలు మొదలవ్వలేదు. దాంతో ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలు అన్నదాతలను కలవరపెడు తున్నాయి. కండ్లముందే ధాన్యం కొట్టుకుపోతున్నా ఏమీ చేయలేని పరిస్థితుల్లో రైతులు ఉన్నారు. ఇప్పటికైనా స్పందించి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకాన్ని వెంటనే ప్రారంభించాలని అన్నదాతలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. లేదంటే అన్నదాతల పరిస్థితి అగమ్య గోచరంగా తయారవుతుం దన్నారు. సోమ, మంగళవారం రెండు రోజులపాటు వర్షాలు కురవడంతో పెట్టుబడి రావడం కష్టంగా మారే అవకాశాలున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధాన్యం కుప్పచేసేందుకు వెళ్లి.. పిడుగుపడి మృతి

పిడుగు పడి యువకుడు మృతిచెందిన ఘటన కామారెడ్డి నాగిరెడ్డిపేట్ మండలంలోని బొల్లారం గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన మంద వెంకటి (26) తన తండ్రి నాగభూషణం వడ్లను కుప్ప చేస్తుండగా.. వర్షం కురవడంతో ఇద్దరు చెట్టు కిందకు వెళ్లారు. అదే సమయంలో పిడుగు పడటంతో చెట్టు కింద ఉన్న మంద వెంకటి అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రి నాగభూషణానికి తీవ్ర గాయాలు కావడంతో ఎల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తాండూర్ సొసైటీ చైర్మెన్ ఆకిడి గంగారెడ్డి ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి చేరుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పెండింగ్ డీఏలు వెంటనే ప్రకటించాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్

నవతెలంగాణ-ఎన్జీవోస్ కాలనీ

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని నల్గొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లా మడికొండలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల, బాలుర పాఠశాలలో జరిగిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులంతా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా వెంటనే డీఏలను ప్రకటించాలని, పీఆర్‌సీ కమిటీ నివేదికను తెప్పించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. గురుకుల పాఠశాలల్లో పనివేళలు మార్చాలని, కేర్ టేకర్ల నియామకం చేయాలని, కేజీబీవీ మహిళా ఉపాధ్యాయులకు మినిమం టైమ్‌స్కేల్ ప్రకటించాలని, గురుకుల ఉపాధ్యాయులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఐదున్నరేండ్లుగా తాను



ఎమ్మెల్సీగా ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం కృషి చేశానని, ఉపాధ్యాయులకు 30శాతం ఫిట్మెంట్ సాధనలో, ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతుల సాధనను చేపట్టినట్టు చెప్పారు.

11 ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీలు, కేజీబీవీ ఉపాధ్యాయుల బదిలీలు జరగడానికి ఎంతో కృషి చేసినట్టు తెలిపారు. తానని ఎమ్మెల్సీగా గెలిపిస్తే మిగతా సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తానని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల ప్రిన్సిపాల్స్ కుమారస్వామి, మాలిక, టీఎస్ యూటీఎఫ్ హనుమకొండ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.రవీందర్ రాజు, పెండెం రాజు, జిల్లా కార్యదర్శి కె.సదానందం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏఈవోలపై సర్కారు వేటు

- డిజిటల్ క్రాప్ సర్వే చేయకపోవడమే కారణమా?
- ఐదువేల ఎకరాల్లో ఒక ఏఈవోకు సర్వే చేయడం సాధ్యమేనా?
- సాంకేతిక కారణాలు చూపి ఉద్యోగుల తొలగింపా : సస్పెన్షన్ ఎత్తేయాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్‌కు ఏఈవోల వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వ్యవసాయ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా 160మంది వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో)పై సస్పెన్షన్ వేటు వేసింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన డిజిటల్ క్రాప్ సర్వేకు సంబంధించిన యాప్ డౌన్‌లోడ్ చేసుకుని తన పరిధిలోని అన్ని పంటల ఫొటోలు తీసి, వెంటనే పై అధికారులకు పంపించాలని ఆదేశించింది. కొన్ని సాంకేతిక కారణాలతో పంటల సర్వే చేయని వారిని అర్థాంతరంగా ఇంటికి పంపించింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం పంటను సర్వే చేయడం లేదనే సాకు చూపించి ఏకంగా 160 మందిని రోడ్డున పడేసింది. ఒక్కొక్క ఏఈవో పరిధిలో ఐదువేల నుంచి ఎనిమిది వేల ఎకరాల సాగు భూమి ఉంటుంది. డౌన్‌లోడ్ చేసుకున్న యాప్‌లో ఎక్కడెక్కడ ఏయే పంటలు వేశారు. ఎక్కడ పంటలు వేయలేదనే సమాచారాన్ని ఫొటోలను పై అధికారులకు పంపించాల్సి ఉంటుంది. వీటితో పాటు సాగు, బీడు భూములతోపాటు సర్వే నెంబర్లు, ఫారెస్ట్ ల్యాండ్, గుట్టలను కూడా లెక్కించాల్సి ఉంటుంది. దీంతో సుమారు 25 కిలోమీటర్ల పొడవున కాలినడక తిరుగుతూ ప్రతిదీ ఫొటో, వీడియో తీయాల్సిందే. కాదు, కూడదంటే ఉద్యోగం మానేయాలనే హుంకరింపులు తప్పవు. ఇలాంటి షరతులతో ఏఈవోలపై పనిభారం, ఒత్తిడి పెరుగుతున్నది. ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయి సిబ్బందిపై ఉన్నతాధికారులు తీవ్రమైన ఒత్తిడి పెంచుతున్నారు. ఇద్దరు, ముగ్గురు చేయాల్సిన పనులను ఒక ఏఈవోపై మోపడం వల్ల ఏఈవో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫొటోలు సంక్షిప్తం చేసి, వాటిని అప్‌లోడ్ చేసే సమయంలో ఫోన్ సిగ్నల్ సమస్య తీవ్రంగా ఉంటుంది. అంతేకాక చాలా మంది సిబ్బంది ఆ సాంకేతికతను అందుకోలేకపోవడం వల్ల కూడా కొంత ఆలస్యమవుతున్నది. ఇంత క్లిష్టమైన పనులను ఎలాంటి సహాయకులు లేకుండా సర్వే చేయడం ప్రాక్టికల్‌గా సాధ్యమయ్యే పని కాదని చెబుతున్నారు. అయినప్పటికీ అన్ని రకాల పంటలను సెల్‌ఫోన్లో బంధించాల్సిందే. ఒక సర్వే నంబర్‌లో 30 నుంచి 50 వరకు సబ్ డివిజన్స్ వుంటాయి. అందులో రైతులను గుర్తించడం కూడా ఇబ్బందిగా మారుతున్నది.

సబ్ డివిజన్లకు బౌండరీలు ఎక్కడ అందుబాటులో ఉండవు. దీంతో రైతు వేసిన పంట వివరాలను తప్పుగా నమోదు చేసే అవకాశం ఉన్నది. అందుకు ఏఈవోలే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తున్నది. సర్వేనెంబర్ తప్పుగా నమోదైతే రైతులు తమ పంటను అమ్ముకునే సమయంలో సాంకేతిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తున్నది. 2023-24లో పైలెట్ ప్రాజెక్టు కింద 17 జిల్లాల్లో 17 మండలాల్లో పంటల సర్వే నిర్వహించిన అనుభావాలను వ్యవసాయ శాఖ తీసుకోవడం లేదు. ఆ సమయంలో అదనపు సిబ్బందిని నియమించి సర్వే నిర్వహించింది. వాస్తవానికి అదనపు సిబ్బంది లేకుండా ఈ డిజిటల్ సర్వే చేయడం సాధ్యం కాదనేది తేలింది. వీటితోపాటు రైతుల గుర్తింపు, ధ్రువపత్రాల సేకరణ, రైతు సమావేశాల నిర్వహణ, క్షేత సందర్శన మొదలగు పనులను ఏఈవోలే చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రంలో 2,604 మంది వ్యవసాయ విస్తరణ అధికారులు మాత్రమే పని చేస్తున్నారు. ప్రతీ 5000 ఎకరాలకు ఒక ఏఈవో పని చేయాల్సిన చోట ప్రస్తుతం రాష్ట్రంలో సరాసరిగా 6500 నుంచి 8,000 ఎకరాల వరకు సాగు భూమి విస్తీర్ణం ఉన్నది. అత్యధికంగా ఒక ఏఈవో పరిధిలోని క్లస్టర్‌లో 28,000 ఎకరాల భూమి ఉన్నది. ఇలాంటి పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న కేవలం 2,604 మంది ఏఈవోల సహాయంతో కోటి యాభై లక్షల ఎకరాల సాగు భూమిని సర్వే చేయడం ఎలా సాధ్యమని ఏఈవోలు ప్రశ్నించారు. ఇదే అంశంపై మంగళవారం వ్యవసాయ శాఖ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సస్పెండ్ చేసిన ఏఈవోలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలనీ, పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. తమకు సహాయకులను నియమించాలని డిమాండ్ చేశారు. మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, ఎంపీ, ఒడిశా రాష్ట్రాల్లో అదనపు సిబ్బందిని నియమించి పంటలు సర్వే చేయిస్తున్నారని తెలిపారు.

మరో సియోల్ నగరం కానున్న హైదరాబాద్

- మూసీ ప్రక్షాళనతో కలలకు సాకారం : ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్ నగరం దక్షిణ కొరియా రాజధాని సియోల్ కాబోతున్నదని ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. చామల తోపాటు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల బృందం నాలుగు రోజుల పర్యటన నేపథ్యంలో నేడు రెండో రోజుకు చేరుకుంది. మంగళవారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కాలే యాదయ్య, ప్రకాష్‌గౌడ్‌తోపాటు అధికారులు, జర్నలిస్టుల బృందం సియోల్‌లో చెంగిచియాన్‌నది, హన్‌నదులను పరిశీలించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. అక్కడ ఉన్న నదులు వాటి ప్రక్షాళన, అనంతరం చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే వనరుల పునర్వినియోగంపై రివర్స్ ఫ్రంట్ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణంపై దుష్ప్రభావం పడకుండా వ్యర్థాలను పునర్వినియోగంలోకి తెచ్చే అద్భుత సాంకేతిక పరిజ్ఞానం సియోల్‌లో వినియోగంలో ఉందని తెలిపారు. సియోల్ నగరం నడిబొడ్డు నుంచి ప్రవహించే చెంగిచియాన్ నది హైదరాబాద్ మధ్యలో ప్రవహించే మూసీలాగా మురికిమయంగా ఉండేదన్నారు. నదిని సియోల్ నగర పాలక సంస్థ ప్రక్షాళనతో అత్యంత సుందర నగరంగా సియోల్ మారిందని చెప్పారు.సీఎం రేవంత్‌రెడ్డి తలపెట్టిన మూసీనది ప్రక్షాళనతో హైదరాబాద్ నగరం మరో సియోల్‌గా మారనుందన్నారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే పునర్వినియోగం ప్లాంట్లను తెలంగాణ ప్రభుత్వం నెలకొల్పుతుందని వివరించారు.

మానవాళిపై వ్యాధుల పంజా

(మొదటిపేజీ తరువాయి)

డాలర్ల ఆర్థిక భారం పడుతుందని ఆ నివేదిక తెలిపింది. వివిధ సంస్థల అంచనాలు, సర్వేలు, నివేదికలను పరిశీలిస్తే భవిష్యత్తులో మానవాళిపై ఇన్‌ఫెక్షన్లు, వ్యాధులు విరుచుకుపడబోతున్నాయని అర్థమవుతోంది. కరోనా వైరస్ మహమ్మారి నుండి ఈ ప్రపంచం ఏవైనా పాఠాలు నేర్చుకున్నదా అని అనుమానాలు కలుగుతున్నాయి.

సరిహద్దులు దాటుతూ...

ప్రపంచంలో నెలకొన్న ఆరోగ్య పరిస్థితిపై ఐరాస ఫౌండేషన్‌లో గ్లోబల్ హెల్త్ స్ట్రాటజీ విభాగం ఉపాధ్యక్షుడు డాక్టర్ అహ్మద్ ఆగ్‌వెల్ ఏమన్నారంటే...

ప్రస్తుతానికి ఉష్ణోగ్రత ఓ మోస్తరు ముప్పు కలిగిస్తోంది. పలు దేశాలలో మంకీపాక్స్ వ్యాధి వ్యాపించింది. రాబోయే కాలంలో ఎదురయ్యే ఆరోగ్య విపత్తులను ఎదుర్కోవడానికి అన్ని దేశాలు కలసికట్టుగా సన్నద్ధం కావాల్సిన అవసరం ఉంది. ఇప్పుడు ప్రపంచ దేశాలను వివిధ వ్యాధులు కలవరపెడుతున్నాయి. మంకీపాక్స్, డెంగ్యూ, కలరా, పోలియో వంటి వ్యాధులు ప్రజల జీవితాలతో అడుకుంటున్నాయి. ఆరోగ్య వ్యవస్థలపై కోవిడ్ ప్రభావం ఇప్పటికీ కొనసాగుతోంది. వ్యాధులు ఏ ఒక్క దేశానికో పరిమితం కావడం లేదు. అవి ఎల్లలు లేకుండా విజృంభిస్తున్నాయి. వీటి కారణంగా ప్రపంచం ఇప్పుడు ఓ మోస్తరు ముప్పును మాత్రమే ఎదుర్కొంటోంది. అది పెరగనూ వచ్చు, తగ్గనూ వచ్చు. ప్రపంచ దేశాల స్పందనపై అది ఆధారపడి ఉంటుంది.

నాటి జాగ్రత్తలు నేడేవి?

వ్యాధులపై అన్ని దేశాలు పూర్తి సన్నద్ధత ప్రదర్శించాల్సి ఉంటుంది. పరిస్థితి నియంత్రణలో ఉండాలంటే చేయాల్సింది ఎంతో ఉంది. కోవిడ్ నుండి పాఠాలు నేర్చుకోవాల్సి ఉన్నప్పటికీ అది జరగలేదు. అప్పుడు మాస్కులు ధరించాం. శానిటైజర్‌తో తరచూ చేతులు శుభ్రం చేసుకున్నాము. దూరం పాటించాము. మరి ఇప్పుడో? అన్నీ మరచిపోయాము. పరిస్థితిని మన నియంత్రణలో ఉంచుకోవడంలో విఫలమవుతున్నాము. కోవిడ్ నివారణకు కొన్ని వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాము. ఆ ముప్పు తప్పిన తర్వాత వాటన్నింటినీ అటకెక్కించాము. ఉదాహరణకు అప్పుడు విమానాశ్రయాలలో టెంపరేచర్ స్కానింగ్ యంత్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పుడు అవి కన్పిస్తున్నాయా?

అదమరిస్తే అంతే

కోవిడ్ వచ్చినప్పుడు ఆరేడు నెలల వ్యవధిలోనే వ్యాక్సిన్లను ఉత్పత్తి చేశారు. మంకీపాక్స్ విషయంలో ఆ ఆతృత కన్పించలేదు. దానిని తక్షణమే అదుపు చేయాల్సిన అవసరం ఉన్నదని గుర్తించలేకపోయాము. డెంగ్యూ జ్వరాల విషయంలోనూ అంతే. పాలకులు కూడా కోవిడ్ నుండి పాఠాలు నేర్చుకోలేదు. ఇప్పటికీ మంకీపాక్స్ ముప్పు తొలగిపోలేదు. మంకీపాక్స్ వ్యక్తుల మధ్య త్వరగా వ్యాపిస్తుంది. ఆ వ్యాధి సోకిన వ్యక్తి వేరే దేశం వెళితే అది కూడా అతనితో పాటే ప్రయాణిస్తుంది. ఇదో గొలుసు కట్టు లాంటిది. ఆదమరిస్తే మరింత ప్రమాదం జరుగుతుంది. ఈ ప్రపంచంలో ఎక్కడైనా ఓ వ్యాధి సోకిందనుకోండి. అది ఏ మూలకైనా వ్యాపిస్తుంది.

ఘర్షణలతో మరింత వ్యాప్తి

కోవిడ్, ఎబోలా, కలరా వ్యాధులు నేర్పిన పాఠాలకు అనుగుణంగా మనం వ్యవహరించాల్సి ఉంటుంది. ఈ వ్యాధులు మనకు నేర్పిన పాఠం ఏమిటి? సరిహద్దులతో నిమిత్తం లేకుండా అందరూ సంఘటితం కావాల్సిన ఆవశ్యకతను అవి నొక్కి చెప్పాయి. వ్యాధులను అరికట్టేందుకు ఉపకరించే వైద్య పరికరాలు, మందులు, వనరులు, పరిజ్ఞానం ఏ దేశంలో ఉన్నప్పటికీ అవి అందరికీ అందుబాటులో ఉండాలి. అయితే ఇప్పుడు ప్రపంచంలో ఆ పరిస్థితులు ఉన్నాయా అంటే లేవనే చెప్పాలి.

పలు ప్రాంతాలలో మానవీయ సంక్షోభం నెలకొని ఉంది. ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారం, తాగునీరు లభించడం లేదు. కాలుష్య వాయువులను పీల్చాల్సి వస్తోంది. దీంతో ప్రమాదం పెరిగిపోతోంది. ముఖ్యంగా ఘర్షణలు జరిగే ప్రాంతాలు లేదా వార్ జోన్స్‌లో శరణార్థుల ద్వారా వ్యాధులు అత్యంత వేగంగా వ్యాపిస్తున్నాయి. కొత్తగా సూపర్‌బగ్స్ వృద్ధి చెందుతున్నాయి. వాటిని అడ్డుకునేందుకు ఔషధాలు కనిపెడుతుంటే అవి వాటిని తట్టుకునే సామర్థ్యాన్ని పెంచుకుంటున్నాయి. ఆ బగ్స్ ద్వారా కొత్త వేరియంట్లు వ్యాపిస్తున్నాయి. ప్రపంచంలోని మిగిలిన దేశాలు కూడా ప్రమాదంలో పడిపోతాయి. ఘర్షణలు, యుద్ధాలు జరిగే ప్రాంతాలు ప్రపంచవ్యాప్తంగా మిగిలిన ఆరోగ్య వ్యవస్థలను ధ్వంసం చేస్తాయి.

వాతావరణ మార్పులతో...

వాతావరణ మార్పులు కూడా ఆరోగ్యంపై బాధాకరమైన ప్రభావం చూపుతున్నాయి. ఈ మార్పుల కారణంగా సమాజాలు ఓ నిర్దిష్ట వ్యాధి బారిన పడకపోవచ్చు. అయితే అవి సంభవించినప్పుడు కొన్ని ప్రాంతాలలో వ్యాధులు ప్రబలుతాయి. అంతేకాదు... అప్పటికే ఉన్న వ్యాధులు ఈ మార్పుల కారణంగా మరింత వృద్ధి చెందుతాయి. వరదలు సంభవించి, నీరు కొద్ది గంటలు మాత్రమే నిల్వ ఉంటే పెద్దగా వ్యాధులు రాకపోవచ్చు. కానీ నీరు ఎక్కువ కాలం అలాగే ఉండిపోతే మాత్రం వ్యాధులు తప్పవు. వాతావరణ మార్పుల కారణంగా ప్రజా సమూహాలు దీర్ఘకాలం నష్టపోతాయి. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు వ్యాధులు మరింత విజృంభించే ప్రమాదం ఉంటుంది.

జనారణ్యాలలో ప్రవేశిస్తే...

అడవులు, మంచు పర్వతాలలో కూడా ఇప్పుడు మానవ సంచారం కన్పిస్తోంది. మనం ఇప్పటి వరకూ చూడని గుహలు, అడవులు, సముద్రపు లోతులలోకి వెళ్లామనుకోండి. అక్కడ బగ్స్, వ్యాధి కారకాలు ఉండవచ్చు. వాతావరణ మార్పుల కారణంగా ఈ బగ్స్, వ్యాధి కారక సూక్ష్మక్రిములు, జంతువులు జనారణ్యాలలో ప్రవేశిస్తాయి. అప్పుడు ప్రజలు గతంలో ఎన్నడూ అనుభవంలోకి రాని వ్యాధుల బారిన పడతారు.

వ్యాపారంగా ఆరోగ్య సేవలు

ఆరోగ్య రంగంపై ప్రభుత్వాలు పెద్దగా ఖర్చు చేయకపోవడంతో లక్షలాది ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. ముఖ్యంగా పేదలు వైద్య ఖర్చులను భరించలేని పరిస్థితి తలెత్తుతోంది. వారిని నాణ్యమైన సేవలు లభించడం లేదు. ఇప్పుడు ఆరోగ్య రక్షణ అనేది వ్యాపారమై పోయింది. కొన్ని రకాల వైద్య సేవల నుండి ప్రభుత్వం పూర్తిగా తప్పుకుంది. ఆరోగ్య రంగంలో వ్యాపార ధోరణికి ఓ పరిమితి అంటూ ఉండాలి. అప్పుడే పేదలపై భారం పడదు.



మహిళలపై దాడులను అరికట్టాలి

పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు అనసూయ

నవతెలంగాణ - ముషీరాబాద్

మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు అనసూయ డిమాండ్ చేశారు. కోల్‌కతా మహిళా డాక్టర్ లైంగికదాడి, హత్య ఘటన జరిగి 72 రోజులు గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మంగళవారం పీఓడబ్ల్యూ ఆధర్యంలో పార్సిగుట్ట అంబర్‌నగర్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు చేయాలని, దోషులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు అరుణ, రాజమణి, మనక్క, సుజాత, పుష్ప లీల, మంజుల, స్వప్న తదితరులు పాల్గొన్నారు.నారా

హెచ్‌ఎంల సస్పెన్షన్ ఎత్తేయాలి : బీటీఏ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రధానోపాధ్యాయుల (హెచ్‌ఎం)పై ఉన్న సస్పెన్షన్‌ను ప్రభుత్వం వెంటనే ఎత్తేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) రాష్ట్ర అధ్యక్షులు కల్పదర్శి చైతన్య మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్పౌజ్ పాయింట్లను వారు దుర్వినియోగం చేశారనే నెపంతో సస్పెండ్ చేయడం సరైంది కాదని తెలిపారు. జీహెచ్‌ఎంలకు స్పౌజ్‌కు సంబంధించిన నిబంధనలను సరిచేయాలని కోరారు. వారికి సాధారణ బదిలీల్లో జిల్లా క్యాడర్ కాకుండా మల్టీ జోన్ వారీగా బదిలీలు పదోన్నతులు చేయబడ్డాయని పేర్కొన్నారు. అలాంటప్పుడు వారికి జిల్లాగాని లేదా జోన్ గాని పరిగణనలోకి రావాలనీ, స్కూల్ పాయింట్ల పరిధిలోకి ఎలా వస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేసి వారి సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తేసి నియమ నిబంధనలను సరిచేయాలని కోరారు.

ఎన్ఐసీకి ధరణి

- రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
- 25న బదలాయింపుపై ఆయా సంస్థలతో సమావేశం
- భూ సమస్యలకు త్వరలో పరిష్కారం : రెవెన్యూశాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన నేషనల్ ఇన్ఫర్మేటిక్ సెంటర్(ఎన్ఐసీ)కి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ మంగళవారం జీవో 107 జారీ చేశారు. ఇప్పటి వరకు టెర్రాసిస్ సంస్థ నిర్వహిస్తున్న ధరణి పోర్టల్ బాధ్యతలను. మూడేండ్ల పాటు నిర్వహణకు ఎన్ఐసీతో ఒప్పందం చేసుకున్నట్టు ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. పనితీరు బాగుంటే మరో రెండేండ్లు పొడిగించనున్నారు. అయితే ధరణి పోర్టల్‌కు చెందిన సాంకేతిక అంశాలను ఎన్ఐసీకి బదలాయించేందుకు నవంబరు 30వ తేదీ వరకు టెర్రాసిస్ సిబ్బంది ఎన్ఐసీకి సహకరించనున్నారు. అప్పటి వరకు సాంకేతికంగా పూర్తి స్థాయిలో బదలాయింపు కాకుంటే మరో నెల పాటు సదరు సంస్థే సహకరించనుందని ఉత్తర్వులో పేర్కొన్నారు. 2018లో టెక్నికల్, ఫైనాన్షియల్ బిడ్డింగ్, అర్హతల ఆధారంగా రూ.116 కోట్లకు ఐఎల్ఎఫ్ఎస్ అనే కంపెనీకి ధరణి పోర్టల్ డిజైన్ డెవలప్‌మెంట్‌ను అప్పటి ప్రభుత్వం అప్పగించింది. ఆ కంపెనీ దివాళా తీయడంతో తర్వాత టెర్రాసిస్‌గా అనంతరం, ఫాల్కాన్ ఇన్వెస్టిమెంట్ కంపెనీగా మారింది. ధరణి టెండర్ దక్కించుకున్న కంపెనీ తమ వాటాలను దాదాపు రూ.1200 కోట్లకు అమ్ముకోవటం అప్పట్లో సంచలనం కలిగించింది. గత సర్కార్ ఎంతో ఆర్భాటంగా తెచ్చిన ధరణితో భూసమస్యలు తగ్గకపోగా మరింతగా పెరిగాయి. ఈ పోర్టల్ అమల్లోకి రాకముందు 75 రకాల భూ సమస్యలుంటే, వచ్చాక ఆ సమస్యల సంఖ్య 130కి పెరిగింది. ఈ నేపథ్యంలో గత డిసెంబర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ భూ సమస్యల పరిష్కారం కోసం మార్చిలో ధరణి కమిటీని ఏర్పాటు చేసింది. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ సిఫారసుల మేరకు సర్కార్ మంగళవారం ధరణి పోర్టల్‌ను ఎన్ఐసీకి అప్పగించింది.

25న టెర్రాస్, ఎన్ఐసీతో సమావేశం

ధరణి పోర్టల్‌ను ఎన్ఐసీకి అప్పగించేందుకు సాంకేతికంగా చేపట్టాల్సిన చర్యల కోసం ఆయా సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 25న ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ అదనపు కార్యదర్శి టి.శేఖర్ మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ఏర్పాటు చేసే సమన్వయ మీటింగ్‌కు ఎన్ఐసీతో పాటు తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్, టెర్రాస్‌లు హాజరు కావాలని సర్క్యులర్‌లో పేర్కొన్నారు.

త్వరలో ధరణి సమస్యలకు పరిష్కారం : రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

త్వరలో ధరణి సమస్యలు పరిష్కారం కానున్నాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు విదేశీ సంస్థ టెర్రాసిస్ చేతిలో ఉన్న నిర్వహణా బాధ్యతను స్వదేశీ సంస్థ ఎన్ఐసీకి అప్పగించామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోని పెద్దలు ఎలాంటి ముందు చూపు లేకుండా హడావుడిగా తీసుకువచ్చిన పోర్టల్ వల్ల తెలంగాణ రైతాంగం ఇబ్బందులు ఎదుర్కొందని ఆరోపించారు. అప్పట్లో లక్షలాది రైతులకు చెందిన కోట్లాది ఎకరాల వ్యవసాయ భూములను ఏకపక్షంగా విదేశీ కంపెనీలకు అప్పగించారని విమర్శించారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఎన్నికల ప్రణాళికలో చెప్పినట్టుగా ధరణిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

ఉక్రెయిన్‌లో శాంతి నెలకొనాలి

- స్పష్టం చేసిన ప్రధాని మోడీ
- అవసరమైతే సాయానికి సిద్ధమని వెల్లడి
- కజన్‌లో బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో పుతిన్‌తో భేటీ



కజన్ (రష్యా) : ఉక్రెయిన్‌లో శాంతిని కోరుకుంటున్నామని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. అవసరమైతే రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి శాంతియుత పరిష్కారాన్ని కనుగొనేందుకు అన్ని రకాలుగా అవసరమైన సాయమందించడానికి భారత్ సంసిద్ధంగా వుందని ప్రధాని నరేంద్ర మోడీ మంగళవారం తెలిపారు. 16వ బ్రిక్స్ సదస్సులో పాల్గొనేందుకు కజన్‌కు వచ్చిన మోడీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో భేటీ అయ్యారు. తమ మధ్య ధృఢమైన స్నేహబంధం వుందని పేర్కొన్నారు. పుతిన్‌తో అర్ధవంతమైన, అద్భుతమైన సమావేశాన్ని జరిపినట్టు మోడీ తెలిపారు. భారత్, రష్యా సంబంధాలకు లోతైన మూలాలున్నాయన్నారు. వివిధ రంగాల్లో ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసుకోవడంపై చర్చలు జరిగినట్లు మోడీ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

బ్రిక్స్ సదస్సుకు భారత్ చాలా ప్రాధాన్యతనిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా బ్రిక్స్ దేశాల అధినేతలతో విడివిడిగా ద్వైపాక్షిక సమావేశాలు జరిపే అవకాశం వుందని, పలు అంశాలపై విస్తృతంగా చర్చలు జరపడం కోసం ఎదురుచూస్తున్నానని మోడీ పేర్కొన్నారు. ఈ మేరకు రష్యాకు బయలుదేరడానికి ముందుగా మోడీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

పుతిన్, జిన్‌పింగ్ భేటీ

బ్రిక్స్ సదస్సుకు విచ్చేసిన చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సమావేశమయ్యారు. గత శతాబ్ద కాలంలో ఎన్నడూ చూడని మార్పులను నేటి ప్రపంచం చూస్తోందని, అంతర్జాతీయంగా పరిస్థితులు కల్లోలంగా వున్నాయని, ఒకదానితో ఒకటి ముడిపడి వున్నాయని జిన్‌పింగ్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. ఇరు దేశాల మధ్య బలమైన సంబంధాలు వున్నాయని ప్రశంసించారు. ఇరు దేశాలు సమగ్ర వ్యూహాత్మక సమన్వయాన్ని, ఆచరణాత్మక సహకారాన్ని మరింత విస్తరించుకుంటూనే వున్నాయన్నారు. జిన్‌పింగ్‌ను తన ప్రియమిత్రుడుగా పుతిన్ అభివర్ణించారు. ఇరు దేశాల మధ్య పెరుగుతున్న సహకారం ప్రపంచ స్థిరీకరణకు దోహదపడుతోందన్నారు.

దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రమఫోసా కూడా పుతిన్‌తో భేటీ అయ్యారు. రష్యాను విలువైన మిత్రపక్షంగా భావిస్తున్నామని చెప్పారు. వర్ణవివక్షతపై పోరాట కాలం నుండి నేటి వరకు ఇరు దేశాల మధ్య స్నేహ బంధం అలాగే కొనసాగుతోందన్నారు.

బ్రిక్స్ దేశాలతో సన్నిహిత సహకారం:పీఎంఓ ప్రకటన

ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) కూడా ఒక ప్రకటన విడుదల చేసింది. బ్రిక్స్ దేశాలతో సన్నిహిత సహకారానికి భారత్ నిబద్ధతతో వుందని పేర్కొంది. వాతావరణ మార్పులు, ఆర్థిక సహకారం, సమర్ధవంతమైన రీతిలో సరఫరా గొలుసులను నిర్మించుకోవడం వంటి పలు కీలకమైన అంతర్జాతీయ అంశాలను పరిష్కరించడంలో బ్రిక్స్ పాత్రపై చర్చించనున్నారు. గతేడాది కొత్త సభ్యులను చేర్చుకోవడం వల్ల బ్రిక్స్ సమర్ధత మరింత పెరిగిందని పీఎంఓ పేర్కొంది. భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడానికి మోడీ ఈ పర్యటన ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. న్యాయమైన అంతర్జాతీయ అభివృద్ధి, భద్రతకు బహుళపక్షవాదాన్ని బలోపేతం చేయడం ఈ ఏడాది సదస్సు ముఖ్య ఉద్దేశ్యంగా వుందని విదేశాంగ శాఖ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది.

ప్రజలే కేంద్రంగా పాలన

- డాక్టర్ శశాంక్ గోయల్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజలే కేంద్రంగా పాలన అవసరమని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి డాక్టర్ శశాంక్ గోయల్ తెలిపారు. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లో ఆర్మ్‌డ్ ఫోర్సెస్-సివిల్ సర్వీసెస్ ఆఫీసర్ల కోసం సిటీజన్-సెంట్రిక్ గవర్నెన్స్ ఏర్పాటు చేసిన ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు మరింత సులభతరంగా సాంకేతికతను ఉపయోగించుకునేందుకు ఇష్టపడుతున్నారని తెలిపారు. సెంటర్ హెడ్, కోర్స్ డైరెక్టర్ డాక్టర్ మాధవి రావులపాటి సమావేశంలోని నిర్ణయాలను కేంద్ర ప్రభుత్వానికి పంపించనున్నట్టు తెలిపారు.

ఏ హోదాలో విచారణకు హాజరయ్యారు?

- అక్రమ మార్గాల్లో డైరెక్టర్లు అయ్యారనీ ప్రభుత్వమే జీవో ఇచ్చింది
- మిగులు విద్యుత్ భారం కూడా ప్రజలపైనేనా? : టీజీఈఆర్సీ బహిరంగ విచారణలో విద్యుత్‌రంగ నిపుణులు ఎమ్ వేణుగోపాలరావు
- ట్రాన్స్‌కో ప్రతిపాదనలపై పలువురి అభ్యంతరాలు





నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

"ఏ హోదాలో వీరంతా బహిరంగవిచారణల్లో పాల్గొంటున్నారో స్పష్టంచేయాలి. వీరంతా అక్రమ పద్ధతుల్లో డైరెక్టర్లుగా నియమితులయ్యారని ప్రభుత్వమే ఉత్తర్వులు జారీ చేసింది" అని విద్యుత్‌రంగ నిపుణులు, సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్ ఎమ్ వేణుగోపాలరావు నిలదీశారు. 2024-29 బహుళ సంవత్సరాల టారిఫ్ (ఎమ్‌వైటీ) ప్రతిపాదనలపై టీజీ ట్రాన్స్‌కో దాఖలు చేసిన పిటీషన్లపై తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ సంస్థ (టీజీఈఆర్సీ) ఆధ్వర్యంలో మంగళవారంనాడిక్కడి విద్యుత్ నియంత్రణ్ భవన్‌లో చైర్మెన్ తన్నీరు శ్రీరంగారావు, సభ్యులు ఎమ్‌డీ మనోహరరాజు, బండారు కృష్ణయ్య నేతృత్వంలో బహిరంగ విచారణ జరిగింది. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో డైరెక్టర్లు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా తమ టారిఫ్ ప్రతిపాదనలను వివరించారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. విద్యుత్ కమిషన్ ముందు అక్రమ డైరెక్టర్ల వాదనలు ఏమిటని ప్రశ్నించారు. వీరంతా నిబంధనలకు విరుద్ధంగా నియమితులైనట్టు జనవరిలో ప్రభుత్వమే జీవో ఇచ్చిందని గుర్తుచేశారు. అలాంటి వారు ఇంకా అవే పదవుల్లో కొనసాగుతూ ఈఆర్సీ ముందు హాజరై ఎలా వాదనలు వినిపిస్తారని అడిగారు. ట్రాన్స్‌కో ప్రతిపాదనల్ని నిర్ద్వంధంగా తిరస్కరించాలని కోరారు. కీలకమైన ఈ కార్యక్రమానికి ట్రాన్స్‌కో సీఎండీ ఎలా గైర్హాజరవుతారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కోలోని డైరెక్టర్ల నియామకాలు అక్రమమని ప్రకటిస్తూ ఈ ఏడాది జనవరి 27న రాష్ట్ర ఇంధన శాఖ జారీ చేసిన జీవో నెంబర్ మూడును ఆయన కమిషన్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రభుత్వానికి సూచనలు చేయాలని కోరారు. అలాగే ప్రజలపై మిగులు విద్యుత్ భారం వేయరాదని విజ్ఞప్తి చేశారు. అవాస్తవ అంచనాలు, అడ్డగోలు విద్యుత్ కొనుగోలు ఒప్పందాల వల్లే భారీగా మిగులు విద్యుత్ ఏర్పడుతున్నదని స్పష్టంచేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 21,866 మిలియన్ యూనిట్ల విద్యుత్ మిగులుతుందని స్వయంగా డిస్కంలు నివేదించాయని తెలిపారు. అలాగే 2028-29 నాటికి 43వేల ఎమ్‌యూల మిగులు విద్యుత్ ఉంటుందని అంచనా వేశారనీ, వినియోగించుకోకపోయినా సదరు విద్యుత్‌కు ఫిక్సెడ్ చార్జీలు ఎందుకు చెల్లించాలని అడిగారు. ఆ భారం తిరిగి ప్రజలపైనే పడుతుందని ఉదహరించారు. కమిషన్ దీనికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని కోరారు. టీజీ ట్రాన్స్‌కో వివిధ రకాల వ్యయాలు, చార్జీలను అసాధారణంగా, అవాంఛనీయంగా పెంచి ప్రతిపాదించిందనీ, వినియోగదారుల ప్రయోజనాల దృష్ట్యా వాటిని అనుమతించొద్దని విజ్ఞప్తి చేశారు. ఈఆర్సీ ఆమోదించిన వనరుల ప్రణాళిక, ట్రాన్స్‌కో ప్రతిపాదనలు వాస్తవాలకు దగ్గరగా ఉండేలా చూడాలని సూచించారు. ట్రాన్స్‌కో సమర్పించిన ప్రతిపాదనల్లో ఎలాంటి వాస్తవికత లేదనీ, ఐదేండ్లలో ట్రాన్స్‌మిషన్ చార్జీలను రెట్టింపు చేసుకోవాలని కోరడం సహేతుకం కాదని స్పిన్నింగ్ మిల్స్ తరఫు న్యాయవాది శివకుమార్ ఈఆర్సీ ఎదుట వాదనలు వినిపించారు. అయితే 2019 నుంచి 2024 వరకు ఆర్జించిన రూ.582.68 కోట్ల మిగులు ఆదాయాన్ని 2024-29 మధ్యకాలంలోని వ్యయాల్లో సర్దు బాటు చేస్తామని ట్రాన్స్‌కో ఈఆర్సీకి ప్రతిపాదిం చింది. దీన్ని బహిరంగ విచారణకు హాజరైన పలువురు ప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకించారు. మిగులు ఆదాయం ఉందంటూ, మళ్లీ చార్జీలు పెంచాలని కోరడం ఏంటని ప్రశ్నించారు.

ధర్నాచౌక్‌లో కాదు..కేంద్రం వద్ద ధర్నా చేయ్

- మూసీ ప్రక్షాళన కోసం రూ.10 వేల కోట్లు ఇప్పించు :

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి మంత్రి డాక్టర్ సీతక్క సూచన

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్



మూసీ ప్రక్షాళన కోసం గానీ, మూసీ ప్రాంత ప్రజల సంక్షేమం, ఉపాధి కోసంగానీ పదేండ్ల కాలంలో నయా పైసా ఎందుకు కేటాయించలేదని కేంద్ర ప్రభుత్వం ఎదుట ధర్నా చేయాలని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ నేతలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) సూచించారు. ప్రధాని మోడీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసిలోని గంగా ప్రక్షాళన కోసం కేంద్ర ప్రభుత్వం రూ. 11 వేల కోట్లు ఖర్చు చేసిందనీ, ఇతర నదుల ప్రక్షాళన కోసం రూ.6 వేల కోట్ల మంజూరు చేసిందని గుర్తు చేశారు. మూసీ ప్రక్షాళన కోసం కేంద్ర ప్రభుత్వం ఎందుకు నిధులు కేటాయించలేదు? ఇది తెలంగాణపై వివక్షకు నిదర్శనం కాదా? దీనిని మీరెందుకు ప్రశ్నించలేదు? అని నిలదీశారు. గుజరాత్‌లో సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును సమర్ధిస్తున్న బీజేపీ నేతలు ఇక్కడ మూసీ అభివృద్ధి ప్రాజెక్టును ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. 25న ఇందిరాపార్కు వద్ద బీజేపీ తలపెట్టిన ధర్నాను ఉపసంహరించుకుని కేంద్రం నుంచి మూసీ పునర్జీవనం కోసం నిధుల కోసం కొట్లాడాలని హితవు పలికారు. మంగళవారం ఈ మేరకు మంత్రి సీతక్క ఒక ప్రకటన విడుదల చేశారు. సొంత నియోజకవర్గం గుండా మూసీ పారుతున్నా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఏనాడూ కేంద్రం నుంచి నిధులు తీసుకురాలేదనీ, ఇప్పుడు మూసీ ప్రాంత ప్రజల తరుపున ధర్నాకు పిలుపునివ్వడమేంటని ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంతంలో ముగ్గురు బీజేపీ ఎంపీలు, ఒక కేంద్ర మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నారనీ, వారంతా కేంద్రంతో చర్చించి హైదరాబాద్ జీవన రేఖగా భావించే మూసీ పునరుజ్జీవనం కోసం రూ. పది వేల కోట్లను మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. రెండేండ్ల కింద మూసీ ప్రాంత ప్రజలు వరదలతో నష్టపోయినప్పుడు బండికి బండి ఇస్తామనీ, ప్రతి ఇంటికీ నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చిన బీజేపీ నేతలుగానీ, కేంద్ర ప్రభుత్వంగానీ ఒక్కరిని కూడా ఆదుకోలేదని విమర్శించారు. ఇప్పుడు మూసీ ప్రాంత అభివృద్ధిని అడ్డుకుంటూ బీజేపీ తన నైజాన్ని బయటపెట్టుకుంటుందని పేర్కొన్నారు. మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు సక్సెస్ అయితే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెరిగి ఎక్కడ ఇతర నగరాలను దాటిపోతుందో అనే భయం బీజేపీ నేతలను వెంటాడుతున్నదని పేర్కొన్నారు. మూసీ పునర్జీవన ప్రాజెక్టులో ఎక్కడా బలవంతపు తరలింపులు లేవనీ, ప్రజల సమ్మతితోనే వారికి మరో చోట స్థిర నివాసం, ఉపాధి కల్పించిన తర్వాతే పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. యూపీఏ హయంలో మూసీ ప్రక్షాళన కోసం రూ.335 కోట్లు మంజూరైతే మోడీ పాలనలో పైసా కూడా మంజూరు కాలేదని వివరించారు.

చరిత్రకు సాక్షులు ఫోటో వీడియో గ్రాఫర్లు



- వారు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి రావద్దు : మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి

నవతెలంగాణ - ముషీరాబాద్

చరిత్రకు సాక్షులు ఫోటో, వీడియో గ్రాఫర్లు అని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ ఎట్టి పరిస్థితుల్లో ఆత్మహత్యల వైపు ఆలోచించొద్దని, మీకు ఆ పరిస్థితి వస్తే తానున్నానని హామీ ఇచ్చారు. మంగళవారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన తెలంగాణ ఫోటో, వీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి మంత్రి హాజరై నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నల్లగొండ రాష్ట్ర ఏర్పాటు కోసం సొంత పార్టీతో కొట్లాడి పదవులకు త్యాగం చేశామని, తెలంగాణలో ఆత్మహత్యలు అనే మాటే రావద్దన్నారు. అలాంటి పరిస్థితి రాకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందన్నారు. 30వేల మంది సమిష్టి ప్రయోజనాల కోసం సంఘం చేస్తున్న కృషి అభినందనీయమని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా జరిగిన సాగర హారంలో దెబ్బలు కూడా తిన్నామన్నారు. తన కుమారుడు పేర స్థాపించిన ప్రదీప్ ఫౌండేషన్ ద్వారా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని, ఫోటో, వీడియో గ్రాఫర్ల కుటుంబంలోని పిల్లలకు ఎంబీబీఎస్, ఐఐటీలో సీట్లు వస్తే వారి ఫీజులు తానే భరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో పోలీసు అమర వీరుల కుటుంబాలకు ప్రతి ఏడాది జిల్లా ఎస్పీ రూ. 10వేలు ఇస్తారని, అయితే తాను ఆయా కుటుంబాలకు రూ. 25వేల చొప్పున నగదును బదిలీ చేసినట్టు చెప్పారు. సంఘం కార్యాలయం కోసం 500ల గజాల స్థలాన్ని ముఖ్యమంత్రితో మాట్లాడి ఇప్పిస్తానన్నారు. తాను ఉట్టిమాటలు చెప్పి పోయే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు వెంకట్ రెడ్డి, నూతన అధ్యక్షులు ఎస్‌కె. హుస్సేన్, ప్రధాన కార్యదర్శి లడే రవీందర్, కోశాధికారి బీమిడి మాధవరెడ్డి, కుటుంబ భరోసా ఇన్‌చార్జి బి. నాగరాజు, మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, తెలంగాణ జర్నలిస్టు ఫోరం అధ్యక్షులు పల్లె రవికుమార్, సీనియర్ జర్నలిస్టు కాచం సత్యనారాయణ, రఘురాం, రా స్టూడియో టీమ్, నికిత డిస్ట్రిబ్యూటర్స్ గోడోస్ లైట్స్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ప్రధాన అనుచరుడి హత్య

- రోడ్డుపై బైటాయించి ఎమ్మెల్సీ నిరసన
- కాంగ్రెస్ నాయకుల రాస్తారోకో
- పార్టీ నుంచి వెళ్లిపోతానంటూ ఎమ్మెల్సీ ఆవేదన



నవతెలంగాణ-జగిత్యాలటౌన్

జగిత్యాల జిల్లాలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు, కాంగ్రెస్ నాయకుడు మారు గంగారెడ్డి(58) దారుణ హత్యకు గురయ్యాడు. జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ మారు గంగారెడ్డి.. మంగళవారం ఉదయం గ్రామంలో బైక్‌పై వెళుతుండగా.. గుర్తుతెలియని దుండగులు మొదట కారుతో వెనుక నుంచి ఢీ కొట్టి కింద పడగానే కత్తులతో విచక్షణా రహితంగా దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన గంగారెడ్డిని.. స్థానికులు, కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వెంటనే జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి చేరుకొని గంగారెడ్డి మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద తన అనుచరులతో కలిసి రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. హత్యకు పాల్పడిన నిందితుల్ని పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీలో కీలకంగా ఉన్న గంగారెడ్డిని హత్య చేయడమంటే.. తనను హత్య చేసిన దాంతో సమానమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకు రక్షణ లేకపోతే ఇక పార్టీని, కార్యకర్తలను ఏ విధంగా కాపాడుకుంటామని ఆవేదన వ్యక్తం చేశారు. 'మీకు.. మీ కాంగ్రెస్ పార్టీకో దండం.. ఇకనైనా మమ్మల్ని బతకనియ్యండి' అంటూ సొంత పార్టీపై ఎమ్మెల్సీ టీ.జీవన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. ఇంత కాలం మానసిక అవమానాలకు గురవుతున్నా తట్టుకున్నామని, ఇప్పుడు భౌతికంగా దాడులు చేసి చంపుతున్నారని, ఎందుకు భరించాలని, ఓ స్వచ్ఛంద సంస్థ పెట్టుకొనైనా ప్రజలకు సేవ చేస్తానంటూ ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌తో జీవన్ రెడ్డి తన ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో ఎందుకు కొనసాగాలంటూ తనకు ఫోన్ చేసిన పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్‌పై అసహనం వ్యక్తం చేశారు. 'పార్టీలో ఎందుకు కొనసాగాలి.. దయచేసి తనను క్షమించాలి. తాను పార్టీలో ఉండలేను' అంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. నాలుగు దశాబ్దాల కష్టానికి మంచి బహుమతి ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ వైపు మహేష్ గౌడ్ మాట్లాడుతుండగానే ఫోన్ కట్ చేశారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ జిల్లా ఎస్పీతో మాట్లాడి నిందితులను త్వరగా పట్టు కోవాలని కఠినంగా శిక్షించాలని కోరారు. కాగా, కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున రోడ్డుపై నిరసన చేపట్టడంతో పట్టణంలో భారీగా ట్రాఫిక్ జామైంది. దాంతో పోలీసులు ట్రాఫిక్‌ను బైపాస్ రోడ్డు గుండా మళ్ళించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గ్రామంతో పాటు జగిత్యాలలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజావాణి అద్భుతం

- త్రివిధ దళాలు, ఆలిండియా సర్వీసెస్ అధికారుల బృందం
- ఆ కార్యక్రమం గురించి వివరించిన చిన్నారెడ్డి, దివ్య

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ప్రజావాణి కార్యక్రమం నిర్వహణ అద్భుతంగా ఉందని త్రివిధ దళాలు(ఆర్మీ, నావీ, ఎయిర్‌ఫోర్స్), ఆలిండియా సర్వీసెస్ అధికారుల బృందం కొనియాడింది. ప్రజా భవన్‌లో తమ సమస్యలు విన్నవించేందుకు భారీగా తరలి వస్తుండటం విశేషమని అభిప్రాయపడింది. మంగళవారం హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్, ప్రజావాణి ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి, ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లతో బృంద సభ్యులు సమావేశమయ్యారు. ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న తీరును చిన్నారెడ్డి, దివ్య వారికి వివరించారు. అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానమిచ్చారు. ప్రజావాణికి వస్తున్న అర్జీలను అందజేసిన వెంటనే సమస్యలను ఓపికతో విని సీఎం ప్రజావాణి పోర్టల్ ద్వారా సంబంధిత శాఖల అధికారులకు పంపుతామనీ, సీఎం ప్రజావాణి పేరిట రశీదు ఇస్తూ దాన్ని నిరంతరం ఫాలోఅప్ చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ అధికారి రావులపాటి మాధవి కూడా పాల్గొన్నారు.

దుబాయిలో తప్పిపోయిన హైదరాబాద్ యువకుడు

వెతికి పెట్టాలని 'ప్రవాసీ ప్రజావాణి' లో విజ్ఞప్తి

దుబాయిలో తప్పిపోయిన తమ కొడుకు రాహుల్ రాజ్‌ను హైదరాబాద్‌కు తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని అతని తల్లిదండ్రులు తల్లిదండ్రులు కుముదిని, గౌతమ్ ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని గౌలిగూడకు చెందిన నూగురు రాహుల్ రాజ్ (32) ఉద్యోగం కోసం విజిట్ వీసాపై ఈ నెల 14న దుబాయికి వెళ్లాడు. ఆ తర్వాత 19న తన బ్యాగును దొంగలు కొట్టేశారనీ, అందులో ఉన్న డబ్బులు కూడా పోయాయని తల్లిదండ్రులకు సమాచారం అందించాడు. ఆ తర్వాత అతని మొబైల్ స్విచ్చాఫ్ అయింది. అప్పటి నుంచి సమాచారం లేకుండాపోయింది. ఈ నేపథ్యంలోనే ప్రజావాణిలో అతని తల్లిదండ్రులు మంగళవారం ఫిర్యాదు చేశారు. తమ కుమారుడు రాహుల్‌ను వెతికి పెట్టి ఇండియాకు తీసుకురావాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆచూకీ తెలిసినవారు 91 98487 49667 మొబైల్ నెంబర్‌కు వాట్సాప్ చేయాలని కోరారు. టీపీసీసీ ఎన్నారై సెల్ చైర్మెన్, అంబాసిడర్ డాక్టర్ బిఎం వినోద్ కుమార్, తెలంగాణ కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి వారికి తగిన సూచనలు చేసి దరఖాస్తు చేయించారు.

మళ్లీ షురూ

- నేటి నుంచి కాళేశ్వరం విచారణ
- 29వరకు క్రాస్ ఎగ్జామినేషన్
- అఫిడవిట్లు ఇవ్వని వారికీ పిలుపు ?



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టు వ్యవహారంలో క్రాస్ ఎగ్జామినేషన్ ప్రారంభం కానుంది. దసరా ముందు వరకు జరిగిన ఈ ప్రక్రియను, తిరిగి బుధవారం నుంచి చేపట్టనున్నారు. ఈమేరకు మంగళవారం సాగునీటి శాఖ అధికారులతో కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ చైర్మెన్ జస్టిస్ పీసీ ఘోష్ జలసౌధలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విచారణ కమిషన్ పరిధిలోని అన్ని అంశాలను మరోసారి సమీక్షించారు. ఈనెల 29 వరకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించేందుకు నిర్ణయం తీసుకున్నారు. దాదాపు వారం రోజులపాటు నిర్వహించనున్నారు. వీలైనంత వేగంగా తుది నివేదికను ఇవ్వాలని విజిలెన్స్ డీజీని జస్టిస్ ఘోష్ ఆదేశించారు. బ్యారేజీలు నిర్మించిన సంస్థల ప్రతినిధులనూ జస్టిస్ పీసీ ఘోష్ విచారించనున్నారు. నిర్మాణానికి సంబంధించిన అన్ని రికార్డులు, సంస్థల లావాదేవీలు వివరాలను కమిషన్ పరిశీలించనుంది. అఫిడవిట్ దాఖలు చేసిన వి. ప్రకాష్‌ను కూడా మళ్లీ విచారించాలని కమిషన్ భావిస్తున్నట్టు తెలిసింది. ఎన్డీఎస్ఏ, కాగ్ నివేదికల ఆధారంగా విచారణ కొనసాగించనున్నారు. గతంలో ఎగ్జామినేషన్‌కు హాజరై అఫిడవిట్లు సమర్పించని అధికారులకు నోటీసులు ఇస్తారనే ప్రచారం జలసౌధలో సాగుతున్నది. అఫిడవిట్ ఆధారంగా వాస్తవాలు బయటకు వస్తాయనీ, ఆ మేరకు తమ పరిశీలన, తుది నివేదిక ఇవ్వాలని కమిషన్ చైర్మెన్ జస్టిస్ ఘోష్ భావిస్తున్నట్టు తెలిసింది. వేల కోట్ల ప్రజాధనంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలు విఫలం కావడంలో కమిషన్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ఫియర్లు విఫలం కావడం, సీపేజీ(బుంగ)లు రావడంతో ప్రాజెక్టుకు ప్రమాదం పొంచి ఉందనీ, వరద నీటిని వదిలేయాలని ఎన్డీఎస్ఏ సూచించిన విషయం విదితమే.

సీఆర్‌పీఎఫ్ స్కూల్‌లో బాంబు కలకలం

- విస్తృతంగా పోలీసుల తనిఖీలు
- ఘటనా స్థలానికి రాచకొండ సీపీ



నవతెలంగాణ - జవహర్‌నగర్

న్యూఢిల్లీలోని సీఆర్‌పీఎఫ్ పాఠశాలలో ఇటీవల పేలుడు సంభవించిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని జవహర్ నగర్‌లోని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ స్కూల్‌లో బాంబు పెట్టినట్టు గుర్తు తెలియని ఆగంతకుల నుంచి మెయిల్ రావడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వెంటనే అప్రమత్తమైన యాజమాన్యం స్థానిక పోలీసులకు సమాచారాన్ని అందజేసి, విద్యార్థులను సురక్షితంగా వారి ఇండ్లకు పంపించారు. ఈ మెయిల్స్ సోమవారం అర్థరాత్రి వచ్చినట్టు స్కూల్ యాజమాన్యం చెబుతోంది. సమాచారం అందుకున్న వెంటనే రాచకొండ సీపీ సుధీర్ బాబు, మల్కాజిగిరి డీసీపీ పద్మజ, కుషాయిగూడ ఏసీపీ మహేష్, పోలీస్ సిబ్బంది హుటాహుటిన జవహర్ నగర్ సీఆర్‌పీఎఫ్ క్యాంపస్‌కు చేరుకుని విస్తృతంగా తనిఖీలు చేశారు. క్యాంపస్ మొత్తం డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేసి బాంబు లేదని నిర్ధారించారు. జవహర్‌నగర్ సీఐ సైదయ్య, స్థానిక ఎస్ఐలు, పోలీస్ బృందం, సీఆర్‌పీఎఫ్ జవాన్లు పాల్గొన్నారు.

మతసామరస్యాన్ని కాపాడదాం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్ మహానగరంలో మతసామరస్యాన్ని కాపాడుకుందామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇటీవల సికింద్రాబాద్ దేవాలయంలో విగ్రహం ధ్వంసం చేసిన ఘటన అత్యంత విచారకరమని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. దానిపై ఇంకా ఉద్రిక్తతలు కొనసాగడం దురదృష్టకరమనీ, మతాల మధ్య విద్వేషాలు పెరగకుండా మత పెద్దలు, మేధావులు కృషి చేయాలని కోరారు. ఘటనకు కారకులు, వారి వెనుక ఉన్న వారిని కఠినంగా శిక్షించేందుకు సత్వరం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మత మౌఢ్యంతో వ్యవహరించే వారు ఏ మతస్తులైనా వదిలిపెట్టవద్దని కోరారు. అన్ని మతాల వారితో శాంతి కమిటీలు వేసి ప్రజల్లో సామరస్యం పెంపొందించే చర్యలు తీసుకోవాలని సూచించారు. గడిచిన రెండు దశాబ్దాలకుపైగా హైదరాబాద్ నగరంలో హిందూ, ముస్లింలు సామరస్యంతో ఉంటున్నారనీ, ఇతర నగరాల్లో మాదిరిగా విద్వేషంతో కూడిన హింసా ఘటనలు జరగలేదని తెలిపారు.

గ్రూప్-1 మెయిన్స్‌కు రెండోరోజు 69.4 శాతం హాజరు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలకు రెండోరోజు మంగళవారం ప్రశాంతంగా జరిగిందని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ప్రకటించింది. పేపర్-1 జనరల్ ఎస్సే పరీక్ష విజయవంతంగా ముగిసిందని తెలిపింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 31,403 మంది అభ్యర్థులకుగాను 21,817 (69.4 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారని వివరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలో ఈనెల 27వ తేదీ వరకు గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలు జరుగుతాయి. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఈ ఏడాది ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన నిర్వహించింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 3.02 లక్షల మంది హాజరయ్యారు. వారిలో 31,383 మంది అభ్యర్థులు గ్రూప్-1 మెయిన్స్‌కు ఎంపికయ్యారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
బుధవారం | అక్టోబర్ 23, 2024 | www.navatelangana.com

'నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా'



నవతెలంగాణ -చంపాపేట్

మలక్‌పేట నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా అన్నారు. మంగళవారం నియోజకవర్గం చంచలగూడ మూస మియా మసీదు వీడీసీ రోడ్డును ప్రారంభించారు. ఓల్డ్ మలక్ పేట్ డివిజన్ కార్పొరేటర్ ఎండి సైఫుద్దీన్ షఫీ, అబ్రర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, సభ్యులతో కలిసి మంగళవారం కాలనీలల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్థానిక నాయకులు.. కార్పొరేటర్లను, ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మలక్‌పేట నియోజకవర్గం కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, టిజిఎస్ఎస్‌పిడిసిఎల్, జీహెచ్ఎంసీ శానిటేషన్ హార్టికల్చర్, ఎంటమాలజీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బి, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రేణుక ఎల్లమ్మ ఆలయ నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-హయత్‌నగర్

రేణుక ఎల్లమ్మ ఆలయ నూతన కమిటీని రేణుక ఎల్లమ్మ గౌరవ అధ్యక్షులు పరంద స్వామి ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లో మంగళవారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులుగా ఎర్ర రవీందర్, ఉప అధ్యక్షులుగా జోరల నాగభూషణం, ప్రధాన కార్యదర్శిగా దాసర మౌని కృష్ణ, కోశాధికారిగా పిట్టల జంగయ్య, ఉపకోశాధికారిగా ముత్యం శ్రీకాంత్, సహాయ కార్యదర్శిగా కె సతీష్, సహాయ ఉపకోషాధికారిగా కొమ్ము శ్రీధర్, సహాయ కార్యదర్శి బండారి సురేష్, సంస్కృత కార్యదర్శులుగా ఓరుగంటి రవిబాబు, బుట్టి శివ, జోరల రాజు, ప్రచార కార్యదర్శులుగా శివరాత్రి మధు, మార్కండేయలు నియమితులయ్యారు.

సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి



- మేయర్ పారిజాత నర్సింహా రెడ్డి

నవతెలంగాణ-బడంగ్‌పేట్

ప్రజల మౌలిక సదుపాయాల కల్పనకు, సమస్యల పరిష్కారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 30, 31, 32వ డివిజన్‌లకు చెందిన డ్రైనేజీ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డితో కలిసి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందని తెలిపారు. బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఇప్పటికే కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు భీమిడి జంగారెడ్డి, కాలనీ వాసులు కొండ శ్రవణ్ కుమార్ యాదవ్, శ్యాంసుందర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, సరోజ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య పెంచాలి



- బండ్లగూడ ఎంఈఓ దశరథ్ నాయక్

నవతెలంగాణ - చంపాపేట్

బండ్లగూడ మండల పరిధిలోని ప్రభుత్వ స్కూల్స్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని బండ్లగూడ ఎంఈఓ దశరథ్ నాయక్ సూచించారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ బండ్లగూడ మండల పరిధిలోని ప్రభుత్వం స్కూళ్ల అభివృద్ధి కోసం తోడ్పాటు అందిస్తామని అన్నారు. విద్యార్థులకు యూనిఫామ్, బుక్స్, మిడే మీల్స్ సమయానికి వచ్చేలా చొరవ తీసుకుంటున్నామని భరోసా ఇచ్చారు. రవీంద్ర నాయక్ నగర్ కాలనీలో ఇంటింటికీ సర్వే చేసి విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ స్కూళ్లల్లో నాణ్యమైన విద్యనందించాలని కోరారు. అనంతరం రవీంద్రనాయక్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ కృష్ణ నాయక్ మాట్లాడుతూ...రవీందర్ నాయక్ నగర్ కాలనీలో ఎక్కువ మంది గిరిజన విద్యార్థులు ప్రైవేట్ స్కూల్స్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు.

వాళ్లందరు ప్రభుత్వ స్కూల్స్ వైపు మొగ్గు చూపే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. రవీందర్ నాయక్ నగర్ కాలనీలో ప్రతి ఇంటింటి వెళ్లి విద్యార్థులు ప్రభుత్వ స్కూల్‌కు వచ్చే విధంగా మా కాలనీ కమిటీ సభ్యులు టీచర్లకు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల హెడ్ మాస్టర్ సీతారాంరెడ్డి, టీచర్లు రాములు, లక్ష్మణ్, కమిటీ సభ్యులు, నాయకులు కిషన్, సంతోష్, రాజేష్, శ్రీను, సురేష్, మహేష్, నాగేష్, భరత్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర కీలకం

- హైదరాబాద్ రీజనల్ మేనేజర్ వరప్రసాద్



నవతెలంగాణ-హయత్‌నగర్

ఆర్టీసీ అభివృద్ధిలో డ్రైవర్లు, కండక్టర్ల పాత్ర ఎంతో కీలకమని హైదరాబాద్ రీజనల్ మేనేజర్ వరప్రసాద్ అన్నారు. హైదరాబాద్ రీజియన్ పరిధిలో వివిధ డిపోలకు చెందిన ఆదర్శ ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదర్శ ఉద్యోగులకు అవార్డులు అందజేయడం తోటి ఉద్యోగులను మరింత ప్రోత్సహించేలా ఉంటుందన్నారు. హయతనగర్-2 డిపో మహిళా కండక్టర్ వి.ఎన్ మల్లేశ్వరి అత్యధిక ఆదాయం సాధించినందుకు గాను త్రైమాసిక ప్రగతి చక్ర అవార్డును అందజేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం(o)లు సుచరిత, బాబు నాయక్, డిప్యూటీ ఆర్ఎం(M)జగన్, వివిధ డిపోల డిపో మేనేజర్లు, సూపర్వైజర్లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

అదేవిధంగా హయత్ నగర్-2 డిపోలో రాఖీ పౌర్ణమి, దసరా పండుగ సందర్భంగా ఉద్యోగులు సమిష్టిగా కష్టపడి అత్యధిక ఆదాయాన్ని సాధించినందుకు ప్రోత్సాహకంగా ఎండీ ఆదేశాల మేరకు ఉద్యోగులకు డీఎం వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. అదేవిధంగా సెప్టెంబర్ మాసానికి అత్యధిక ఆదాయం సాధించిన ఉద్యోగులకు క్యాష్ అవార్డ్స్ అందజేశారు.



గుండె పోటుతో మధ్యాహ్న భోజన కార్మికురాలు మృతి

- మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి : సీఐటీయూ

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్‌మెట్

అబ్దుల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేసే మధ్యాహ్న భోజనం కార్మికురాలు మారగోని ఉమా గుండె పోటుతో మంగళవారం మృతి చెందారు. మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై మృతిరాలి చిత్రపటానికి సీఐటీయూ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన బిల్లులు కొంతకాలంగా పెండింగ్‌లో ఉండడం వల్ల కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సకాలంలో బిల్లులు రాక అప్పులపాలై మారగోని ఉమా గుండెపోటుతో మరణించిందన్నారు. ప్రభుత్వం వెంటనే ఆమె కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, తక్షణమే పది లక్షల రూపాయల ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. నివాళులర్పించిన వారిలో సీఐటీయూ నాయకులు నర్సింహ, ఎస్ఎఫ్ఐ నాయకులు గుండె శివకుమార్, మధ్యాహ్న భోజన కార్మికులు రమాదేవి, నిర్మలమ్మ నవనీత, లక్ష్మమ్మ, రాములమ్మ, రంగమ్మ, నిర్మలమ్మ, రాజమణి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు చూపించడంలో నిర్లక్ష్యం..

మండల విద్యాధికారులకు షోకాజ్ నోటీసులు : డీఈవో రోహిణీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

డీఎస్సీ-2024లో పలు ఉపాధ్యాయ ఖాళీలను ప్రదర్శించుటకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల వారీగా అడిగిన సమాచారాన్ని సరిగ్గా ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన మండల డిప్యూటీ ఈవోలు, డిప్యూటీ ఐవోఎస్‌లకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణీ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

డీఎస్సీ-2024 ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్‌లో భాగంగా జిల్లాలో ఎంపిక అయిన అభ్యర్థులకు కౌన్సిలింగ్.. ఆ తర్వాత పోస్టుల కేటాయింపులో భాగంగా పాఠశాలల వారీగా ఖాళీల సమాచారాన్ని పూర్తి పరిశీలన అనంతరం డీఈవో కార్యాలయానికి పంపించాలని కోరమని, అనేక పర్యాయాలు సవివరంగా వివరించి సందేహాలను నివృత్తి చేసినప్పటికీ కొందరు మండల విద్యాధికారులు కొన్ని పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులున్న ఖాళీలను చూపించలేదని చెప్పారు. అడిగిన సమాచారాన్ని ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన సంబంధిత మండల డిప్యూటీ ఈవోలు, డిప్యూటీ ఐవోస్‌లకు సంజాయిషీ నోటీసులు జారీ చేశామని, నేడు(బుధవారంలోగా) నోటీసులకు సమాధానం ఇవ్వాలని డీఈవో ఆదేశించారు. తదుపరి చర్యలకు జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపించనున్నామని తెలిపారు. అదే సమయంలో ఈ విషయమై ఒక ఉపాధ్యాయ సంఘం పనిగట్టుకుని జిల్లా విద్యాశాఖను అప్రతిష్టపాలు చేయడం శోచనీయం డీఈవో పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ - హస్తినాపురం

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఓ వరం అని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ పరిధిలోని నార్త్ హస్తినాపురం కాలనీలో నివాసం ఉంటున్న నిర్విక(6) గుండెకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతోంది. ఆమెకు రూ.2 లక్షల ఎల్.ఓ.సీ చెక్కు మంజూరైంది. ఈ మేరకు మంగళవారం ఆ చెక్కును ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్‌ను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం



సహాయనిధి ఎంతో దోహదపడుతుందన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన, అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ నాయకులు, కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాలాపూర్‌లో స్వేరోస్ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



బాలాపూర్ స్వేరోస్ ప్రతినిధి మైలారం జగన్

నవతెలంగాణ- బడంగ్‌పేట్

ఈ నెల 27న సిద్దిపేట జిల్లా బెజ్జంకిలో జరిగే జాతీయ స్వేరోస్ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ..బాలాపూర్ స్వేరోస్ ప్రతినిధి మైలారం జగన్ మంగళవారం బాలాపూర్ స్వేరో సర్కిల్‌లో విద్యార్థుల తల్లీదండ్రుల ఆధ్వర్యంలో స్వేరోస్ జాతీయ మహాసభ గోడ పత్రిక ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మైలారం జగన్ మాట్లాడుతూ ఈ నెల 27న సిద్దిపేట జిల్లా, బెజ్జంకిలో స్వేరోస్ జాతీయ మహాసభ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం ప్రధాన అజెండాగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్థాపించిన సంస్థ స్వేరోస్ అని అన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా బాలాపూర్ స్వేరో సర్కిల్ నుండి ఉత్తమ కమాండర్స్ సహకారంతో ఎంతో మంది పేద విద్యార్థులకు చదువుతో పాటు, క్రమశిక్షణ, వ్యక్తిత్వ వికాసం, సమాజంపై అవగాహన కల్పిస్తూ విద్యార్థులను వివిధ రకాల గురుకులాల్లో పంపడం జరిగిందన్నారు. ఈ నెల 27న జరిగే స్వేరోస్ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ స్వేరో సర్కిల్ మైలారం జగన్, కమాండర్స్ ప్రీతి, మౌనిక, విద్యార్థుల తల్లీదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

- కులవృత్తిదారులు, చేతివృత్తిదారులు, పనిముట్ల వృత్తిదారులు ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోండి
- హైదరాబాద్ జిల్లా బీసీ సంక్షేమ అధికారి జి.ఆశన్న



నవతెలంగాణ-సిటీబ్యూరో

పీఎం విశ్వకర్మ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వెనుకబడిన తరగ తుల సంక్షేమ అధికారి జి.ఆశన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా కుల వృత్తి దారులకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందచేయడం జరుగుతున్నదని ఈ దిగువ తెలిపిన 18 వృత్తులకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. వడ్రంగి పడవల తయారీ దారులు, ఆయుధ తయారీదారులు, కమ్మరి, సుత్తులు / టూల్ కిట్ తయారీదారులు, తాళాల తయారీ దారులు, శిల్పి, రాళ్ళు కొట్టేవారు, స్వర్ణకారులు, కమ్మరి, చెప్పులు కుట్టేవారు, మేస్త్రి, బుట్టలు/ చాపలు/ చీపుర్లు తయారీ చేసే వారు, కొబ్బరి పీచు అల్లేవారు, బొమ్మల తయారీదారులు, భార్బర్, పూలమాలలు అల్లేవారు, రజకులు, టైలర్, చేపలు పట్టువారు / వలలు తయారు చేయువారు అర్హులని ఆయన పేర్కొన్నారు. ఆర్థిక సహాయం మంజూరీకి అర్హతలు : 1. పైన పేర్కొన్న వృత్తులలో చేతులు, పనిముట్లతో పనిచేస్తూ, కుటుంబ సాంప్రదాయ వృత్తులలో నిమగ్నమైన హస్తకళాకారుడు లేదా వృత్తికళాకారుడు పీఎం విశ్వకర్మ పథకంకు అర్హుడు. 2. లబ్దిదారునికి రిజిస్ట్రేషన్ తేదీ నాటికి కనీసం 18 సంవత్సరాలు వయస్సు ఉండాలి. 3. లబ్దిదారుడు రిజిస్ట్రేషన్ తేదీ నాటికీ పై వృత్తులలో ఉండి ఉండాలి. గత 5 సంవత్సరాలలో స్వయం ఉపాధి / వ్యాపార అభివృద్ధి కోసం కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద ఋణం పొంది ఉండకూడదు. 4. ఈ పథకం కింద రిజిస్ట్రేషన్ కుటుంబంలో ఒకరికి మాత్రమే పరిమితము. 5. ప్రభుత్వ సర్వీస్‌లో ఉన్నా వ్యక్తి అతని / ఆమె కుటుంబ సభ్యులు ఈ పథకానికి అనర్హులని ఆయన చెప్పారు. అర్హులైన కులవృత్తిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ

- ఎమ్మెల్యే అహ్మద్ బలాల



నవతెలంగాణ -మలక్‌పేట్

మలక్‌పేట్ నియోజకవర్గ పరిధిలోని చంచల్‌గూడలో మంగళవారం జీహెచ్ఎంసీ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న 50 మంది మహిళలకు ఇంచార్జి నాజిమతో కలిసి ఎమ్మెల్యే బలాల కుట్టుమిషన్లు, ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల స్వయం ఉపాధికి కుట్టు మిషన్లు ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం ఆజంపుర డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అబరార్, జీహెచ్ఎంసీ డిపార్ట్మెంట్, ఈఈ, ఏఈ, పార్టీ కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

లైంగికదాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు



నవతెలంగాణ - అబ్దుల్లాపూర్‌మెట్

లైంగిక దాడి కేసులో ఓ వ్యక్తికి జీవిత ఖైదు శిక్ష పడింది. మైనర్ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా, బలవంతంగా పలుమార్లు లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి పోక్సో చట్టం కింద జీవిత ఖైదుతో పాటు రూ.30 వేల జరిమానా విధించారు. బాధితురాలుకు తక్షణ పరిహారం రూ.12 లక్షలు అందజేయాలని రంగారెడ్డి జిల్లా ప్రత్యేక సెషన్ న్యాయమూర్తి మంగళవారం తీర్పు ఇచ్చారు.

కేసు వివరాలు....

గత సంవత్సరం నవంబర్ 05న ఓ ప్రభుత్వ ఉద్యోగి అబ్దుల్లాపూర్ మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని విచారించగా బాధితురాలు ఓ మైనర్..తను 9వ తరగతి చదువుతుంది. ఆమె తల్లి చనిపోవడంతో మైనర్ బాలిక సవతి తండ్రి/నిందితుడు రంగారెడ్డి జిల్లా, అబ్దుల్లాపూర్ మెట్ మండలం, కవాడి పల్లిలో నివాసం ఉండే మహమ్మద్ ఖాజా లారీ డ్రైవర్. బాధితురాలుకు సంబంధించిన టీసీ ఇవ్వమని పాఠశాలకు వెళ్లి ఆడగగా.. అదే విషయం బాధితురాలికి చెప్పగా తన తండ్రి చెడ్డవాడని, తనను 14-10-2023 నాడు దసరా సెలవులకు అని చెప్పి.. అతను ఉండే కిరాయి రూంకి(కవాడిపల్లి గ్రామం) తీసుకువెళ్ళి బలవంతంగా పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్టు బాధితురాలు తెలిపినట్టు ఫిర్యాదు దారుడు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు.

విచారణ అధికారి (ఐఒ) సాక్ష్యాలను సేకరించి, నిందితుని అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. దర్యాప్తు ముగిసిన తర్వాత చార్జ్ షీట్ దాఖలు చేశారు. విచారణలో భాగంగా మంగళవారం ఎల్బీనగర్ ప్రత్యేక న్యాయమూర్తి హరీష నిందితుడికి జీవిత ఖైదుతో పాటు 30 వేల రూపాయల జరిమానా, బాధితురాలికి 12 లక్షలు పరిహారం అందించాలని తీర్పు వెల్లడించారు. ప్రాథమిక విచారణ అధికారి సీఐ ఏ మన్మోహన్, తదుపరి విచారణ అధికారి ఏసీపీ ఎస్.బీమిరెడ్డి, అదనపు పీపీలు కోమలత, నరేష్ కుమార్, ప్రాసిక్యూటర్ శ్రీశైలం, సమన్లు డి. సురేష్‌లు హాజరయ్యారు. ఈ కేసులో నిందితుడికి శిక్షపడే విధంగా కృషి చేసినందుకుగాను వారిని రాచకొండ సీపీ, డీసీపీ, ఏసీపీ అభినందించినట్లు సీఐ అంజిరెడ్డి తెలిపారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- ఎమ్మెల్సీ రహమాత్ బేగ్

నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న నాబిల్ కాలనీలో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఏఐఎంఐఎం పార్టీ ఎమ్మెల్సీ రహమాత్ బేగ్ కాంట్రాక్టర్‌కు సూచించారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ఉన్న నాబిల్ కాలనీలో ఎంపీ అసోద్దిన్ ఒవైసీ ఆదేశం మేరకు పలు కాలనీలలో నిర్మాణంలో ఉన్న ఎస్ఎన్‌డీపీ నాలా నిర్మాణ పనులను మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అహ్మద్ సాధి, జల్ పల్లి మున్సిపల్ చైర్మెన్ అబ్దుల్లా బిన్ సాదితో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో అధిక మొత్తంలో పేద ముస్లింలు అధికంగా ఉన్నారని, ప్రభుత్వాలు మారిన ప్రజల జీవితాల్లో మార్పు రాలేదన్నారు. చాలా కాలనీలల్లో ప్రజలు మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ముఖ్యంగా రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, విద్యుత్ దీపాలు తదితర సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి.. సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. అధిక మొత్తంలో ప్రత్యేక నిధులు మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కాలనీవాసులు పాల్గొన్నారు.





ప్రజలకు చేసిన సేవ, సహాయం శాశ్వతంగా నిలుస్తాయి

- ధరణి రుణ మాఫీ చైర్మెన్ కోదండ రెడ్డి

నవతెలంగాణ-కల్చరల్

కోట్ల రూపాయలు ఇవ్వని సంతోషం ప్రజలు చూపే ఆదరాభిమానాలు ఇస్తుందని ధరణి రుణ మాఫీ చైర్మెన్ కోదండ రెడ్డి అన్నారు. ప్రజలకు చేసిన సేవ, సహాయం శాశ్వతంగా నిలుస్తాయి అని చెప్పారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై సీల్ వెల్ కార్పొరేషన్ శ్రుతి లయ ఆర్ట్స్ అకాడమీ, ఆర్ ఆర్ ఫౌండేషన్ నిర్వహణలో జాతి పిత మహాత్మా గాంధీ స్ఫూర్తి పురస్కారాలు కోదండ రెడ్డికి, 103 సంవత్సరాల స్వాతంత్ర సమర యోధుడు ఏటుకూరి కృష్ణ మూర్తికి ప్రదానోత్సవం సభ జరిగింది. పురస్కారం అందుకున్న కోదండ రెడ్డి మాట్లాడుతూ.. తాను రెండు సార్లు శాసన సభ సభ్యునిగా ఎన్నికైన ముషీరాబాద్ నియోజకవర్గ ప్రాంతం గాన సభలో తనకు సత్కారం చేయటం సంతోషంగా ఉందన్నారు. ఈ నియోజక ప్రజలు ఇప్పటికీ తాను చేసిన కృషి గుర్తు చేస్తూ ఉంటారని చెప్పారు. గాంధీజీ అహింసతో బ్రిటిష్ వారిని దేశం నుంచి వెళ్లగొట్ట గలిగారని.. అదే సిద్ధాంతం పాటించాలని కోరారు.

ముఖ్య అతిథిగా పాల్గొన్న పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ చైర్మెన్ కోలేటీ దామోదర్ మాట్లాడుతూ నిస్వార్థ దేశ భక్తులు ఏటుకూరి కృష్ణ మూర్తి కోదండ రెడ్డి అని, నేటి కాలంలో ఇటువంటి గాంధీజీ వారసులు అతి తక్కువ మంది మాత్రమే ఉన్నారని కొనియాడారు. కళా రఫీ పురస్కార గ్రహీతలను పరిచయం చేశారు. అధ్యక్షత వహించిన సంఖ్య శాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ మాట్లాడుతూ గాంధీజీ సిద్ధాంత కర్మ యోగులు కృష్ణ మూర్తి కోదండ రెడ్డి అన్నారు. కృష్ణ మూర్తి వామ పక్ష భావ శీలి అని అభినందించారు. సంస్థ చైర్మెన్ భీంరెడ్డి కుసుమ భోగరాజు పాల్గొన్న సభలో స్వాగతం పలికిన సంస్థ కార్యదర్శి ఆమని శ్రుతి లయ సంస్థకు వెన్ను దన్నుగా నిలిచిన బండారు సుబ్బారావు, భీం రెడ్డి, కోలేటి దామోదర్‌లకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమానికి తొలుత గాయని ఆమని, సుభాష్, రాజన్, అరుణ, సవిత, అనుష తదితరులు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి.



సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు మేలు : మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

లబ్ధిదారులకు చెక్కు అందజేత



నవతెలంగాణ-శామీర్‌పేట

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. మూడుచింతలపల్లి మండలం ఉద్దమర్రి గ్రామానికి చెందిన రజినికి సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.42 వేల చెక్కును మంగళవారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు ముక్కెర్ల సంజీవ్ యాదవ్, మూడు చింతలపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గుండ్లపల్లి మల్లేష్ గౌడ్, నాయకుడు వంగ వెంకట్ రెడ్డి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

క్షయ్య వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి



నవతెలంగాణ-బోడుప్పల్

క్షయవ్యాధి నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ అన్నారు. మంగళవారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో జరిగిన జాతీయ క్షయవ్యాధి నిర్మూల హెల్త్ క్యాంపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జీ.రామలింగం, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



- నాచారంలో ట్రాఫిక్ సమస్యను జోనల్ కమిషనర్‌కు దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి

నవతెలంగాణ-కాప్రా

నాచారం ప్రధాన రహదారిపై విపరీతమైన ట్రాఫిక్‌తో నిత్యం వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతూ సమయానికి గమ్యస్థానాలకు చేరుకోవడం లేదని నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలు జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ రుద్వీర్ కుమార్, కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జగన్, కాప్రా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగేందర్ ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే, కార్పొరేటర్ నాచారంలో ట్రాఫిక్ సమయంలో పర్యటించారు. అనంతరం సమస్యలను జోనల్ కమిషనర్‌కు వివరించారు. నాచారంలో స్కూల్స్ బస్సులు 200, గ్యాస్ లారీలు, పెట్రోల్ ట్యాంకర్లు, వాటితో పాటు స్కూల్స్ వ్యాన్లు తదితర వాహనాలతో ట్రాఫిక్ పెరిగుతోందని గుర్తించారు. దీనికి తోడు హబ్సిగూడ జంక్షన్ వద్ద నాచారం నుండి ఉప్పల్ పోవడానికి ఫ్రీ లెఫ్ట్ లేకపోవడంతో ఉప్పల్‌కు వెళ్లే వారు కూడా తార్నాక వెళ్లే వాళ్లతో పాటు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఈ సమస్య పరిష్కరించడానికి నాచారం నుండి ఉప్పల్ వెళ్లే కార్నర్ బిల్డింగ్ ల్యాండ్ అక్వైర్ చేయాలని జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను ఎమ్మెల్యే కోరారు. అలాగే రాఘవేంద్ర నగర్, శ్రీరాఘవేంద్ర నగర్, న్యూ రాఘవేంద్ర నగర్, సాయి నగర్, అన్నపూర్ణ కాలనీ, ఇందిరానగర్, రైతు బజార్, జాన్సన్ గ్రామర్ స్కూల్, సెయింట్ పీటర్ స్కూల్, డెక్కన్ గ్లోబల్ స్కూళ్లకు వెళ్లే వారి కోసం మహంకాళి అమ్మవారి గుడి వద్ద ఒక్కటే యూటర్న్ ఉన్నదని తెలిపారు. ఇది దాటితే ఈఎస్ఐ హాస్పిటల్ వద్ద మరో యూటర్న్ ఉన్నదని తెలిపారు. పైన తెలిపిన కాలనీవాసులు వారి ఇంటికి పోవాలంటే 1.3 కిలోమీటర్లు తిరిగి రావాల్సి వస్తుందని వివరించారు. దీంతో జోనల్ మిషనర్ స్పదిస్తూ అధికారులు, ప్రజాప్రతినిధుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయి జన్ శేఖర్, మేకల ముత్యంరెడ్డి, విఠల్ యాదవ్, కట్ట బుచ్చన్న గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కిరణ్ కుమార్, చంద్రశేఖర్, బాల్‌రెడ్డి, లడ్డు శివ, ఆంజనేయులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-కాప్రా

మీర్పేట్ హెచ్‌బీ కాలనీ పరిధిలోని న్యూ నర్సింహ నగర్, ఎన్టీఆర్ నగర్‌లో త్రీ ఫేజ్ సప్లై, ఓల్డ్ మీర్‌పేట్ కాలనీలో త్రీ ఫేజ్ సప్లైతో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని మల్లాపూర్ విద్యుత్ ఏఈ నాగరాజును కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చాలా కాలంగా పలు కాలనీల్లో విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ దృష్టికి తీసుకెళ్లారు. విద్యుత్ సమస్యలను అప్పటి ఏఈ, లైన్‌మెన్‌ల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. సమస్యను తొందరలోనే పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘ నాయకులు మధు, అంజి, దండెం నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు పరిశీలన



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌లోని ఈసీ నగర్‌లో 200 మీటర్ల రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మంగళవారం పరిశీలించారు. ఆమె వెంట జీహెచ్ఎంసీ ఏఈ కీర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ గౌడ్, చర్లపల్లి డివిజన్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రభు గౌడ్, ఈసీ నగర్, జనరల్ సెక్రెటరీ వర్మ, బాలయ్య, రాజుగౌడ్, మురళీగౌడ్, తిరుపాల్, నవనీత, నిర్మల, శ్యామ్ ఉన్నారు.

త్వరలోనే పెండింగ్ పనులు పూర్తి చేస్తాం



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్‌లోని చక్రిపురంలో పెండింగ్‌లో ఉన్న రోడ్డు నిర్మాణ పనులను త్వరలో పూర్తి చేస్తామని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవియాదవ్ అన్నారు. మంగళవారం చర్లపల్లి డివిజన్ అధికారులతో కలిసి పెండింగ్‌లో ఉన్న చక్రిపురం రోడ్డు నెంబర్ -1, 2లో 170 మీటర్ల రోడ్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి , వర్క్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, మేడ్చల్ మల్కాజిగిరి మార్కెట్ డైరెక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, కాలనీ వాసులు బుచ్చిరెడ్డి, కొండారెడ్డి, జంగిరెడ్డి పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు : పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-కాప్రా

నాచారంలోని హెచ్ఎంటీ నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ షోడష వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం నేత్రపర్వంగా సాగాయి. ఆలయ ప్రధాన అర్చకులు వెంకటేశ్వరాచార్యులు, అర్చకుల బృందం పర్యవేక్షణలో శ్రీనివాస కల్యాణం కన్నుల పండువగా సాగింది. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి సాయిజెన్, బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్ పాల్గొని శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మాధికారి డాక్టర్ తుమ్మల దుర్గాప్రసాద్, అధ్యక్షుడు రామచంద్రరావు కార్యదర్శి ఆర్. వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ రాజ్ , గోపాల్ రెడ్డి, శేషారెడ్డి భీష్మాచారి, వెంకటరెడ్డి, జనార్దన్‌రావు, తదితరులున్నారు.

వీఓఏలకు రూ.26వేల వేతనమివ్వాలి

- సెర్ఫ్ సీఈఓ దివ్య దేవరాజన్‌కు ఏఐటీయూసి వినతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

సెర్ఫ్ డిపార్టుమెంట్ల ఓవెలిజ్ ఆర్గనైజేషన్ అస్టెంట్స్ వీవోఏలుగా పని చేస్తున్న వారికి కనీస వేతనం చట్టం ప్రకారం రూ.26 వేల వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలనీ, ఇతర సమస్యలు పరిష్కారించాలని కోరుతూ సెర్ఫ్ సీఈవో దివ్య దేవరాజన్‌ను ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో డ్వాక్రా గ్రూప్‌ల ద్వారా మహిళలకు పొదుపు, ఆర్థిక అభివృద్ధి, స్వయం ఉపాధి అందింస్తున్న ప్రభుత్వం, అభివృద్ధి కోసం నిరంతరం బేస్ లెవల్‌లో వీవోఏలు పని చేస్తున్నారనీ, సెర్ఫ్ విధులతో పాటు మున్సిపల్, రెవెన్యూ శాఖ, ఎన్నికల విధులు, హెల్త్ డిపార్టుమెంట్, బ్యాంక్‌లు, ఇలా చాలా శాఖల కోసం పని చేస్తున్నారని తెలిపారు. 18 ఏండ్లుగా వీవోఏలుగా పని చేస్తున్న వారికి రూ.1,200 నుంచి రూ.5 వేల వరకు గౌరవ వేతనాన్ని గతేడాది పోరాడి సాధించుకున్నామని తెలిపారు. ప్రస్తుతం కుటంబం గడవాలి అంటే నెలకు రూ.6 వేలతో జీవించే పరిస్థితులు లేవనీ, పెరుగుతున్న మార్కెట్ ధరల వల్ల ఇబ్బందులు పడుతున్నామనీ, ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనీ, పీఫ్, ఈఎస్ఐ, బీమా సౌకర్యం కల్పించాలనీ, అర్హత ఉన్న వీవోఏలకు పదోన్నతి కల్పించాలనీ, టీఏ, డీఏ, స్టేషనరీ అలవెన్స్‌లు ఇవ్వాలనీ, 5జీ సెల్ ఫోన్లు నాణ్యమైనవి అందించాలనీ, పని వేళలు 8 గంటలు ఉండేలా ఆదేశించాలనీ, ఐడీ కార్డులు, యూనిఫామ్స్ ఇవ్వాలనీ, పెన్షన్, గ్రాడ్యూటీ, కారుణ్య నియామకాలు ఇవ్వాలనీ, బ్యాంక్‌లో వీవోఏ ల ద్వారా జరిగిన రుణం మంజూరు, రికవరీ, ఆర్థిక లావాదేవీలపై 5 శాతం కమిషన్ ఇవ్వాలని వీవోఏ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ సీతా మహాలక్ష్మి డిమాండ్ చేశారు. అధికారుల వేధింపులను అరికట్టాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏఐటీయూసీ నాయకులు వి.మల్లిఖార్జున్, లత, పద్మ, రమణ. తదితరులు ఉన్నారు.

రోడ్డు విస్తరణ పనుల్లో జాప్యం వద్దు

- అధికారులతో సమీక్ష సమావేశంలో మేయర్ అమర్ సింగ్



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని పీర్జాదిగూడ కార్పొరేషన్ మేయర్ అమర్ సింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో మేయర్ అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో హెచ్ఎండీఏ, జలమండలి, ఎలక్ట్రిసిటీ, రోడ్లు ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ నుండి పర్వతపూర్ వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ త్రిలేశ్వర్ రావు, డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్, కార్పొరేటర్ భీమ్ రెడ్డి నవీన్ రెడ్డి, సీనియర్ నాయకులు మాడుగుల చంద్రారెడ్డి,పప్పుల అంజిరెడ్డి, యాసారం మహేష్,దేవేందర్ గౌడ్, బొడిగే కృష్ణ, బైటంటి ఈశ్వర్ రెడ్డి,కో ఆప్షన్ సభ్యులు ఇర్ఫాన్, కమిషనర్ త్రిలేశ్వర్ రావు, డీఈ సాయినాథ్ గౌడ్, టీపీవో సుకన్య, విద్యుత్ ఏఈ సత్యనారాయణ, జలమండలి మేనేజర్, హెచ్ఎండీఏ అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను విడుదల చేయాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



నవతెలంగాణ-బోడుప్పల్

పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు విద్యారంగ సమస్య పరిష్కారానికి నేడు చేపడుతున్న జిల్లా కలెక్టర్ల కార్యాలయాల ముట్టడి వాల్ పోస్టర్‌ను ఉప్పల్ డిపో కార్యాలయం వద్ద మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ స్కాలర్‌షిప్స్, ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు రూ. 8 వేల కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వాటిని విడుదల చేయకపోవడంతో 13 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నాయని చెప్పారు. కోర్సులు పూర్తయినా కళాశాల యాజమాన్యాలు వారికి ధ్రువపత్రాలు ఇవ్వకపోవడంతో విద్యార్థులు మానసిక ఆవేదన చెందుతున్నారని అన్నారు. నాటి సీఎం వైఎస్. రాజశేఖర్ రెడ్డి పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఫీజురీయింబర్స్‌మెంట్ పథకాన్ని తీసుకొచ్చారని గుర్తు చేశారు. నేడు అధికారంలో ఉన్న అదే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా వ్యవహరిస్తోందన్నారు. అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా విద్యారంగ సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. విద్యాశాఖను సీఎం రేవంత్‌రెడ్డి దగ్గరే పెట్టుకుని విద్యార్థుల సమస్యలపై దృష్టి పెట్టడం లేదన్నారు. మరో పక్క ప్రయివేట్ కళాశాల యాజమాన్యాలకు పాత బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలలను నడుపలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదని చెప్పారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని రేపు నిర్వహించే మేడ్చల్- మల్కాజిగిరి కలెక్టర్ కార్యాలయం ముట్టడిని విద్యార్థులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఉపాధ్యక్షుడు హరీష్, నాయకులు అరవింద్, ఆదిత్య, బబ్బి, శివ, మోహన్, కార్తీక్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

- కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మౌలాలి డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలు, బస్తీల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నానని కార్పొరేటర్ గున్నాల సునీత శేఖర్ యాదవ్ అన్నారు. మౌలాలి డివిజన్ లోని ఏ1 హోటల్, ఎంజే కాలనీ శ్రామిక నగర్, సాయినాధపురం రామ కృష్ణ స్కూల్, ఆర్ కే హెచ్, గీతా నగర్ పార్క్ ఎదురుగా ఉన్న రోడ్లపై గుంతలు పడడంతో ఆ రోడ్లను బ్యాడ్ లీ డామేజ్ కింద ఎంపిక చేసి రూ.24 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు ప్యాచ్ వర్క్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో ఉన్న పలు కాలనీల్లో గుంతల పడిన రోడ్లకు జోనల్ కమిషనర్ రూ.24 లక్షలను మంజూరు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈ మధురిమ, వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, నరేందర్, బీజేపీ మల్కాజిగిరి పార్లమెంటు కన్వీనర్ ఆర్.కే. శ్రీనివాస్, ప్రసాద్ చౌదరి, శాంతారామ్, దేవానంద్, సాయి బాబా, మౌలాలి శ్రీనివాస్ యాదవ్, శివా గౌడ్, మైనారిటీ మోర్చా నాయకులు శబ్బార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జే.కే.సాయి గౌడ్ జన్మదిన వేడుకలు

- మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిల ఆశీర్వాదం తీసుకున్న జేకే





నవతెలంగాణ-నేరేడ్‌మెట్

బీఆర్ఎస్ పార్టీ నేరేడ్‌మెట్ డివిజన్ యువ నాయకులు జూలకంటి సాయి గౌడ్ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా జే.కే సాయి గౌడ్ మాట్లాడుతూ..మాజీ మంత్రి మల్లారెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిలను మంగళవారం మర్యాద పూర్వకంగా కలిసి వారి ఆశీర్వదం తీసుకున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారు పార్టీ అభివృద్ధికి, డివిజన్‌లోని సమస్యలను అధికారులకు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారని తెలిపారు. కార్యాక్ర మంలో నాయకులు శివకుమార్, వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిరంతరం.. సేవే లక్ష్యం



నవతెలంగాణ-ఘట్కేసర్

ఆపదలో ఉన్న వారిని అక్కున చేర్చుకుని ఆదుకోవటమే లక్ష్యం అని సన్‌రైజ్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు వై. సుందర్ రావు తెలిపారు. వరంగల్ జిల్లా మర్రిపెడ గ్రామానికి చెందిన వెంకన్న, నల్లగొండ జిల్లా హుజూర్ నగర్‌కు చెందిన మరో వ్యక్తి వెల్డింగ్ పనులు చేస్తూ బతుకుతున్నారు. కాగా ఈ నెల 14న పనులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో రోడ్డు ప్రమాదానికి గురై హస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. వారికి చికిత్స చేసుకోడానికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న సురేందర్‌రావు ఘట్కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీ నగర్‌లోని సన్ రైజ్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో బాధితులకు రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కార్యదర్శి శ్రీకాంత్, సభ్యులు సోమయ్య, లింగస్వామి, బంగారు బాబు తదితరులు పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో డ్రయినేజీ పనులు ప్రారంభం

మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్



నవతెలంగాణ - జవహర్‌నగర్

మురుగు నీటికి శాశ్వత ప్రాతిపదికన పనులు చేపడుతున్నామని జవహర్ నగర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని 6వ డివిజన్ బిజెఆర్ నగర్ లో రూ.10 లక్షల నిధులతో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులను స్థానిక కార్పొరేటర్ పల్లవు రవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విడతల వారీగా అన్ని కాలనీలలో డ్రయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో బస్తీ నాయకులు. మహిళలు నాయకులు పాల్గొన్నారు.

ఈసీఐఎల్ నిర్మాణానికి నాంది పలికిన వ్యక్తి ఏఎస్‌రావు

- విజ్ఞాన దర్శిని నాయకులు టి. రమేష్
- ఏఎస్ రావు బయోపిక్ చిత్ర ప్రదర్శన



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

దేశ స్వాలంబన కోసం ఈసీఐఎల్ నిర్మాణానికి నాంది పలికిన మహోన్నత వ్యక్తి డాక్టర్ ఏఎస్ రావు అని విజ్ఞాన దర్శిని నాయకులు టి. రమేష్ అన్నారు. నేరేడ్‌మెట్ డివిజన్ ఆర్కే పురం హరిజన బస్తీలోని పోచమ్మ టెంపుల్ దగ్గర సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు సమక్షంలో డాక్టర్ ఏఎస్‌రావు బయోగ్రఫీ డాక్యుమెంటరీ సినిమా ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమానికి టి. రమేష్ పాల్గొని మాట్లాడుతూ.. దేశ స్వాలంబనకు, ఈసీఐఎల్ నిర్మాణానికి నాంది పలికిన మహోన్నత వ్యక్తి డాక్టర్ ఏఎస్ రావు అని, ఆయన జీవితాన్ని ఆదర్శంగా భావితరాలకు అందించాలని, విజ్ఞానదర్శిని టీపీఎస్‌కే ఆధ్వర్యంలో చిత్ర ప్రదర్శన చేస్తున్నామన్నారు. అనంతరం తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం జిల్లా అధ్యక్షులు యాదగిరిరావు మాట్లాడుతూ.. డాక్టర్ ఏఎస్ రావు బయోపిక్ ఒడిస్సా ప్రభుత్వం ద్వారా ప్రాంతీయ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో ఉత్తమ డాక్యుమెంటరీ ఫిలిం అవార్డు అందుకున్నదని చెప్పారు. ఏఎస్ రావు చిన్ననాటి నుంచే అనేక సమస్యలు ఎదుర్కొంటూ అగ్రవర్ణంలో పుట్టినా కుల వివక్ష ఎదుర్కొన్న వ్యక్తి అని తెలిపారు. ఉన్నత చదువులు చదివిన ఏఎస్‌రావు మూఢ, అంధ విశ్వాసాలకు, మత క్రతువులకు వ్యతిరేకంగా నిలబడ్డారని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు సుమిత్ర, వైష్ణవి, సునంద, సత్యవతి, దీప, సునీత, మంగమ్మ, అమ్ములు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసు బందోబస్తు మధ్య గ్రూప్-1 పరీక్షలు



సీపీ సుధీర్ బాబు

నవతెలంగాణ-కీసర

కట్టు దట్టమైన పోలీసు బందోబస్తు మధ్య గ్రూప్-1 పరీక్షలు నిర్వహిస్తున్నామని రాచకొండ సీపీ జి.సుధీర్ బాబు అన్నారు. మంగళవారం చీర్యాలలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు, పరిస్థితిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. పరీక్షకు చివరి సమయంలో హాజరయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. ఆయన వెంట కీసర సీఐ వెంకటయ్య, సిబ్బంది ఉన్నారు. కాగా 936 మంది అభ్యర్థులకుగాను 488 మంది పరీక్షకు హాజరు కాగా 448 మంది గైర్హాజరయ్యారు.

హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులుగా మోమిన్ బాషా



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా తెలంగాణ స్టేట్ అధ్యక్షులుగా నేరేడ్‌మెట్‌కు చెందిన మోమిన్ బాషా నియమితులయ్యారు. నియామక పత్రాన్ని హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా ఫౌండర్, నేషనల్ అధ్యక్షులు అయ్యప్ప మంగళవారం మోమిన్ బాషాను తెలంగాణ స్టేట్ అధ్యక్షులుగా నియమిస్తున్నట్టు అపాయింట్మెంట్ లెటర్ అందజేశారు. ఈ సందర్భంగా మోమిన్ భాషా మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి సహకరించిన నేషనల్ ఫౌండర్, నేషనల్ డైరెక్టర్, చైర్మెన్ రాజుకు, హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కేవెల్ నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి రావడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందని, పలు సేవా కార్యక్రమాలతో పాటు, సమాజ సేవ చేసే చేసేందుకు అవకాశం వచ్చిందని, రానున్న కాలంలో హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్‌ను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



తపస్ రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్

నవతెలంగాణ-మేడ్చల్

ప్రభుత్వ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని తపస్ రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్ అన్నారు. పెండింగ్‌లోని డీఏ, పీఆర్సీలను ప్రభుత్వం ప్రకటించాలని కోరుతూ మేడ్చల్ మండల పరిధిలోని పలువురు ప్రభుత్వ ఉపాధ్యాయులు భోజన విరామ సమయంలో మంగళవారం నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా తపస్ రాష్ట్ర కార్యదర్శి గడప నవీన్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర శాఖ పిలుపు మేరకు ధర్మదీక్ష కార్యక్రమంలో భాగంగా నిరసన చేపట్టినట్టు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు వెంకటరమణ, జిల్లా కార్యదర్శి గోపాల్, జిల్లా కోశాధికారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

భార్య మృతికి కారణమైన భర్తకు రిమాండ్



నవతెలంగాణ-బోడుప్పల్

భార్య మృతికి కారణమైన భర్తను రిమాండ్‌కు తరలించిన సంఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. మేడిపల్లి సీఐ గోవింద్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ కార్పొరేషన్ ఎస్ఐఎస్ కాలనీకి చెందిన బసిరి కవితా సంతోష్‌లు భార్య భర్తలు కాగా వీరి మధ్య గొడవలు జరగడంతో నాలుగు నెలల క్రితం సంతోష్ ఇంటి నుండి వెళ్లిపోయాడు. అప్పటి నుండి కవిత భర్తను కలిసి ఉందాం రావాలని ప్రాధేయ పడిన అతను ఎంతకు స్పందించకపోవడంతో మానసికంగా మనోవేదనకు గురైన ఆమె ఈ నెల 20వ తేదీన మేడిపల్లిలోని ఒయో హోటల్లో గది అద్దెకు తీసుకుని ఉరేసుకుని చనిపోయింది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సంతోష్ ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేస్తాం



నవతెలంగాణ-కీసర

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందజేస్తామని బీజేపీ నాగారం మున్సిపాలిటీ కార్యదర్శి జూపల్లి నరేష్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డులో మోడీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించి సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సూర్య శేఖర్ రెడ్డి , సురేందర్ రెడ్డి , నాగేందర్, తదితరులున్నారు.

కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలువురు కార్పొరేటర్లు మంగళవారం మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్‌ను వారి నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో నెలకొన్న సమస్యలు, అభివద్ధి కార్యక్రమాలపై మాజీ ఎమ్మెల్యేకు వివరించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కషి చేస్తానని వారికి ఆయన హామీ ఇచ్చారు. పలు బస్తీలు, కాలనీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, ప్రజలు మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్‌కు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. పలువురు పలు శుభకార్యాలకు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

అభివృద్ధి పనులలో నాణ్యత లోపిస్తే సహించేది లేదు

● అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

అభివద్ధి పనులలో నాణ్యత లోపిస్తే సహించేది లేదని అల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ సబీహా గౌసుద్దీన్ అన్నారు. మంగళవారం అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సబ్దర్ నగర్ సి బ్లాక్‌లో రూ.50 లక్షల వ్యయంతో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను మంగళవారం డీఈ శ్రీదేవి, ఏఈ రంజిత్ లతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు కషితో డివిజన్ పరిధిలోని అన్ని బస్తీలలో అధునాతన వసతులతో అభివద్ధి పరుచుకున్నామని తెలిపారు. అభివద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ వినాయక్ రావు, అబ్దుల్ హమీద్, తదితరులు పాల్గొన్నారు.

గ్లోబల్ అయోడిన్ లోప రుగ్మతల నివారణా దినోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి ఇన్‌చార్జి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శోభారాణి మంగళవారం గ్లోబల్ అయోడిన్ లోప రుగ్మతల నివారణా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మల్కాజిగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అయోడిన్ లోపం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. అయోడిన్ లోపం వల్ల గోయిటర్, మానసిక అభివద్ధి లోపం, గొయిటర్, హైపోథైరాయిడిజం, క్రెటినిజం, నవజాత శిశువులు, పిల్లల్లో బుద్ధి లోపాలు, మానసిక అభివృద్ధి లోపం, జన్యుపరమైన లోపాలు, వద్ధి మందగింపు, వంధ్యత్వం, మూత్రపిండాల సమస్యలు వంటి అనేక వ్యాధులు సంభవిస్తాయని తెలిపారు. ఈ అవగాహనా కార్యక్రమం వారం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలనీ, రానున్న వారం రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు, ప్రజా చైతన్య కార్యక్రమాలు, స్కూల్స్, ఆరోగ్య కేంద్రాల్లో అవగాహనా సదస్సులు నిర్వహించాలని ఆదేశించారు. అయోడిన్ లోప నివారణలో భాగంగా సరైన ఆహారం తీసుకోవడం, సాధారణమైన ఉప్పు కాకుండా అయోడిన్ కలిగిన ఉప్పును వినియోగించడం వంటి అలవాట్లను ప్రజలు పాటించాలనే చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ విజయ నిర్మల, డాక్టర్ వినోద్, లింగాల అక్షయ్ కుమార్, థెరిస్సా, రిపోర్టింగ్ అధికారులు వేణు గోపాల్, రాము, బాలరాజు, జోసెఫ్, జానకమ్మ, వెంకటేశ్వర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగుపడేనా..?

- తీరిన ఉపాధ్యాయుల కొరత
- విధుల్లో చేరిన 82 మంది..
- ఏండ్లుగా జిల్లాలో టీచర్ల కొరత
- అంతంత మాత్రమే విద్యా బోధన
- అధికారులు పర్యవేక్షణ చేస్తే విద్యార్థులకు ప్రయోజనం

నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో పాధ్యాయుల్లేక ఏండ్ల తరబడి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఉపాధ్యాయ ఖాళీలు ఎక్కువగా ఉండటంతో విద్యార్థులకు సరైన విద్య అందడం లేదని అపవాదు ఉంది. ఇటీవల నిర్వహించిన డీఎస్సీతో జిల్లాలోని పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలను కొంత వరకు భర్తీ చేశారు. దాదాపు అన్ని ప్రాంతాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఇటీవల 82 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. అంతేకాకుండా ఇటీవల మండల విద్యాశాఖ అధికారులుగా సీనియర్ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జి బాధ్యతలను సైతం అప్పగించారు.

అన్ని ప్రాంతాలకూ ప్రాధాన్యత

జిల్లాలో ఏండ్లుగా ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. విద్యావాలం టరీల నియామకం లేకపోవడంతో ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులనే సర్దుబాటు చేశారు. అయినప్పటికీ విద్యార్థులకు అంతంత మాత్రమే విద్య అందే ది. ప్రధానంగా కొన్ని మండలాల్లో ఉపాధ్యాయుల కొరత అధికంగా ఉండటమే కాకుండా పాఠశాలలకు ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేని పరిస్థితులను అధిగమించారు. ఇటీవల రేపట్టిన ఉపాధ్యాయుల కేటాయింపులో దాదాపు అన్ని ప్రాంతాలకు అధికారులు ప్రాధాన్యతనిచ్చి ఉపాధ్యాయులను భర్తీ చేశారు.



విద్యా బోధన మెరుగుపడేనా..?

ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ ఖాళీలు కొంత వరకు భర్తీ అయ్యాయి. గతం నుంచి పని చేసిన ఉపాధ్యాయులతోపాటు నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులందరూ విద్యార్థుల భవిష్యత్ గురించి ఆలోచించి.. వెనుకబడిన విద్యా బోధనను మెరుపర్చాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థుల సంఖ్యను కూడా పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల పైనే ఉంది. జిల్లా వ్యాప్తంగా 505 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా దాదాపు లక్ష మంది వరకు విద్యార్థులు ఉన్నారు. జిల్లా మొత్తంగా దాదాపు 3 వేల మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించారు. ఇటీవల డీఎస్సీ ద్వారా మరో 82 మంది ఉపాధ్యాయులను నియమించారు.

అధికారుల పర్యవేక్షణ పెరిగేనా..?

డీఈఓతో పాటు ఎంఈఓలు ప్రతి రోజూ పాఠశాలలను పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉంది. గత నెలలో ప్రభుత్వం ప్రతి మండలానికో ఇన్‌చార్జి ఎంఈఓలను నియమించింది. ఏండ్లుగా జిల్లాలోని 15 మండలాలకు ఇద్దరు రెగ్యులర్, మరో ఇద్దరు ఇన్‌చార్జి ఎంఈఓలు మాత్రమే విధులు నిర్వర్తించారు. పాఠశాలలపై పర్యవేక్షణ తగ్గడంతో మండలంలో సీనియర్ ప్రధానోపాధ్యాయులకు అదనపు బాధ్యతలను అప్పగించారు. గతంలో నాలుగైదు మండలాలకు ఒక్కరే ఎంఈఓ ఉండటంతో పర్యవేక్షణ మరిచి కేవలం కార్యాలయానికి పరిమితమై ఉపాధ్యాయుల పనులు, రిపోర్టుల తయారీకి మాత్రమే పరిమితమయ్యారు. నూతనంగా ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓలు ప్రతి పాఠశాలనూ తనిఖీ చేసి పర్యవేక్షణ చేస్తేనే విద్యాభివృద్ధి చెందుతుంది.

అంతంత మాత్రమే..

పలు మండలాల్లో ఇప్పటి వరకు స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పీఈటీలు ఖాళీలు ఉండేవి. దీంతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరైన విద్య అందలేదు. దీనికి నిదర్శనం పదో తరగతి ఫలితాల్లో గతేడాది జిల్లా 27వ స్థానానికి పడిపపోయింది. అలాగే 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు అన్ని సబ్జెక్ట్‌లకు ఉపాధ్యాయులు లేకపోవడంతో నామమాత్రంగానే విద్యాబోధన చేశారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులను ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కొత్త నియామకాలు చేపట్టడంతో విద్యాబోధన మెరుగుపడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు భావిస్తున్నారు.

డివిజన్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాను



కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మౌలాలి డివిజన్ లోని ఎంజే కాలనీ పార్కుని మంగళవారం స్థానిక కాలనీ వాసులతో కలిసి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ తాను కార్పొరేటర్ గా ఎన్నికైన అప్పటినుంచి మౌలాలి అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నామని, ఇందులో భాగంగా మౌలాలిలోనీ చాలా పార్కులను అభివృద్ధి చేశామని అదేవిధంగా ఎంజే కాలనీ పార్కుని కూడా అభివృద్ధి చేశామని కాలనీవాసులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం జె కాలనీ వాసులు ప్రసాద్ చౌదరి, శాంతారామ్, సాయిబాబా, శివ గౌడ్, శ్రీనివాస్ యాదవ్, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

లింక్ రోడ్ల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య పరిష్కారం

ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

లింక్ రోడ్ల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య పరిష్కారమని ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ అన్నారు. పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని లింకు రోడ్ల పనులపై హైదరాబాద్ రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, జీహెచ్ఎంసీ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు.

అభివృద్ధి పనుల్లో భాగంగా...

1) ఎన్.హెచ్ 44 నుంచి ఫాక్స్ సాగర్ మీదుగా రాంరెడ్డి నగర్ ఇండస్ట్రియల్ ఏరియా వరకు రూ.29 కోట్లతో 2) కైసర్ నగర్ హనుమాన్ టెంపుల్ నుంచి గాజులరామారం మిథిలా నగర్ వరకు రూ.36 కోట్లతో... 3) ప్రగతి నగర్ నుంచి ఎల్లమ్మ బండమీదుగా మహాదేవపురం వెటర్నరీ హాస్పిటల్ వరకు రూ.30 కోట్లతో... లింకు రోడ్డు పనులను చేపట్టనుండగా అదేవిధంగా భూదేవి హిల్స్ లింకు రోడ్డు పనుల పురోగతిపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లింక్ రోడ్ల అభివద్ధితో ట్రాఫిక్ రద్దీ తగ్గడంతోపాటు దూరం తగ్గుతుందన్నారు. లింక్ రోడ్డు పనుల అభివద్ధిపై అధికారులు ఇతర విభాగాల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఎవ్వరికీ అసౌకర్యం కలగకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు జగన్, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, డిప్యూటీ కమిషనర్లు నరసింహ, మల్లారెడ్డి, టౌన్ ప్లానింగ్ ఏసిపి సురేందర్ రెడ్డి, టీపీఎస్ రమేష్, నాయక్ , ఇంజినీర్ జయశ్రీ , విజయ్ కుమార్, విట్టలయ్య, హెచ్ఆర్డీసీఎల్ అధికారులు జెరేమయ్య, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ నాయకునికి పుట్టినరోజు శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పేట్ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కెపి. వివేకానంద్‌ను కలిసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. అదేవిధంగా వారి ఇండ్లలో నిర్వహించనున్న శుభకార్యాలకు ఎమ్మెల్యేను ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికలు అందజేశారు.

అన్నదానం మహాదానం : గౌడ సంఘం



● శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ

నవతెలంగాణ-శామీర్‌పేట

అన్నదానం మహ దానమని గౌడ సంఘం ప్రతినిధులు అన్నారు. మంగళవారం శామిర్ పేట మండల కేంద్రంలోని రాజీవ్ రహదారి ప్రక్కనున్న శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. శామీర్ పేట కు చెందిన కుమావత్ విష్ణు-కాంతాదేవి దంపతులు వారి కుటుంబ సభ్యులు అన్నదానానికి ఒక క్వింటాల్ 25 కేజీల బియ్యం అందజేశారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని అన్న ప్రసాదం స్వీకరించారు.

జేఎన్టీయూహెచ్ వీసీగా బంజారా సామాజిక వర్గానికి అవకాశం కల్పించాలి

● జెఎన్టీయుహెచ్ బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షులు ధరావత్ వినోద్‌నాయక్



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

జేఎన్టీయూహెచ్ వీసీగా బంజారా సామాజిక వర్గానికి చెందిన వారికి అవకాశం కల్పించాలని జెఎన్టీయుహెచ్ బంజారా విద్యార్థి సంఘం అధ్యక్షులు ధరావత్ వినోద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన యూనివర్సిటీల రెగ్యులర్ వీసీల నియామకంలో లంబాడీ ప్రొఫెసర్లకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో రావడం కోసం లంబాడీలు ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. రెగ్యులర్ వీసీల్లో లంబాడీ ప్రొఫెసర్లకు స్థానం ఇవ్వకపోవడం దురదష్టకరమన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించి జె.ఎన్.టి.యు హెచ్ వీసీగా బంజారా సామాజిక వర్గానికి చెందిన వాళ్లని వీసీగా నియమించాలన్నారు. ఇప్పటి వరకు ఒక్క బంజారా బిడ్డ వీసీగా కాలేదని, జేఎన్టీయూహెచ్ చరిత్రలో రెగ్యులర్ వీసీల ప్రకటనలో కచ్చితంగా లంబాడీ ప్రొఫెసర్లకు న్యాయం చేసే విధంగా ప్రకటన చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

ప్రజలను భాగస్వామ్యం చేస్తూ చెడు వ్యసనాలపై పోరాటం

● టీపీవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సతీష్ కుమార్, ప్రసన్న కుమార్



నవతెలంగాణ - బాలానగర్

నవసమాజ నిర్మాణంలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ చెడు వ్యసనాలపై పోరాటం చేస్తామని తెలంగాణ ప్రోగ్రెసివ్ యూత్ ఫెడరేషన్ (టీపీవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సతీష్ కుమార్, ప్రసన్న కుమార్ అన్నారు. వారి ఆధ్వర్యంలో బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ నరసింహారాజును మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఐకు పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించారు. నేటి యువత డ్రగ్స్, గంజాయి, భారిన పడకుండా యువజన సంఘాలు యువతకు పలు అంశాలపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సీఐను కోరారు. ఆయా సదస్సులలో తమను భాగస్వాములను చేయాలని దాంతో ఒక మంచి సమాజం కోసం కషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే టీపీవైఎఫ్ సంఘం చేపట్టబోయే నవ సమాజ మార్పుకోసం సమాజ నిర్మాణానికి కావాల్సిన సహాయ సహకారాలు పోలీసు సిబ్బంది నుంచి అందించాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేష్, నర్సింగ్ రావు (చిట్టి), అఖిల్, సంతోష్, శివ, రాజు, అభిలాష్, దివాకర్, విక్రమ్, చెన్నయ్య, మహేష్, ప్రకాష్, కర్ణాకర్ పాల్గొన్నారు.

నర్సరీలు, డంపింగ్ యార్డుల తనిఖీ



నవతెలంగాణ-శామిర్‌పేట

నర్సరీలు, డంపింగ్ యార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని మేడ్చల్ డీఆర్‌డీఓ అధికారి సాంబశివరావు అన్నారు. మూడుచింతలపల్లి మండలం లోని కొల్తూరు, పోతారం, గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నర్సరీలు, డంపింగ్ యార్డులను తనిఖీ చేసి పరిశీలించారు. కంపోస్టు ఎరువులు తయారుచేసి మొక్కలకు వేసి సంరక్షించాలని, ఈ విడత మొక్కలు ఎన్ని కావాలో ఇండెంట్ తయారు చేయాలని సూచించారు. డంపింగ్ యార్డును సందర్శించి చెత్తను నిర్వహిస్తున్న తీరును స్థానిక సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఏజీఎస్ఈసి సూర్య, టీఏ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, శరత్, బిల్ కలెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి

● కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి



నవ తెలంగాణ - బాలానగర్

జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి మంగళవారం బాలానగర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న స్వీపింగ్ పనీతీరును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణ పనులో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, బస్తీలలో పేరుకుపోయిన చెత్త కుప్పలు ఎప్పటికప్పుడు తరలించి ప్రజలకు మెరుగైన ఫలితాలు అందించాలని కోరారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ సిబ్బందికి సూచిస్తూ బాలానగర్ ఫ్లైఓవర్ కింద మెయిన్ రోడ్డు పై వెళుతున్న వాహనదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చెత్తను ఎప్పటి కప్పుడు క్లీన్ చేసి రోడ్లను సుందరంగా ఉంచాలని తెలిపారు. ప్రధానంగా డివిజన్ పరిధిలోని ఆయా బస్తీలలో ప్రజలకు ఎలాంటి ఇబ్బం దులు కలగకుండా మెరుగైన వసతులు కల్పించే విధంగా మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు కషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మహమ్మద్ ఖాజా, మహేందర్ రెడ్డి, జీహెచ్ఎంసీ సిబ్బంది శానిటేషన్ ఎస్ఆర్పీ నర్సింగ్ రావు, ఎస్ఎఫ్ఏలు పాండు నాయక్, భోళా శంకర్, సిబ్బంది ఉన్నారు.

ప్రజాసంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

రోడ్డు పనులకు రూ. 15.50 లక్షలు మంజూరు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

ప్రజాసంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మంగళవారం గాజులరామరం డివిజన్ లోని కైసర్ నగర్ ప్రాంతంలో రోడ్లు అధ్వాన్నంగా ఉండడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతుండటంతో ఈ విషయాన్ని స్థానికులు మాజీ ఎమ్మెల్యే కూన దష్టికి తీసుకెళ్లారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రివర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు,జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ ల దష్టికి తీసుకెళ్లారు.వెంటనే స్పందించి ప్రభుత్వం తరపున సీసీ రోడ్డు నిర్మాణానికి 15.50 లక్షలు మంజూరు చేయించారు.దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ రోడ్లను పరిశీలనకు విచ్చేసిన ఆయనకు స్థానికులు ధన్యవాదాలు తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే సమస్యలను పట్టించుకోకుండా పాలనను గాలికి వదిలేశారని కాలనీ వాసులు మండిపడ్డారు. నియోజకవర్గంలో పనులు జరగకుండా అడ్డుపడుతున్న ఎమ్మెల్యే ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చేలా చేస్తున్నారని విమర్శించారు. బస్తీల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మహ్మద్ తౌసీఫ్,స్థానిక నాయకులు జమీల్ పాషా, జబ్బార్, రాములు, దావూద్, సలీం, రంగయ్య, ఫయాజ్, హబీబ్, భవాని, శ్రీనివాస్, రసూల్,ఖాజా భాయ్, మున్నా, ముక్తార్, అక్రమ్, అలీం, మహబూబ్, బుచ్చిరెడ్డి, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 131 డివిజన్ కుత్బుల్లాపూర్‌లోని చెరుకుపల్లి కాలనీలో సీసీ రోడ్డు పూర్తిగా పాడవటంతో బస్తీ వాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ మేరకు బస్తీ వాసులు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని గత నెల సంప్రదించగా వారి సమ్యసపై వెంటనే స్పందించిన ఆయన మంత్రి శ్రీధర్ బాబుతో చెప్పి స్పెషల్ ఫండ్స్ ద్వారా సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు సీసీ రోడ్డు పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. చెరుకుపల్లి కాలనీ అసోసియేషన్ సభ్యులు హన్మంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ మహమ్మద్ జాకీర్, చెరుకుపల్లి కాలనీ అసోసియేషన్ ప్రెసిడెంట్ మీసాల రాములు, జనరల్ సెక్రెటరీ సూర్య బాబు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మల్లేష్, రాందాస్, సంగమ్మ, రాజు, అక్బర్ హుస్సేన్, ఈశ్వర్, సుబ్బారావు, శ్రీనివాస్ గుప్తా, వీరేష్ , తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలు మర్చిపోలేదు

ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు



నవతెలంగాణ - కూకట్ పల్లి

గత 10 ఏండ్ల కాలంలో కేసీఆర్ చేసిన అభివృద్ధిని ప్రజలు మర్చిపోలేదని ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూకట్‌పల్లి డివిజన్ కు చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలకోట్ల రూపాయలతో కూకట్‌పల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకున్నామని గుర్తు చేశారు. ప్రతినిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా ముందుకు వెళదామని దిశా నిర్దేశం చేశారు. రాబోయే రోజుల్లో మళ్ళీ తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని, ఇప్పటికే ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసిగెత్తిపోయారని తెలిపారు. ఎక్కడ ఎటువంటి సమస్య ఉన్న తమ దష్టికి తీసుకురావాలని సూచించారు. కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు సంతోష్.జనరల్ సెక్రటరీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సత్ జ్ఞాన్ విద్యార్థుల దాతృత్వం అందరికీ ఆదర్శం



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

వరద ముంపు ప్రాంతాల విద్యార్థులకు కుత్బుల్లాపూర్ వెంకటేశ్వర నగర్ లోని సత్ జ్ఞాన్ హై స్కూల్ విద్యార్థులు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ పిలుపుమేరకు 4వేల నోట్ బుక్స్ తమ పాకెట్ మనీతో కొని పాఠశాల ప్రిన్సిపల్ చింతల మల్లేశం చేతుల మీదుగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ చైర్మెన్ మామిడి భీమ్ రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మెన్ మామిడి భీమ్ రెడ్డి మాట్లాడుతూ.. చిన్నప్పటినుండి విద్యార్థుల్లో సేవా భావం సేవ తత్పర్త పెంపొందించడం వల్ల రేపటి భవిష్యత్తురాలని కాపాడుకున్న వాళ్ళం అవుతాం అని తెలిపారు. తాము చెప్పిన వెంటనే పాఠశాల ప్రిన్సిపాల్ లయన్ చింతల మల్లేశం స్పందించి ఫ్లడ్ రిలీఫ్ కమిటీ కోఆర్డినేటర్‌గా ముఖ్యభూమిక పోషించి గొప్ప ఉదారత చాటారని తెలియజేశారు. పాఠశాల ప్రిన్సిపల్ లయన్ చింతల మల్లేశం మాట్లాడుతూ ఇంత గొప్పగా మానవతా హదయంతో ముందుకు వచ్చిన తల్లిదండ్రులు వారి పిల్లల దాతత్వం వల్లనే ఇది సాధ్యమైందని తెలియజేశారు. సత్ జ్ఞాన్ విద్యార్థులు ప్రతి మంచి పనికి ముందుంటారని ఇది గత 30 సంవత్సరాల నుంచి సంఘంలో చేసిన సేవల వల్ల రుజువైందన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్ ఏవి రావు, యూత్ చైర్మెన్ మణిదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ చెక్కు అందజేత



నవతెలంగాణ - కూకట్ పల్లి

అనారోగ్యంతో సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకున్న ఏవీబీ పురంకు చెందిన పి.అజ్జేశ్వరి (భర్త పి. రాంబాబు)కి మంజూరైన రూ. 75 వేల ఎల్ఓసీ చెక్కును ఎమ్మెలే క్యాంపు కార్యాలయంలో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కష్ణా రావు మంగళవారం అందజేశారు.

ఉన్నత విద్యామండలి చైర్మెన్‌ను కలిసిన వీసీ



నవతెలంగాణ-ఓయూ

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మెన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డిని మంగళవారం ఓయూ వీసీ ప్రొ. కుమార్ మొలుగారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తు విద్యావిధానంపై ఈ సందర్భంగా కాసేపు ఇరువురు చర్చించారు. రాష్ట్రంలో ఉన్నత విద్యాభివద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రాయాలు పంచుకున్నారు. ఆధునిక సాంకేతిక రంగాల్లో నైపుణ్యాన్ని అందించటం ద్వారా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెరుగుపరిచవచ్చని వారు అభిప్రాయపడ్డారు. ఉన్నత విద్యామండలి నాయకత్వంలో విశ్వవిద్యాలయాలుగా తామంతా కలిసి పనిచేస్తామని ప్రొ. కుమార్ తెలిపారు. ఆ తర్వాత ఇటీవలే బాధ్యతలు చేపట్టిన ఉన్నత విద్యామండలి వైస్ చైర్మెన్ ప్రొ. ఇటిక్యాల పరుషోత్తంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మధురంగా సినీ గీతాల గానం



నవతెలంగాణ-కల్చరల్

ప్రముఖ గాయకుడు చంద్ర తేజ తన గళంలో ఘంటసాల పాడిన పద్యాలు రాగ బద్ధం గా పాడి శ్రోతలను రంజింప జేశారు. వర్ధమాన ప్రవర్ధమాన గాయకులు కె వీ రావు అనుష కల్యాణి వెంకీ శ్రీ కాంత్ లు నాటి నేటి పాటలతో సందడి చేశారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లలిత కళా వేదిక పై సినీ గీత విభావరి రస రమ్యం గా జరిగింది. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హెలెన్ కెల్లర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రిసెర్చ్ అండ్ రిహబిలిషన్ ఫర్ ది డిసేబుల్డ్ చిల్డ్రన్ నిర్వాహకుడు ఉమర్ ఖాన్ మాట్లాడుతూ నాటి సినీ పాటలు సంగీత సాహిత్య సమ్మేళనం అనీ వాటిని ఆస్వాదించటం మానసిక ఉల్లాసం కలిగి ఒత్తిడి తగ్గుతుంది అన్నారు . యువ కళా వాహిని అధ్యక్షులు లంక లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ చంద్ర తేజ స్వరం భాస్వరం అని, మోహన కృష్ణ అత్యంత ప్రతిభావంతుడైన మిమిక్రీ కళాకారుడు అంతే కాక సమయోచిత వ్యాఖ్యాత అని ప్రశంసించారు. అనంతరం చంద్ర తేజను మోహన్ కృష్ణకు అతిథులు ఆత్మీయ సత్కారం చేశారు సంస్థ నిర్యహకుడు లోకం కృష్ణయ్య స్వాగతం పలికారు

ఓయూ నూతన వీసీ ముందు అనేక సవాళ్లు..

- రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక చేయూత ఇచ్చేనా ?
- వెక్కిరిస్తున్న బోధన ఖాళీలు..
- న్యాక్ లో ఉత్తమ గ్రేడ్ సాధించేనా ?
- అన్యాక్రాంతం అవుతున్న భూముల సంరక్షణ దృష్టి సారిస్తారా ?
- వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న ప్రొఫెసర్లు, ఉద్యోగులు



నవతెలంగాణ-ఓయూ

ఇటీవలే ఉస్మానియా విశ్వవిద్యాలయం నూతన వీసీగా ప్రొ.యం.కుమార్ పదవీ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. అయితే ప్రస్తుతం ఆయన ముందు అనేక సమ స్యలు సవాళ్లు ఉన్నాయి. వాటిని వీసీ ఇప్పుడు ఎంత వరకు ఎలా పరిష్కరిస్తారనేది యూనివర్సిటీలో చర్చనియాం శమైంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎంత వరకు ఆర్థిక సహకారాన్ని ఇస్తూ, వెక్కిరిస్తున్న బోధన ఖాళీలు భర్తీ చేస్తారో అన్నది చూడాలి. వీసీ ముందున్న ప్రధాన కర్తవ్యం న్యాక్ గుర్తింపు. అందుకు ప్రత్యేకంగా కషి చేయాల్సి ఉంది. అయితే ప్రధానంగా యూనివర్సిటీలో ప్రొపెసర్స్ పోస్టులు గణనీయంగా తగ్గిపోవడంతో, దాని ప్రభావం న్యాక్ పై ఎంత వరకు చూపిస్తుందో చూడాల్సిందే.

ప్రొఫెసర్లు, బోధనేతర ఉద్యోగుల సమస్యలు..

1. ఓయూ లో వెక్కిరిస్తున్న బోధన ,బోధనేతర ఖాళీలు తక్షణమే భర్తీ చేయక పోతే వర్సిటీ మనుగడ ప్రశ్నార్థకంగా మారనున్నది. కొన్ని విభాగాలకు ఒక్కరైనా రెగ్యులర్ ప్రొఫెసర్స్ లేక పోవడం శోచనీయం.

2. 2004 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు నియమితులైన ప్రొఫెసర్లు, ఉద్యోగులు సీపీఎస్ (కాంట్రిబ్యూటరి పెంచన్ స్కీమ్) అమలు కోసం ఉద్యమిస్తున్నారు..

3. 2016 - 2020 బోధన సిబ్బందికి యూజీసీ ఏరియర్స్ చెల్లించాల్సి ఉంది. గత పాలకులు సర్వీస్ ఉన్నవారికి ఇవ్వకుండా పదవీ విరమణ చేసిన వారికి ఇవ్వడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

4. కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్స్ గతంలో సంవత్సరానికి 20 సీఎల్‌లు ఇచ్చేవారు. వాటిని గత పాలకులు రద్దు చేశారు. తిరిగి వాటిని ఇవ్వాలని, పే స్లిప్ నెలనెలా ఇవ్వాలని వారు కోరుతున్నారు.

5. నాన్ టీచింగ్ ఉద్యోగులు వార్షిక ఇంక్రిమెంట్లు అమలు చేయాలని కోరుతున్నారు.

విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు

1. గత పాలకులు పెంచిన వివిధ రకాల ఫిజులు తగ్గించాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

2. 100 ఏండ్ల నాటి పలు వసతి గహాల్లో అనేక సమస్యలు నెలకొన్నాయి. వాటిని మరమ్మతులు చేపట్టి, పెరిగిన విద్యార్థినీల సంఖ్య కు అనుగుణంగా వసతి గహాలు నిర్మాణం చేయాలని కోరుతున్నారు.

3. వసతి గహాల్లో ,మెస్‌లలో కనీస సౌకర్యాలు కల్పించడం .నాణ్యమైన ఆహార పదార్థాలు ఇస్తూ ,ప్రధానంగా విద్యార్థినీలకు అన్ లిమిటెడ్ ఆహారం ఇవ్వడం.

4. ట్యూషన్ అండ్ మెస్ ఫీజులు క్రమబద్ధీకరణ చేయడం.

5. యూనివర్సిటీ లో రాజకీయ జోక్యాన్ని తగ్గించడం. యూనివర్సిటీ స్వయం ప్రతిపత్తిని కాపాడటాం

6. నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన రహదారి చట్టపరమైన అడ్డంకులు ఎదుర్కొవాడం .

7. ఓయూలో ఉన్న బస్తీల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఉన్న బస్తీలకు రాష్ట్ర ప్రభుత్వం చొరవతో వారికి పునరావాసం కల్పిస్తు దీనికి ప్రత్యామ్నాయ మార్గాలు వెతకడం.

8. అనవసరమైన నిర్మాణలపై పునరాలోచించడం.

9. గందరగోళనికి కారణమైన సీసీఈ కొనసాగిస్తారా ? లేదా లోటుపాట్లు సవరిస్తారా ? వేచి చూడాల్సిందే.

10. డిజిటల్ కార్యక్రమల నిర్వహణపై పునరాలోచించడం.

11. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుల భారం విద్యార్థులపై పడకుండా చేయడం.

12. స్కిల్ ఓరియెంటెడ్ , ఉపాధిని కల్పనకు కోర్సులు ఏర్పాటు చేయడం.

13. పెంచిన పీహెచ్‌డీ ఫీజులు సరళతరం చేయడం.

14. ఓయూ ఖజానాకు ఆర్థిక భారంగా మారిన సెక్యూరిటీపై పునరాలోచన.

15. తరగతుల నిర్వహణపై ప్రత్యేక దష్టి సారించి , అకడమిక్‌ను బలోపేతం చేయడం.

16. ఓయూలో ఎన్నోకోట్ల విలువైన భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి వాటి సంరక్షణ చర్యలు.

17. ఇక ఓయూ భూముల విషయంలో పలు కోర్టులో ఉన్న పెండింగ్ కేసులు ఓయూ గెలవడం.

18. ఓయూ ఉద్యోగులకు ఆరోగ్య భీమా వర్తించేలా హెల్త్ కార్డ్స్ ఇవ్వాలని కోరుతున్నారు.

19. ప్రభుత్వం నుండి ఫిజు రియంబర్స్ మెంట్స్ రాక పోవడంతో కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికేట్స్ ఇవ్వాలని కోరుతున్నారు.

20. టైం స్కెల్ , కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ చేయాలని కోరుతున్నారు. రెగ్యులర్ ఉద్యోగులతో పాటుగా వీరికి పదవీ విరమణ వయస్సును 61కి పెంచాలని కోరుతున్నారు.

21. ఓయూలో ఔట్ సోర్సింగ్ వ్యవస్థను అండ్ దళారి వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

22. బిల్డింగ్ డివిజన్, యూనివర్సిటీ ప్రెస్ పునరుద్ధరణ కోసం కృషి చేయాలని ఉద్యోగులు కోరుకుంటునారు.

23. ఓయూ ప్రహరీ చుట్టుపక్కల చెత్త పోస్తూ డంపింగ్ యార్డ్ చేస్తున్నారు... దానిని నియంత్రణ చర్యలు చేపట్టకపోతే ఓయూ భూగర్భ జలాలు కలుషితమవుతాయని విద్యార్థులు వాపోతున్నారు.



కాకతీయనగర్‌లో కార్పొరేటర్ పర్యటన

నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ మంగళవారం జలమండలి అధికారులతో కలిసి డివిజన్ లోని కాకతీయ నగర్ లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు డ్రయినేజీ సమస్య తీవ్రంగా ఉందని తెలపడంతో ప్రధాన రహదారిలో ఉన్న హెూటల్స్ ను పరిశీలించారు. హెూటల్ యజమానులు నిర్లక్ష్యంగా వ్యర్థాలు అన్ని డ్రయినేజీలో వేయడం వల్లే చుట్టుపక్కల కాలనీ వాసులకు డ్రయినేజీ సమస్య చాలా ఇబ్బందిగా మారిందని, డ్రయినేజీ వ్యర్థాలు వేయకుండా ఉండాలని హెూటల్ యజమానులను అదేశించారు. డ్రయినేజీ సమస్య లేకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం రజినీకాంత్ , సీనియర్ నాయకులు సంజయ్ పటేల్,అల్కాపురి సురేష్, కట్ట భాస్కర్, పాల్గొన్నారు.



'జోయలుక్కాస్' క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఎంబీఏ గ్రాడ్యుయేట్ల కోసం హ్యూమన్ క్యాపిటల్ డెవలప్మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో జోయలుక్కాస్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ ఆధ్వర్యంలో మంగళవారం సీఎఫ్ఆర్‌డీ భవనంలోని ఈ - క్లాస్ రూంలో క్యాంపస్ రిక్రూట్మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హెచ్‌సీడీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సి.వి. రంజని,హెచ్‌సీడీసీ కోఆర్డినేటర్ డాక్టర్ పి. మురళీధర్ రెడ్డి, జోయలుక్కాస్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ హెచ్ఆర్ అధికారులు హాజరయ్యారు.ప్రొఫెసర్ సి.వి. రంజని , హెచ్ఆర్ అధికారులను, విద్యార్థులను ఆహ్వానించి, విద్యార్థులు ఇంటర్వ్యూ ల కోసం తమ ప్రతిభను అత్యుత్తమంగా ప్రదర్శించాలని సూచించారు. డాక్టర్ పి. మురళీధర్ రెడ్డి విద్యార్థులను అభినందించి, అనంతరం కతజ్ఞతలు తెలిపారు. జోయలుక్కాస్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ నుండి డీజీఎం హెచ్ఆర్ జోసెఫ్ క్రిస్టో , ఇతర హెచ్ఆర్ అధికారులు ముందుగా ప్రీ-ప్లేస్‌మెంట్ టాక్ తో ప్రారంభించి, తదుపరి రౌండ్లలో రిక్రూట్మెంట్ ప్రక్రియను నిర్వహించనున్నారు.

బ్యాలెట్‌తోనే దేశంలో ప్రజాస్వామ్యం సుగమం

- మాజీ కేంద్ర మంత్రి చింతా మోహన్



నవతెలంగాణ-బంజారా హిల్స్

బ్యాలెట్ పేపర్ తో ఎన్నికల నిర్వహించడం ద్వారానే దేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ అన్నారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు.. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంలో దూసుకుపోతున్న అమెరికా వంటి అగ్ర రాజ్యాలు సైతం వారి ఎన్నికలను బ్యాలెట్ విధానంలో నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. దేశంలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియ తీవ్ర ఆందోళన గురిచేస్తున్నదని అన్నారు. ఇటీవల జరిగిన హర్యానా ఎన్నికలతో పాటు దేశంలోని పలు ప్రాంతాలలో జరుగుతున్న ఎన్నికలపై ప్రజలకు అనుమానాలు ఉన్నాయని చెప్పారు. మూసి ప్రక్షాళన పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మంచిదేనని. మేధావులు, ఆయా రంగాల నిపుణులతో విస్తతంగా చర్చించి ముందుకు వెళితే బాగుంటుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అభివద్ధి వైపు అడుగులు వేస్తుండగా ఆంధ్రప్రదేశ్ పరిస్థితి నానాటికి దిగజారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. 40 ఏండ్ల రాజకీయ చరిత్ర ఉందని చెప్పుకునే చంద్రబాబు తిరుపతి లడ్డు విషయంలో తప్పుగా మాట్లాడి ఆయన ఇమేజ్‌ను తగ్గించుకున్నారని అన్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో దేశంలో తీవ్ర అలజడి నెలకొనే ప్రమాదం ఉందన్నారు. పాలకులు ప్రజలకు మెరుగైన పాలన అందించే అంశంపై దష్టి సాధించాలని సూచించారు. దేశంలో పెరుగుతున్న ధరలను తగ్గించి పేదలకు ఆహార ధాన్యాలు తక్కువ ధరలకు అందేలా చూడాలని కోరారు.



శ్మశాన వాటికలను పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ-కంటోన్మెంట్

పాత బోయిన్‌పల్లి అస్మత్ పెట్ హిందూ శ్మశాన వాటికను కార్పొరేటర్ నరసింహ యాదవ్ మంగళవారం పరిశీలించారు అధికారులతో కలిసి శ్మశాన వాటిక సందర్శించారు. అలాగే శ్మశానవాటికలో పిచ్చి మొక్కలు తొలగించి సౌకర్యాలు కల్పించాలని అధికారుల కోరారు. దీపావళి నాడు హిందువులు శ్మశాన వాటికలో వారి పెద్దలకు పూజలు చేస్తారని ఈ నేపథ్యంలో వారికి అసౌకర్యం ఉండకుండా చూడాలని కోరారు. శ్మశానవాటికలో కాంతివంతమైన దీపాలను కూడా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు ఏ ఈ గోవర్ధన్ గౌడ్, ఏఈ ఆశ, శ్రీకాంత్, అరుణ తదితరులు పాల్గొన్నారు.



పూడిక తీత పనులను పరిశీలన

ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ లోని బోయిని చెరువు నాలా పూడికతీత పనులనుమంగళవారం జీహెచ్ఎంసి అధికారులతో కలిసి కార్పొరేటర్ ముద్దం నరసింహ యాదవ్ పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ వైస్ చైర్మెన్ మన్నే ఉదయ్ యాదవ్ ఆశ తదితరులు పాల్గొన్నారు

ముత్యాలమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

- కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్



నవతెలంగాణ-బేగంపేట

కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మంగళవారం ఎండోమెంట్ అధికారులతో కలిసి ముత్యాలమ్మ దేవాలయాన్ని సందర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముత్యాలమ్మ ఆలయ పునర్నిర్మాణ, మరమ్మతుల పనులను ప్రభుత్వ ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ సోమవారం నాడే ప్రారంభించినట్టు తెలిపారు. ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహంపై దాడి బాధాకరమైన విషయమని, దీని వెనకాల ఉన్నవారిని ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తుందని తెలిపారు. దుండగుడి దాడిలో ధ్వంసమైన విగ్రహం స్థానంలో తిరిగి పంచలోహ విగ్రహాన్నీ ప్రతిష్టించాలని బస్తీవాసులు, ఆలయ ఫౌండర్స్, మెంబర్స్ కోరుతున్నారని చెప్పారు. అందరి కోరిక మేరకే ప్రభుత్వం తరపున ఎండోమెంట్ డిపార్ట్మెంట్ సహకారంతో విగ్రహ పున్ణ ప్రతిష్టతో పాటు ఇతర పనులు జరుగుతాయని తెలిపారు. కానీ కొంతమంది రాజకీయాల కోసం బస్తీవాసులతో,టెంపుల్ ఫౌండర్స్, మెంబర్స్‌ను మిస్ గైడ్ చేస్తున్నారని అలాంటిని పట్టించుకోవద్దన్నారు. వారు కూడా అమ్మవారి విషయంలో రాజకీయం చేయడం సరికాదని ఎమ్మెల్యే హితువు పలికారు. ఈ కార్యక్రమంలో బద్రి యాదవ్, సంకి రవీందర్, బల్వంత్ రెడ్డి, శేఖర్ ముదిరాజ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు



దేవాదాయ శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంటోన్మెంట్

దేవదాయ శఖ మంత్రి కొండా సురేఖ, కమిషనర్ శైలజను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ సోమవారం సచివాలయంలో కలిశారు. ముత్యాలమ్మ దేవాలయ పునర్నిర్మాణం పనుల విషయంపై వారు చర్చించారు. జరగబోయే పూజా కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చించి త్వరగా పూర్తి చేయాలని ఆయన మంత్రిని కోరారు.

మహనీయుల పోరాట స్ఫూర్తి పై అధ్యయనం జరగాలి

- ఓయూ వీసీ ప్రొ. కుమార్ ములుగరం



నవతెలంగాణ-ఓయూ

పూలే-అంబేద్కర్ భవనం వద్ద కొమరం భీమ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని ఓయూ వీసీ ప్రొ.కుమార్ తెలిపారు. మహనీయుల పోరాట స్ఫూర్తి పై కతంగా పరిశోధనలు అధ్యయనం జరగాలని అన్నారు. మంగళవారం ఓయూ లోని పూలే- అంబేద్కర్ భవనం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంక్లూజివ్ అండ్ ఎంపవర్మెంట్ స్టడీస్ సెమినార్ హాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సెల్ డైరెక్టర్ ప్రొ. మంగు ఆధ్వర్యంలో కొమరం భీమ్ 123వ జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా వీసీ హాజరై కొమరం భీమ్ అంబేద్కర్ పూలే విగ్రహాలక ుపూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆదివాసీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయాలలో మహనీయుల పోరాట స్ఫూర్తిపై విస్తతంగా అధ్యయనం చెయ్యాలని ఆదివాసి విద్యార్థులకు పిలుపునిచ్చారు. కొమరం భీమ్ పోరాట స్ఫూర్తి ఎందరికో ఆదర్శప్రాయమన్నారు. ఆ మహనీయుని పోరాటాల జ్ఞాపకార్థం రాబోయే కొమరం భీమ్ జయంతి నాటికి పూలే- అంబేద్కర్ భవనం వద్ద కొమరం భీం విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. విశిష్ట అతిథిగా హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే వెడమ్మా బొజ్జు పటేల్ కొమరం భీమ్ చిత్రపటానికి నివాళులర్పించి అనంతరం మాట్లాడారు. కొమరం భీమ్ ఉద్యమ స్ఫూర్తితో అనేక ఉద్యమాలు నిర్వహించి ఖానాపూర్ ప్రజల పక్షాన నిస్వార్థ సేవకునిగా పనిచేసినందుకే నేడు ఎమ్మెల్యేగా మీ ముందు మాట్లాడుతున్నానన్నారు. 12 గ్రామాలను ఏకం చేసి గిరిల్ల సాయిధ పోరాటాలు చేసి జల్, జంగల్, జమీన్ నినాదంతో ఆదివాసి హక్కులు, చట్టాలను మనకు అందించిన మహనీయుడు కొమరం భీమ్ అని అన్నారు. అనేకమంది ఆదివాసుల త్యాగాల ఫలితంగా వచ్చిన హక్కులు చట్టాలను పక్కదారి పట్టించడం పకడ్బందీగా అమలు చేయకపోవడం శోచనీయమని అన్నారు. 1/70, పిసా గ్రామసభ, ఎల్‌టీఆర్ చట్టాలను సక్రమంగా అమలు చేసి హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందనిగుర్తు చేశారు. రాష్ట్రంలో ఆదివాసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కషి చేసేందుకు సుముఖంగా ఉన్నారని అన్నారు. గత పాలనలో ఆదివాసులకు జరిగిన అన్యాయాలను నేటి ప్రజాపాలనలో ఆదివాసి ప్రజలకు అండగా ఉండేందుకు కషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఆదివాసీ విద్యార్థులు ఉన్నత విద్య వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఓయూ రిజిస్టార్ ప్రొ.పి. లక్ష్మీనారాయణ,యూజీసీ డిన్ ప్రొ. జి మల్లేశం, బీసీ సెల్ డైరెక్టర్ ప్రొ.మంగు, చలామల వెంకటేశ్వర్లు, మైనార్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ సయ్యద అజీమ్ ఉన్నిసా, ఆదివాసీ ప్రొఫెసర్లు ప్రొఫెసర్ రేగా రాజేందర్, ప్రొ. ఆప్కా నాగేశ్వరరావు, ప్రొ. గుమ్మడి అనురాధ, ఆదివాసి పరిశోధక విద్యార్థులు సొగబోయిన పాపారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై బంజారాహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు



నవతెలంగాణ-బంజారాహిల్స్

సీఎం రేవంత్ రెడ్డి ఉన్నత పదవిలో ఉండి చేసిన వ్యాఖ్యలు అభ్యంతరకరమని, వెంటనే ఆయనపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ మాజీ కార్పొరేషన్ చైర్మెన్‌లు కోరారు. ఈ మేరకు మంగళవారం బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌తో పాటు మాజీ కార్పొరేషన్ చైర్మెన్‌లు ఎర్రోళ్ల శ్రీనివాస్,గెల్లు శ్రీనివాస్,దూది మెట్ల బాలరాజ్ యాదవ్, రాజీవ్ సాగర్, రామచంద్ర నాయక్, ఎండీ ఇంతియాజ్,కిషోర్ గౌడ్,మన్నే గోవర్ధన్ రెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ...ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న రేవంత్ రెడ్డి తమ నాయకులు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులను బెదిరిస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తూ చేస్తున్న వ్యాఖ్యలు భయం గొల్పేలా ఉన్నాయని, తెలంగాణ సమాజానికి ఇవి తీవ్ర అభ్యంతరకరమన్నారు. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పరిశీలన చేసుకొని వాటిని వెనక్కి తీసుకోవాలని కోరారు. తమ నాయకులకు ఎలాంటి హాని కలిగినా కాంగ్రెస్ నాయకులు. సీఎం రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలన్నారు. ఓ బాధ్యతయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం దేనికి సంకేతం అంటూ ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బంజారా హిల్స్ పోలీస్ స్టేషన్‌కు పెద్ద ఎత్తున తరలివచ్చి ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలగవద్దనేదే తమ అభిమతం అని, పది సంవత్సరాల పరిపాలనలో ఒక్క చిన్న ఘటన కూడా చోటు చేసుకోకుండా కేసీఆర్ ఆధ్వర్యంలో పాలన కొనసాగిందని గుర్తు చేశారు. పోలీసు అధికారులను వాడుకొని నిరసనలను అణిచివేయలేరని తెలంగాణ ఉద్యమాల పురిటిగడ్డ ఉద్యమాలతోనే స్వరాష్ట్రం సంపాదించుకున్న విషయాన్ని సీఎం మర్చిపోవద్దని తెలిపారు.

త్వరలోనే అమ్మవారి నూతన విగ్రహం ప్రతిష్టాపన

- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-బేగంపేట్

ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి నూతన విగ్రహాన్ని త్వరలోనే ప్రతిష్టించనున్నట్టు మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయం లో ప్రముఖ దేవాలయాలకు చెందిన పలువురు పండితులు, పలువురు కుమ్మరి బస్తీ వాసులతో సమావేశం నిర్వహించారు. అనంతరం కుమ్మరిగూడ కు పండితులతో కలిసి వెళ్ళి బస్తీ వాసులతో మాట్లాడారు. తర్వాత అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమ్మవారి విగ్రహం ధ్వంసం చేయడం చాలా బాధాకరమని, దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రశాంతంగా ఉన్న సికింద్రాబాద్ ప్రాంతంలో సంఘటన జరిగిన నాటి నుంచి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని విచారం వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులకు ముగింపు చెప్పాలని, ప్రశాంత వాతావరణంలో ప్రజలు జీవినం సాగించాలనేది తమ ఉద్దేశం అని అన్నారు. బస్తీవాసుల శ్రేయస్సును దష్టిలో ఉంచుకొని పండితుల సూచనలు, సలహాల మేరకు నూతన అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, కుంభాభిషేకం, మూడు రోజుల పాటు శాంతి పూజలు, హెూమాలను నిర్వహించనున్నట్టు చెప్పారు. బస్తీ వాసులు ప్రతి ఇంటి నుంచి అమ్మవారికి బోనాలు సమర్పిస్తారని తెలిపారు. ఎలాంటి రాజకీయ ప్రమేయాలకు అవకాశం లేకుండా పూర్తిస్థాయిలో బస్తీవాసుల సమక్షంలోనే పూజా కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. అమ్మవారి విగ్రహం ప్రతిష్ట, పూజల తేదీలను త్వరలోనే నిర్ణయించి ప్రకటించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మోండా మార్కెట్ మాజీ కార్పొరేటర్ ఆకుల రూప, ఆలయ ట్రస్టీ సభ్యులు కిరణ్, కిషోర్, మహేష్, ఎల్లేష్, సాయి, బస్తీ వాసులు మురళి, రవి, సునీత, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరికష్ణ, నాయకులు తలసాని స్కై లాబ్ యాదవ్, నాగులు, రాములు, మహేష్ యాదవ్, సత్యనారాయణ, జయరాజ్, పార్టీ డివిజన్ అధ్యక్షులు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, వెంకటేషన్ రాజు, నాయకులు ఏసూరి మహేష్, శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మీపతి, ప్రేమ్, శ్రీహరి తదితరులు ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఆటో యూనియన్ హైదరాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు కొమురెల్లి బాబు



నవతెలంగాణ-ఓయూ

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆటో యూనియన్ హైదరాబాద్ జిల్లా మాజీ అధ్యక్షులు కొమురెల్లి బాబు డిమాండ్ చేశారు.వివిధ కారణాలతో మరణం పొందిన ఆటో డ్రైవర్లకు సంతాప సభను మైలార్ గడ్డ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో దూద్ బావి కమ్యూనిటీ హాల్లో మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సభకు మైలార్ గడ్డ ఆటో యూనియన్ అధ్యక్షులు జోగు రాములు అధ్యక్షత వహించగా కొమురెల్లి బాబు మాట్లాడుతూ మరణించిన ఆటో డ్రైవర్లు నరహరి, వెంకటయ్య, కొమురయ్య, నూర్ భాయ్, రవి, సాగర్, రమేష్ వీరంతా ఆటో యూనియన్ రంగంలో క్రియాశీలకంగా పని చేశారని తెలిపారు. వారి మరణం ఆటో యూనియన్ కు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు.పదేండ్లుగా ఆటో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఎన్ని విధాలుగా డిమాండ్ చేసినా గత ప్రభుత్వం ఈ ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. సంక్షేమ బోర్డు ఉంటే ఇవాళ ఆ కుటుంబాలకు బోర్డు నుంచే వచ్చే బెనిఫిట్స్ పొందేవారని ఆ కుటుంబాలకు ఆసరాగా ఉండేదన్నారు. పెద్దదిక్కు కోల్పోవడం వల్ల ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఇప్పటికైనా ఇలాంటి కుటుంబాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తక్షణమే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో అమరుల కుటుంబ సభ్యులు,ఆటో యూనియన్ నాయకులు రమేష్, చందర్, నరేష్, పెద్ద కుమార్, గడ్డం యాదగిరి, బిక్షపతి, పంగ శీను నాయకులు పాల్గొన్నారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం : జాజుల



నవతెలంగాణ-ఓయూ

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతోందనిబీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. బీసీలకు జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు పెంచాలనీ కోరుతూ ప్రధాని మోడీ కి ఈ మెయిల్ ద్వారా లేఖ పంపినట్టు ఆయన తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడారు. డీఎస్సీ టీచర్ పరీక్షల్లో ఎక్కువ మార్కులు వచ్చిన బీసీలకు ఉద్యోగాలు రాకుండా, అతి తక్కువ మార్కులు వచ్చిన అగ్రవర్ణాలకు ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు బీసీలకు ఉరితాడుగా మారాయన్నారు. ఉదాహరణకు నాగర్ కర్నూల్ జిల్లాలో జరిగిన డీఎస్సీ 2024 పరీక్షల్లో ఎస్జీటీ ఉద్యోగాల్లో ఓసీ వారికి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఉండడంవల్ల మహిళా విభాగంలో 62.97 మార్కులకు కటాఫ్ అయితే అదే బిసి.డి విభాగం మహిళలకు 69.43 కటాఫ్ మార్కులని అన్నారు. ఇక్కడ 7 మార్కుల వ్యత్యాసం ఉందని, అదే పురుషుల విభాగంలో ఓసీ అభ్యర్థికి 61.87 కటాఫు అయితే బీసీ.డీ అభ్యర్థికి 70.30 కట్ ఆఫ్ మార్క్స్ అని ఇక్కడ 9 మార్కుల వ్యత్యాసం ఉందని విచారం వ్యక్తం చేశారు. ఈ రిజర్వేషన్లు ఇలాగే కొనసాగితే బీసీలకు అన్ని రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
11
హైదరాబాద్
HMDA
బుధవారం | అక్టోబర్ 23, 2024 | www.navatelangana.com

'రవాణాశాఖ'కు మెగా పవర్ స్టార్ రామ్ చరణ్

● స్వాగతం పలికిన జేటీసీ రమేష్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మంగళవారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయాన్ని సందర్శించారు. తన వ్యక్తిగత నూతన వాహనం రోల్స్ రాయిస్ స్పెక్ట్రీ లిమిటెడ్ ఎడిషన్(ఇంపోర్టెడ్) రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ఆయన్ను హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) సి.రమేష్ ఘన స్వాగతం పలికారు. అనంతరం రామ్ చరణ్ కొత్త వాహనం సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను జేటీసీ దగ్గరుండి నిబంధనలకు మేరకు పూర్తి చేశారు. ఈ సందర్భంగా రవాణాశాఖ అధికారులు ఆయన వాహనానికి టీజీ09 సీ 2727 నెంబర్ కేటాయించారు. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ఆర్టీఏ కార్యాలయానికి వచ్చిన విషయం తెలుసుకున్న ఆయన అభిమానులు పెద్దఎత్తున అక్కడికి తరలివచ్చారు. వెంటనే అప్రమత్తమైన రవాణాశాఖ సిబ్బంది, ఆయన వ్యక్తిగత భద్రతా సిబ్బంది అభిమానులను కంట్రోల్ చేశారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి డీటీసీ చంద్రశేఖర్ గౌడ్, ఆర్టీవోలు పురుషోత్తం రెడ్డి, రవీందర్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



పార్కుల పరిశుభ్రత అటకెక్కింది

● వ్యర్థాల పారవేతతో అస్తవ్యస్తం..
● పార్కులో వెళ్లాలంటే భయం భయం
● వేళ్లేది వాళ్లు మాత్రమే..

నవతెలంగాణ-బంజారా హిల్స్

హైదరాబాద్ నగరంలో పార్కుల అభివృద్ధికి ప్రత్యేక ప్రతిపాదికన బడ్జెట్‌లు కేటాయించి అద్భుతమైన గ్రీనరీ, జిమ్ సామాగ్రి కోట్ల రూపాయలను ఖర్చు చేస్తోంది. అయితే భారీగా ప్రారంభోత్సవాలు శిలాఫలకాల సమయంలో లేదా ఉన్నత అధికారులు వచ్చినప్పుడు మాత్రమే మెప్పు పొందడానికి పార్కులను శుభ్రపరచడం తప్ప నిత్యం దుర్గంధపు వాసన వెదజల్లుతున్నా పట్టించుకోరు. ప్రధాన గేటులు విరగొట్టి జిమ్ము సామాగ్రి పూర్తిగా ధ్వంసం చేసి దాన్ని అమ్ముకున్నా అడిగే నాథుడు లేడు. బంజారా హిల్స్ రోడ్ నెంబర్ 10 గౌరీ శంకర్ కాలనీ పార్కులో కనిపిస్తున్న దృశ్యాలు ఇవి.

ఖైరతాబాద్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల పరిధిలో ఉన్న ప్రభుత్వ, ప్రయివేటు ఖాళీ స్థలాల్లో వ్యర్థాలే దర్శనమిస్తాయి. పార్కులో వాకింగ్ ట్రాక్‌లో వాకింగ్ చేయడానికి వీలు లేకుండా పెరిగిపోయిన పిచ్చి మొక్కలు, ఎలుకలు, పాముల భయంతో పాటు రాత్రయిందంటే మందుబాబుల అడ్డాగా మారిన పార్క్ స్థలం, జిమ్ము సామాగ్రి ఎవరు తీసుకెళ్లారో? ఎవరికీ తెలీదు, కూర్చునే సిమెంటు కుర్చీలు సైతం విరగగొట్టిన దృశ్యాలు దర్శనమిస్తాయి. బస్తీ వసులకు అన్ని రకాలుగా వినియోగించుకోవడానికి వీలుగా ఉన్న అరఎకరం స్థలంలో ఉన్నాయి. పార్కు అభివృద్ధి అటు ఉంచితే పార్కు నలుమూలల వ్యర్థాలు మాత్రం ట్రక్కులు నిండడం ఖాయం. స్థానికంగా నివసించే ప్రజలందరూ ఇష్టానుసారంగా పార్కులో వ్యర్థాలు పారవేయడంతో డంపింగ్ యార్డ్ మారింది. ప్రతి రెండో ఆదివారం స్వచ్ఛత పేరుతో గతంలో మన చుట్టూ ప్రాంతాలు శుభ్రం చేసుకోవాలని ఓ నినాదం





ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వం జీహెచ్ఎంసీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు పరిశుభ్రతపై అధికారుల నిరంతర పర్యవేక్షణలో కొనసాగుతున్నా యి. సోమవారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ జయంతితో కలిసి సర్కిల్ 18 లో పర్యటించిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి, గార్బేజ్ వాల్నారేబుల్ పాయింట్స్ (జీవీపీ) లను తొలగించి ఆప్రాంతాలను గార్బేజ్ ఫ్రీ సర్కిళ్ల గా మార్చాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో కలిసి ఆయన కెబిఆర్ పార్కు, శ్రీరాంనగర బస్తీ, రోడ్ నెంబర్ 35, యూసుఫ్ గూడ ప్రాంతాల్లో శానిటేషన్ పనులపై ఆకస్మికంగా తనిఖీ చేశారు. జీవీపీ రహిత సర్కిల్‌గా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛ ఆటోలు ఇంటింటికి చెత్త సేకరణ 100 శాతం జరగాలని కమిషనర్ శానిటైజేషన్, ఏఎమ్‌హెచ్ఓనూ ఆదేశించారు. యూసుఫ్ గూడ ఎస్.టి.పి పరిశీలించి 25 టన్నుల వాహన సామర్థ్యాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతకు ముందు డీఎంసీ రజినీకాంత్ రెడ్డి, ఈ ఈ విజయ్ కుమార్లతో కలిసి జూబ్లీ హిల్స్ డివిజన్ పరిధిలోనీ పార్క్ లో పర్యటించి అభివృద్ధికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇంత పటిష్టంగా ముందుకు వెళుతున్న సమయంలో



ఒకపక్క చూసి మరోపక్క చూసి చూడనట్టుగా అధికారులు వ్యవహరిస్తున్నారని స్థానికుల నుండి విమర్శలు గుప్పిస్తున్నారు. అధికారులకు స్థానిక బస్తీ కమిటీలు ప్రజా ప్రతినిధుల ద్వారా పలు మర్లు ఫిర్యాదులు చేసిన ఫలితం లేకపోయింది. అధికారులు జీహెచ్ఎంసీ పార్కులు ప్రత్యేకంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ప్రతి బస్తీలో ఉన్న పార్కులో దుస్థితి ఇలాగే ఉంది. ప్రధాన రహదారి ఉన్న పార్కులు తప్ప జన నివాసాల్లో ఉన్న పార్కులన్నీ వ్యర్థాలతో నిండిపోయిన్నాయి.

సమాజాన్ని మేల్కొల్పిన నాటక రంగం

● కేఎల్ శతజయంతి ముగింపు సభల్లో వక్తలు

నవతెలంగాణ-కల్చరల్

సమాజంలో విలువల నిర్మాణం సాహిత్య సాంస్కృతిక కళా రంగాల ద్వారానే నిర్మితమవుతుందని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మెన్ జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. గురజాడ కన్యాశుల్కం నాటకం దగ్గర నుంచి కేఎల్ నరసింహారావు విప్లవ శంఖం నాటిక వరకు సమాజంలోని దురాగతాల్ని వెలికితీస్తూ అద్భుతమైన నాటకాలువచ్చాయని చెప్పారు. తెలుగు యూనివర్సిటీలో మంగళవారం సాయంత్రం కోదాటి లక్ష్మీ నరసింహారావు కేఎల్ జయంతి ఉత్సవాలు ముగింపు సభలు నిర్వహించారు. సభకు అధ్యక్షత వహించిన జూలూరు మాట్లాడుతూ తెలంగాణ మాండలిక తొలి నాటక రచయితగా కేఎల్ చరిత్ర చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. మునగాల పరగణ రేపాల గ్రామంలో గ్రామ వెలుగు నాట్య కళామండలి ద్వారా కేఎల్ సంవత్సరాల తరబడి నాటక ప్రదర్శనలు కొనసాగించి తెలుగు నాటక రంగానికి ఊపిరి పోశారని కేఎల్ లాంటి మహనీయుల శత జయంతి సభ జరుపుకోవడం సమాజం తనను తాను సత్కరించుకున్నట్లే అవుతుందని తెలిపారు. విశిష్ట



అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ సురభివానీ దేవి మాట్లాడుతూ సమాజంలో అన్యాయాలను నాటకాల ద్వారా చూపెట్టారని ఆనాటి నాటకాలను విశ్లేషించారు. గత కాలాన్ని విలువలతో నడిపించిన చరిత్ర నాటక రంగానికి ఉందన్నారు. నాటకం విస్తృత రూపమే నేటి సినిమా రంగమని తెలిపారు. ఈ సభలో అంతర్జాతీయ నటులు దర్శకులు గుమ్మడి గోపాలకృష్ణ సీనియర్ నటులు దర్శకులు బాసాని మర్రెడ్డి సంగీత నాటక అకాడమీ పూర్వ చైర్మెన్ శివకుమార్ చిలువేరు రఘురాం, తడకమళ్ళ రామచంద్రరావు కేఎల్ కుమారుడు కోదాటి వెంకట రమణ, కోదాటి అరుణ, అంజిరెడ్డి తదితరులున్నారు.

ఫీజు బకాయిలకు నిధుల్లేవు.. మూసీ సుందరీకరణకు ఎక్కడివీ



● రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-మెహిదీపట్నం

విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించేందుకు ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవు కానీ మూసీ సుందరీకరణకు లక్షయాభై వేల కోట్ల రూపాయలు ఇక్కడి నుండి తెస్తారని రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విద్యార్థుల ఫీజు బకాయిలు విడుదల చేయాలని కోరుతూ వందల మంది విద్యార్థులతో మెహిదీపట్నంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి పది నెలలైనా విద్యార్థుల ఫీజుల బకాయిలు విడుదల చేయలేదని విమర్శించారు. ఫీజుల బకాయిలు విడుదల చేయకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకపోవడంతో వారు పైచదువులకు దూరమవుతున్నారన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యార్థులు ఫీజుల బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, బీసీ విద్యార్థులకు మునుపటి లాగా ప్రభుత్వం మొత్తం ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకపోతే మరో ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నీలా వెంకటేష్, గుజ్జ కృష్ణ, పృథ్వీ గౌడ్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ పరిశీలన

నవతెలంగాణ-సిటీబ్యూరో

దుండిగల్‌లోని గండిమైసమ్మ మండలం సర్వే నెంబరు 453, 454లో గల ప్రభుత్వ స్థలాన్ని మంగళవారం మేడ్చల్-మాల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తనిఖీ చేశారు. అనంతరం గండిమైసమ్మ మండలంలోని ఎంఎల్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కాలేజీలో గ్రూప్ -1 పరీక్ష ఏర్పాట్లను పరిశీలించారు.



ఆధునిక భగీరథ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి

నవతెలంగాణ-కల్చరల్

భగీరథుడు ఆకాశ గంగను భూమార్గానికి తెచ్చారని పురాణ కథనం కాగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య కర్ణాటక తెలంగాణ ప్రాంతాలలో ప్రాజెక్ట్‌ల రూప కల్పనతో నీటి వనరులు ప్రజలకు అందించి ఆధునిక భగీరథగా పేరు తెచ్చుకున్నారని ప్రముఖులు పేర్కొన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా మోక్షగుండం విశ్వేశ్వరయ్య యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది. ప్రధాన వక్తగా పాల్గొన్న ప్రముఖ గాయకుడు త్రినాథ రావు మాట్లాడుతూ నైజాం నవాబు విశ్వేశ్వరయ్య సలహా సూచన ల మేరకు మూసీ నది పై వరదలకు అడ్డుకట్టగా ప్రాజెక్టు నిర్మించారని గుర్తు చేశారు.



అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య రూప కల్పన చేసిన ప్రాజెక్ట్‌లు నేటికీ వినియోగంలో వున్నాయని ఆయన భారీ ప్రాజెక్టు ల నిర్మాణంలో దార్శనికుడు అని చెప్పారు. వేదికపై కాంగ్రెస్ నాయకులు శ్రీ మణి గాన సభ పాలక మండలి సభ్యురాలు గుండవరపు గీతా దేవి పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE VII JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT, HYDERABAD.
I.A.No:04 of 2024
In
O.S.No:2504 of 2021

Between:
G.Sumanth Kumar ...Petitioner/plaintiff
And
D1.Smt.G.Sujatha W/o.G.Veeraiah
D2.Sri.G.Hemanth Kumar S/o. G.Veeralah
D3.Smt.Bhuvanagiri Tuljamma D/o.G.Veeraiah
D5.G.Veeraiah S/o.G. Ashappa
D1 to D3 and D5 all R/o.H.No.8-3-229/D/31, Fourth Floor, Venkatagiri Yousufguda, Hyd-45,
...Respondent/Defendants D1 to D3 & D5.

Please take the notice that the above mentioned Petitioner / Plaintiff have filed IA.No.04 of 2024 In OS No.2504 of 2021 before the Hon'ble Vth SENIOR CIVIL JUDGE, City Civil Court, At Hyderabad as detailed in the I.A.PETITION FILED UNDER SECTION 5 OF LIMITATION ACT. to condone the delay of 233 days occasioned in filing petition under Order IX Rule 9 C.P.C., in the interest of Justice. The above matter stands posted to 14-11-2024, if any person/persons have any claim, interest or title etc,. of whatsoever nature in and over the above said matter, he/ they may appear before the above mentioned Court at 10.30 AM, failing which the matter will be heard and decided in your absence holding you responsible for all costs and consequences thereof.

(BY ORDER OF THE HON'BLE COURT)
ANIL KUMAR YADAV.B
Advocate at High Court for the State T.G., INDIA,
Off: 11-2-907/908, Habeeb Nagar, Near Bazar Ghat X Road), Nampally, Hyderabad-500001, T.G
+91-9441887028, 8790100159

PUBLIC NOTICE

The public in general here by inform that my client had filed a suit for declaration B.SHARADHA BAI W/o.Late.B.Manohar Lal Aged about 53Yrs Occ: House wife R/o. H.No:13-2-317/3, Aram Ghar Colony, Near Jalihanuman Rahimpura, Asifnagar Hyderabad Telanagana 500 006. 2.B.Mukesh Lal S/o. Late B.Manohar Lal Aged about 36 Years Occ: R/o.H.No:13-2-317/3, Aram Ghar Colony, Near Jalihanuman Rahimpura, Asifnagar, Hyderabad Telanagana 500 006. B. Sneha D/o.Late B.Manohar Lal. Aged about 33 Years Occ: Private R/o.H.No: 13-2-317/3, Aram Ghar Colony, Near Jalihanuman Rahimpura, Asifnagar, Hyderabad Telanagana 500 006. praying the hon'ble court to declare them as legal heir of late. B.Manohar lal H No: 13-2-317/3, Aram Ghar Colony, Near Jalihanuman Rahimpura, Asifnagar, Hyderabad in Os.no. 4357/2024 on the file of the hon'ble IX Junior civil judge CCC Hyderabad posted to 11.11.2024, It is further inform to general public having in a right claim over the declaration may approached the hon'ble, court otherwise it is deem and confirm no right and claim over declaration is all set to proceed further and court may pass appropriate orders.

//By order of the Court //
DHARMENDER PRASAD
ADVOCATE
R/o.H.No.6-1-95/59, Plot No.59, Near Foot Ball Ground, Anitha Enclave, Yapral Malkajgiri, Hyderabad-500087

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE- CUM-XIV ADDL JUDICIAL FIRST CALSS MAGISTRATE, R.R.DISTRICT, AT HAYATHNAGAR.
O.S.No. 599 of 2022

Between:
Jakka Shailaja Reddy and another ...Plaintiff
And
Shameem Begum ...Defendant

To, Shameem Begum w/o Mir Mohsin Ali, Aged about 56 years, Occ: Housewife, R/O Plot No. 22 near Jahanuma Play Ground, Jahanuma Colony, Falaknuma, Hyderabad - 500 053. ...Defendant

Take notice that the above suit is filed by the Plaintiffs against you for specific performance of the agreement of sale dated 16-10-2006 before the afore mentioned court and the same is posted on 07-11-2024 for your appearance, and written statement if any, Hence, you are hereby directed to appear before the above said court on **07-11-2024** at 10:30 AM either in person or through an advocate duly authorized, otherwise, the matter will be decided ex-parte on the record available.

// By order of the Court //
Sd/-
R.VENKATRAM REDDY
Advocate
H.No. 11-7-174/A, Plot No B-31, Road No-7, HUDA Colony, Saroornagar, R.R. District-500035.

IN THE COURT OF THE HON'BLE II ADDL. SENIOR CIVIL JUDGE, R.R.DISTRICT AT: L.B.NAGAR.
O.S.No.965 of 2017.

Between:
G.Suvarna And others ...Plaintiffs
AND
G.Chinna Lakshamma & Others ...Defendants

To,
D7)Rokkam Janardhan Reddy, S/o.Penta Reddy, Aged about 61yrs, occ:Agril, R/o.Gandicheruvu Village, Hayath Nagar Mandal, R.R.District.
D8)V.Govinda Rao, S/o.Late. Manikyam, Aged about 95 yrs, Occ:Private Service, R/o. Flat No. 301/B, Central Park Apartment, Balkampet, Hyderabad.

Please take notice that the Plaintiff herein filed the above suit against you for partition and Declaration to declare the Regd. Deed bearing No's.3343 of 1995, 712 of 1998, 8566 of 2001 & 8860 of 2003 are null and void. The above case is posted to 04-11-2024 for your appearance.

Therefore your hereby informed to appear before the Hon'ble II Addl. Senior civil Judge, R.R. District, on 04-11-2024 at 10.30 A.M, either in person or through an Advocate, otherwise, the matter will be decided in your absence as exparte.

SUITSCHEDULE PROPERTY

All that Agricultural land admeasuring Sy.no.200, Ac. 3-00 guntas situated at Koheda Village, Abdulla purmet Mandal, (The then Hayath nagar mandal) Ranga Reddy District and bounded by:
NORTH: Road.
SOUTH: Land Of Jakka Krisnha Reddy.
EAST: Land In Sy.Nos. 197 & 199.
WEST: Part Of land in Sy.No.200.

(BY ORDER OF THE COURT)
G.SUDHAKAR REDDY,
Advocate
Plot No. 131, Sairam Nagar Colony, Champapet, Hyderabad-79 Mobile No.9848470673
Counsel for the Plaintiff.

IN THE COURT OF THE HON'BLE PRL.DISTRICT JUDGE MEDCHAL MALKA.IGIRI DISTRICT AT: KUSHAIGUDA.
G.W.O.P.No.91 Of 2024

BETWEEN:
Smt.Valishetty Sudhakar & others ...Petitioners
AND
Smt.Valishetty Keerthi Soumya & others ...Respondents

To
All Concerns ...Defendants

Please take notice that the plaintiff 1)V.Sudhakar, have instituted the above suit for To Grant Permission to Sell the Minor'Property and the same is posted to 18.11.2024 at 10.30 A.M. if anybody not appeared and filed any objection before the Hon'ble Court on 18.11.2024 at 10.30 A.M. the matter will decided on merits.

(BY ORDER OF THE HON'BLE COURT)
V.V. RAMANA & T.SWAMI, Advocates
Flat No. G-1 & G-2, Mani Plaza, H.No. 6-2-101/7/A&B, New Bhoiguda, Secunderabad–500 003.

IN THE COURT OF THE HON'BLE IX ADDL. DISTRICT JUDGE R.R.DISTRICT: AT: L.B.NAGAR
I.A.No.121 OF 2024
IN
O.S. No.1189 OF 2022

Between:
Baddam Surender Reddy ...Petitioner/Plaintiff
AND
M.Ramulu & (3) Others ...Respondents/Defendants
AND
Ramesh Ponugoti & (2) Others ...Respondent/Prop.Defts.No.5 to 7

NOTICE

To,
D5] Ramesh Ponugoti, S/o. Ramaiah Ponugoti, Aged about 54yrs, Occ.:Business, R/o. Villa No.35, Gandipet, R.R.Dist-500075.

Please take notice that the Plaintiff herein had filed the above suit seeking the relief of specific performance of the agreement dt.07.11.2012 in respect of the suit Schedule property against the Defendants herein and the said matter is posted to 20.11.2024 for your appearance.

Hence, you are requested to appear before the above said Hon'ble Court at 10:30 a.m. on the said date either personally or through your authorized Counsel for submitting your claim or otherwise the matter will be adjudicated as per law. Hence, this notice.

(BY ORDER OF THE COURT)
AKULA MAHESH KUMAR
K.MADHAVA REDDY
Advocates
Flat No.206, 2nd Floor, Indra Dhanush Apartments, Beside Axis Bank, Road No.2, Banjara Hills, Hyderabad-034.Cell: 98489 33536

IN THE COURT OF THE HON'BLE CHIEF JUDGE CITY CIVIL COURTS: AT: HYDERABAD
O.P.No.1143 OF 2024

Between:
Babu Sunitha and another ...Petitioner
AND
Nagnath Maroti Waghmode and others ...Respondents

NOTICE

To
3.Gorre Harish S/o.Rajaiah, Aged about: 26yrs, Occ: Employee, R/o. H.No.8-149/E/2, Prasanna Nagar, Chintal, Balnagar, Medchal, Ranga Reddy Dist.

Sir,
Please take notice in above case, above named petitioners have filed a claim application claiming compensation against owner, Insurance Company, and you as one G.Manasa@ Babu Manasa was involved in road accident and she died. The said matter is posted for your appearance on 30-10-2024.

Hence, make it convenient to appear in above mentioned court on the above mentioned date 10:30 a.m. in person or through an Advocate otherwise the matter will be decided in your absence accordingly.

(BY ORDER OF THE COURT)
M/S.KASIREDDY JAGATHPAL REDDY AND ASSOCIATES,
Advocates,
H.No.3-4-491/1, I Floor, Barkatpura, Hyderabad.
Counsel for the Petitioners

IN THE COURT OF THE HON'BLE V ADDITIONAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS CUM V AJCJ R.R.DIST: AT: L.B.NAGAR
O.S.NO.732 OF 2023

Between:
Canara Bank, Dilsukhnagar Branch. ...Plaintiff.
And
Smt.Chilakhani Shobha Reddy, ...Defendant.

To,
Smt.Chilakhani Shobha Reddy, W/o.Sri.Chilakhani Indra Reddy Aged about 40yrs, Occupation Business, R/o.H.No.8-5-283/20, Defence Colony, Opp: Govt. High School, Madhava Nagar, Bairamalguda, Karmanghat, Saroornagar, K.V.Ranga Reddy District, Telangana State-500079

Please take Notice in the above O.S.No.732 of 2023, that the above suit filed by Plaintiff Bank i.e., Canara Bank, Dilsukhnagar Branch against you i.e., Defendant Smt. Chilakhani Shobha Reddy for Recovery of a sum of Rs.7,62,547/- and the Hon'ble Court directed to you are hereby summoned to appear in the above Hon'ble court on 28/11/2024, at 10.30 am either in person or by a pleader duly instructed failing which the case will be heard in your absence and decided on merits.

//By order of the Hon'ble Court//
P.Ravinder
Advocate,
Off: H-NO: 16-11-577/1/A, Flat No. 303, Sri Shakthi Homes, 'A'- Block, Gaddiannaram, Dilsukhnagar, Hyderabad - 500060.
Ph Nos: 9848073618,
Office No: 040 35949164

IN THE COURT OF HON'BLE CHIEF JUDGE COURT, CITY CIVIL COURT AT: HYDERABAD
A.R.O.P.No.19000 OF 2024

BETWEEN:
M/s Life Span Private Limited, Mfg. Unit Plot No.49, Phase – III Biotech Park, Karakapatla (Village), Markook Mandal, Siddipet District, Telangana. Represented by its Authorized Signatory Bhandaram Gopi Krishna. ...Petitioner/Respondent
AND
1.M/s Sanitech Engineers & Consultants Pvt Ltd., Having its registered office at Door No. 8-2-686/K/15, 4th Floor, Road No.12 Banjara Hills, Hyd– 500034. Represented by its Managing Director Sri Amit Sharma. ...Respondent/Claimant
2.Sri.G.Bhoopathi Reddy, District Judge (Retd) Sole- Arbitrator, House No.2-2-1075/22, Bagh Amberpet, Hyderabad-500013, Telangana State. ...Respondent/Arbitrator

To,
1.M/s Sanitech Engineers & Consultants Pvt Ltd., Having its registered office at Door No. 8-2-686/K/15, 4th Floor, Road No.12 Banjara Hills, Hyd-500034. Represented by its Managing Director Sri Amit Sharma.
2.Sri.G.Bhoopathi Reddy, District Judge (Retd) Sole- Arbitrator, House No.2-2-1075/22, Bagh Amberpet, Hyderabad - 500013, Telangana State.

Whereas the above-named Petitioner has filed the above case filed An appeal under Section 34 of the Arbitration and Conciliation Act and along with the said appeal the petitioner herein has applied to Section 34(3) of the Arbitration and Conciliation Act 1996 to condone the delay 6 days.

Whereas the Hon'ble court after hearing the matter directed to publish notice and posted the matter to 20/11/2024 for your appearance If you fail to appear either in person or through an advocate on the above said date and time at 10:30 am before the Hon'ble Court the matter will be heard and decided by Exparte.

//By order of the Court//
Ch Shanthi Vidhya Sagar
Sandha Saikiran Sagar
Advocates
at # Plot No. 92, 5th floor, Road No.1, Jubilee Hills, Hyd-500033.
Cell No. 9397656297

IN THE COURT OF THE HON'BLE ADDL JUNIOR CIVIL JUDGE RANG REDDY DISTRICT AT: HAYATHNAGAR
O.S.No. 538 of 2021

Between:-
Dangatla Sarva Reddy ...Plaintiff
And
1.Syed Meeran and others ...Defendants

To,
1.Syed Meeran S/o.Syed Imam Aged about 73 years Occ: Business R/o. Malakpet, Hyderabad.

NOTICE

Whereas the above named plaintiffs have filed suit for DECLARATION,TO DECLARE THE REGD. SALE DEED BEARING DOCUMENT No.244/2007 DATED 20-10-2007 AS NULL & VOID AND Perpetual Injunction against you and others in respect of Suit Schedule Property. That the Hon'ble court posted the matter on 30-10-2024 for you apperance on The said case is posted for any claims or objections from any concerned. Hence, if any persons is/are having any claims or objections they may be appear before this Hon'ble court on **30.10.2024** at 10.30 AM, either in person are through an advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.

// By Order of the court //
(M/s.C.RAJESHWAR REDDY)
E.SHYAM SUNDER REDDY
Advocates
O/o.Flat No.502, Vijaya Sudha Enclave, beside M.G.Law College, Chitra Layout, L.B.nagar, Hyderabad-074.
Cell no 8341670990

IN THE COURT OF THE HON'BLE V ADDL. DISTRICT JUDGE, R.R. DISTRICT AT: L.B.NAGAR
I.A.No.1213 of 2019
In
O.S.No.373 of 2019

Between:
1.Anthati Srikanth Goud, S/o. A.Balraj Goud Aged about 43 yrs, Occ: Business R/o.H.No.2-3-501/1, Sainagar Colony Nagole, Ranga Reddy District.
2.Anthati Sampath Kumar, S/o. A.Balraj Goud Aged about 39 yrs, Occ: Business R/o.H.No.2-3-501/1 Sainagar Colony Nagole, Ranga Reddy District.
...Plaintiffs
Plaintiffs No.1 and 2
And
Vaddepally Satish Kumar and another ...Defendant

To
Jangum Rushander, S/o. J.Yadagiri Rao Aged about: 62 yrs, Occ: Business R/o.H.No.8-5-283/37, Road No.1 Madhava Nagar Colony, Kharmanghat Vaishali nagar, Saroornagar, R.R.District
...Respondent/ Proposed Defendant No.2

Please take notice that, the above-named Plaintiffs filed the above main suit for Specific Performance of Agreement of Sale against both of you and said case is coming for appearance of the proposed defendant No.2 and case is posted on 12-11-2024 at 10.30 am before the court. If you not present on that day the case will be decide in your absence.

//By order of the court//
R.Kumar Goud
Advocate
Counsel for the Plaintiffs

IN THE COURT OF THE HON'BLE ADDL JUNIOR CIVIL JUDGE RANG REDDY DISTRICT AT: HAYATHNAGAR
O.S.No. 539 of 2021

Between:-
Endurthi Sudarshan Reddy ...Plaintiff
And
1.Syed Meeran and others ...Defendants

To,
1.Syed Meeran S/o.Syed Imam Aged about 73 years Occ: Business R/o.Malakpet, Hyderabad.

NOTICE

Whereas the above named plaintiffs have filed suit for DECLARATION, TO DECLARE THE REGD. SALE DEED BEARING DOCUMENT No.244/2007 DATED 20-10-2007 AS NULL & VOID AND Perpetual Injunction against you and others in respect of Suit Schedule Property That the Hon'ble court posted the matter on 30-10-2024 for you apperance on The said case is posted for any claims or objections from any concerned. Hence, if any persons is/are having any claims or objections they may be appear before this Hon'ble court on 30.10.2024 at 10.30 AM, either in person are through an advocate duly instructed by you, with all relevant documents, failing which the matter will be decided on merits in ex-parte.

// By Order of the court //
(M/s.C.RAJESHWAR REDDY)
E.SHYAM SUNDER REDDY
Advocates
O/o.Flat No.502, Vijaya Sudha Enclave, beside M.G.Law College, Chitra Layout, L.B.nagar, Hyderabad-074.
Cell no 8341670990

కార్మికపక్షపాతి నాయిని నర్సింహారెడ్డి

● బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజ్



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్ర మాజీ హెూంమంత్రి నాయిని నరసింహారెడ్డి కార్మికపక్షపాతిగా ఎనలేని కీర్తిని పొందాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు నగేష్ ముదిరాజ్ అన్నారు. నాయిని నరసింహారెడ్డి నాలుగో వర్ధంతి సందర్భంగా బాగ్‌లింగంపల్లిలోని లంబడి తండా బస్తీలో ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాంనగర్ మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాసరెడ్డి , యువ నాయకులు ముఠా జయసింహ తదితరులు పాల్గొన్నారు.

టోర్నమెంట్‌లో విజయం సాధించిన జట్టుకు అభినందన



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్స్ క్రికెట్ జట్టు రాష్ట్ర స్థాయిలో 2వ స్థానం సాధించింది. టోర్నమెంట్ గద్వాల్ జోగులాంబ జిల్లాలో ఈనెల తేది14-17 వరకు జరిగింది. ఈ టోర్నమెంట్‌లో విజయం సాధించిన హైదరాబాద్ జిల్లా జట్టు కెప్టెన్ దేవ్ రన్నరప్ నిలిచారు. మంగళవారం ప్రభుత్వ ఆలియా మోడల్ స్కూల్‌లో గా హైదరాబాద్ డిఈఓ ఆర్ రోహిణి, డిప్యూటీ డిఈఓలు చిరంజీవి వెంకటేశ్వర్లు, డాక్టర్. ఎ ప్రమోద్ కుమార్ (కోచ్)ఎస్.శ్రీదేవి.మేనేజర్ జి. మల్లికార్జులను వారు అభినందించారు.

అఖిలభారత గౌడ మ్యారేజ్ బ్యూరో మధ్యవర్తుల సంఘం నూతన కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ముషీరాబాద్

అఖిల భారత గౌడ మ్యారేజ్ బ్యూరో మధ్యవర్తుల కేంద్ర రాష్ట్ర నూతన కమిటీలను మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సభ్యులు ఎన్నుకున్నారు. జాతీయ అధ్యక్షులుగా అఖిలభారత గౌడ మ్యారేజ్ బ్యూరో వ్యవస్థాపకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి అయిలి రవీందర్ గౌడ్, ఉపాధ్యక్షులు దాసరి వీరస్వామి గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు గా సందగళ్ళ మధుసూదన్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కౌసల్య, కోశాధికారి చంద్రకళ గౌడ్, సహాయ కోశాధికారిగా కుకునూరు వెంకటేష్ గౌడ్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ గౌడ మ్యారేజ్ బ్యూరో సభ్యులు తమ పరిచయాలు మెరుగుపరచుకోవడానికి సంవత్సరంలో ఒకసారి విహారయాత్ర చేపడతామని తెలిపారు. మ్యారేజ్ బ్యూరో సభ్యులు వధూవరుల పరిచయాలకి సమావేశాలకు హైదరాబాదులో 200 గజాల పక్కా భవనం నిర్మించడానికి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. గౌడ మ్యారేజ్ కుటుంబ సభ్యుల ఇండ్లలో వివాహ శుభ కార్యాలు జరిగితే రూ.5వేల కానుక అందజేయాలని ఎవరికైనా అకాల మరణం సంభవిస్తే వారి కుటుంబ సభ్యులకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేయాలని కోరారు. ప్రతి ఏటా దసరా పండుగను పురస్కరించుకొని గౌడ మ్యారేజ్ బ్యూరో కుటుం బ సభ్యులు కార్యక్రమం ఐదు పెళ్లిల నుంచి పది పెళ్లిళ్లు చేసిన వారికి అవార్డు అందజేస్తామన్నారు. మ్యారేజ్ బ్యూరో సభ్యులకు అతి తక్కువ వడ్డీతో రుణ సదుపాయం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

ఆర్టీజన్ల పోరాటం ప్రభుత్వం దృష్టికి వచ్చింది



నవతెలంగాణ-ధూల్ పేట్

ఆర్టీజన్ల పోరాటం ప్రభుత్వం దృష్టికి వచ్చిందనీ రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారని టీజీయు ఈఈయు సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.గోవర్ధన్ అన్నారు. వరద భాదితుల కోసం ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ చెక్కు అన్నిసంఘాలు కలిసి ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ తరపున ఆయన పాల్గొని మాట్లాడుతూ... ఆర్టీజన్ల కన్వర్షన్ విషయమై టీజీయుఈఈయు సీఐటీయు జనరల్ సెక్రటరీగా మంత్రి దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఏది ఏమైనా టీవీఏసీ జేఏసీ చేస్తున్న న్యాయమైన పోరాటం ప్రభుత్వం దృష్టికి యాజమాన్యం దృష్టికి వెళ్లిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా రెండో రోజు గ్రూప్-1 పరీక్ష



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

గ్రూప్ వన్ పరీక్షలు ప్రశాంతంగా రెండో రోజు కొనసాగాయి. కోఠిలోని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయంలో రెండో రోజు గ్రూప్-1 పరీక్షలు ప్రశాంతంగా కొనసాగాయి. ఎలాంటి సంఘటనలు జరగకుండా సుల్తాన్‌బజార్ పోలీసు లు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. గ్రూప్ 1పరీక్ష రాసే అభ్యర్థులు పరీక్ష సమయం కంటే ముందు గానే పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు.

వన్స్‌మోర్

జలమండలిలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్

● పెండింగ్ బిల్లుల చెల్లింపునకు తెరపైకి ఓటీఎస్
● రూ.1706 కోట్ల బకాయిలు
● 7 లక్షలకుపైగా వినియోగదారులకు లబ్ది
● బిల్లు చెల్లింపునకు ఈ నెల 31వరకు ఛాన్స్
● అవగాహన కోసం విస్తత ప్రచారం

నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలిల్లో పెండింగ్ బిల్లులను వసూలు చేసేందుకు అధికారులు ఓటీఎస్‌ను తెరపైకి తీసుకొచ్చారు. నష్టాల్లోవున్న వాటర్‌బోర్డు గట్టెక్కాలంటే జలమండలికి చాలాకాలం నుంచి రావాల్సి పెండింగ్ బిల్లులను వసూలు చేయడమే మార్గంగా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వన్ టైమ్ సెటిల్ మెంట్‌ను తెరపైకి తీసుకొచ్చారు. వన్‌టైమ్ సెటిల్ మెంట్ ద్వారా పెండింగ్ బిల్లులు చెల్లించిన వారికి ఆలస్య రుసుముతోపాటు వడ్డీ రాయితీని ప్రకటించారు. ఈ పథకం ఈ నెల 31వరకు అమలులో ఉంటుంది.

వన్ టైమ్ సెటిల్ మెంట్ పథకం-2024 ద్వారా పెండింగ్ బిల్లులను చెల్లించిన వారికి ఆలస్య రుసుముతో పాటు వడ్డీపై రాయితీని అందిస్తున్నారు. ఈ పథకం ఈ నెల 31 వరకు వరకు అమల్లో ఉంటుంది. వినియోగదారులు సులువుగా బిల్లులను చెల్లించే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. మీ-సేవ, ఏపీ ఆన్ లైన్ కేంద్రాలతోపాటు వివిధ రూపాలల్లో బిల్లు చెల్లించే అవకాశాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. జలమండలి అందించే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సలుభంగా బకాయి మొత్తం చెల్లించవచ్చు. 13.50 లక్షలు నల్లా కనెక్షన్లు ఉన్న జలమండలిలో ఈ వన్ టైమ్ సెటిల్ మెంట్ పథకం ద్వారా 7 లక్షలకు పైగా వినియోగదారులకు లబ్ది చేకూరనుంది. వీరి వద్ద నుంచి అసలు మొత్తం దాదాపు రూ.1706 కోట్లు బకాయిలు రావాల్సింది. కాగా, రూ.1189 కోట్ల బకాయిలు మాఫీ అవుతాయి.

వడ్డీమాఫీ పరిధి ఇలా..

నల్లా బిల్లుల బకాయిలపై వడ్డీ మాఫీ కోసం అధికారులకు స్థాయిని బట్టి టార్గెట్‌ను నిర్ణయించారు. మేనేజర్ స్థాయిలో రూ.2000 వరకు, డిప్యూటీ జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.2001 నుంచి రూ.10,000 వరకు, జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.10,001 నుంచి రూ.1,00,000 వరకు, చీఫ్ జనరల్ మేనేజర్ స్థాయిలో రూ.1,00,001 నుంచి అంతకంటే ఎక్కువ బిల్లు మాఫీ చేసే అధికారం ఉంది.

సులువుగా బిల్లులు చెల్లించేందుకు..

☞ జలమండలి కార్యాలయాల్లోని క్యాష్ కౌంటర్ల వద్దకు నేరుగా వెళ్లి బిల్లు చెల్లించవచ్చు.

☞ ఆన్ లైన్ విధానంలో.. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యాప్స్ ద్వారా చెల్లించవచ్చు.

☞ ఎన్ఇఎఫ్‌టీ, ఆర్‌టీజీఎస్,బీపీపీస్ ద్వారా చెల్లించే అవకాశం ఉంది.

☞.జలమండలి అధికారిక వెబ్ సైట్ www.hyderbad-water.gov.inకు లాగిన్ అయి చెల్లింపులు చేయవచ్చు.

☞ లైన్ మెన్లు మీ గహాల్ని సందర్శించినప్పుడు వారి దగ్గర ఉండే 'ఇపీఓఎస్' యంత్రం ద్వారానూ బిల్లు చెల్లించే అవకాశం కల్పించారు.

ఎస్ఎంఎస్ ద్వారా పూర్తి సమాచారం

జలమండలి వినియోగదారుల క్యాన్ నంబర్‌కు అనుసంధానమై ఉన్న మొబైల్ నంబరుకు బకాయి మొత్తం ఏంది, వినియోగదారులు ఎంత చెల్లించాలి, ఎంత మాఫీ అవుతుంది తదితర వివరాలన్ని ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందుతోంది. అలాగే సామాజిక మాధ్యమాలు ట్విటర్, ఫేస్ బుక్, ఎలక్ట్రానిక్ మీడియా, ఎఫ్ఎం రేడియో, పోస్టర్లు, కరపత్రాల ద్వారా ఓటీఎస్-2024 పథకం గురించి ప్రజలకు విస్తత అవగాహన కల్పిస్తోంది. ఓటీఎస్ పథకంపై ఏవైనా సందేహాలుంటే.. జలమండలి కస్టమర్ కేర్ నంబర్ 155313 నంబరుకు ఫోన్ చేసి వాటిని నివతి చేసుకోవచ్చు.

నిబంధనలు

☞ ఓటీఎస్ ఈ నెల 31 వరకు మాత్రమే అమల్లో ఉంటుంది.

☞ గతంలో ఓటీఎస్ పథకాన్ని వినియోగించుకోని వారు, ఒకేసారి బిల్లు చెల్లిస్తే ఆలస్య రుసుం, వడ్డీ మాఫీ

☞గతంలో ఓటీఎస్ పథకం ద్వారా ప్రయోజనం పొందిన వినియోగదారులకు 50 శాతం వరకు బిల్లు మాఫీ అవుతుంది.

☞ఈ పథకం కింద ప్రయోజనం పొందాలనుకునే వినియోగదారులు భవిష్యత్తులో 24 నెలల పాటు తప్పనిసరిగా క్రమంగా బిల్లులు చెల్లిస్తామని అఫిడవిట్ రాసి ఇవ్వాల్సి ఉంటుంది. అంతేకాకుండా బిల్లు చెల్లింపుల విషయంలో వారు విఫలమైతే, ఈ పథకం కింద వారు పొందిన ప్రయోజనాన్ని రద్దు చేస్తారు.

☞ తమ నల్లా కనెక్షన్ డిస్ కనెక్షన్ స్థితిలో ఉన్న వినియోగదారులు ఈ పథకం ద్వారా ప్రయోజనం పొందాలనుకుంటే, ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న బిల్లు చెల్లించాల్సి ఉంటుంది.



ఓటీఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి: జలమండలి ఎండీ

వన్ టైమ్ సెటిల్ మెంట్ పథకం-2024 ద్వారా పెండింగ్ బిల్లులను చెల్లించి ఆలస్య రుసుముతో పాటు వడ్డీపై రాయితీ పొందాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీర్ఘకాలికంగా బిల్లులు చెల్లించని వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. నల్లా బిల్లుల్ని చెల్లించి, నగర ప్రజలకు తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ సేవలు అందిస్తున్న జలమండలికి సహకరించాలని కోరారు.

ప్రభుత్వ స్కూల్‌లో విద్యార్థులను విస్తృతంగా పెంచాలి

● బండ్లగూడ మండల డిప్యూటీ ఈఓ దశరత్

నవతెలంగాణ-ధూల్‌పేట్

ప్రభుత్వ స్కూల్ల్లో విద్యార్థులను విస్తృతంగా పెంచాలని బండ్లగూడ మండల డిప్యూటీ ఈఓ దశరత్ అన్నారు. బండ్లగూడ మండలం రవీంద్ర నాయక్ నగర్ కాలనీలో ఇంటింటికీ సర్వేలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. రవీంద్ర నాయక్ నగర్ కాలనీ ప్రభుత్వం పాఠశాల చంద్రికాపూర్ విస్తృతంగా విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు. ప్రయివేట్ స్కూల్ వైపు మొగ్గు చూపకుండా ప్రభుత్వ స్కూలు ముగ్గు చూసేవిధంగా బండ్లగూడ మండలం పరిధిలో ప్రభుత్వం స్కూల్ అభివృద్ధి కోసం తోడ్పాటు అందిస్తామని తెలిపారు. విద్యార్థులు యూనిఫామ్, బుక్స్, మిడే మిల్స్ సమయానికి వచ్చేలా చొరవ తీసుకుంటున్నామన్నారు. రవీంద్రనాయక్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ కృష్ణ నాయక్ మాట్లాడుతూ.. రవీందర్ నాయక్ నగర్ కాలనీలో ఎక్కువ సంఖ్య గిరిజన విద్యార్థులు ప్రయివేట్ స్కూల్ వైపు మొగ్గు చూపుతున్నారని ప్రయివేట్ స్కూల్ వైపు వెళ్లకుండా ప్రభుత్వ స్కూలు వచ్చే విధంగా విద్యాధికారులు చూడాలని కోరారు.



విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియంతో పాటు నాణ్యమైన విద్యను అందించే విధంగా టీచర్స్‌లను నియమించాలన్నారు. రవీందర్ నాయక్ నగర్ కాలనీలో ప్రతి ఇంటింటి వెళ్లి విద్యార్థుల ప్రయివేట్ స్కూలుకు వెళ్లకుండా ప్రభుత్వం స్కూలుకు వచ్చే విధంగా మా కాలనీ కమిటీ సభ్యులుగా టీచర్లకు సహకారాలు అందిస్తారని ఈ సందర్భంగా తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు సీతారాంరెడ్డి, టీచర్లు రాములు, లక్ష్మణ్ కమిటీ సభ్యులు నాయకులు కిషన్, సంతోష్, రాజేష్, శ్రీను, సురేష్, మహేష్, నాగేష్, భరత్,తదితరులు పాల్గొన్నారు.

ఓటమి విజయానికి మెట్టు

నవతెలంగాణ-ధూల్ పేట్

ఓటమి విజయానికి మెట్టని, నిరాశ వదిలి ప్రయత్నం చేయాలని ఎంఎస్ స్కూల్ డైరెక్టర్ మొహమ్మద్ సుల్తాన్ అన్నారు. సోమవారం మొఘల్ పురా ఉర్దూ ఘర్‌లో ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన చదరంగం పోటీలలో విజయం సాధించిన విజేతలు మొహమ్మద్ షబ్బీర్ అహ్మద్ మొదటి బహుమతి, సాయి ప్రణవ్ కుమార్ ద్వితీయ బహుమతి, ఎండీ.సాహెర్ అహ్మద్ తృతీయ బహుమతులను సాధించిన వారికీ మెమెంటో, నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీజే అబ్దుల్ కలాం వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు, అబ్దుల్ హై ఖాద్రి, మొహమ్మద్ సిరాజ్, జుభేర్ అమోది, ఖాదీరుల్లా, ఖమ్రుద్దీన్, అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలిగా అవకాశం కల్పించండి



● ప్రజలకు సేవ చేసే భాగ్యం కల్పించండి
● ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతి పత్రాన్ని అందచేసిన కల్పన

నవతెలంగాణ-ముషీరాబాద్

రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలిగా అవకాశం కల్పించాలని ముషీరాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను ఆ పార్టీ మహిళా విభాగం ప్రస్తుత ప్రధాన కార్యదర్శి సోంత కల్పన కోరారు. ఈ మేరకు ఆమె మంగళవారం ముషీరాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కలిసి తన బయోడేటాతో కూడిన వినతి పత్రాలను అందచేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాను బీఆర్ఎస్ పార్టీలో చేరి 8 సంవత్సరాలు అవుతుందని, పార్టీ బలోపేతం కోసం తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. పార్టీలో క్రియాశీలకంగా ఉంటూనే అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో భాగంగా ఎయిడెడ్ స్కూల్‌ను దత్తత తీసుకొని ఆ స్కూలు కోసం, పిల్లల కోసం నా ద్వారా లయన్స్ క్లబ్ ద్వారా సహాయాలను పొంది పాఠశాలను బాగుపర్చామన్నారు. స్కూలులో గోడలు, గేట్లు, పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, స్లేట్లు, బ్యాగులు, మధ్యాన భోజనాలు సమకూర్చడం జరిగిందన్నారు. బాగ్‌లింగంపల్లిలోని తెలంగాణ మైనారిటీ స్కూల్, కెవీకె హై స్కూల్లో పిల్లలకు ఎగ్జామ్ ప్యాడ్లు పంచడం జరిగిందని తెలిపారు. అనాథ ఆశ్రమంలో, గాంధీ ఆస్పత్రిలో పాఠశాలలో భోజనాలు (అన్న ప్రసాదం) పేరుతో సేవలందించానని, పార్టీ కార్యకర్తగా, మహిళలకు, వృద్ధులకు విరాళాలు సేకరించి వారి అభివృద్ధికి నా వంతు కృషి చేసినట్టు కల్పన చెప్పారు. లయన్స్ క్లబ్ ద్వారా ప్రజల ఆరోగ్య దృష్ట్యా అనేక హెల్త్ క్యాంపులు, కంటి ఆపరేషన్లు చేయించడం జరిగిందన్నారు. క్యాన్సర్ అవగాహన కార్యక్ర మాలను నిర్వహించామని తెలిపారు. కాబట్టి పార్టీ కోసం పని చేస్తున్న కార్యకర్తగా, కార్యదర్శిగా, నా సేవలను గుర్తించి రాంనగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ మహిళా విభాగం అధ్యక్ష పదవి ఇవ్వాలని ఆమె ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డిలను కోరారు. ఈ వినతి పత్రం అందచేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు సాలమ్మ, రేఖ, తిరుమల, మేరి, రేణుక, షబానా, అనురాధ, సుద, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● బస్తీ దవాఖాన డాక్టర్ సాయి ప్రియ



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మేతర్ బస్తీ సూర్య నగర్ బస్తీ దవాఖాన డాక్టర్ సాయి ప్రియ అన్నారు. మంగళవారం బస్తీ దవాఖానాలో ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎక్కువగా డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా తెలిపారు. ప్రజలు ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలని కూలర్లు, ఫ్లవర్ కుండీలు ఇంటి బయట ఉన్న కొబ్బరిచిప్పలు, పాత టైర్ల వంటి వాటిలో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. దోమలు దరి చేరకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ప్రజలు దోమతెరలు వాడాలని చిన్నపిల్లలు, వృద్ధులు జాగ్రత్తగా ఉండాలన్నారు. దగ్గు, చలి జ్వరం, జలుబు ఉంటే వెంటనే వైద్యున్ని సంప్రదించాలని సూచించారు. తమ ఆరోగ్య కేంద్రంలో బీపీ, షుగర్, థైరాయిడ్, వివిధ రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన వారికి మందులను అందిస్తున్నామన్నారు.

కొమురం భీం పోరాటం స్ఫూర్తిదాయకం



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జల్ జంగల్ జమీన్ నినాదంతో అడవి బిడ్డల హక్కుల కోసం నైజాం సర్కార్‌తో పోరాటం చేసిన వీరుడు కొమురం భీమ్ జయంతిని పురస్కరించుకుని కోఠిలోని వీరనారి చాకలి ఐలమ్మ ఉమెన్స్ యూనివర్సిటీలో ఆయన జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించిన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్యా ధనంజయ్ అనంతరం వారు మాట్లాడుతూ.. జాతి హక్కుల కోసం, అడవి బిడ్డల ఆత్మగౌరవం కోసం అలుపు లేని యుద్ధం చేసిన కొమురం భీమ్ అన్నారు. ఆయన పోరాట స్ఫూర్తి రైతాంగ పోరాటానికి, తొలి మలి దశల తెలంగాణ ఉద్యమాలకు బలమైందన్నారు. కొమురం భీం ఆశయాలను కొనసాగించే బాధ్యత యువత భుజస్కంధాలపై ఉందన్నారు. ఈ జయంతి కార్యక్రమంలో ఎస్.వో ప్రొఫెసర్ సరస్వతమ్మ, పిఆర్వో డా.క్రిష్టాజీ, కంట్రోలర్ ఆఫ్ ఎక్సామినేషన్ డా.శైలజ, డైరెక్టర్ ఆఫ్ హాస్టల్స్ డాక్టర్. విజయలక్ష్మితో పాటు విశ్వవిద్యాలయ ఆచార్యులు, పాల్గొన్నారు.

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పది : ఎమ్మెల్యే కాలేరు

నవతెలంగాణ-అంబర్‌పేట

అన్ని దానాల కన్నా అన్నదానం గొప్పదని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. మంగళవారం గోల్నాక డివిజన్ పరిధిలోని మారుతి నగర్ శ్రీ భూదేవి నాగదేవతల ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ దంపతులు అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్ గౌడ్,



లింగం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జల్..జంగల్..జమీన్ నినాదంతో గిరిజనుల హక్కుల కోసం పోరాటం

నవతెలంగాణ-హిమాయత్ నగర్

జల్..జంగల్..జమీన్ అనే నినాదంతో గిరిజనుల హక్కుల కోసం పోరాడి ప్రాణ త్యాగం చేసిన గొప్ప వ్యక్తి కొమరం భీమ్ అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు నేనావత్ రాంబాబు నాయక్ ఆయనను కొనియాడారు. మంగళవారం నిజాం కళాశాల ప్రాంగణంలో స్వర్గీయ కొమరం భీమ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమరం భీమ్ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాంబాబు నాయక్ మాట్లాడుతూ రాష్ట్రంలో గిరిజన రక్షణ చట్టాలు రావడానికి కొమరం భీమ్ ఆద్యుడని ఆయన పేర్కొన్నారు. నిజాం కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ బి.బీమా మాట్లాడుతూ




కొమరం భీమ్ పోరాటం వల్లనే ఆనాటి నిజాం పాలకులు గిరిజనుల స్థితిగతులపై అధ్యయనం చేయడానికి జర్మనీ నుంచి సామాజిక మానవ శాస్త్రవేత్త హైమండార్ఫ్ ను ఆహ్వానించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నిజాం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.ఉపేందర్ రెడ్డి, ప్రొఫెసర్ రమణ నాయక్, అధ్యాపకులు డాక్టర్ కిషోర్, డాక్టర్ ధరావత్ సాంబశివ, డాక్టర్ బి.తిరుపతి, ఉద్యోగులు లకావత్ నవీన్, గిరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు జరిగితే దళిత జాతులకు నష్టం

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్ అమలు చేయవద్దని, ఒకవేళ అమలు జరిగితే దళిత జాతులకు తీవ్ర నష్టం జరుగుతుందని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ కమిటీ చైర్మెన్, దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ, క్రిమిలేయర్ అమలు చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వ క్యాబినెట్ సబ్ కమిటీ చైర్మెన్ ఉత్తమ్ కుమార్ రెడ్డికి సమితి జాతీయ కమిటీ తరుపున లేఖ పంపించడం జరిగిందన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులో ఎస్సీ వర్గీకరణ చేయమని ఎక్కడ పేర్కొనలేదని తెలిపారు. క్రిమిలేయర్‌ను సుప్రీం కోర్టు రద్దు చేయలేదన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డికి పంపిన లేఖలో దళిత జాతి భవిష్యత్తుకు సంబంధించిన వివిధ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ, క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా డిసెంబర్ మూడవ వారంలో కొడంగల్‌లో పెద్ద ఎత్తున బహిరంగ సభ నిర్వహిస్తామని ఆయన



తెలిపారు. ఈ సమావేశంలో మాల మహానాడు జాతీయ అధ్యక్షులు డాక్టర్ వి.ఎల్.రాజు, రాష్ట్ర అధ్యక్షులు జె.ఎన్.రావు, సమితి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పబ్బతి శ్రీకృష్ణ, మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు రోజా లీలా, ఆర్పిఐ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.అశోక్, ఆలిండియా ఎస్సీ, ఎస్టీ అడ్వకేట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు పసుల రాజ లింగం, వీబీపి రాష్ట్ర అధ్యక్షులు గవ్వల శ్రీకాంత్, తెలంగాణ బేగరి సంక్షేమ సంఘం అధ్యక్షులు పి.సుచంద్ర, ఎల్.హెచ్.పి.ఎస్ రాష్ట్ర నాయకులు మాలోత్ రవీంద్ర, డీబీపీ గ్రేటర్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పరి సుబ్బారావు, అధ్యక్షులు మద్దెల ప్రవీణ్ కుమార్, ఆల్ ఇండియా దర్జీ మేరు హక్కుల పోరాట సమితి అధ్యక్షులు పెండ్యాల సునీల్ చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

'హైదరాబాద్ ఇమేజ్ దెబ్బ తీసే కుట్రలను అడ్డుకోవాలి'

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి.నరసింహ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

హైదరాబాద్ ఇమేజ్ దెబ్బ తీసే కుట్రలను ప్రభుత్వం అడ్డుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈ.టి.నరసింహ కోరారు. సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ కౌన్సిల్ సమావేశం నేర్లకంటి శ్రీకాంత్ అధ్యక్షతన మంగళవారం హిమాయత్ నగర్‌లోని సీపీఐ నగర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ.టి.నరసింహ మాట్లాడుతూ ఐటీ రంగంలో అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ ఉన్న క్రమంలో మతోన్మాద శక్తులు తమ రాజకీయ ప్రయోజనాల కోసం గొడవలు సృష్టిస్తున్నారని, ప్రశాంతంగా ఉన్న నగరంలో ప్రజల మధ్య మత విద్వేషాలు వ్యాప్తి చేస్తున్నారని, ఇలాంటి శక్తుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం, నిఘా వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలన్నారు.

సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేద్దాం

కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 సంవత్సరాలు కావొస్తున్న సందర్భంగా పార్టీ చేసిన త్యాగాలు, పోరాటాలను వివిధ ప్రాంతాలలో సెమినార్లు, సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలని అదే విధంగా గతంలో ప్రజల కోసం వారి హక్కుల కోసం పోరాటం చేసి త్యాగాలు చేసిన నాయకుల పోరాటాన్ని పుస్తకాల రూపంలో ముద్రించి ప్రజల వద్దకు తీసుకెళ్లాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్య దర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బి.వెంకటేశం, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ నాయక్, చంద్రమోహన్ గౌడ్, నళిని, కాంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'డీపీఐఐటీతో భాగస్వామ్యం చేసుకున్న అమెజాన్ ఇండియా'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఈ-కామర్స్ ద్వారా తమ వ్యాపారాలను నిర్మించడానికి, వృద్ధి చేసుకోవడానికి స్టార్టప్‌లకు సాధికారత కల్పించే లక్ష్యంతో బహుళ కార్యక్రమాలను నిర్వహించటానికి డిపార్ట్మెంట్ ఫర్ ప్రొమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) ఆధ్వర్యంలో స్టార్టప్ ఇండియాతో కలిసి పని చేయనున్నట్లు అమెజాన్ ఇండియా మంగళవారం ఒక ప్రకటనలో ప్రకటించింది. స్టార్టప్ ఇండియా పోర్టల్ లోని ప్రత్యేక పేజీ ద్వారా అమెజాన్ ఇండియా మార్కెట్ ప్లేస్‌లో నమోదు చేసుకోవడం ద్వారా అర్హత కలిగిన స్టార్టప్‌లుఈ-కామర్స్‌లో అవకాశాలను పొందేందుకు వీలుగా అమెజాన్ స్టార్టప్ ఇండియాతో సహకరిస్తుంది. అమెజాన్ స్టార్టప్ లకు అంకితమైన ఆన్ బోర్డింగ్ అనుభవాన్ని అందిస్తుంది. ఇది దేశీయ మార్కెట్‌కు అవకాశాలను పొందడంలో సహాయ పడుతుంది. అమెజాన్ నాయకుల నుండి మార్గదర్శకత్వం, గో-టు-మార్కెట్ మద్దతు, లాజిస్టిక్స్ మార్గదర్శకత్వం సైతం అందించనుంది. ఇంకా తన సహేలీ ప్రోగ్రామ్ ద్వారా ఈ-కామర్స్‌లో మహిళా పారిశ్రామిక వేత్తలకు సాధికారత కల్పించడానికి స్టార్టప్ ఇండియాతో భాగస్వామి అవుతుంది. అమెజాన్ పే, అమెజాన్ ఇన్సెంటివ్‌లు, అమెజాన్ బిజినెస్, అమెజాన్ ట్రాన్స్‌పోర్ట్, ఏడబ్ల్యుఎస్, అమెజాన్ అడ్వర్టైజింగ్, మినీ టివితో సహా అమెజాన్ విస్తృతమైన సేవల సముదాయం ఈ కార్యక్రమంలో భాగమైన మహిళా స్టార్టప్ లకు అందుబాటులో ఉంటుంది. ఇది ఫ్యాషన్, ఎఫ్ అండ్ బి, టెక్స్‌టైల్, దుస్తులు, బొమ్మలు, ఆటలు, ఆటోమోటివ్, ఆర్ట్, ఫోటోగ్రఫీ, పెంపుడు జంతువులు, వ్యవసాయం మరెన్నో సహా సంబంధిత పరిశ్రమల విస్తృత శ్రేణిని కవర్ చేస్తుంది.



తండ్రి, సోదరుడు రాజకీయాల్లోనే హత్యలకు గురయ్యారు. ఆమెపై కూడా 20 సార్లు హత్యాయత్నాలు జరిగాయి. అయినా ఏమాత్రం వెనకడుగు వేయలేదు. ఇసుమంతైనా జంకకుండా రాజకీయాల్లో ఉండేందుకే నిర్ణయించుకుంది. ఎంతో ధైర్యంగా తన రాజకీయ జీవితం కొనసాగించింది. అంతేనే ఎన్నికల్లో నిలబడి గెలిచింది. ఇటీవలెనే జమ్మూ కాశ్మీర్‌లో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా ప్రమాణం చేశారు. తన కేబినెట్‌లో ఒకే ఒక మహిళకు అవకాశం కల్పించారు. ఆమెనే సకీనా ఈటూ. ప్రస్తుతం మంత్రిగా బాధ్యతలు చేపట్టింది. జమ్మూ కాశ్మీర్‌లో ఏకైక మహిళా మంత్రి అయిన ఆమె స్ఫూర్తిదాయక పరిచయం నేటి మానవిలో...

మన మెదడు రహస్యాల గని. భావోద్వేగాలకు నెలవు. అటువంటి మెదడు గురించి దశాబ్దాలుగా పరిశోధనలు చేస్తోన్న సంస్థ ఐబీఆర్‌వో. అలాంటి ప్రసిద్ధ అంతర్జాతీయ సంస్థకు తొలిసారిగా భారతీయ శాస్త్రవేత అధ్యక్షురాలిగా నియమించబడ్డారు. ఆమే శుభ టోలే. ఇంటర్నేషనల్ బ్రెయిన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఐబీఆర్‌వో) అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళా శాస్త్రవేత్తగా చరిత్ర సృష్టించిన ఆమె పరిచయం...



ఏకైక మహిళా మంత్రిగా...

రాజకీయ కుటుంబ నేపథ్యం కలిగిన సకీనా ఈటూ.. తండ్రి, సోదరుడు కూడా రాజకీయాల్లో ఉండేవారు. అయితే వారిద్దరినీ ఉగ్రవాదులు చంపేశారు. పైగా సకీనా ఈటూ కూడా 20 సార్లు హత్యాయత్నాల నుంచి బయటపడ్డారు. గతంలోనూ మంత్రిగా పనిచేసిన సకీనా... తాజాగా మరోసారి ఒమర్ అబ్దుల్లా కేబినెట్‌లో స్థానం దక్కించుకున్న ఏకైక మహిళగా నిలిచారు.

తండ్రి, సోదరుడిని పోగొట్టుకున్నా...

దక్షిణ కాశ్మీర్‌లోని కుల్గామ్ జిల్లా డీ హెజ్ పోరా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి సకీనా ఈటూ ఇటీవలి ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచారు. మెహబూబా ముఫ్తీకి చెందిన పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి గుల్జార్ అహ్మద్ దర్‌పై 17,449 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన సకీనా నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీలో పలు హోదాల్లో పనిచేశారు. ఆమె తండ్రి వలీ మోహమ్మద్ ఈటూ.. గతంలో జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేశారు. అయితే ఆయన 1994లో హత్యకు గురయ్యారు. ఆ తర్వాత ఆమె సోదరుడు రాజకీయాల్లోకి వచ్చాడు. అతడిని కూడా 2001లో ఉగ్రవాదులు హత్య చేశారు.

పలు బాధ్యతల్లో...

సోదరుడు చనిపోయిన సమయంలో సకీనా మెడిసిన్ చదువుతుంది. తండ్రీ, సోదరుడుని పోగొట్టుకున్నా ఏ మాత్రం భయపడకుండా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఈమె రాజకీయ ప్రవేశం చేసిన తర్వాత 20 సార్లకు పైగా హత్యాయత్నాలు జరిగినా ప్రాణాలతో ఆమె బయటపడ్డారు. ఈ క్రమంలోనే గతంలో జమ్మూ కాశ్మీర్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు నిర్వర్తించారు. అంతేకాకుండా పర్యాటక శాఖ, విద్యాశాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2008 నుంచి 2014 వరకు జమ్మూ కాశ్మీర్ సోషల్ వెల్ఫేర్ శాఖ మంత్రిగా ఉన్నారు. 53 ఏండ్ల సకీనా తాజాగా ఒమర్ అబ్దుల్లా కేబినెట్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. జమ్మూ కాశ్మీర్ ప్రజల్లో మంచి ఆదరణ ఉన్న అతి కొద్దిమంది మహిళా నేతల్లో సకీనా ఈటూ ఒకరు. ■





ఐబీఆర్‌వో అధ్యక్షురాలిగా...

శుభ ప్రస్తుతం ముంబయిలోని ప్రముఖ సైంటిఫిక్ రీసెర్చ్ సంస్థ టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్‌లో గ్రాడ్యుయేట్ స్టడీస్ డీన్‌గా పని చేస్తున్నారు. ఇండియన్ అకాడీ ఆఫ్ సైన్సెస్ 'ఉమెన్ ఇన్ సైన్స్' కమిటీకి ఛైర్‌పర్సన్‌గానూ ఆమె పని చేశారు. విద్యావంతుల కుటుంబంలో ముంబయిలో ఆమె జన్మించారు. తల్లి అరుణ టోలే ఆక్యుపేషనల్ థెరపిస్ట్. తండ్రి ప్రభుత్వ ఎలక్ట్రానిక్స్ విభాగానికి చెందిన సంస్థకు డైరెక్టర్‌గా పని చేశాడు. ముంబయిలోని సెయింట్ జేవియర్స్ కాలేజీలో లైఫ్ సైన్సెస్, బయోకెమిస్ట్రీ చదివిన శుభ అమెరికాలోని కాలిఫోర్నియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో మాస్టర్స్, డాక్టోరల్ డిగ్రీ చేశారు. చికాగో యూనివర్సిటీలో పోస్ట్-డాక్టోరల్ రీసెర్చ్ పూర్తి చేశారు.

కళల్లోనూ ప్రవేశం

శుభ టోలే శాస్త్రవేత్త మాత్రమే కాదు కథక్ శాస్త్రీయ నృత్యకారిణి కూడా. లాస్ ఏంజిల్స్‌లో పీహెచ్‌డీ చేస్తున్న కాలంలో గురు అంజనీ అంబేగావ్కర్ దగ్గర కథక్ నేర్చుకున్నారు. 'కథక్ చేస్తుంటే ఒత్తిడి దూరం అవుతుంది. మనసు ఆహ్లాదంగా ఉంటుంది. నేనూ, నా పెద్ద కొడుకు కథక్ ప్రాక్టీస్ చేస్తుంటాం. నా భర్త, ఇద్దరు పిల్లలు తబలా ప్రాక్టీస్ చేస్తుంటారు' అంటుంది శుభ. ఆమె భర్త సందీప్ కూడా శాస్త్రవేత్త. ఇద్దరూ శాస్త్రవేత్తలే కాబట్టి ఇంట్లో సైన్స్‌కు సంబంధించిన విషయాలే మాట్లాడుకుంటా రనుకుంటే మనం పొరబడినట్టే. పెయింటింగ్ నుంచి మ్యూజిక్ వరకు ఎన్నో కళల గురించి వారి ఇంట్లో చర్చ జరుగుతుందంటా. 'సైన్స్ అనేది ఓ సృజనాత్మక వృత్తి' అంటారు ఆమె.

చర్చలతో పరిష్కారం

ప్రస్తుతం ఐబీఆర్‌వో అధ్యక్ష పదవి చేపట్టిన శుభ 'అభివృద్ధి చెందుతున్న దేశాలలో పని చేయడానికి ఎన్నో పరిమితులు ఉంటాయి. ప్రయోగాలు, నిధుల జాప్యం నుంచి కొన్ని దేశాలకు సంబంధించి అంతర్జాతీయ సదస్సులు, వీసా అపాయింట్‌మెంట్‌లకు హాజరు కావడం వరకు ఇబ్బందులు ఉన్నాయి. చర్చల ద్వారా వాటికి పరిష్కారం దొరుకుతుంది' అంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 57 దేశాలకు చెందిన 69 సైంటిఫిక్ సొసైటీలు, ఫెడరేషన్‌లకు ఇంటర్నేషనల్ బ్రెయిన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఐబీఆర్‌వో) ప్రాతినిధ్యం వహిస్తోంది. 1961లో ఏర్పాటైన దీని నినాదం: ప్రొవైడింగ్ ఈక్వల్ యాక్సెస్ టు గ్లోబల్ న్యూరోసైన్స్. గతంలో దీని అధ్యక్షులుగా యూరోపియన్, ఉత్తర అమెరికా దేశాల నుంచి ఎంపికయ్యారు. భౌగోళికంగా, జనాభాపరంగా 'ఐబీఆర్‌వో'కు సంబంధించి అతి పెద్ద ప్రాంతానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం శుభకు దక్కింది. ■



గురుకుల విద్యార్థులకు విద్యుద్ఘాతం

జెండాల పైపులు విద్యుత్ వైర్లకు తగిలి..

ఐదుగురు విద్యార్థులకు స్వల్ప గాయాలు

మెదక్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటికి తరలింపు

నవతెలంగాణ-హవేలీఘనపూర్

మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో జరగనున్న ఉమ్మడి జిల్లా క్రీడా పోటీల ఏర్పాట్లలో జెండాలను గుంతలో పాతే క్రమంలో జెండా ఇనుప పైపులు విద్యుత్ వైర్లకు తగిలి ఐదుగురు విద్యార్థులు విద్యుద్ఘాతానికి గురయ్యారు. ఈ ఘటన మెదక్ జిల్లా హవేళిఘనపూర్ మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం జరిగింది. విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలికల గురుకుల పాఠశాలలో ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన క్రీడా పోటీలను నేడు(బుధవారం) ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లు చేస్తుండగా.. జెండాలు గుంతలో పాతే క్రమంలో ఇనుపపైపు పాఠశాల ముందు నుంచి వెళ్తున్న 11 కేవీ విద్యుత్ వైర్లకు తాకింది. దాంతో గురుకుల పాఠశాలకు చెందిన రజిత, తనుష్క, గాయత్రి, వసంత, బాలుర పాఠశాలకు చెందిన వర్షిత్ అనే ఐదుగురు విద్యార్థులు విద్యుద్ఘాతానికి గురై స్పృహ తప్పి పడిపోయారు. గమనించిన పాఠశాల సిబ్బంది ఆ విద్యార్థులను మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం వారిని ఇంటికి తీసుకెళ్లారు. మెదక్ ఆర్డీవో రమాదేవి ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కాగా విద్యార్థులతో పనిచేయించడం పట్ల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్‌రెడ్డి బాధితులను పరామర్శించారు. అనంతరం ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

రూ.9 లక్షల కోట్లు హాం ఫట్

(మొదటిపేజీ తరువాయి)

పూటలోనే ఇన్వెస్టర్ల సంపద రూ.9 లక్షల కోట్లు పైనా ఆవిరయ్యింది. ఇంట్రాడేలో 1000 పాయింట్లు పతనమై సెన్సెక్స్ తుదకు 931 పాయింట్లు క్షీణించి 80,221కి పరిమితమయ్యింది. అదే బాటలో ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 309 పాయింట్ల నష్టంతో 24,472 వద్ద ముగిసింది. నిఫ్టీ-50లో 47 స్టాక్స్ కూడా పతనాన్ని చవి చూడగా.. అన్ని రంగాలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి.

బీఎస్‌ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.9.34 లక్షల కోట్లు ఆవిరై రూ.444.31 లక్షల కోట్లుగా నమోదయ్యింది. సెన్సెక్స్-30లో మహీంద్రా అండ్ మహీంద్రా, ఎస్‌బీఐ, పవర్ గ్రిడ్, టాటా స్టీల్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, టాటా మోటార్స్, లార్సెన్ అండ్ టర్బో, ఎన్‌టీపీసీ, బజాజ్ ఫైనాన్స్, రిలయన్స్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. బీఎస్‌ఈలో 3428 స్టాక్స్ నష్టాలను చవి చూడగా.. కేవలం 559 స్టాక్స్ మాత్రమే రాణించాయి.

మరో 71 షేర్లు యధాతథంగా ముగిశాయి. స్మాల్ క్యాప్ 3.81 శాతం, మిడ్ క్యాప్ 2.52 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీలో పీఎస్‌యూ, రియాల్టీ రంగాలు 4.2 శాతం, 3.3 శాతం చొప్పున క్షీణించాయి. ఆటో రంగాలు, మీడియా, కన్స్యూమర్ డ్యూరేబుల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలు 2 శాతం పైగా నష్టపోయాయి.

తొలి రోజే హ్యుందాయ్ షేర్లు ఢమాల్

దేశంలోనే రెండో అతిపెద్ద కార్ల కంపెనీ హ్యుందాయ్ మోటార్ ఇండియా (హెచ్‌ఎంఐఎల్) స్టాక్ మార్కెట్‌లో లిస్టింగ్ తొలిరోజే ఇన్వెస్టర్లను నిరాశకు గురి చేసింది. ఇష్యూ ధరతో పోల్చితే 7 శాతం పతనమయ్యింది. రూ.27,870 కోట్ల నిధుల సమీకరణతో దేశంలోనే అతిపెద్ద ఐపీఓగా నిలిచిన ఈ కంపెనీ షేర్లు మంగళవారం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. రూ.1,960 వద్ద లిస్టింగ్ అయినా హెచ్‌ఎంఐఎల్ షేర్ ఒక్క పూటలోనే రూ.140 లేదా 7.1 శాతం నష్టంతో రూ.1,820కు పడిపోయింది. ఇంట్రాడేలో రూ.1,807-1,970 మధ్య కదలాడింది. రూ.5వేల కోట్ల పైబడిన ఐపీఓల్లో హెచ్‌ఎంఐఎల్ ఐదో అత్యంత పేలవమైన లిస్టింగ్‌గా నమోదయ్యింది.

ఉద్యోగుల ఉద్యమబాట



(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. అదేనెల నాలుగు, ఐదు తేదీల్లో ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలను అందజేయాలని కోరింది. ఆరున ఉద్యోగ జేఏసీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు పేర్కొంది. అదేనెల ఏడు నుంచి 27 వరకు ఉమ్మడి జిల్లా స్థాయిలో సమస్యల సాధన సదస్సులను నిర్వహించాలని నిర్ణయించింది. వచ్చే ఏడాది జనవరి మూడు, నాలుగు తేదీల్లో నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో ప్లకార్డులతో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని కోరింది. అదేనెల 21న రాష్ట్రవ్యాప్తంగా మౌన ప్రదర్శనలు చేపట్టాలని తెలిపింది. 23న రాష్ట్రవ్యాప్తంగా బైక్ ర్యాలీలు నిర్వహించాలని పేర్కొంది. 30న రాష్ట్రవ్యాప్తంగా మానవహారాలు జరపాలని కోరింది. అయినా ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యోగ జేఏసీ సమావేశమై భవిష్యత్ కార్యాచరణను ప్రకటించాలని నిర్ణయించింది. ఉద్యోగ జేఏసీ విస్తృత స్థాయి సమావేశాన్ని మంగళవారం హైదరాబాద్‌లోని టీఎన్జీవో భవన్‌లో నిర్వహించారు. ఉద్యోగ జేఏసీలోని భాగస్వామ్య సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ పెండింగ్‌లో ఐదు డీఏలు ఎప్పుడూ లేవని వివరించారు. దసరా కానుకగా రెండు, లేదా మూడు డీఏలను ప్రభుత్వం ప్రకటిస్తుందని ఉద్యోగులంతా ఎదురుచూశారని అన్నారు. కానీ ఎలాంటి ప్రకటన రాలేదన్నారు. దీపావళి కానుకగానైనా పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను ప్రకటించాలనీ, పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్యోగ జేఏసీ నాయకులతో వెంటనే చర్చించాలనీ, సమస్యలను పరిష్కరించాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని తాము అర్థం చేసుకున్నామనీ, వరదలొస్తే రూ.130 కోట్లు విరాళంగా ప్రకటించామని గుర్తు చేశారు. ఇప్పటికే పది నెలలు ఆగామని అన్నారు. అధికారంలోకి వస్తే ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తామంటూ నాటి పీసీసీ అధ్యక్షుడు, నేటి సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారని గుర్తు చేశారు. సమస్యలను పరిష్కరించాలనీ, సీఎం వద్దకు తీసుకెళ్లాలని మంత్రులు, ఉన్నతాధికారులు, సలహాదారులను పలుమార్లు కలిసి విన్నవించామని అన్నారు. అయినా సీఎం అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకే ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తున్నామని చెప్పారు. ఇది తమ సమస్యల సాధన కోసమే తప్ప ప్రభుత్వానికి వ్యతిరేకం కాదన్నారు. 317 జీవో బాధితుల సమస్య ఇంకా పరిష్కారం కాలేదని చెప్పారు. ఆ జీవో ద్వారా గత ప్రభుత్వం భార్యాభర్తలను వేరు చేసిందనీ, స్థానికులను స్థానికేతర జిల్లాలకు కేటాయించిందని అన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి పది నెలలు కావస్తున్నా సీపీఎస్ రద్దుపై ఓ కమిటీని నియమించలేదన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో సీపీఎస్‌ను ఎలా రద్దు చేశారో అధ్యయనం చేయాలని సూచించారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకుని వెంటనే అమలు చేయాలన్నారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌తో ఆరోగ్య కార్డులను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. తెలంగాణ వచ్చాక ఉద్యోగ సంఘాలకు కనీస గౌరవం లేదన్నారు. రాష్ట్రంలో పెన్షనర్ల బాధలు వర్ణనాతీతమని ఆందోళన వ్యక్తం చేశారు. వీఆర్‌వో, వీఆర్‌ఏలను గత ప్రభుత్వం ఒక్క కలంపోటుతో తొలగించిందని చెప్పారు. ఐదు వేల పోస్టులను మంజూరు చేయలేదన్నారు. దీంతో కారుణ్య నియామకాలు చేపట్టేందుకు అవకాశం లేకుండా పోయిందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీద పూర్తి విశ్వాసం ఉందనీ, అన్ని విషయాలపై ఆయనకు అవగాహన ఉందని చెప్పారు. తమను పిలిచి మాట్లాడితే సమస్యలు పరిష్కరమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తమ సమస్యల్లో ఆర్థికపరమైనవీ, ఆర్థికేతర అంశాలు కూడా ఉన్నాయని వివరించారు. ప్రతినెలా ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ జేఏసీ కో చైర్మెన్లు చావ రవి, జి సదానందంగౌడ్, వంగా రవీందర్‌రెడ్డి, అశోక్, దామోదర్‌రెడ్డి, పి మధుసూదన్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, ముజీబ్ హుస్సేనీ, డిప్యూటీ సెక్రెటరీ జనరల్ ఎ సత్యనారాయణ, వైస్ చైర్మెన్లు ఎం మోహన్‌నారాయణ, పబ్లిసిటీ సెక్రెటరీ బి శ్యామ్, నాయకులు వై అశోక్‌కుమార్, పి నాగిరెడ్డి, టి లింగారెడ్డి, కటకం రమేష్, పర్వతి సత్యనారాయణ, ఎండీ అబ్దుల్లా, ఎం రాధాకృష్ణ, మణిపాల్‌రెడ్డి, జి దీపారెడ్డి, ఎస్ ఉమాదేవి, టి శ్రీనివాసరావు, కె శ్రీకాంత్, కృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.49 కోట్లతో అసెంబ్లీ పునరుద్ధరణ పనులు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్



తెలంగాణ అసెంబ్లీని అగాఖాన్ ట్రస్ట్ రూ. 49 కోట్ల అంచనాతో పునరుద్ధరణ చేస్తున్నదని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, శాసనసభ వ్యవహారాలు, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి శ్రీధర్‌బాబు తెలిపారు. అసఫ్ జాహీల నిర్మాణశైలితో ఉన్న అసెంబ్లీ పాతభవనాన్ని మూడు నెలల్లో పునరుద్ధరిస్తామన్నారు. పనులు వేగంగా చేపట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారని గుర్తు చేశారు. నిజాం తరహాలో అసెంబ్లీని ఎలా కట్టారో అలా మార్పులు చేస్తున్నామని వివరించారు. మంగళవారం అసెంబ్లీ లోని స్పీకర్ ఛాంబర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్‌చైర్మెన్ బండా ప్రకాష్‌తో కలిసి భవన నిర్మాణ పురోగతిపై సమీక్షించిన ఇరువురు మంత్రులు భవనాన్ని పునర్నిర్మిస్తున్న అగాఖాన్ ప్రతినిధులు, ఆర్‌అండ్‌బీ అధికారులు, అసెంబ్లీ కార్యదర్శి నరసింహాచారి, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పునరుద్ధరణ పనులను పరిశీలించారు. అనంతరం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీడియాతో మాట్లాడుతూ పార్లమెంట్ సెంట్రల్ హాల్ తరహాలో అసెంబ్లీ, కౌన్సిల్ ఒకే దగ్గర ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పుడు అసెంబ్లీ నుంచి కౌన్సిల్‌కు వెళ్లాలంటే సీఎం, మంత్రులు వాహనంలో వెళ్లాల్సి వస్తున్నదని గుర్తు చేశారు. ఆ రెండు భవనాలు ఒకే దగ్గర ఉంటే సమయం ఆదా అవుతుందని అభిప్రాయపడ్డారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు విద్యుత్ చార్జీల అంశంపై ఈఆర్సీ దగ్గరకు కేటీఆర్ వెళ్లటం పెద్ద జోక్ అని విమర్శించారు. ఆయనే ఓ జోకర్ అని వ్యాఖ్యానించారు. పార్లమెంట్‌లో బీఆర్‌ఎస్‌కు ఒక్క సీటు కూడా రాలేదనీ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించినా కూడా బీఆర్‌ఎస్ నేతలకు ఇంకా బుద్ధి రావడం లేదని విమర్శించారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత కరెంటును తమ ప్రభుత్వం ఇస్తున్నదని తెలిపారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారని మంత్రులు ప్రశ్నించారు. అంతేకాదు, భవనానికి కావాల్సిన విద్యుదీకరణ వ్యవస్థ, ప్లంబింగ్ పనులపై టెండర్లు పిలవాలని మంత్రులు ఆర్‌అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందనకు ఆదేశాలు జారీ చేశారు. అంతేకాదు అగాఖాన్ ట్రస్ట్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ. 2 కోట్ల నిధులపై సమావేశం నుంచే ఉప ముఖ్యమంత్రితో మాట్లాడి అప్పటికప్పుడు విడుదల చేయించారు. బిల్లుల కోసం ప్రజోపయోగమైన పనులు ఆపొద్దని అధికారులకు సూచించిన మంత్రి, ఏవైనా బిల్లులు పెండింగ్‌లో ఉంటే తనకుగానీ, సహచర మంత్రి శ్రీధర్‌బాబుకు గానీ తెలిపితే వెంటనే నిధులు విడుదలయ్యేలా చేస్తామన్నారు. ఈ హెరిటేజ్ భవనం అందుబాటులోకి వస్తే, కౌన్సిల్ హాల్‌ను అసెంబ్లీ భవనంలోకి మార్చవచ్చన్నారు. పార్లమెంటు తరహాలో వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటే ప్రజలకు అసెంబ్లీ మరింత చేరువ అవుతుందన్నారు. అంతేకాదు పార్కింగ్, సెక్యూరిటీ సిబ్బందికి ప్రత్యేక గదులను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు అసెంబ్లీ పునరుద్ధరణ పనులు వేగంగా సాగేందుకు ప్రత్యేకంగా ఒక ఎస్‌ఈ స్థాయి అధికారిని నియమించి పర్యవేక్షించాలని ప్రత్యేక కార్యదర్శి హరిచందనను ఆదేశించారు. పనుల్లో అలసత్వానికి తావులేకుండా చూడాలని సూచించారు. లోక్‌సభ, రాజ్యసభ తరహాలో ఉన్నట్టుగానే అసెంబ్లీ భవన ప్రాంగణంలో సెంట్రల్ హాల్‌ను కూడా అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అలాగే తన ఐటీ శాఖ ద్వారా అసెంబ్లీకి అవసరమైన నెట్‌వర్కింగ్ సేవలను అందించేందుకు కావాల్సిన ప్రతిపాదనలు పంపిస్తే వెంటనే ఆమోదం తెలుపుతామని చెప్పారు.

రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డిపై ఏసీబీ కేసు నమోదు

- విలువైన డాక్యుమెంట్స్ గుర్తింపు

నవతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ భూపాల్ రెడ్డి ఆస్తులను ఏసీబీ అధికారులు మంగళవారం సీజ్ చేశారు. సుమారు రూ. 9కోట్ల మేర స్థిర, చర ఆస్తులను సీజ్ చేయడంతో పాటు విలువైన డాక్యుమెంట్స్ కూడా అధికారులు గుర్తించారు. ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి అడిషనల్ కలెక్టర్ భూపాల్‌రెడ్డి ధరణికి సంబంధించిన ఓ వివాదంలో రూ. 8లక్షలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి చిక్కారు. దాంతో ఏసీబీ అధికారులు అతనిపై అక్రమ ఆస్తుల కేసు నమోదు చేశారు. భారీగా అక్రమ ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో ఏసీబీ దర్యాప్తు ముమ్మరం చేసింది. భూపాల్‌రెడ్డి, బంధువుల ఇండ్లలో, మరో నాలుగు చోట్ల సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో రూ. 5,05,71,676 విలువ చేసే స్థిర, చర ఆస్తులతో పాటు మరో రూ. 4,19,40,158ల విలువైన అనుమానిత ఆస్తులను ఏసీబీ అధికారులు గుర్తించారు. డాక్యుమెంట్ విలువ ప్రకారం ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో మూడు రెట్లు అధికంగా ఉండనున్నట్టు అధికారులు అంచనాలు వేస్తున్నారు.

ఏసీబీ వలలో మున్సిపల్ కమిషనర్

(మొదటిపేజీ తరువాయి)

రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. మంగళవారం ఈ విషయాన్ని ఏసీబీ అడిషనల్ ఎస్పీ బి.కృష్ణ గౌడ్ విలేకరులకు వెల్లడించారు. పెబ్బేరు పట్టణానికి చెందిన ఎద్దుల వెంకటేష్ అనే కాంట్రాక్టర్.. ఐదేండ్లుగా కాంట్రాక్ట్ పనిచేస్తున్నాడు. కాగా, 2023లో పట్టణంలోని 2,3,7,10 వార్డుల్లో జనరల్ ఫండ్ నిధులతో టైలెట్ పెయింటింగ్స్, సీసీ రోడ్డు పనులు చేశాడు. ఒక్కో పనికి రూ.83,890 చొప్పున మూడు పనులకు గానూ మొత్తం రూ.2.50 లక్షల బిల్లులు చేయడానికి రూ.25 వేలిస్తేనే చేస్తానని కమిషనర్ కాంట్రాక్టరుకు చెప్పారు. దాంతో రూ.20 వేలు ఇచ్చేందుకు కాంట్రాక్టర్ అంగీకరించాడు. అనంతరం కాంట్రాక్టర్ ఈ విషయాన్ని.. ఏసీబీ మహబూబ్‌నగర్ బ్రాంచ్ అధికారులకు తెలిపాడు. ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో మంగళవారం మధ్యాహ్నం 12.50 గంటలకు కమిషనర్‌కు కాంట్రాక్టర్ రూ.20వేల నగదు ఇచ్చి బయటకి వచ్చిన వెంటనే.. నగదుతో రెడ్ హ్యాండెడ్‌గా కమిషనర్‌ను పట్టుకున్నారు.

రూ.20వేల నగదును స్వాధీనం చేసుకుని కమిషనర్ ఆది శేషును అదుపులోకి తీసుకున్నారు. ఇదే సమయంలో, హైదరాబాద్‌లో ఉన్న కమిషనర్ నివాసంలో కూడా ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు సోదాలు నిర్వహి స్తున్నట్టు వెల్లడించారు. కాగా, హైదరాబాద్ నాంపల్లి కోర్టులోని స్పెషల్ కోర్టులో బుధవారం హాజరు పరచనున్నట్టు ఏసీబీ అడిషనల్ ఎస్పీ బి.కృష్ణ గౌడ్ తెలిపారు. ఎవరైనా లంచాలు అడిగితే 1064 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు సయ్యద్ అబ్దుల్ ఖాదర్, జిలాని, లింగస్వామితోపాటు పదిమంది సిబ్బంది పాల్గొన్నారు.

సెబీ చీఫ్ మాధబికి కేంద్రం క్లీన్‌చిట్

(మొదటిపేజీ తరువాయి)

(సెబీ) ఛైర్‌పర్సన్ మాధబి పురీ బచ్‌కు కేంద్రం క్లీన్‌చీట్ ఇచ్చిందని సమాచారం. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకూ ఆమె కొనసాగుతారని కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నట్టు జాతీయ మీడియాల్లో రిపోర్టులు వస్తోన్నాయి. అదానీ గ్రూప్ అనుబంధ విదేశీ సంస్థల్లో మాధబి పెట్టుబడులు పెట్టారని హిండెన్‌బర్గ్ ఓ రిపోర్ట్‌లో పేర్కొన్న విషయం తెలిసిందే. మరోవైపు ఆమె భర్త ధావల్ బచ్‌కు చెందిన సొంత కన్సల్టెన్సీ సంస్థ అగోరా అడ్వైజరీ ప్రయివేటు లిమిటెడ్ సంస్థతో ఆమెకు సంబంధాలు ఉన్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. ఆ సంబంధాల ద్వారా అగోరా సంస్థకు పలు కార్పొరేట్ కంపెనీల నుంచి కోట్లలో ఆదాయం సమకూరిందని వెల్లడించింది. మరోవైపు మాధబి ఇప్పటికీ ఐసీఐసీఐ బ్యాంక్ నుంచి ఆదాయం పొందుతున్నారని ఆరోపించింది. సెబీ ఛైర్‌పర్సన్‌కు వ్యతిరేకంగా ఆధారాలు ఉన్నా..సెబీ ఉద్యోగులు నిరసనలు చేసినా..మోడీ సర్కార్ లైట్ తీసుకున్నది. అంతేకాదు ఆమెపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతోన్న క్రమంలో ఆర్థిక మంత్రిత్వ శాఖ పెద్దగా విచారణ ఏమీ జరపకుండానే మాధబికి క్లీన్‌చిట్ ఇవ్వడం గమనార్హం.

మూసీ కన్నీళ్లు



(మొదటిపేజీ తరువాయి)

తీర్చిదిద్దాలని సంకల్పించింది. ఇందుకు గాను నది రెండు వైపులా 50 మీటర్ల బఫర్‌జోన్ పరిధిలో నిర్మాణాలన్నింటినీ తొలగించనున్నారు. గత మూడు నెలలుగా రెవెన్యూ, ఇరిగేషన్, జీహెచ్ఎంసీ తదితర విభాగాలతో కూడిన 30 బృందాలు లంగర్‌హౌజ్ నుంచి ఉప్పల్ వరకు ఇంటింటి సర్వే నిర్వహించాయి. నదీ గర్భంలో 1,680, రివర్‌బెడ్, బఫర్‌జోన్‌లలో 10,200 మొత్తం 11 వేల పైచిలుకు ఇండ్లు మూసీలో ఉన్నట్టు సర్కార్ నిర్ధారించింది. వీరిని విడతల వారీగా తరలించాలని ప్రభుత్వం యాక్షన్‌ప్లాన్ సిద్ధం చేసింది. దీని ప్రకారం దాదాపు లక్ష మంది ప్రజలను మూసీ పరివాహక ప్రాంతం నుంచి తరలించాలి. అంటే రాష్ట్రంలోనే అతి పెద్ద పునరావాసం అన్న మాట. ఈ నేపథ్యంలో నష్ట పరిహారం, తరలింపు విషయంలో సర్కార్ ఎలా ముందుకెళుతుందనే విషయంపై ఇంకా స్పష్టత లేదు. అధికారులు మాత్రం నదికిరువైపులా రివర్‌బెడ్, బఫర్‌జోన్ పరిధిలో గుర్తించిన ఇండ్లకు మార్కింగ్ చేశారు. ఖాళీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని వారిని మౌఖికంగా ఆదేశించారు. అయితే దశాబ్దాలుగా ఈ తీర ప్రాంతాన్ని ఆవాసంగా చేసుకుని బతుకుతున్న ప్రజల్లో భిన్నాభిప్రాయాలున్నాయి. నది గర్భంలో ఉన్న వారు వెళ్లేందుకు సిద్ధపడుతుండగా, రివర్‌బెడ్‌పై చిన్న చిన్న ఇండ్లను నిర్మించుకున్న వారు మాత్రం పరిహారం పూర్తి స్థాయిలో ఇస్తేనే వెళదామనే ఆలోచనతో ఉన్నారు. వీరిలో ఈ ప్రతిపాదనను పూర్తిగా వ్యతిరేకిస్తున్న వారు కూడా కొంతమంది ఉన్నారు. ఇక బఫర్ జోన్‌లో ఉన్న పదివేల కుటుంబాలు మాత్రం ఎక్కడికి వెళ్లోమని తెగేసి చెబుతున్నాయి. పుట్టింది ఇక్కడే, బతుకంతా ఇక్కడే.. బుల్డోజర్లు రానీ, మరేదైనా రాని చావనైనా చస్తాం కానీ ఖాళీ చేయబోయబోమని తెగేసి చెబుతున్నారు. కాని ఎన్ని అవాంతరాలెదురైనా మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టను పట్టాలెక్కించాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉంది. అయితే ఎలా ముందుకెళ్లాలనే దానిపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. నిర్వాసితుల్ని ఒప్పించిన తర్వాతే వారిని తరలించాలని ప్రాథమికంగా నిర్ణయించినప్పటికీ, ఆ దిశగా బాధితులతో క్షేత్రస్థాయిలో సంప్రదింపులు జరపడంలేదు.

చావైనా, బతుకైనా ఇక్కడే :

ఆర్. మణమ్మ, మారుతీనగర్, నాగోల్



చావైనా, బతుకైనా ఇక్కడే. ఇక్కడి నుంచి కదిలేది లేదు. ఇండ్లల్లో పనిచేసి పైసా పైసా కూడబెట్టి 25 ఏండ్ల క్రితం పట్టా భూమిని కొనుగోలు చేసి ఇల్లు కట్టుకున్నాం. నా భర్త చనిపోయారు. ఇప్పుడు కూల్చుతామంటే ఎట్లా, యాడికిపోయి బతకాలే.

ఆస్తికి సమానంగా పరిహారం ఇస్తే వెళ్తాం :

కె.రాజు, సత్యనగర్, చైతన్యపురి



గత 20 ఏండ్లుగా ఇక్కడే ఉంటున్నాం. ఐదేండ్ల కింద 56 గజాల స్థలం కొనుక్కోని ఇల్లు కట్టుకున్నాం. ఇప్పుడు దాని విలువ మార్కెట్ రేట్ ప్రకారం దాదాపు రూ.60 లక్షలుంటుంది. ఆస్తుల మొత్తానికి పరిహారంతో పాటు ఉపాధి కల్పిస్తామంటే వెళతాం.

అధికారులు దౌర్జన్యం చేస్తున్నారు :

ఎండి.ఖలీల్, చిరు వ్యాపారి, అసద్‌బాబానగర్

అసద్‌బాబానగర్‌లో 20 ఏండ్లుగా ఉంటున్నాం. అధికారులు దౌర్జన్యంగా మా ఇల్లు కూల్చేశారు. డబుల్‌బెడ్ రూం ఇండ్లు ఇస్తాం.. వెళ్లాలని బలవంతం చేస్తున్నారు. వారిచ్చే ఇల్లు ఏ మూలకు సరిపోదు. మా స్థలానికి బదులుగా హైదరాబాద్ నగరంలో మరో చోట స్థలం ఇచ్చి ఇల్లు కట్టివ్వాలి.

పునరావాసం తర్వాతే నిర్వాసితుల్ని తరలించాలి

ఎండి.అబ్బాస్, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

(మొదటిపేజీ తరువాయి)

అత్యధికంగా ఉన్నారు. వారందరికీ ఇంటి అనుమతులు, నల్లా, విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. బఫర్ జోన్ అని తెలిసినా గత ప్రభుత్వాలు ఎందుకు అనుమతించాయి. ఇండ్లు కోల్పోయిన నిర్వాసితులకు, మార్కెట్ ధర ప్రకారం పరిహారమివ్వాలి. అంతే మొత్తం స్థలంలో కొత్త ఇండ్లు నిర్మించడంతో పాటు ఉపాధి కల్పించాలి.

అవినీతి కేసులో డిస్మిస్డ్ పోలీసు అధికారి వజెకు బెయిల్

ముంబయి : అవినీతి కేసులో డిస్మిస్ అయిన పోలీసు అధికారి సచిన్ వజెకు బాంబే హైకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో మహారాష్ట్ర మాజీ హోం మంత్రి అనీల్ దేశ్‌ముఖ్ కూడా వున్నారు. జస్టిస్ ఎం.ఎస్.సోనక్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ బెయిల్ మంజూరు చేస్తూ, ప్రత్యేక సిబిఐ కోర్టు ఇందుకోసం షరతులను రూపొందిస్తుందని పేర్కొంది. అయితే జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) నమోదు చేసిన ఆంటాలియా బాంబు బెదిరింపు కేసులో వజె జ్యుడీషియల్ కస్టడీలో వుండడంతో బెయిల్ మంజూరైనా ఆయన జైల్లోనే కొనసాగాల్సి వస్తోంది. ఈ కేసులో తాను అప్రూవర్‌గా మారానని, అందువల్ల తనను బెయిల్‌పై విడుదల చేయాలని వజె కోరుతున్నారు. అప్రూవర్‌గా మారిన తర్వాత కూడా జైల్లో వుంచితే ప్రాథమిక హక్కులను ఉల్లంఘించినట్లే కాగలదని వజె తరపు న్యాయవాది అమద్ పోండా పేర్కొన్నారు. అవినీతి కేసులో ఇప్పటివరకు వజె సాక్ష్యమివ్వలేదంటూ సిబిఐ ఆయన బెయిల్‌ను వ్యతిరేకించింది. ఆయనను బెయిల్‌పై విడుదల చేస్తే కేసు ప్రయోజనాల రీత్యా మంచిది కాదని వ్యాఖ్యానించింది.

ముందుగా విశ్వాస పునరుద్ధరణ జరగాలి

- భారత్, చైనా సంబంధాలపై ఆర్మీ చీఫ్ ద్వివేది

న్యూఢిల్లీ : విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి, పరస్పరం తిరిగి హామీలిచ్చుకోవడానికి భారత్, చైనాలు ప్రయత్నిస్తున్నాయని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది పేర్కొన్నారు. ఒకసారి ఆ చర్యలు తీసుకున్న తర్వాత ఇక బలగాల ఉపసంహరణ, ఉద్రిక్తతల నివారణ, వాస్తవాధీన రేఖ వద్ద సాధారణ నిర్వహణా చర్యలు వంటి వన్నీ కొనసాగుతాయని చెప్పారు. తూర్పు లడఖ్‌లో గస్తీ, బలగాల ఉపసంహరణపై భారత్, చైనాలు ఒప్పందానికి వచ్చాయని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి ప్రకటించిన ఒక రోజు తర్వాత ఈ ప్రకటన వెలువడింది. "ఇప్పటివరకు జరిగిందైతే, విశ్వాసాన్ని పునరుద్ధరించుకోవడానికి మేం ప్రయత్నిస్తున్నాం. పరస్పరం ఒకరినొకరు చూసుకుని, ఒకరిని ఒకరు నమ్మేలా చేయగలిగితేనే విశ్వాసాన్ని పునరుద్ధరించుకోగలుగుతాం. ఇరుపక్షాలు కూడా పరస్పరం హామీలిచ్చుకోవాల్సి వుంటుంది. గస్తీకి అనుమతించడమనేది ఆ రకమైన అవకాశాన్ని ఇస్తుంది. మొదటగా చర్యలంటూ ప్రారంభమయ్యాయి, కాబట్టి ఇక వరుసగా తదుపరి దశలన్నీ కొనసాగుతాయి." అని జనరల్ ద్వివేది వ్యాఖ్యానించారు. యునైటెడ్ సర్వీస్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇండియా నిర్వహించిన కల్నల్ ప్యారా లాల్ 28వ స్మారకోపన్యాసం సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మనకు సంబంధించినంతవరకు 2020 ఏప్రిల్‌కు ముందు నాటి పరిస్థితులను పునరుద్ధరించాలని భావిస్తున్నామన్నారు. ఆ తర్వాత బలగాల ఉపసంహరణ, ఉద్రిక్తతల నివారణ, వాస్తవాధీన రేఖ వద్ద సాధారణ నిర్వహణ చర్యలు కొనసాగుతాయన్నారు. అవన్నీ వరుస దశల్లో చేపడతామన్నారు.

పిచ్‌పైనే ఫోకస్!

- సిరీస్ సమంపై భారత్ గురి
- పుణెలో ఇరు జట్ల నెట్ ప్రాక్టీస్

మూడు మ్యాచుల టెస్టు సిరీస్ ఆసక్తికరంగా మారింది. బెంగళూర్‌లో న్యూజిలాండ్ ఊహించని రీతిలో విజయం సాధించి.. ఆతిథ్య జట్టు భారత్‌కు గట్టి షాక్ ఇచ్చింది. బెంగళూర్ టెస్టు ఫలితం ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ రేసును సైతం రసవత్తరంగా మార్చింది. భారత్, న్యూజిలాండ్ రెండో టెస్టు గురువారం నుంచి ఆరంభం కానుండగా...సిరీస్ సమంపై రోహిత్‌సేన కన్నేసింది. ఈ నేపథ్యంలో పుణె 'పిచ్'పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

నవతెలంగాణ-పుణె



స్వదేశంలో టీమ్ ఇండియా ఒత్తిడిలో పడటం చాలా అరుదు. సొంతగడ్డపై ప్రత్యర్థులను ఉక్కిరి బిక్కిరి చేస్తూ ఏకపక్ష విజయాలు సాధించటం భారత్‌కు పరిపాటి. బోర్డర్ గవాస్కర్ సిరీస్‌కు వరుస విజయాల ఊపుతో వెళ్లాలని భావించిన రోహిత్‌సేనకు న్యూజిలాండ్ ఊహించని షాక్ ఇచ్చింది. శ్రీలంక చేతిలో టెస్టు సిరీస్ కోల్పోయి భారత్‌లో అడుగుపెట్టిన కివీస్.. మేఘావృత వాతావరణంలో టీమ్ ఇండియాను ఝలక్ ఇచ్చింది. బెంగళూర్ టెస్టులో మెరుపు విజయంతో న్యూజిలాండ్ సిరీస్‌లో 1-0తో ఆధిక్యం సాధించింది. చివరి రెండు మ్యాచుల్లో విజయం సాధిస్తేనే సిరీస్ భారత్‌కు దక్కనుండగా.. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ రేసులోనూ ముందంజలో నిలిచేందుకు ఆస్కారం ఉంది. ఈ నేపథ్యంలో గురువారం నుంచి ఆరంభం కానున్న రెండో టెస్టులో విజయమే లక్ష్యంగా భారత్ బరిలోకి దిగుతోంది. అందుకోసం పలు ముందస్తు జాగ్రత్తలు సైతం తీసుకుంటుంది.

స్పిన్ పిచ్ సిద్ధం : పుణెలో స్పిన్‌కు రంగం సిద్ధమైంది. మంగళవారం పుణెలో ప్రాక్టీస్ సెషన్‌కు వచ్చిన కెప్టెన్ రోహిత్ శర్మ, చీఫ్ కోచ్ గౌతం గంభీర్‌లు నేరుగా పిచ్ వద్దకు వెళ్లారు. అప్పటివరకు పిచ్‌పై దుప్పటి కప్పి ఉంచగా.. భారత కోచ్, కెప్టెన్ కోసం కవర్లను తొలగించారు. బీసీసీఐ చీఫ్ క్యూరేటర్ సహా లోకల్ క్యూరేటర్ సిబ్బందితో గంభీర్, రోహిత్‌లు సంభాషించారు. పుణెలో నల్లమట్టి పిచ్‌లు ఉన్నాయి. రెండో టెస్టు కోసం సైతం నల్లమట్టితో చేసిన పిచ్‌నే సిద్ధం చేశారు. నల్ల మట్టితో చేసిన పిచ్ కాస్త ఎండ తగలగానే పగుళ్లు తేలుతుంది. పగుళ్లు తేలిన పిచ్‌పై స్పిన్నర్లను ఎదుర్కొవటం ఏమాత్రం సులువు కాదు. పుణె టెస్టులో భారత్ అవసరమైతే నలుగురు స్పిన్నర్లను సైతం బరిలోకి నిలిపే అవకాశం లేకపోలేదు. ఇప్పటివరకు పుణెలో రెండు టెస్టు మ్యాచ్‌లు జరుగగా.. రెండింటిలోనూ ఏకపక్ష ఫలితాలు రావటం గమనార్హం. భారత జట్టులో నలుగురు స్పిన్నర్లు ఉన్నప్పటికీ జట్టు మేనేజ్‌మెంట్ ఐదో స్పిన్నర్ వాషింగ్టన్ సుందర్‌ను కోరింది. అశ్విన్, జడేజా, కుల్దీప్, అక్షర్, వాషింగ్టన్‌లలో ఏకంగా నలుగురు స్పిన్నర్లు తుది జట్టులో నిలిస్తే న్యూజిలాండ్ బ్యాటర్లకు పరుగుల వేట గగనం కానుంది.

జోరుగా ప్రాక్టీస్ : రెండో టెస్టు కోసం భారత్, న్యూజిలాండ్ జట్లు మంగళవారం జోరుగా సాధన చేశాయి. పుణె శివారు ప్రాంతంలో ఉన్న ఎంసీఏ స్టేడియంలో గత మ్యాచ్‌లో గాయపడిన రిషబ్ పంత్, గాయంతో బెంచ్‌పై కూర్చున్న శుభ్‌మన్ గిల్ నెట్స్‌లో బ్యాటింగ్ చేశారు. బెంగళూర్‌లోనూ గిల్ బ్యాటింగ్ చేయగా.. అక్కడ కాస్త ఇబ్బందిపడినట్టు సమాచారం. మెడ నొప్పితో బాధపడుతున్న గిల్ గురువారం నాటికి పూర్తి ఫిట్‌నెస్ సాధించే అవకాశం ఉంది. రిషబ్ పంత్ కీపింగ్ చేస్తుండగా మోకాలి గాయానికి గురయ్యాడు. పుణెలో మరో వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్ గ్లౌవ్ పట్టుకోగా.. పంత్ కేవలం బ్యాటింగ్ మాత్రమే సాధన చేశాడు.

భారత్‌కు ఎదురుదెబ్బ

హాకీ, క్రికెట్, షూటింగ్, బ్యాడ్మింటన్ అవుట్
2026 గ్లాస్గో కామన్‌వెల్త్ గేమ్స్



లండన్ : టీమ్ ఇండియాకు భారీ ఎదురుదెబ్బ. కామన్‌వెల్త్ క్రీడల్లో భారత్ భారీగా పతకాలు సాధించే క్రీడాంశాలను 2026 గ్లాస్గో కామన్‌వెల్త్ క్రీడల జాబితా నుంచి తొలగించారు. కామన్‌వెల్త్ క్రీడల నిర్వహణ ఆతిథ్య దేశానికి వ్యయ భారంగా మారకూడనే ప్రణాళికలో భాగంగా బ్యాడ్మింటన్, రెజ్లింగ్, హాకీ, క్రికెట్ సహా షూటింగ్‌లను క్రీడల జాబితా నుంచి తీసివేశారు. ఈ మేరకు కామన్‌వెల్త్ క్రీడల నిర్వాహకులు మంగళవారం వెల్లడించారు. బ్యాడ్మింటన్‌లో భారత్ ఇప్పటివరకు 10 స్వర్ణాలు సహా 31 పతకాలు సాధించింది. రెజ్లింగ్, షుటింగ్‌లోనూ పతకాల పంట పండించింది. బర్మింగ్‌హామ్ కామన్‌వెల్త్ క్రీడల్లోనూ షుటింగ్‌కు చోటు దక్కలేదు. తాజా గ్లాస్గో ప్రణాళికల్లోనూ షుటింగ్‌ను తొలగించారు. హాకీ వరల్డ్‌కప్ సమీపిస్తున్న కారణంగా కామన్‌వెల్త్‌లో హాకీ క్రీడను పక్కనపెట్టడానికి కారణంగా చెప్పవచ్చు. 2026 కామన్‌వెల్త్ క్రీడలు కేవలం నాలుగు వేదికల్లోనే నిర్వహిస్తున్నారు. అథ్లెట్ల కోసం ప్రత్యేకంగా 'విలేజ్'ను నిర్మించటం లేదు. నగరంలోని హెూటల్స్‌లోనే క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులకు బస ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ప్రణాళికలు తయారు చేశారు. భారత్ పతకాలు పండించే క్రీడాంశాలను కామన్‌వెల్త్ క్రీడల నుంచి తొలగించటం పట్ల భారత క్రీడాకారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

టైటాన్స్‌కు రెండో ఓటమి

ప్రొ కబడ్డీ లీగ్ 2024



హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ 11వ సీజన్‌లో ఆతిథ్య తెలుగు టైటాన్స్ వరుసగా రెండో మ్యాచ్‌లో పరాజయం పాలైంది. కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ 19 పాయింట్లతో విజృంభించడంతో జైపూర్ పింక్ పాంథర్స్ జట్టు 30 పాయింట్ల తేడాతో వరుసగా రెండో విజయం సొంతం చేసుకుంది. మంగళవారం రాత్రి ఇక్కడి జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో జైపూర్ 52%-%22 తేడాతో తెలుగు టైటాన్స్‌ను ఓడించింది. జైపూర్ జట్టులో అర్జున్ తో పాటు అభిజీత్ మాలిక్ (8) కూడా ఆకట్టుకున్నాడు. ఆతిథ్య టైటాన్స్ జట్టులో పవన్ సెహ్రావత్ (7), విజయ్ మాలిక్ (5), ఆశీష్ నర్వాల్ (5) పోరాడినా ఫలితం లేకపోయింది. ఈ మ్యాచ్‌లో డిఫెన్స్‌లో పూర్తిగా తేలిపోయిన టైటాన్స్ నాలుగుసార్లు ఆలౌటైంది.

నవచిత్రం

చదువు విలువ తెలిపే పొట్టేల్




యువ చంద్ర కృష్ణ, అనన్య నాగళ్ల లీడ్ రోల్స్‌లో సాహిత్ మోత్కూరి డైరెక్ట్ చేస్తున్న రూరల్ యాక్షన్ డ్రామా 'పొట్టేల్'.

ఈ చిత్రంలో అజయ్ పవర్ ఫుల్ రోల్ పోషిస్తున్నారు. నిసా ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిశాంక్ రెడ్డి కుడితి, ప్రజ్ఞ సన్నిధి క్రియేషన్స్‌పై సురేష్ కుమార్ సడిగే ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈనెల 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు.

ఈ వేడుకకి ముఖ్యఅతిథిగా డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా హాజరయ్యారు. హీరో యువ చంద్ర మాట్లాడుతూ, 'మైత్రి మూవీ వారు ఈ సినిమాని రిలీజ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఈ మూవీ ప్రాపర్ థియేటర్ ఎక్స్‌పీరియన్స్ మూవీ. ఇందులో ఎమోషన్ ఆడియన్స్ మనసుల్ని కదిలించేలా ఉంటుంది' అని చెప్పారు.

'ఈ కథ విన్నాను. తర్వాత సినిమా చూశాను. చాలా బాగా నచ్చింది. రెండు పాటలు చాలా బాగా నచ్చాయి. ట్రైలర్ కూడా చాలా బాగుంది. అజయ్ సినిమా అంతా భయపెట్టించి వదిలారు. యువ, అనన్య, నోయల్, జీవ సూపర్‌గా యాక్టింగ్ చేశారు. సాహిత్ ఇంత అద్భుతంగా తీస్తాడని ఊహించలేదు. ప్రొడ్యూసర్స్ చాలా ప్యాషన్‌తో సినిమా తీశారు. సినిమా మీ అందరికీ నచ్చుతుంది. న్యూ కైండ్ ఆఫ్ ట్రీట్‌మెంట్. ఈ బ్యాక్‌డ్రాప్‌లో 'రంగస్థలం' తర్వాత నేను చూసిన సినిమా ఇదే. అందర్నీ ఆలోచింపజేస్తుంది' అని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు.

ప్రజల కోసం పోరాటం



రాకేష్ వర్రే

రాకేష్ వర్రే టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'జితేందర్ రెడ్డి'. 'ఉయ్యాలా జంపాల, మజ్ను' సినిమాలు తీసిన విరించి వర్మ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం నవంబర్ 8న ప్రేక్షకుల ముందుకు రానుంది.

1980 కాలంలో జగిత్యాల చుట్టు పక్కల జరిగిన యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన సినిమా ఇది. ముదుగంటి క్రియేషన్స్ పై ముదుగంటి రవీందర్ రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమాకి సంబంధించిన ప్రమోషనల్ కంటెంట్ ఇప్పటికే అందరినీ విశేషంగా ఆకట్టుకుంది.

ట్రైలర్‌కి మిలియన్‌కి పైగా వ్యూస్ రావడం విశేషం. అంతే కాకుండా సినిమా టీజర్, గ్లిమ్స్, రెండు పాటలు ప్రేక్షకులని అమితంగా ఆకట్టుకున్నాయి. కాలేజీ రోజుల నుంచే ప్రజా సమస్యల కోసం పోరాడుతూ నక్సలైట్లతో జితేందర్ రెడ్డి చేసిన పోరాటాన్ని ఈ సినిమాలో చూపించారు. ఆ తర్వాత రాజకీయాల్లోకి రావడం, అప్పట్లో ముఖ్యమంత్రిగా ఉన్న సీనియర్‌తో మాట్లాడటం ట్రైలర్‌లో చూపించారు.

భిన్న కాన్సెప్ట్స్‌తో 2 సినిమాలు



సెవెల్ హిల్స్ సతీష్

నిర్మాత సెవెన్ హిల్స్ సతీష్ తన పుట్టిన రోజు సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, 'గతంలో నేను తీసిన 'బట్టల రామస్వామి' బయోపిక్, 'అందరి బంధువయా' సినిమాలు మంచి పేరు తీసుకొచ్చాయి. అలాగే రిలీజ్‌కి రెడీగా ఉన్న 'కాఫీ విత్ ఏ కిల్లర్', 'సోలో బాయ్' చిత్రాలు సైతం మిమ్మల్ని అలరిస్తాయి. క్రైం థ్రిల్లర్‌గా రానున్న 'కాఫీ విత్ ఏ కిల్లర్' సినిమాని ఆర్పీ పట్నాయక్ డైరెక్ట్ చేసారు. జీరో టూ హీరో జోనర్‌లో 'సోలో బాయ్' సినిమా రెడీ అయింది. కంటెంట్ ఉంటే సినిమాని తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ఆదరిస్తారు. నా గత సినిమాల మాదిరిగానే డెఫినిట్‌గా ఈ రెండు సినిమాలు డిఫరెంట్ జోనర్స్‌లో చేశాం. 'సోలో బాయ్' సినిమా ద్వారా నవీన్ కుమార్ అనే కొత్త దర్శకుడిని పరిచయం చేస్తున్నాం. ఈ సినిమా విడుదల ప్లాన్ చేస్తుంటే మా హీరో గౌతమ్ కృష్ణకి బిగ్ బాస్ అవకాశం వచ్చింది. అతను మళ్ళీ రాగానే, రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తాము. భిన్న కాన్సెప్ట్‌తో సినిమాలను తీయాలనే లక్ష్యంతో ఉన్నాను' అని అన్నారు.



ప్రభాస్

ఫ్యాన్స్‌కి బర్త్‌డే సర్‌ప్రైజ్..

ప్రభాస్ హీరోగా డైరెక్టర్ మారుతి రూపొందిస్తున్న మూవీ "రాజా సాబ్". ఈ సినిమాకి సంబంధించి ప్రభాస్ ఫ్యాన్స్ ఎదురుచూస్తున్న అప్డేట్ వచ్చేసింది. నేడు (బుధవారం) ప్రభాస్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా నుంచి అప్డేట్ ఇస్తున్నట్లు మేకర్స్ అనౌన్స్ చేశారు. ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌లో నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రభాస్ ఇప్పటిదాకా చేయని రొమాంటిక్ హర్రర్ జోనర్‌లో ఈ సినిమాను దర్శకుడు మారుతి రూపొందిస్తుండటంతో ఈ సినిమా మీద అందరిలో క్యూరియాసిటీ ఏర్పడింది. నయా అప్డేట్ అనౌన్స్‌మెంట్ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో ప్రభాస్ అల్ట్రా స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ లుక్, మేకోవర్ చాలా కొత్తగా ఉండబోతోంది. సూపర్ హిట్ సినిమాలతో టాలీవుడ్‌లో దూసుకెళ్తున్న ప్రెస్టీజియస్ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఈ సినిమాను భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో ఎక్కడా రాజీపడకుండా గ్రాండ్‌గా ప్రొడ్యూస్ చేస్తోంది. ఈ సినిమా తమ సంస్థలో ఒక బెంచ్ మార్క్ మూవీగా మిగిలిపోయేలా నిర్మిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీలో వచ్చే ఏడాది ఏప్రిల్ 10న గ్రాండ్‌గా ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ తుది దశలో ఉంది.

ప్రభాస్, నిధి అగర్వాల్, మాళవిక మోహనన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఎడిటింగ్ - కోటగిరి వెంకటేశ్వరరావు, సినిమాటోగ్రఫీ - కార్తీక్ పళని, మ్యూజిక్ - తమన్, ఫైట్ మాస్టర్ - రామ్ లక్ష్మణ్, కింగ్ సోలొమన్, ప్రొడక్షన్ డిజైనర్ - రాజీవన్, క్రియేటివ్ ప్రొడ్యూసర్ - ఎస్ కేఎన్, కో ప్రొడ్యూసర్ - వివేక్ కూచిభొట్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కృతి ప్రసాద్, ప్రొడ్యూసర్ - టీజీ విశ్వప్రసాద్, రచన, దర్శకత్వం - మారుతి.

ప్రతి ఒక్కరూ బఘీరలా ఫీల్ అవుతారు..



శ్రీ మురళి

'ఉగ్రమ్' ఫేమ్ శ్రీ మురళి నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బఘీర'. ప్రశాంత్ నీల్ ఈ చిత్రానికి కథ అందించారు. డాక్టర్ సూరి దర్శకత్వం వహించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిలింస్ బ్యానర్‌పై విజయ్ కిరగందూర్ ఈ చిత్రాన్ని నిర్మించారు.

రుక్మిణి వసంత్, ప్రకాష్ రాజ్ అచ్యుత్ కుమార్, గరుడ రామ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. పలు బ్లాక్‌బస్టర్‌లను విజయవంతంగా డిస్ట్రిబ్యూషన్ చేసిన ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్ఎల్‌పి ఈ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తోంది. దీపావళి కానుకగా ఈనెల 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరో శ్రీమురళి మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

- దర్శకుడు ప్రశాంత్ నీల్ స్టోరీ ఇచ్చి, నన్ను చేయమని చెప్పారు. ఆయన అంటే నాకు చాలా ఇష్టం. నా కెరీర్‌లో 'ఉగ్రం' లాంటి ఒక గొప్ప సినిమా ఇచ్చారు. అలాగే హోంబలే ఫిలింస్ ప్రొడ్యూస్ చేస్తామని ముందుకు వచ్చారు. అలా ఈ ప్రాజెక్టు మొదలైంది.
- ఇందులో పోషించిన పాత్ర కోసం మూడేళ్ళ పాటు జిమ్‌లో ట్రైనింగ్ తీసుకున్నాను. ఇది నాకు చాలా ఫేవరెట్ క్యారెక్టర్. ప్రశాంత్ నీల్ ఇచ్చిన కథని డైరెక్టర్ సూరి 100% అద్భుతంగా స్క్రీన్ మీదకు తీసుకొచ్చారు. ఈ స్టోరీని, ఐడియాని అద్భుతంగా విజువలైజ్ చేశారు. ఈ స్క్రిప్ట్‌కి ఏం కావాలో అవన్నీ అద్భుతంగా ఎగ్జిక్యూట్ చేశారు. ఇది లార్జర్ దెన్ లైఫ్ క్యారెక్టర్. యూనివర్సల్ అప్పీల్ ఉన్న కంటెంట్.
- ఈ సినిమా విషయంలో నాదొక సిన్సియర్ రిక్వెస్ట్. సినిమాకి బ్లాంక్ మైండ్‌తో రండి. నన్ను ఒక న్యూ బోర్న్ యాక్టర్‌గానే చూసి బ్లెస్ చేయమని కోరుతున్నాను. ఉగ్రం, బఘీర కంప్లీట్ డిఫరెంట్ ఫిలిమ్స్. ప్రతి ఒక్కరిలో హీరో ఉంటారు. ఆ హీరో ఎప్పుడు బయటకు వస్తాడో తెలియదు. 'బఘీర' సినిమా చూసి బయటకు వస్తున్నప్పుడు ప్రేక్షకులు కూడా 'బఘీర'లా ఫీల్ అవుతారని నమ్ముకున్నాను. త్వరలోనే 'ఉగ్రం 2' వివరాలు తెలియజేస్తాను.

శ్రీ చక్రం ప్రేరణతో రహస్యం ఇదం జగత్



మానస, కోమల్ ఆర్.భరద్వాజ్, స్రవంతి పత్తిపాటి

సైన్స్ ఫిక్షన్, మైథాలాజికల్ థ్రిల్లర్స్‌గా రూపొందుతున్న చిత్రం 'రహస్యం ఇదం జగత్'. నవంబరు 8న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. రాకేష్ గలేబి, స్రవంతి పత్తిపాటి, మానస వీణ, భార్గవ్ గోపీనాథం ముఖ్య తారలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని సింగిల్ సెల్ యూనివర్స్ ప్రొడక్షన్ పతాకంపై కోమల్ ఆర్ భరద్వాజ్ దర్శకత్వంలో పద్మ రావినూతుల, హిరణ్య రావినూతుల నిర్మిస్తున్నారు.

ఇటీవల ఈ చిత్ర టీజర్‌ను అమెరికాలోని డల్లాస్‌లో విడుదల చేశారు. ఆ టీజర్‌కు అందరి నుంచి మంచి స్పందన వస్తోంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు కోమల్ ఆర్.భరద్వాజ్ మాట్లాడుతూ, 'శ్రీ చక్రం ప్రేరణతో ఈ కథ తయారు చేశాను. కల్కి, హనుమాన్, కార్తికేయలా ఇది మైథలాజికల్ సినిమా. తెలుగు ప్రేక్షకులకు ఈ చిత్రం ద్వారా మన పురాణాల గురించి, మన మూలాల గురించి ఓ కొత్త విషయాన్ని చెప్పబోతున్నాం. ఈ జనరేషన్‌కు నచ్చే సినిమా ఇది. తప్పకుండా ఈ చిత్రం అందర్నీ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లి సర్‌ప్రైజ్ చేస్తుందనే నమ్మకం ఉంది' అని అన్నారు.

'నాకు ఈ అవకాశం ఇచ్చిన కోమల్‌కి థ్యాంక్స్. అందరం ఎంతో తపనతో చేసిన సినిమా ఇది' అని హీరోయిన్ మానస చెప్పారు. మరో నాయిక స్రవంతి పత్తిపాటి మాట్లాడుతూ,'ఓ మంచి సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. టీజర్‌లాగే సినిమా కూడా నచ్చుతుందనే నమ్మకం ఉంది' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

ఓరియంట్ సిమెంట్‌లో అదానీ వాటాల కొనుగోలు..!



న్యూఢిల్లీ : సిమెంట్ పరిశ్రమ రంగంలో గౌతం అదానీ ఏకచత్రాధిపత్యానికి మార్గం సుగమం చేసుకుం టున్నారు. క్రమంగా ఒక్కో కంపెనీని కొనుగోలు చేస్తూ పోతున్నారు. తాజాగా ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్‌లో 46.8 శాతం వాటాలను స్వాధీనం చేసుకోనున్నట్లు అదానీ గ్రూపు వెల్లడించింది. అదానీ గ్రూపులోని అంబూజా సిమెంట్స్ ద్వారా ఓరియంట్ సిమెంట్‌లో 46.8 శాతానికి సమానమయ్యే వాటాను రూ.8,100 కోట్లకు కొనుగోలు చేయనున్నారు. ప్రమోటర్ల నుంచి 37.9 శాతం, పబ్లిక్ నుంచి అదనంగా 8.9శాతం కొనుగోలు చేయనున్నట్లు అదానీ గ్రూప్ వెల్లడించింది.

మరో 26శాతం వాటా కోసం ఆఫర్ ఫర్ సేల్‌కు వెళ్లాలని యోచిస్తోంది. దీంతో ఆ సంస్థలో మెజారిటీ వాటాను సాధించు కోనుంది. ఈ కొనుగోలుతో 2025 నాటికి ఏటా ఉత్పత్తి 100 మిలియన్ టన్నులకు చేరనుందని అంబుజా సిమెంట్ డైరెక్టర్ కరణ్ అదానీ పేర్కొ న్నారు. అంబుజా, ఎసిసి సిమెంట్స్‌లో వాటాల కొనుగోలు ద్వారా సిమెంట్ వ్యాపారంలోకి ప్రవేశించిన అదానీ గ్రూప్ భారీ విస్తరణపై దృష్టి పెట్టింది. 2028 ఆర్థిక సంవత్సరానికి దేశీయ సిమెంట్ మార్కెట్‌లో తన వాటాను 20శాతానికి పెంచుకోవాలని లక్ష్యంగా చేసుకుంది. 2028 నాటికి ఏటా ఉత్పత్తిని 140 మిలియన్ టన్నులకు చేర్చాలని యోచిస్తోంది. అదానీ గ్రూప్ ప్రవేశంతో సిమెంట్ వ్యాపారంలో అనేక కంపెనీలు గట్టి పోటీని ఎదుర్కొంటున్నాయి.

మలేషియన్ సంస్థతో హెచ్ఎంఎ అగ్రో ఒప్పందం

హైదరాబాద్ : మలేషియా ప్రభుత్వానికి చెందిన సెలంగోర్ అగ్రికల్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వ్యవసాయోత్పత్తుల కంపెనీ హెచ్ఎంఎ అగ్రో ఇండస్ట్రీస్ వెల్లడించింది. గేదె మాంసం పరిశ్రమ అభివృద్ధికి సహాయపడే సహకార పరిశోధన ప్రాజెక్టుల కోసం ద్వైపాక్షిక వాణిజ్య సంబంధాల సులభతరానికి వీలు కల్పించనుందని పేర్కొంది.

మాంసం ప్రాసెసింగ్, సరఫరా గొలుసుల నాణ్యత, సామర్థ్యాన్ని మెరుగుపరచడం ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొంది. ఇరు దేశాల మధ్య వ్యవసాయ వాణిజ్య సంబంధాలను మెరుగుపరచడంతో ఈ ప్రక్రియలో రెండింటికి ప్రయోజనం చేకూరనుందని పేర్కొంది.

రూ.10 నాణెంపై చైతన్య క్యాంపెయిన్

- హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వెల్లడి

హైదరాబాద్ : రూ.10 నాణేలను అంగీకరించడంపై తెలంగాణ వ్యాప్తంగా ప్రజా చైతన్య క్యాంపెయిన్‌ను నిర్వహించినట్టు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ తెలిపింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో తమ 430 శాఖలు, 542 బిజినెస్ కరస్పాండెంట్ల ద్వారా రెండు రోజుల పబ్లిక్ అవేర్‌నెస్ క్యాంపెయిన్ (పీఏసీ)ను చేపట్టినట్లు పేర్కొంది. ఈ క్యాంపెయిన్‌లో రూ.10.96 లక్షల విలువ చేసే రూ.10 నాణేలను పంపిణీ చేసినట్టు తెలిపింది. ఈ నాణెం చెల్లిబాటుపై ఉన్న అపోహలను తొలగించడం ప్రధాన ఉద్దేశమని పేర్కొంది.

జొమాటో లాభాలు నాలుగు రెట్లు

న్యూఢిల్లీ : ప్రముఖ ఫుడ్ డెలివరీ సంస్థ జొమాటో ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 389 శాతం వృద్ధితో రూ.176 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.36 కోట్ల లాభాలు ఆర్జించింది. ఇదే సమయంలో రూ.2,848 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ2లో 68.50 శాతం పెరిగి రూ.4,799 కోట్లకు చేరింది.

రాడార్ స్టేషన్‌ను కేంద్రం ఆమోదించింది

- బీఆర్ఎస్ నేతలకు అభ్యంతరమేంటి? : టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

'దామగుండంలో రాడార్‌స్టేషన్ ఏర్పాటు చేసేందుకు కేంద్రం సంకల్పించింది. దానికి సీఎం రేవంత్‌రెడ్డి మద్దతు చెప్పారు. ఈ విషయంలో అభ్యంతరమేంటి' అని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు జగ్గారెడ్డి బీఆర్ఎస్ నేతలను ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేశ రక్షణ కోసం కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సీఎం ఇంప్లిమెంట్ చేశారన్నారు. దామగుండంలో రాడార్‌కు జీవో ఇచ్చిందే బీఆర్ఎస్ ప్రభుత్వం అని గుర్తుచేశారు. దామగుండం 360 మీటర్ల ఎత్తు ఉండి అక్కడ నుంచి సిగ్నల్స్ పంపడానికి ఎటువంటి ఇబ్బందులు లేకపోవడంతో పాటు అనేక సానుకూలతలు ఉన్నాయన్నారు. అక్కడ రాడార్ ఏర్పాటు చేశారని తెలిపారు.

పంట ఎండుతోంది

వరదలకు కొట్టుకుపోయిన ఎత్తిపోతల మోటర్లు

- వర్షాభావంతో వాడుతున్న పంటలు
- పట్టింపు లేని అధికారులు.. పాలకులు

నవతెలంగాణ-చర్ల

సుమారు రెండు నెలలుగా వరుణుడు ముఖం చాటేయడంతో ఏజెన్సీలో తీవ్ర వర్షాభావంతో పంటలు ఎండుతున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండల పరిధిలోని పూసుగుప్ప పంచాయతీ వద్దిపేట సమీప తాలిపేరు పరివాహక ప్రాంతంలో వద్దిపేట ఎత్తిపోతల పథకం-2 మరమ్మతులకు గురవడంతో సాగునీటి ఎద్దడి తలెత్తింది. రైతులు ఇప్పటికే పలుమార్లు సంబంధిత అధికారులకు మెమోరాండం ఇవ్వడంతో పాటు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకు సైతం తెలియజేశారు. ఎంతమందికి విన్నవించినా ఆ ఆదివాసుల ఆవేదన అరణ్య రోదనగా మారడం తప్ప, సమస్య పరిష్కారం కావడం లేదు. 2000-01 ఆర్థిక సంవత్సరంలో భద్రాచలం ఎమ్మెల్యేగా ఉన్న సున్నం రాజయ్య తీసుకువచ్చిన నిధులతో నిర్మించిన ఈ ఎత్తిపోతల పథకం ద్వారా ఎంతోకాలంగా వద్దిపేట ఆదివాసీ గిరిజన రైతులు చక్కని సేద్యం చేసుకున్నారు. కానీ నేడు మరమ్మతులకు గురై కేవలం ఒక్క విద్యుత్ మోటరు ఉపయోగంలో ఉండటంతో చాలీచాలని సాగునీరు ఎత్తిపోతలు జరగడం వల్ల ఈ పథకంపై ఆధారపడి సేద్యం చేపట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు. వరి, పత్తి పంటలు పండించే రైతాంగం సాగునీరు లేక నానా అవస్థలు పడుతున్నారు.



ఐటీడీఏ పీఓ సారూ మా మొర వినండి

ఒక పక్క వర్షాలు పడక, మరోపక్క ఎత్తిపోతల పథకం పనిచేయక మా పంటలు ఎండిపోతున్నాయి. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన వరి, పత్తి పంటలు మాడు మొఖం వేస్తున్నాయి. ఇక తమరైనా మా గిరిజన రైతులపై దృష్టి సారించి ఎత్తిపోతల పథకంలో విద్యుత్ మోటర్లు ఏర్పాటు చేసి మా వ్యవసాయానికి సహకరించాలని కోరుతున్నాం.



పుయిక రాము, వద్దిపేట రైతు

తాలిపేరులో వద్దు.. ఒడ్డున కట్టండని.. నిర్మించేటప్పుడే చెప్పాం

వద్దిపేట రెండు ఎత్తిపోతల పథకం ఎత్తైన ప్రదేశంలో కట్టమని చెప్పాం. కానీ కాంట్రాక్టర్ వినకుండా ఇష్టానికి నిర్మించడం వల్ల వరదలు వచ్చినప్పుడు రైతాంగం నానా అవస్థలు పడాల్సి వస్తుంది. ఈ ఏడాది రెప్పపాటులో వచ్చిన వరద కారణంగా మూడు విద్యుత్ మోటర్లు తాలిపేరు వాగులో కొట్టుకుపోయాయి. కలెక్టర్, ఐటీడీఏ పీవో స్థాయి అధికారులు మా ఎత్తిపోతల పథకంపై దృష్టి సారించి వెంటనే మోటర్లు ఇవ్వకపోతే మా పంటలు ఎండిపోయి వేల రూపాయల నష్టం వాటిల్లుతుంది.



పుయిక భుజంగారావు, వద్దిపేట రైతు



అధిక వర్షాలకు జూన్, జులై నెలలో వచ్చిన వరదల కారణంగా ఎత్తిపోతల పథకానికి ఉపయోగపడుతున్న రెండు మోనోటెక్, రెండు సబ్రేంజబుల్ విద్యుత్ మోటర్లకు గాను రెండు మోనోటెక్స్, ఒక సబ్ రేంజబుల్ మోటరు పూర్తిగా వరదల్లో కొట్టుకుపోయినట్టు స్థానిక రైతులు చెబుతున్నారు. పంట సాగుబడి కోసం విద్యుత్ మోటర్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు అధికారులు, పాలకుల చుట్టూ తిరిగినా ఎవరూ తమ గోడు వినడం లేదని రైతులు వాపోతున్నారు. కంటి నిండా సాగునీరు కన్పిస్తున్నా సాగు చేసేందుకు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నో నీటి వసతులు ఉన్నప్పటికీ వాటిని ఉపయోగించుకోవడానికి ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోవట్లేదని రైతులు పెదవిరుస్తున్నారు. గిరిజన అభ్యుదయానికి సహకరించే ఐటీడీఏ పీవో చొరవ చూపి ఈ ప్రాంత గిరిజన రైతులను ఆదుకోవాలని గిరిపుత్రులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

అధిక వర్షాలతో వచ్చిన వరదల కారణంగా విద్యుత్ మోటర్లు తాలిపేరు వరదలో కొట్టుకుపోయిన విషయం రైతుల ద్వారా తెలిసింది. రైతుల సమస్య తీర్చేందుకు ప్రతిపాదనలు పంపాం. నూతన విద్యుత్ మోటర్లు కొనుగోలుతో పాటు మరమ్మతులు కూడా చేపడతాం. నిధులు మంజూరు అయిన తర్వాత పనులు ప్రారంభిస్తాం.

- తిరుపతి, ఇరిగేషన్ డీఈఈ

వట్‌పల్లిలో సినీ ఫక్కీలో చోరీ

- కుమారుడు పంపించాడని నమ్మబలికి ఒంటరిగా ఉన్న మహిళ ఇంట్లో చోరీ
- ఆమెను చీరతో కట్టేసి.. ఐదున్నర తులాల బంగారం, రూ.20వేల నగదు దోపిడీ
- ముఖాలు తెలియకుండా హెల్మెట్లు ధరించిన దుండగులు



నవతెలంగాణ-వట్‌పల్లి

ఒంటరిగా ఉంటున్న ఓ మహిళ ఇంటికి అర్ధరాత్రి వేళ వచ్చిన గుర్తు తెలియని వ్యక్తులు.. తమను ఆమె కుమారుడు పంట కోయడానికి పంపించాడని నమ్మబలికి ఇంట్లోకి చొరబడ్డారు. అనంతరం ఆమె కాళ్లు, చేతులు చీరతో కట్టేసి ఇంటిని లూటీ చేశారు. ఐదున్నర తులాల బంగారం, రూ.20 వేల నగదును అపహరించుకుపోయారు. సినీ ఫక్కీలో జరిగిన ఈ ఘటన సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం పల్వట్లలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సంగారెడ్డి గారి సునందమ్మ ఒంటరిగా నివసిస్తోంది. ఆమె కుమారుడు వెంకటరెడ్డి బీదర్‌లో నివాసం ఉంటూ వారంలో ఒకటి రెండు సార్లు ఇంటికొచ్చి.. వ్యవసాయ పనులు చూసుకొని తిరిగి వెళ్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం అర్ధరాత్రి సుమారు 12:30 సమయంలో సునందమ్మ ఇంటికి కొందరు దుండగులు వచ్చారు. సోయపంట కోసేవారిమని, తన కొడుకు పంపించాడని, వర్షం పడే అవకాశముండటంతో ఇంట్లో పడుకోమన్నాడని సునందమ్మను నమ్మించారు. దీంతో ఆమె తలుపులు తెరిచి ఇంట్లోకి రానివ్వగా వెంటనే వారు సునందమ్మను చేయితో తలపై కొట్టి చీరతో కాళ్లు, చేతులు కట్టేశారు. బంగారం, డబ్బు ఎక్కడ ఉన్నదో చెప్పాలని.. లేకపోతే చంపేస్తామని చాకులతో బెదిరించారు. దాంతో రూ.20 వేల నగదు గురించి ఆమె చెప్పడంతో.. వాటిని తీసుకున్నారు. అలాగే ఆమె మెడలో ఉన్న నాలుగున్నర తులాల తాడు, చేతి వేళ్లకు ఉన్న ఉంగరాలు, చెవుల పోగులను లాక్కున్నారు. ముఖాలు తెలియకుండా హెల్మెట్లను ధరించుకొని ఇల్లు మొత్తం లూటీ చేశారు. వెళ్లే ముందు ఆమెపై బిందెడు నీళ్లు పోసి వెళ్లారు. తెల్లవారిన తర్వాత సునందమ్మనే కొంత ధైర్యం చేసుకుని.. కట్లు తెచ్చుకొని బయటికి వచ్చింది. ఇరుగుపొరుగు వారికి విషయం చెప్పడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రల కోసం ప్రయత్నించగా లభ్యం కాలేదు. కాగా ఘటనా స్థలాన్ని సీఐ అనిల్ కుమార్ పరిశీలించి వివరాలను సేకరించారు. బాధితురాలి కొడుకు వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

ఎస్.ఆర్ శంకరన్ జీవితం.. భావితరాలకు ఆదర్శప్రాయం

- ఎస్.ఆర్. శంకరన్ ఐఏఎస్ అకాడమీ ముఖ్య సలహాదారులు వై. సత్యనారాయణ
- ఘనంగా ఎస్.ఆర్. శంకరన్ 90వ జయంతి



నవతెలంగాణ - ముషీరాబాద్

ఎస్.ఆర్ శంకరన్ జీవితం భావితరాలకు ఆదర్శప్రాయమని ఎస్.ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమీ ముఖ్య సలహాదారులు వై. సత్యనారాయణ అన్నారు. హైదరాబాద్ చిక్కడపల్లిలోని ఎస్.ఆర్. శంకరన్ ఐఏఎస్ అకాడమీలో ఎస్.ఆర్. శంకరన్ ఐఏఎస్ 90వ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్. ఆర్. శంకరన్ ఏనాడు ఒక ఐఏఎస్ ఆఫీసర్‌గా గర్వపడలేదని, సాధారణ పౌరునిగా ఉండటమే గొప్పగా భావించేవారని కొనియాడారు. ఎస్.ఆర్. శంకరన్ గురుకుల విద్యాసంస్థలకు సృష్టికర్త అని అన్నారు. నేడు పేదలు చదువుకోవడానికి వారు ఆజ్యం పోశారని గుర్తు చేశారు. వారు అనేక జిల్లాల్లో కలెక్టర్‌గా పని చేసిన సందర్భంలో ప్రత్యక్షంగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలపై ఒక ఐఏఎస్ ఆఫీసర్ భారత రాజ్యాంగానికి లోబడి ఏ విధంగా పనిచేయవచ్చో నిరూపించారని తెలిపారు. అంతేకాకుండా త్రిపుర రాష్ట్రానికి చీఫ్ సెక్రెటరీగా పనిచేశారని, బొగ్గు బావులను ప్రభుత్వపరం చేసే విషయంలో వారి తోడ్పాటు ఉందని, నెల్లూరులో ఎస్‌హెచ్‌ఏఆర్ కేంద్రం ఏర్పాటులో కూడా శంకరన్ తనదైన కృషి చేశారని, నక్సలైట్లకు ప్రభుత్వానికి మధ్య వివాదం వచ్చినప్పుడు ఆ వివాదాన్ని పరిష్కరించడంలోనూ కృషి చేశారని తెలిపారు. ఆయన నెల్లూరు జిల్లాలో ఉన్నప్పుడు బాలికలకు పాఠశాల లేదన్నప్పుడు తన కలెక్టర్ బంగ్లాలోనే నిర్వహించాలని ఆదేశాలు ఇవ్వడం, ఇవన్నీ కూడా ప్రజల పట్ల శంకరన్‌కు ఉన్న బాధ్యత, ప్రేమ, ఆదరాభిమానాలను తెలియజేస్తున్నా యన్నారు. విద్యార్థులు ఇలాంటి లక్షణాలను అలవర్చుకొని, అలాంటి ఐఏఎస్ ఆఫీసర్‌గా తయారు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి అకాడమీ ప్రిన్సిపాల్ కే సురేందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. పరిపాలన అధికారి కే.సతీష్ కుమార్, టెక్నికల్ ఇన్‌చార్జి కోట మురళీకృష్ణ, విద్యార్థులు వి. స్నేహలత, బి.శిరీష, రాధ, బి. కవిత, భాగ్య, నరస, నర్సింలు, శివరాత్రి గోపి, ఎన్నం కిషన్, ఎం. ఉమేష్, గణేష్, ఫణిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మత విద్వేషకులను నియంత్రించడంలో కాంగ్రెస్ వైఫల్యం

- ఎంఐఎం మెప్పు, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం సీఎం రేవంత్‌రెడ్డి యత్నం : ఈటల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మత విద్వేషాలను రెచ్చగొట్టేవారిని నియంత్రించడంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యం చెందుతూనే ఉన్నదని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హిందూ ఆలయాలపై దాడులకు పాల్పడిన విషయంలో ప్రశ్నిస్తున్న వారిపై సంఘవిద్రోహ శక్తులుగా, మతోన్మాదులుగా, దుర్మార్గులుగా చిత్రీకరించే ప్రయత్నం చేయడం ఆ పార్టీకి అలవాటేనని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలలో రాష్ట్రంలో జరిగిన మత కలహాలను, టెర్రరిస్టుల దాడులను వివరించారు. సీఎంలను మార్చాలన్నా మత కలహాలను సృష్టించిన చరిత్ర కాంగ్రెస్‌దని ఆరోపించారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమాయక ప్రజల జీవితాలతో చెలగాటమాడుతూ, సమాజాన్ని అస్థిరపర్చే టెర్రరిస్టుల మీద ఉక్కుపాదం మోపారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎంఐఎం మెప్పు కోసం, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం మత కలహాలను సృష్టించాలని చూసిన వారిని వదిలేసి శాంతియుతంగా నిరసనలు తెలుపుతున్న వారిపై కేసులు పెట్టించడం, బీజేపీ నాయకులను అరెస్టు చేయంచడం అన్యాయమన్నారు. తెలంగాణలో స్లీపర్ సెల్స్ ఉన్నాయనీ, హైదరాబాద్ టెర్రిస్టులకు అడ్డాగా మారిందనీ, రోహింగ్యాలు అక్రమంగా వలస వస్తున్నారని కేంద్ర ఏజెన్సీలు హెచ్చరించినా రాష్ట్ర ప్రభుత్వం అక్రమ చొరబాటుదారులను నివారించలేదని విమర్శించారు. బాంబు పేలుళ్లను, దుర్మార్గపు హత్యలను, రక్తపాతాన్ని ఏ మతపెద్దలూ హర్షించరని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలుసుకోవాలని హితవు పలికారు. బీజేపీ నేతల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నామనీ, వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌ది దివాళాకోరు ప్రచారం

- హామీల అమలు చేతగాకే ఇలాంటి కుట్రలు : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రం దివాళా తీసిందంటూ కాంగ్రెస్ ప్రచారం చేయటం దారుణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ విమర్శించారు. అది ముమ్మాటికీ దివాళకోరు ప్రచారమేనని ఆయన ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వ హయాంలో ఆర్థిక నిర్వహణ, అప్పులు, వనరుల నిర్వహణలో తెలంగాణ అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎకానమీ అండ్ పొలిటికల్ వీక్లీలో ప్రచురితమైన ఒక డేటాను కేటీఆర్ ఉదహరించారు. కేసీఆర్ సమర్థ పాలనకు ఆయా గణాంకాలే సజీవ సాక్ష్యాలని తెలిపారు. ఈ క్రమంలో రాష్ట్రం ఆర్థికంగా దివాళా తీసిందంటూ కాంగ్రెస్ చేస్తున్నది బూటకపు ప్రచారం మాత్రమేనని ఎద్దేవా చేశారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలు సాధ్యం కాకపోవటంతో...ఆ పార్టీ నేతలు ఇలా డొంకతిరుగుడుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా వారు తమ తప్పు తెలుసుకుని, ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వారిని వదిలిపెట్టేదే లేదు...

పిరికిపందల మాదిరిగా తన వ్యక్తిత్వంపై నిరాధార ఆరోపణలు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని కేటీఆర్ పునరుద్ఘాటించారు. మంత్రి కొండా సురేఖ్‌పై తాను వేసిన క్రిమినల్ పరువు నష్టం దావాకు సంబంధించి ఆయన మాట్లాడుతూ... ఇప్పటిదాకా ఎవరెన్ని ఆరోపణలు చేసినా చూసీచూడనట్టు వదిలేశామని పేర్కొన్నారు. కానీ ఇకపై మీడియా, సోషల్ మీడియాలో నీచమైన ప్రచారాలకు పాల్పడితే వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. అర్థంపర్థం లేని ఆరోపణలు చేసే వారికి తాను వేసిన పరువు నష్టం దావా గుణపాఠం కావాలని ఆయన వ్యాఖ్యానించారు.

మేమేం పాపం చేశాం

- మావి ప్రాణాలు కావా? నష్టపరిహారం మాకొద్దా?
- తమకూ నష్టపరిహారం వర్తించేలా చూడాలని డీజీపీకి హోంగార్డుల విన్నపం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రంలో విధి నిర్వహణలో మరణించిన, అంగవైకల్యానికి గురైన పోలీసులకు ఇచ్చే నష్టపరిహారాన్ని భారీగా పెంపు చేసిన రాష్ట్ర ప్రభుత్వం తమను విస్మరించడంపై హోంగార్డులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసులకు వారి హోదాలను బట్టి కోటి రూపాయల నుంచి రెండు కోట్ల రూపాయల వరకు నష్టపరిహారాన్ని పెంచుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసు అమరవీరుల సంస్మరణ సభలో ప్రకటించారు. అయితే, ఈ పెంపులో హోంగార్డులను చేర్చకపోవడంపై అక్కడే ఉన్న పలువురు హోంగార్డులు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల పిల్లల చదువులను పరిపుష్టం చేయడానికిగానూ కొత్తగా ప్రభుత్వం తెరుస్తున్న యంగ్ ఇండియా పోలీస్ స్కూళ్లలో హోంగార్డులు మొదలుకొని డీజీపీ వరకు వారి పిల్లలు చదువుకోవడానికి అవకాశం ఉంటుందని సీఎం ప్రకటించడంపై వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. తమను నష్టపరిహారం పెంపులో భాగస్వామ్యం చేయకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి, పోలీసుల శాఖలో పరిమితమైన పనులకే హోంగార్డుల సేవలను వినియోగించుకుంటామని చేర్చుకున్నప్పటికీ దాదాపుగా కానిస్టేబుల్ చేసే విధులను వారితో చేయిస్తున్నారు. అంతేగాక, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలతో పాటు ఐఎస్ఐ ప్రేరిత ఉగ్రవాదుల కార్యకలాపాలను అరికట్టడంలోనూ, మాదకద్రవ్యాల నివారించడంలోనూ వారి సేవలను పోలీసు శాఖ వాడుకుంటున్నది. పోలీసులకు పెంచిన నష్టపరిహారాన్ని అన్ని రకాల పనులు చేస్తున్న తమకెందుకు వర్తింపజేయరని పలువురు హోంగార్డులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు ఉన్నతాధికారులు పూనుకుని పోలీసుల అంత స్థాయిలో కాకున్నా..కొంత తక్కువైనా తమకు కూడా నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వానికి సిఫారసులు చేయాలని డీజీపీకి విజ్ఞప్తి చేశారు.

అప్‌గ్రేడ్‌కే పరిమితమైన మినీ అంగన్వాడీలు

మహిళలు, పిల్లల అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తున్న అంగన్వాడీల పట్ల పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీసెస్(ఐసీడీఎస్) ఆధ్వర్యంలో ప్రధాన కేంద్రాలు, మినీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, ఐదేండ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. దీనితో పాటు ఆరోగ్యపరమైన సేవలు, విద్యా బుద్ధులు నేర్పుతారు. అంగన్వాడీ కేంద్రాల నిర్వాహణలో సేవలందిస్తున్న టీచర్లు, ఆయాలకు మాత్రం ప్రభుత్వం జీతభత్యాలు పెంచట్లేదు. ముఖ్యంగా విద్యార్థులు పెరగడంతో మినీ అంగన్వాడీ కేంద్రాలను అప్‌గ్రేడ్ చేసి వదిలేశారు. భర్తీ చేయాల్సిన ఆయా పోస్టుల గురించి పట్టింపులేదు. పెంచిన వేతనాల్ని రెండు నెలలు ఇచ్చి ఆ తర్వాత బడ్జెట్ లేదనే నెపంతో పాత జీతానికే పరిమితం చేశారు.



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

తల్లీపిల్లల మరణాల్ని తగ్గించడం, పిల్లల్లో పోషక స్థాయిని పెంచడం, రక్తహీనత నివారణ, సుఖ ప్రసవాల వంటి లక్ష్యాలతో ఏర్పాటు చేసిన అంగన్వాడీ కేంద్రాల నిర్వాహణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ చూపట్లేదు. రాష్ట్ర వ్యాప్తంగా 99 గ్రామీణ, 25 పట్టణాల్లో కలిపి 149 ఐసీడీఎస్ ప్రాజెక్టులున్నాయి. వీటి పరిధిలో 35,700 అంగన్వాడీ కేంద్రాలు పనిచేస్తు న్నాయి. 31,711 ప్రధాన కేంద్రాలు, 399 మినీ కేంద్రాలు నడుస్తున్నాయి. మహిళలు, పిల్లల పోషకాహార స్థితిని మెరుగుపర్చడం, బరువు తక్కువ బరువుతో పుట్టిన పిల్లలు, రక్తహీనత ఉన్న గర్భిణులు అధికంగా ఉన్నందున శిశు, మాతా మరణాల రేటు, ప్రసూతి మరణాల రేటు అధికంగానే ఉండేది. అంగన్వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందుతున్నందున మరణాల రేటు తగ్గుతూ వస్తోంది. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, 7 నెలల నుంచి 6 సంవత్సరాల పిల్లలు కలిపి 21.60 లక్షల మంది వరకు అంగన్వాడీల్లో వివిధ సేవలు పొందుతున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా 4023 అంగన్వాడీ కేంద్రాలున్నాయి. సంగారెడ్డి జిల్లాలో 1604, సిద్దిపేట జిల్లాలో 1150, మెదక్ జిల్లాలో 1267 అంగన్వాడీ కేంద్రాలున్నాయి.

పాత జీతాలే ఇస్తున్న వైనం

మినీ అంగన్వాడీ కేంద్రాల్ని అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం అందులో పని చేస్తున్న టీచర్లకు మాత్రం పాత జీతాలనే చెల్లిస్తోంది. ఒక్కో మినీ కేంద్రంలో ఒక్కో టీచర్ మాత్రమే పనిచేస్తారు. వీరికి ప్రతి నెలా రూ.7800 వేతనం ఇచ్చేది. అప్‌గ్రేడ్ చేసిన తర్వాత టీచర్లకు రూ.13,650 చొప్పున పెంచిన వేతనం చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పింది. అన్నట్లుగానే అప్‌గ్రేడ్ చేసిన మొదటి రెండు నెలలు మాత్రం పెంచిన వేతనాల్నే చెల్లించారు. ఆ తర్వాత బడ్జెట్ కేటాయింపులు లేవన్న నెపంతో మళ్లీ అప్‌గ్రేడ్ చేయబడిన మినీ కేంద్రాల టీచర్లకు పాత వేతనాలే జమవుతున్నాయి. సిద్దిపేట జిల్లాలో 66, సంగారెడ్డి జిల్లాలో 160, మెదక్ జిల్లాలో 191 మినీ కేంద్రాలు అప్‌గ్రేడ్ చేయబడ్డాయి. వీటిల్లో పనిచేస్తున్న టీచర్లపై పని భారం పెరిగింది. పిల్లల సంఖ్య పెరగడంతో వారికి సేవలందించేందుకు ఆయాలుండాలి. ప్రభుత్వం మాత్రం మినీ కేంద్రాలకు ఆయా పోస్టుల్ని భర్తీ చేయలేదు. దాంతో ఇద్దరు చేయాల్సిన పనుల్ని టీచర్ ఒక్కరే చేస్తున్నారు.

- బడ్జెట్ లేదని పాత జీతమే జమ..
- పదేండ్లుగా టీఏ, డీఏ బంద్.. ఏడాదికోసారి అద్దె బిల్లులు
- పెరిగిన గ్యాస్, కూరగాయల ధరలతో టీచర్లపై భారం
- ఆయాల నియామకం పట్టని పాలకులు
- మినీ సెంటర్లలో పెరిగిన విద్యార్థులు

భారంగా మారిన నిర్వహణ

అంగన్వాడీ సెంటర్లకు ప్రభుత్వం తగిన బడ్జెట్ కేటాయించకపోవడంతో టీచర్లకు భారంగా మారింది. గ్యాస్ బండను ఏజెన్సీ వద్దకెళ్లి తెచ్చుకోవాల్సి వస్తుంది. రెండు, మూడు నెలలకు ఒక్క సిలిండర్ వాడితే ఆరు నెలల్లో రూ.2000 గ్యాస్ కోసం టీచర్లు ఖర్చు చేస్తున్నారు.

ఆ సెంటర్‌కు మాత్రం గ్యాస్ బిల్లు రూ.450 మాత్రమే ఇస్తున్నారు. టమాటా, పాలకూర, ఇతర ఆకుకూరలు, కాయగూరల ధరలు పెరుగుతున్నా బిల్లులు మాత్రం పెంచట్లేదని అంటున్నారు.

భవనాల అద్దె బిల్లుల్ని ప్రభుత్వం ఏడాదికోసారి ఇస్తుంది. టీచర్లు మాత్రం యజమానికి నెల నెలా చెల్లించాలి. నెలకు నాలుగు సార్లు సెక్టార్ సమావేశానికి వెళ్లి వస్తే రూ.500పైనే ఖర్చు అవుతుందని, పదేండ్లుగా టీఏ, డీఏల చెల్లింపులు ఆగాయని అంగన్వాడీలు తెలిపారు.

మానసిక ఒత్తిడి పెరిగింది

అంగన్వాడీ కేంద్రాల్ని నడపడం వల్ల టీచర్లపై ఆర్థిక భారం, మానసిక ఒత్తిడి పెరిగింది. చాలా చోట్ల ఆయాల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అప్‌గ్రేడ్ చేసిన కేంద్రాల్లో ఆయాల్లేరు. గ్యాస్, కూరగాయలు, అద్దెల ధరలు పెరగడంతో అప్పులు చేసి సెంటర్లను నడపాల్సి వస్తుంది. యూనియన్ పోరాడితే తప్ప ప్రభుత్వం పట్టించుకోవట్లేదు.


మినీ సెంటర్ల టీచర్లకు పెరిగిన వేతనాలు ఇవ్వట్లేదు.

శశికళ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా అధ్యక్షులు

15 రోజుల్లో డ్రోన్ పాలసీ

- ఓర్వకల్లులో హబ్
- సమ్మిట్ ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు
- అబ్బురపర్చిన విన్యాసాలు

అమరావతి: పారిశ్రామిక వేత్తలు, పెట్టుబడిదారులు, విద్యావేత్తల నుండి సలహాలు, సూచనలు తీసుకుని 15 రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వ డ్రోన్ పాలసీని ప్రకటిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలిపారు. కేంద్ర పౌరవిమానయాన శాఖ, ఎపి డ్రోన్ కార్పొరేషన్ సంయుక్తంగా మంగళగిరిలోని సికె కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించిన అమరావతి డ్రోన్ సమ్మిట్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మౌలిక వసతులు, పెట్టుబడుల శాఖ మంత్రి బిసి జనార్ధనరెడ్డి తదితరులతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ ఓర్వకల్లు ఇండస్ట్రియల్ పార్కులో 300 ఎకరాలను డ్రోన్ హబ్ కోసం కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. హబ్ ఏర్పాటు అనంతరం 35 వేల మందికి డ్రోన్ పైలట్లుగా శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ హబ్‌లోనే డ్రోన్ల తయారీ రంగాన్ని ప్రారంభిస్తామని, దీనికి సహకారం అందించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. డ్రోన్ సిటి ఆఫ్ ఇండియాగా అమరావతిని తీర్చిదిద్దడం తమ లక్ష్యమని తెలిపారు. రాబోయే కాలమంతా డేటాదేనని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, మెషీన్ లెర్నింగ్‌తో డేటా ను ఉపయోగించి నిర్దిష్టమైన సమాచారాన్ని పొందవచ్చని చెప్పారు. ఎపి



డ్రోన్ కార్పొరేషన్ సిఎం సమక్షంలో క్వాలిటి కౌన్సిల్ ఆఫ్ ఇండియా, తిరుపతి ఐఐటిలతో ఎంఒయూ కుదుర్చుకుంది. డ్రోన్ ఎకో సిస్టమ్ కొరకు స్ట్రాటజీ ఫ్రేమ్ వర్క్ కాన్సెప్ట్ పేపర్‌ను విడుదల చేసిన అనంతరం డ్రోన్ ఎక్స్‌పోను సిఎం చంద్రబాబు ప్రారంభించారు.

ప్రపంచ డ్రోన్ హబ్‌గా ఎపి : రామ్మోహన్‌నాయుడు

ప్రపంచ డ్రోన్ హబ్‌గా ఆంధ్రప్రదేశ్ మారనుందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్‌నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. విజయవాడ వరదల్లో డ్రోన్లు వినియోగించి బాధితులకు ఆహారం, నీరు పంపిణీ చేయడం సరికొత్త విప్లవమన్నారు. దీనిపై ప్రధాని మోడీ సైతం వివరాలు అడిగి తెలుసుకున్నారని చెప్పారు. దేశంలో పదేళ్ల కిందట 74 ఎయిర్ పోర్ట్‌లుంటే ఇప్పుడు ఆ సంఖ్య 157కు చేరిందన్నారు. పౌర విమానయానం అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి వుంలున్‌మంగ్ వుల్నమ్, డ్రోన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు స్మిత్ షా, సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్, ఐ అండ్ ఐ శాఖ కార్యదర్శి ఎస్.సురేష్ కుమార్, డ్రోన్ కార్పొరేషన్ ఎండి కె.దినేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన డ్రోన్ షో: ఐదు గిన్నిస్ రికార్డులు

ఈ సదస్సు అనంతరం కృష్ణా నది తీరాన పున్నమి ఘాట్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహించిన డ్రోన్ షో ఆహుతులను అకట్టుకుంది. 5,500 డ్రోన్లతో రంగురంగుల కాంతుల్లో అనేక చిత్రాలను ప్రదర్శించారు. డ్రోన్ షో గురించి విస్తృత ప్రచారం నిర్వహించడంతో పెద్ద సంఖ్యలో జనం కృష్ణా తీరానికి తరలివచ్చారు. విజయవాడలోని ఐదు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన భారీ డిస్‌ప్లేల ముందు కూడా ప్రజలు బారులు తీరి డ్రోన్‌షోను తిలకించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన లేజర్‌షో, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ప్రజలను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన గిన్నిస్ బుక్ ప్రతినిధులు అమరావతి డ్రోన్‌షో చరిత్ర సృష్టించినట్లు ప్రకటించారు. అమరావతి డ్రోన్‌షోలో ఐదు గిన్నిస్ రికార్డులు నమోదైనట్లు వారు తెలిపారు. లార్జెస్ట్ ప్లానెట్ ఫార్మేషన్, లార్జెస్ట్ ల్యాండ్ మార్క్ సృష్టికి, లార్జెస్ట్ ఫ్లేస్ ఫార్మేషన్ డ్రోన్లతో అతిపెద్ద జెండా ప్రదర్శన, ఎరియల్ లోగోల్లో ఈ రికార్డులకు సంబంధించిన సర్టిఫికేట్లను వారు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందచేశారు. అంతకుముందు డ్రోన్ షోను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కేంద్ర పౌర విమానయాల శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు ప్రారంభించారు. అమరావతి డ్రోన్ హ్యాక్‌థాన్‌లో విజేతలుగా ఎంపికైన వారికి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రైజ్ మనితోపాటు సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు.. ఈ కార్యక్రమంలో మంత్రులు కె.అచ్చెన్నాయుడు, బిసి జనార్ధనరెడ్డి, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్‌గా పోలీసు అధికారి

- ఆదేశాలు జారీ చేసిన శాట్ మేనేజింగ్ డైరెక్టర్

హైదరాబాద్ : తెలంగాణను క్రీడా హబ్‌గా మార్చుతామని ఓ వైపు ముఖ్యమంత్రి ప్రకటనలు చేస్తుండగా.. మరోవైపు క్రీడలకు ఏ మాత్రం సంబంధం లేని ఇతర శాఖల అధికారులను తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (శాట్)లో కీలక స్థానాల్లో నియమించటంపై క్రీడాభిమానులు, కోచ్‌లు మండిపడుతున్నారు. రిజర్వ్ పోలీసు ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు కన్నం మధును గచ్చిబౌలి స్టేడియం అడ్మినిస్ట్రేటర్‌గా నియమిస్తూ శాట్ వీసీ, ఎండీ సోనీబాలా దేవి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. తక్షణమే స్టేడియం అడ్మినిస్ట్రేటర్‌గా విధుల్లో చేరాలని ఆర్డర్‌లో సూచించారు. ఇప్పటికే శాట్‌లో పలు శాఖల నుంచి డిప్యూటేషన్లతో క్రీడలపై కనీస అవగాహన లేని వ్యక్తులు శాట్‌లో కీలక స్థానాల్లో ఉన్నారని.. ఇప్పుడు కొత్తగా పోలీసు అధికారినే శాట్‌లోకి తీసుకురావటం శోచనీయమని సీనియర్ కోచ్ సత్యవాణి విమర్శలు చేశారు.

రూ 47.65 కోట్ల లాభాన్ని ఆర్జించిన ఒలెక్ట్రా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రముఖ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థ ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ ఈ ఏడాది సెప్టెంబర్ 30తో ముగిసిన రెండో త్రైమాసికానికి రూ 47.65 కోట్ల లాభాన్ని ఆర్జించింది. ఈ మేరకు సోమవారం కంపెనీ తన ఫలితాలను ప్రకటించింది. త్రైమాసికంలో అధిక డెలివరీల ఫలితంగా గణనీయమైన ఆదాయ వృద్ధి నమోదు చేసిందని కంపెనీ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 90 శాతం పెరుగుదలను సూచిస్తుంది. గత ఏడాది 154వాహనాలను డెలివరీ చేయగా, ఈ ఏడాది 315 ఎలక్ట్రిక్ వాహనాలను పంపిణీ చేసిందని పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరం రూ. 26.57 కోట్లతో పోలిస్తే 144 శాతం పెరుగుదలతో రూ.64.83 కోట్ల ఆదాయం పెరిగిందని వెల్లడించింది. మొత్తంగా రూ. 47.65 కోట్ల లాభం వచ్చిందని తెలిపింది.

30 వరకు బీజేపీ సభ్యత్వ నమోదు

- మాజీ ఎమ్మెల్సీ, మెంబర్‌షిప్ ఇన్‌చార్జి ఎన్.రాంచందర్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ఈ నెల 30 వరకు కొనసాగుతుందని మాజీ ఎమ్మెల్సీ, సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి రాంచందర్‌రావు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయా రాష్ట్రాల ఎన్నికలు, ఉప ఎన్నికల నేపథ్యంలో ఈ పొడిగింపు చేశామన్నారు. తెలంగాణలో ఇప్పటివరకూ 24 లక్షల సభ్యత్వ నమోదు పూర్తయిందని తెలిపారు. పార్టీలో 100 మందికిపైగా చేర్చిన వారే యాక్టివ్ మెంబర్ షిప్ జాబితాలో చేరుతారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా యాక్టివ్ మెంబర్ షిప్ లక్ష్యాన్ని 40 వేల మందిగా నిర్దేశించుకున్నామనీ, వారే సంస్థాగత పదవులకు అర్హులని తెలిపారు. ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో దాదాపు వెయ్యి క్యాంపులు నిర్వహించి 50 వేల సభ్యత్వాలు స్వీకరించామన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, పార్టీ మెంబర్ షిప్ స్టేట్ కో-కన్వీనర్లు కొల్లి మాధవి, గోలి మధుసూదన్ రెడ్డి, ఎస్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కళ్యాణ్ నాయక్, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి రవి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ సోషల్ మీడియా దుష్ప్రచారాన్ని తిప్పికొట్టండి

- కిసాన్ కాంగ్రెస్ నేతలకు మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్‌ఎస్ నేతలు డబ్బులిచ్చి సోషల్ మీడియాలో సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై దుష్ప్రచారం చేయిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. అలాంటి దుష్ప్రచారాన్ని క్షేత్రస్థాయిలో తిప్పికొట్టాలని కిసాన్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కిసాన్ కాంగ్రెస్ చైర్మెన్ అన్వేష్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి కిసాన్ కాంగ్రెస్ పాత్ర చాలా ఉందని చెప్పారు. కష్టపడిన నాయకులకు కార్పొరేషన్ పదవుల్లో, మార్కెట్ కమిటీల్లో, వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో, ఆత్మ కమిటీల్లో తగిన అవకాశాలు ఇస్తామన్నారు. పార్టీలో, స్థానిక సంస్థల్లో సరైన అవకాశాలిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలు చేసిందన్నారు. దేశంలోనే రైతు రుణ మాఫీ రూ.18వేల కోట్లు ఇచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికి దక్కిందన్నారు. కొంత మంది ఎమ్మెల్యేలు కార్యకర్తలను నిర్లక్ష్యం చేస్తున్నట్టు సమాచారముందన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో విజయం సాధించే దిశగా అడుగులు వేయాలని సూచించారు. నియోజకవర్గాల్లో సమన్వయంతో పని చేయాలని కోరారు.

జేఎల్ తుది ఫలితాలు విడుదల

- టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఎంపికైన అభ్యర్థుల వివరాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఇంటర్ విద్యాశాఖ కమిషనరేట్ పరిధిలో 1,392 జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టులకు సంబంధించిన తుది ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) మంగళవారం విడుదల చేసింది. ఈ మేరకు టీజీపీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ ఒక ప్రకటన విడుదల చేశారు. కెమిస్ట్రీ ఉర్దూ మాధ్యమంలో మల్టీ జోన్-1 ముగ్గురు ఎంపికయ్యారనీ, అర్హులైన అభ్యర్థులేనందున మూడు పోస్టులకు ఎంపిక చేయలేదని తెలిపారు. మల్టీజోన్-2లో ఎనిమిది మంది ఎంపికయ్యారనీ, అర్హులైన అభ్యర్థుల్లేనందున ఐదు పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. సివిక్స్‌లో మల్టీజోన్-1లో 35 మంది, మల్టీజోన్-2లో 21 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని పేర్కొన్నారు. సివిక్స్ ఉర్దూ మాధ్యమంలో మల్టీజోన్-1లో ఎనిమిది మంది ఎంపికయ్యారని తెలిపారు. అర్హులైన అభ్యర్థుల్లేనందున ఐదు పోస్టులు మిగిలాయని పేర్కొన్నారు. మల్టీజోన్-2లో ఇద్దరు ఎంపికయ్యారనీ, అర్హులైన అభ్యర్థుల్లేనందున ఒక పోస్టుకు ఎంపిక చేయలేదని వివరించారు. సివిక్స్ మరాఠీ మాధ్యమంలో మల్టీజోన్-1లో ఒకరు ఎంపికయ్యారని తెలిపారు. ఉర్దూ లెక్చరర్ పోస్టులకు మల్టీజోన్-1లో పది మందిని ఎంపిక చేశామని తెలిపారు. అర్హులైన అభ్యర్థుల్లేనందున ఐదు పోస్టులు మిగిలాయని పేర్కొన్నారు. మల్టీజోన్-2లో 11 మంది ఎంపికయ్యారని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు అందుబాటులో లేనందున రెండు పోస్టులు మిగిలాయని పేర్కొన్నారు. జేఎల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల వివరాలు ఙఙఙ.్‌రజూం౯.్రశీఱ.ఱఅ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని తెలిపారు. 1,392 జేఎల్ పోస్టుల భర్తీకి 2022, డిసెంబర్ తొమ్మిదిన టీజీపీఎస్సీ నోటిఫికేషన్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. జూనియర్ లెక్చరర్ పోస్టులకు సంబంధించి ఇంకా వివిధ సబ్జెక్టుల్లో ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించాల్సి ఉన్నది. మిగతా సబ్జెక్టుల జేఎల్ తుది ఫలితాలను వెంటనే ప్రకటించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

9వ అంతస్తు నుంచి దూకి యువతి ఆత్మహత్య



ఫైల్

నవతెలంగాణ-ఉప్పల్

ఓ యువతి తాను పనిచేస్తున్న భవనం 9వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ లాలాగూడకు చెందిన పిన్నపాటి హరిత (24) ఉప్పల్‌లోని డీఎస్ఎల్ ఐటీ కంపెనీలో పనిచేస్తోంది. ఆమె ప్రతిరోజూ సాయంత్రం ఐదు గంటలకు డ్యూటీకి వెళ్లి తిరిగి తెల్లవారుజామున నాలుగు గంటలకు ఇంటికి వస్తుంది. ప్రతిరోజులాగే మంగళవారం కూడా ఆఫీస్‌కు వెళ్లింది. అయితే తెల్లవారుజామున ఆమె ఆఫీసు భవనంపై నుంచి దూకిందని తోటి ఉద్యోగులు పోలీసులకు సమాచారం అందించారు. ఆమెను రామంతపూర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

యువతకు స్వయం ఉపాధి అవకాశాల కల్పనే ధ్యేయం



ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

- పోలీసు రిక్రూట్‌మెంట్, ఆర్మీ ట్రైనింగ్ సెంటర్ల ఏర్పాటు
- పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో ఎస్సీ, ఎస్టీ హబ్ సెల్ ఏర్పాటు :నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

యువతకు స్వయం ఉపాధి అవకాశాల కల్పనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి అన్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని తేజ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో నిరుద్యోగ యువతకు ఉపాధిపై నిర్వహించిన అవగాహనా సదస్సును ఎంపీ డాక్టర్ మల్లు రవితో కలిసి మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే కుచకుళ్ల రాజేష్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలోని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి, ఆర్థికంగా ఎలా బలపడాలి, వారి ప్రాంతాలకు ఎలాంటి పరిశ్రమలు కల్పించాలనే వాటిపై అవగాహనా సదస్సు నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి దిశగా అడుగులు వేయాలని సూచించారు. దేశంలోనే మొదటిసారిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై అవగాహనా సదస్సు నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో నిర్వహించడం ఆనందదాయకమని తెలిపారు.

నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ.. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీన వర్గాల యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలన్న లక్ష్యంతో దేశంలోని వివిధ ప్రముఖ ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులతో స్థానిక ఎన్జీవో సంస్థ అవార్డు సహకారంతో అవగాహనా సదస్సును నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దేశంలోని వివిధ రకాల బ్యాంకులు అందిస్తున్న రుణాలు, సబ్సిడీలతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను స్థాపించడానికి కావాల్సిన వనరులు, నైపుణ్యాలు, పెట్టుబడి తదితర పలు అంశాలపై వివరించారు. బ్యాంకుల చైర్మెన్‌లతో మాట్లాడి స్థానిక యువతకు బ్యాంకులు త్వరితగతిన రుణాలు అందించేలా చర్యలు చేపట్టినట్టు చెప్పారు.

కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ ద్వారా జిల్లాకు ఒకటి చొప్పున ఏడు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నామని హామీ ఇచ్చారు. డిగ్రీ పూర్తి చేసిన యువత సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ దిశగా ప్రయత్నాలు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, మెగా రెడ్డి, డీసీసీబీ చైర్మెన్ విష్ణువర్ధన్ రెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ ఒబెదుల్లా కొత్వాల్, నాగర్‌కర్నూల్, వనపర్తి జిల్లా కలెక్టర్లు, మూడు జిల్లా అదనపు కలెక్టర్లు, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల ప్రతినిధులు, జాతీయ, రాష్ట్ర, జిల్లాల ఉన్నతాధికారులు, తదితరులు పాల్గొన్నారు.

టీజీఎస్పీ కానిస్టేబుళ్లకు ఒకే చోట డ్యూటీ వేయాలి

- ఆయా కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యుల నిరసన
- కుటుంబాలకు దూరమవుతున్నారని ఆందోళన
- ఖమ్మం ప్రధాన రహదారి గవిచర్ల క్రాస్ వద్ద ఆందోళన
- అడ్డుకున్న స్థానిక పోలీసులు

నవతెలంగాణ-సంగెం

మామునూర్ ఫోర్త్ బెటాలియన్ టీజీఎస్పీలో పని చేసే కానిస్టేబుళ్లకు కనీస సెలవులు ఇవ్వకుండా, కుటుంబాలకు దూరం చేస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నారంటూ ఆయా కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. మంగళవారం వరంగల్ జిల్లా ఖమ్మం ప్రధాన రహదారి రంగశాయిపేట-గవిచర్ల క్రాస్‌రోడ్ వద్ద సుమారు 25 నుంచి 35 మంది రిజర్వుడ్ కానిస్టేబుళ్ల కుటుంబ సభ్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీజీఎస్పీలో పని చేసే వారికి సివిల్, ఏఆర్ లాగా ఒకే దగ్గర ఐదేండ్లు డ్యూటీ ఉండి కుటుంబాన్ని చూసుకునేలా మార్పు తేవాలని కోరారు. రిజర్వుడు పోలీసుల బాధలను అర్థం చేసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. పాత పద్ధతినే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కొత్త డీజీపీ కానిస్టేబుళ్లను



కుటుంబాలకు దూరంచేసే నిర్ణయం తీసుకోవడంపై కుటుంబ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. కాగా, నిరసన విషయం తెలుసుకున్న ఫోర్త్ బెటాలియన్ కమాండెంట్ రాంప్రకాష్.. నిరసన తెలుపుతున్న ప్రదేశానికి చేరుకుని కుటుంబ సభ్యులకు నచ్చచెప్పి వారిని కమాండెంట్ ఆఫీస్‌కు తరలించారు. అక్కడ వారితో ఆయన మాట్లాడినట్టు సమాచారం. ఇదిలా ఉండగా కానిస్టేబుళ్ల భార్యలు నిరసన తెలుపుతున్నారన్న విషయాన్ని గ్రహించిన పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినా ఫోర్త్ బెటాలియన్ నుంచి నిరసనకారులు ఒక్కొక్కరు ఆటోల్లో గవిచర్ల క్రాస్‌రోడ్ వద్దకు చేరుకుని నిరసన తెలిపారు.

భవిష్యత్ అవసరాల మేరకు ప్రతిపాదనల్లో మార్పులు

- టీవీవీపీ హాస్పిటళ్ల పై అస్కి ప్రతిపాదనలకు మంత్రి దామోదర సూచన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్‌గా బలోపేతం చేయడానికి అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) రూపొందించిన ప్రతిపాదనల్లో మార్పులు చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు. మంగళవారం మంత్రి టీవీవీపీ హాస్పిటళ్ల పనితీరుపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మార్పుల సమయంలో ఓపీ, ఐపీ, బెడ్ల సంఖ్యను దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ ప్రకారం ఆస్పత్రుల్లో క్లినికల్, నాన్ క్లినికల్ స్టాఫ్ పాటర్న్ ఉండాలని తెలిపారు. అదనపు పోస్టుల మంజూరుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. సర్వీస్ మ్యాటర్, ఉద్యోగుల పదోన్నతుల్లో న్యాయపరమైన చిక్కులు రాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. వీవీపీని సెకండరీ హెల్త్‌కేర్ డైరెక్టరేట్‌గా మార్చడం కోసం రూపొందించిన ప్రతిపాదనలపై అస్కి కన్సల్టెంట్స్ మంత్రికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

చాలాచోట్ల డిస్ట్రిక్ట్ హాస్పిటల్స్ టీచింగ్ హాస్పిటల్స్ కిందకు వెళ్లిపోయాయనీ, కొన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు వీవీపీ పరిధిలోకి వచ్చాయని అధికారులు మంత్రికి తెలిపారు. వీవీపీ పరిధిలోకి వచ్చిన పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు అవసరమైన స్టాఫ్‌తోపాటు, ఏమేం పరికరాలు అవసరమో ప్రతిపాదనలు రూపొందించాలని మంత్రి సూచించారు. జనరల్ మెడిసిన్, సర్జరీ, గైనిక్, పీడియాట్రిక్ వంటి బేసిక్ వైద్య సేవలు అన్నీ వీవీపీ హాస్పిటళ్లలో అందుబాటులో ఉండాలన్నారు. 85 శాతం మంది రోగులకు జిల్లాల్లోనే వైద్యం అందించాలన్నది తమ ప్రభుత్వ లక్ష్యం అని, ఈ లక్ష్యం నెరవేరాలంటే జిల్లా, ఏరియా హాస్పిటళ్లు, కమ్యునిటీ హెల్త్ సెంటర్లలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మంత్రి సూచించారు.

త్వరలో వరంగల్ హాస్పిటల్స్ పర్యటించనున్న మంత్రి

హన్మకొండలోని కాకతీయ మెడికల్ కాలేజీ, దానికి అనుబంధంగా ఉన్న ఎంజీఎం, సీకేఎం, జీఎంహెచ్, టీబీ, కంటి దవాఖానాలపై మంత్రి దామోదర్ రాజనర్సింహ సమీక్షించారు. ఎంజీఎం హాస్పిటల్‌లో రోగుల ఇక్కట్లపై ఆరా తీసిన మంత్రి, అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వాలు ఎన్నికోట్లు ఖర్చు చేసినా, అంతిమంగా ప్రజలకు వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత అధికారులు, డాక్టర్లదేనన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలనీ, వాటిని పరిష్కరించే బాధ్యత తమదన్నారు. ఏయే సమస్యలు ఉన్నాయో, ఏమేం అవసరాలు ఉన్నాయో రెండ్రోజుల్లో పూర్తి వివరాలతో ప్రతిపాదనలు అందించాలని మంత్రి ఆదేశించారు. కొత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అందుబాటులోకి వచ్చే వరకూ ఇప్పుడున్న హాస్పిటల్స్‌లో రోగులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వైద్య సేవలు అందించాలన్నారు. ఇందుకోసం అవసరమైన రిపేర్లు చేయించాలని అధికారులకు సూచించారు. పేషెంట్ల పట్ల సానుభూతితో, చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. అధికారుల మధ్య సమన్వయ లోపం ఉండకూడదని తెలిపారు. త్వరలో స్వయంగా తానే ఎంజీఎంకు వస్తాననీ, అన్ని వార్డులు పరిశీలిస్తానని మంత్రి తెలిపారు. కేఎంసీ పరిధిలోని 5 హాస్పిటళ్లలో1,525 బెడ్లు అందుబాటులో ఉన్నాయని మంత్రికి అధికారులు వివరించారు. ఇందుకు అనుగుణంగా ఏమేం కావాలో ప్రతిపాదనలు పంపాలని అధికారులకు మంత్రి సూచించారు. ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్, డీఎంఈ (అకాడమిక్) శివరామ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలే లక్ష్యం

- ప్రతి పంచాయతీని సమర్థ, పారదర్శక, బాధ్యతాయుత కేంద్రంగా మారుస్తాం
- జీపీలకు 22,164 కంప్యూటర్లు ఇచ్చేందుకు కేంద్రం ఆమోదం : కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

క్షేత్రస్థాయిలో మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా గ్రామపంచాయతీ వ్యవస్థను బలోపేతం చేస్తామనీ, సమర్థవంత, పారదర్శక, బాధ్యతాయుత కేంద్రంగా ప్రతి పంచాయతీని మారుస్తామని కేంద్ర పంచాయతీరాజ్ మంత్రిత్వశాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ అన్నారు. పంచాయతీ సమ్మేళన్ సిరీస్‌లో భాగంగా హైదరాబాద్‌లోని ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో 'జీవన సౌలభ్యం.. చివరి అంచెవరకూ మెరుగైన సేవలు' అనే అంశంపై తొలి ప్రాంతీయ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్వావలంబనకు, ప్రజలు స్వచ్ఛందంగా పన్ను చెల్లించే దుకు సమర్థవంతమైన సేవలందించడం కీలకమని చెప్పారు. అప్పుడే సొంత ఆదాయ మార్గాల ద్వారా పంచాయతీలు స్వావలంబన సాధించగలుగుతాయన్నారు. సేవలు అందించడంలో ఆదర్శంగా నిలుస్తోన్న రాష్ట్రాల్లో అనుసరిస్తున్న నమూనా ప్రక్రియలను ఇతర రాష్ట్రాల్లో అమలు చేసే కృషి జరగాలని ఆకాంక్షించారు. ఇప్పటివరకూ కంప్యూటర్లు అందుబాటులో లేని వివిధ రాష్ట్రాల్లోని గ్రామ పంచాయతీలకు 22,164 కంప్యూటర్లను అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. 3,301 గ్రామపంచాయతీ కార్యాలయాల నిర్మాణానికి కూడా అనుమతి ఇచ్చిందని గుర్తుచేశారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జీ.నరేంద్రకుమార్ మాట్లాడుతూ..క్షేత్రస్థాయిలో సానుకూల మార్పును తీసుకురావాల్సిన బాధ్యత పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందని నొక్కి చెప్పారు. పంచాయతీ ప్రజాప్రతినిధులు, అధికారులను అత్యాధునిక పరికరాలు, సాంకేతికతో సన్నద్ధం చేయడం ద్వారా క్షేత్రస్థాయి నుంచే పరిపాలనా విప్లవానికి రంగం సిద్ధం చేస్తున్నామన్నారు. పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి అలోక్ ప్రేమ్ నగర్ మాట్లాడుతూ..ఎన్ఐసీకి చెందిన సర్వీస్‌ప్లస్, యునిసెఫ్‌కు చెందిన రాపిడ్ ప్రోతో సహా వివిధ డిజిటల్ సదుపాయాల గురించి ప్రస్తావించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సృజనాత్మకంగా ఉపయోగించడం, సహకార అభ్యసనపై దృష్టి సారించడం వల్ల భవిష్యత్ పంచాయతీ సమ్మేళనాల్లో జరిగే ప్రాంతీయ వర్క్‌షాప్‌లకు కొత్త ప్రామాణికతను నిర్దేశించవచ్చునన్నారు. భాషిని ప్లాట్‌ఫామ్ ద్వారా హైదరాబాద్ పంచాయతీ సమ్మేళనాన్ని బెంగాలీ, ఇంగ్లీష్, గుజరాతీ, హిందీ, కన్నడ, మలయాళం, మరాఠీ, ఒడియా, పంజాబీ, తమిళం, తెలుగుతో సహా పదకొండు భాషల్లో ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని తెలిపారు. దీంతో అన్ని భాషల వారికి అవసరమైన సమాచారాన్ని సమర్థవంతంగా అందించగలుగుతామన్నారు. తెలంగాణ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేశ్‌కుమార్ మాట్లాడుతూ.. సృజనాత్మక విధానాల పై చర్చించడం, క్షేత్రస్థాయిలో సేవలను పెంపొందించడం కోసం అనుభవాలను పంచు కోవడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మిజోరం, ఒడిశా రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొని ప్రజలకు సేవలందించడంలో సవాళ్లు, అవకాశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

కాంగ్రెస్ పాలనలో రైతాంగానికి తీవ్ర మోసం

- మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర రైతాంగం అడుగడుగునా మోసపోతోందని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. రైతు బంధు, రుణమాఫీ, ధాన్యానికి బోనస్ తదితరాంశాలన్నింటిలో రేవంత్ సర్కార్ అన్నదాతలకు మొండి చెయ్యే చూపుతోందని ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రంలో 44.5 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పత్తి సాగైందని అధికారిక వర్గాలు అంచనా వేశాయని తెలిపారు. ఈ క్రమంలో మొత్తం 322 పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. ఆచరణలో ఇప్పటి వరకూ ఒక్క రైతు దగ్గరా పత్తి కొనుగోలు చేసిన దాఖలాల్లేవని విమర్శించారు. కాంగ్రెస్ ప్రకటించిన వరంగల్ డిక్లరేషన్ ప్రకారం పత్తికి క్వింటాల్‌కు రూ.7,521 మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ కలిపి రూ.8,021 ఇవ్వాల్సి వస్తుందని తెలిపారు. ఈ క్రమంలో ప్రభుత్వం కొనుగోలు చేయకపోవటం వల్ల రైతులు ప్రయివేటు వ్యాపారస్తులకు రూ.5 వేలకే అమ్ముకునే దుస్థితి తలెత్తిందని హరీశ్ ఈ సందర్భంగా వాపోయారు. మరోవైపు అకాల వర్షాల వల్ల పత్తి దిగుబడి తగ్గిపోయిందని పేర్కొన్నారు. ఎకరానికి నాలుగు క్వింటాళ్ల పత్తి కూడా పండలేదని వివరించారు. గోరు చుట్ట మీద రోకటి పోటులా దిగుబడి తగ్గటంతోపాటు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి రావటం వల్ల పత్తి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ సర్కార్ వైఫల్యం వల్లే ఇలాంటి దుస్థితి తలెత్తిందని విమర్శించారు.

విద్యార్థుల ప్రాణాలతో సర్కారు చెలగాటం

మెదక్ జిల్లా హవేలి ఘనపూర్ గురుకులంలో నలుగురు విద్యార్థినులు కరెంట్ షాక్ తగిలి గాయాలపాలవటం పట్ల హరీశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ హయాంలో గురుకులాల్లో పాము కాట్లు, కుక్క, ఎలుక కాట్లు, ఫుడ్ పాయిజన్ కేసులు సర్వసాధారణమయ్యాయని పేర్కొన్నారు.



పాలస్తీనాకు సంఘీభావంగా బ్రస్సెల్స్‌లో భారీ ప్రదర్శన

- గాజా, లెబనాన్‌ల్లో ఊచకోతలను ఆపాలని డిమాండ్

బ్రస్సెల్స్ : గతేడాది కాలంగా బెల్జియంలో పాలస్తీనా సంఘీభావ ఉద్యమం గణనీయమైన రీతిలో ఊపందుకుంది. తక్షణమే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరేలా చూడాలని, ఇజ్రాయిల్‌పై ఆర్థిక ఆంక్షలు విధించాలని దేశవ్యాప్తంగా కార్యకర్తలు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. ఏడాదిగా సాగుతున్న ఈ ఉద్యమాలకు క్లైమాక్స్‌గా ఆదివారం దేశ రాజధాని బ్రస్సెల్స్‌లో బ్రహ్మాండమైన ప్రదర్శన జరిగింది. దాదాపు 70వేల మంది బ్రస్సెల్స్ వీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. గాజాలో ఇజ్రాయిల్ నరమేధాన్ని ఆపేందుకు తక్షణమే కార్యాచరణకు దిగాలని వారు డిమాండ్ చేశారు. ఇజ్రాయిల్‌తో బెల్జియం సంబంధాలు తెగదెంపులు చేసుకోవాలని కోరారు. "నిరాశా నిస్పృహలకు తావు లేదు, దృఢ నిశ్చయంతో ఈ పోరాటం కొనసాగుతుంది" అని గ్లోబలైజ్ సాలిడారిటీ సంస్థకు చెందిన జాస్పర్ తేజ్ వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు జరిగిన నిరసనల్లో ఈ ర్యాలీనే అతిపెద్దదని అంతర్జాతీయ ఆరోగ్య సంఘీభావ సంస్థ అయిన వివా సాలూద్‌కి చెందిన మాటిల్డ్ దే కూమన్ వ్యాఖ్యానించారు. గాజాలో ఏం జరుగుతోందో, లెబనాన్‌లో ఎలా వుందో ప్రజలు చూస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకునేంతవరకు తమ పోరాటాన్ని విరమించేది లేదని వారు స్పష్టం చేశారు.

ఏడాది తర్వాత కూడా ఇంత పెద్ద ఎత్తున ప్రజా సమీకరణ చోటు చేసుకోవడంపై స్పందిస్తూ, గాజాలోని ఊచకోత పట్ల ప్రజలు ఎంతలా ఆందోళన చెందుతున్నారో తెలుస్తోందని పలువురు ప్రదర్శకులు పేర్కొన్నారు. గత అక్టోబరు నాటి సంఘటనలతో నిమిత్తం లేకుండా కార్యకర్తలు పాలస్తీనా ఉద్యమానికి బలమైన సంఘీభావం నిర్మించుకుంటూ వస్తున్నారు. అదే క్రమంగా బలమైన ప్రజా సమీకరణ శక్తిగా మారింది. బ్రస్సెల్స్‌లో ఇప్పటికే ఆరు సార్లు జాతీయ స్థాయిలో ప్రదర్శనలు జరిగాయి. బెల్జియం వర్కర్స్ పార్టీ (పిటిబి)తో సహా విస్తృత వర్గాల నుండి ప్రజలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. ఆరోగ్య కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాలస్తీనా ఆరోగ్య వ్యవస్థను విధ్వంసం చేసిన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు గట్టిగా కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ విధానాలతోనే వ్యవసాయాభివృద్ధి



అమరావతి : ప్రత్యామ్నాయ విధానాలతోనే వ్యవసాయాభివృద్ధి సాధ్యమవుతుందని కేరళ స్థానిక స్వపరిపాలన, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి ఎంబి రాజేష్ అన్నారు. 'వ్యవసాయ రంగ సమస్యలు - కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు' అనే అంశంపై మంగళవారం విజయవాడ ఎంబివికెలో ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు జరిగింది ఏపీ రైతు సంఘం సీనియర్ నాయకులు వై.కేశవరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో రాజేష్ మాట్లాడుతూ పరిమిత అధికారాలతో పాటు, కేంద్ర ప్రభుత్వం సహాయ నిరాకరణ చేసినప్పటికీ ప్రత్యామ్నాయ ప్రజా ప్రణాళిక ద్వారా వ్యవసాయ రక్షణకు, రైతుల సంక్షేమానికి కేరళలోని ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. 1957లో ఇఎంఎస్ నంబూద్రిపాద్ నేతృత్వంలో ఏర్పడిన తొలి ప్రభుత్వంలోనే ఈ దిశలో బీజం పడిందని అన్నారు. నాడు భూ సంస్కరణలు, అధికార వికేంద్రీకరణ మీద దృష్టి పెట్టారని, ఆ కృషే నేడు కేరళ పలు రంగాల్లో మొదటి స్థానంలో నిలిచేందుకు దోహదపడిందన్నారు. కేరళలో స్థానిక సంస్థలను స్థానిక ప్రభుత్వాలుగా తీర్చిదిద్దుతున్నామని, వీటికి కేటాయించే నిధుల్లో 30శాతం వ్యవసాయ, అనుబంధ రంగాల రక్షణకు ఖర్చు చేస్తున్నామన్నారు. కుడుంబశ్రీ(సెల్ఫ్ హెల్ప్ (గ్రూపులు)ను ఏర్పాటు చేసి మహిళా సాధికారికతకకు కృషి చేస్తున్నట్టు మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలో మొత్తం మీద 3.16లక్షల సెల్ఫ్ హెల్ప్ గ్రూపుల్లో 46లక్షల మంది మహిళలు ఉన్నారని తెలిపారు. 90వేల సాగు గ్రూపులు ఏర్పాటు చేసి లక్షలాదిమంది మహిళలను భాగస్వామ్యులను చేసినట్లు చెప్పారు. వీటిలో రెండు వేల గ్రూపులు కూరగాయల ఉత్పత్తిలో భాగస్వామ్యమయ్యాయన్నారు. దీంతో ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రాజకీయ రంగాల్లో మార్పులచ్చాయని వివరించారు. తమ రాష్ట్రంలో భూమి ప్రాతిపదికగా రైతుకు హెక్టారుకు ప్రభుత్వం నుంచి రూ.5,500లు, స్థానిక ప్రభుత్వం నుంచి రూ.18 వేలు సహాయం చేస్తున్నామని, ఒక్కోసారి ఈ సహాయం రూ.29 వేల వరకు ఉంటుందని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 16 రకాల కూరగాయలకు మద్దతు ధరలు ప్రకటించి ఇస్తున్నామని తెలిపారు. సాగుదారుకు ధర దక్కకపోతే ప్రభుత్వమే వాటిని మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. కొబ్బరి రైతులకు అండగా 272 గ్రామాల్లో 1.44లక్షల ఎకరాల కొబ్బరి తోటలకు నగదుసబ్సిడీఇచ్చి ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. గత ఏడేండ్లుగా కేరళ అప్పు తీసుకురాలేదన్నారు. ఇలాంటి అననుకూల పరిస్థితుల్లోనూ విద్య, ఆరోగ్యం, సుస్థిరాభివృద్ధిలో కేరళ మొదటి స్థానంలో ఉందని కేంద్రమే ప్రకటించిందని అన్నారు. మాజీ వ్యవసాయశాఖ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ ఖర్చులు పెరిగిపోతున్నాయని, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఉండటం లేదన్నారు. స్వామినాథన్ సిఫారసుల మేరకు సి2 ప్లస్ 50ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.

విద్యుత్తు రంగ నిపుణులు కె అశోక్‌రావు మాట్లాడుతూ దేశంలో 58శాతం మంది ప్రజలు ప్రధాన మంత్రి గరీబ్ యోజన ద్వారా బతుకుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆరు స్థంభాల మీద నిలబడి వ్యవసాయ రంగాన్ని నాశనం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్ల విషయానికి వస్తే సమయాన్ని బట్టి (ఉదయం, సాయంత్రం కరెంట్ వాడుకునే డిమాండ్)ను బట్టి విద్యుత్తు రేట్లు చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈ మీటర్లు కూడా ఏడేళ్లకు మించి పనిచేయవని, అప్పుడు రీ ప్లేస్ వినియోగదారుడే భరించాల్సి వస్తుందని తెలిపారు.అఖిలభారత కిసాన్ సభ నాయకులు పి.కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ రైతు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కనీస మద్దతు ధర అని, ఇందుకోసం నవంబరు 26న దేశ వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు.

ఈ సదస్సులో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.కృష్ణయ్య, కె.ప్రభాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ, ఏపీ కౌలు రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు, వ్యవసాయకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు సీఐటీయూ ఏపీ రాష్ట్ర కార్యదర్శి సిహెచ్ నరసింగరావు, ఏపీ రైతు కూలి సంఘం నాయకులు ఎస్ ఝాన్సీ, అక్కినేని భవానీ ప్రసాద్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కె.శ్రీనివాస్, రైతు సంఘం ఆఫీస్ బేర్లు పాల్గన్నారు. సభ కు ముందు ప్రజానాట్యమండలి కళాకారులు రైతు గేయాలను ఆలపించారు.

పర్యావరణ మార్పు.. పేదలకే ముప్పు

చిన్న పరిశ్రమలు, పేద కుటుంబాలకు అధిక నష్టం

- అసంఘటితరంగ కార్మికుల పాలిట శాపం
- అత్యధిక ఉష్ణోగ్రతలు, వరదలతో బిక్కుబిక్కు
- సంపన్నులు అనుకూల ప్రాంతాలకు తరలివెళ్లే ఆప్షన్
- ప్రపంచ బ్యాంకు అధ్యయనంలో వెల్లడి



పారిశ్రామిక విప్లవం తర్వాత భూతాపం పెరుగుతూ వస్తున్నది. పెట్టుబడిదారి విధానం దాన్ని మరింత పెంచి పోషిస్తున్నది. తత్ఫలితమే పర్యావరణ మార్పులు. ఈ మార్పుల వల్ల కలిగే దుష్పరిణామాలు చిన్న చిన్న పరిశ్రమలను, పేదలనే ఎక్కువ నష్టపరుస్తాయని తాజాగా వరల్డ్ బ్యాంక్ ఓ అధ్యయనంలో వెల్లడించింది. పెట్టుబడిదారి విధానంలో పీడితులైన పేదలే.. ఈ పర్యావరణ మార్పుల దుష్ప్రభావాన్ని ఎక్కువ ఎదుర్కోనుండటం వైచిత్రి. పంచభూతాలపై సమస్త ప్రాణకోటికి సమాన హక్కులు ఉంటాయి. కానీ, కొన్ని ఉన్నత వర్గాలు వీటిని వ్యాపారాలకు, స్వలాభాల కోసం ఇష్టారీతిన వినియోగించి మానవాళికి పెనుసవాళ్లను తెచ్చిపెడుతున్నాయి. పర్యావరణ మార్పుల వల్ల అత్యధిక ఉష్ణోగ్రతలు, వరదలు వంటి దుష్ప్రభావాలు చిన్న చిన్న పరిశ్రమలపైనా, పేద ప్రజలపైనా ఎక్కువ ప్రతాపాన్ని చూపుతాయని ప్రపంచ బ్యాంకు తాజా అధ్యయనంలో వెల్లడైంది. 'హౌజ్ హెల్డ్ అండ్ ఫరమ్ ఎక్స్‌పోజర్ టు హీట్ అండ్ ఫ్లడ్స్ ఇన్ సౌత్ ఏషియా' అనే రీసెర్చ్ పేపర్ పర్యావరణ మార్పుల గురించి కీలక వివరాలను బయటపెట్టింది. అత్యధిక ఉష్ణోగ్రతల వల్ల వ్యాధిగ్రస్తుల పరిస్థితులు దిగజారుతాయని, మరణాల సంఖ్య పెరుగుతుందని తెలిపింది. పాఠశాలల మూసివేత వల్ల విద్యార్థులు నష్టపోతారు. సాగు ఉత్పాదకత దెబ్బతిని కర్షకులు దివాళా తీసే పరిస్థితులు దాపురిస్తాయి. ఇక వరదల వల్ల భారీ పంట నష్టాలేగాక ఆస్తుల నష్టం కూడా వాటిల్లుతుంది.

చిన్న పరిశ్రమలకు పెద్ద దెబ్బ

మన దేశంలో వ్యవసాయేతర రంగాల్లో పెద్ద పెద్ద పరిశ్రమల కంటే చిన్న పరిశ్రమలు, అసంఘటిత రంగాలు వరదలు, అత్యధిక ఉష్ణోగ్రతలను ఎదుర్కొనే చాన్స్ ఉన్నదని ఈ రీసెర్చ్ పేపర్ వివరించింది. సాధారణంగానే ఉద్యోగులు పెద్ద పెద్ద పరిశ్రమల్లో ఎక్కువ. సగటున 33 డిగ్రీల ఉష్ణోగ్రతల వద్ద కంటే 31 డిగ్రీల ఉష్ణోగ్రతల వద్ద 12.5 శాతం మంది ఉద్యోగులు తక్కువగా ఉంటారని ఈ అధ్యయనం తెలిపింది.

పట్టణ ప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతల ప్రభావం ఎక్కువ ఉంటుంది. అదే వరదల విషయానికి వస్తే పట్టణ ప్రాంతాల్లో పేదలు ఎక్కువ నష్టపోయే ముప్పు ఉండగా.. గ్రామీణ ప్రాంతాల్లో సంపన్నులు ఈ సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటారని అంచనా వేసింది. వలస వెళ్లే శక్తి సామర్థ్యాలు పర్యావరణ మార్పుల వల్ల ఉత్పన్నమయ్యే తీవ్ర వాతావరణ పరిస్థితుల నుంచి తప్పించుకుని అనుకూల ప్రాంతాలకు తరలి వెళ్లే శక్తి సామర్థ్యాలు పేదల కంటే సంపన్నులకు ఎక్కువ ఉంటాయి. అయితే, తరచూ సంభవించే ఈ సమస్యలు ధనికవర్గాలనూ తీవ్రంగా నష్టపరుస్తాయి. ఇవి వారి ఆస్తులను క్రమంగా ధ్వంసం చేయగలవు.

ఇన్నో :

- పర్యావరణ మార్పులతో ఉత్పన్నమయ్యే తీవ్ర ఉష్ణోగ్రతలు, వరదలను చిన్న పరిశ్రమలు, పేద కుటుంబాలు అధికంగా ఎదుర్కోనున్నాయి.
- ఈ ప్రాంతాల్లో ఎక్కువగా పేద ప్రజలు నివసిస్తున్నారని సర్వే తెలిపింది.
- ఎక్కువ మంది కార్మికులకు ఉపాధినిచ్చే చిన్న పరిశ్రమలే.. అత్యధిక ఉష్ణోగ్రతలు, వరదలను చవిచూస్తాయి.
- సంపన్నులు అనుకూల ప్రాంతాలకు వలస వెళ్లే అవకాశాలున్నాయి. పేదలు వలస వెళ్లే సామర్థ్యాలను కోల్పోతారు.

కల్లుగీతకు మా హయాంలో స్వర్ణయుగం

- మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



కల్లుగీత కార్మికులు, పరిశ్రమకు బీఆర్‌ఎస్ హయాంలో స్వర్ణయుగంగా మారిందని మాజీ ఎక్సైజ్ శాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కల్లుగీత కార్మిక సంఘం 67వ వార్షికోత్సవాలు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగాయి. ఈ సందర్భంగా 'తెలంగాణలో పదేండ్ల ప్రయాణం ఆల్బమ్'ను ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులుల ఎమ్ రమణ, ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు వీ వెంకట నరసయ్య, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ ఎమ్ కృష్ణస్వామి, రాఘవేంద్ర తదితరులు మాజీ ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, తాడి కార్పొరేషన్ మాజీ చైర్మెన్ పల్లె రవికుమార్‌గౌడ్‌కు అందచేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వ హయాంలో గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశామన్నారు. సర్వాయి పాపన్న జయంతి వర్ధంతి అధికారికంగా నిర్వహించి, ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలని జీవో జారీ చేశామన్నారు. హైదరాబాదులో మూసివేసిన కల్లు దుకాణాలు తెరిపించామనీ, వృత్తి పన్ను రద్దు చేశామనీ, ఎక్స్‌గ్రేషియా రూ.5 లక్షలకు పెంచామన్నారు. నీరా పాలసీ తీసుకువచ్చి నెక్లెస్‌రోడ్‌లో నీరాకేఫ్ నిర్మించామన్నారు. వైన్‌షాప్‌లో గౌడులకు 15శాతం రిజర్వేషన్లు కల్పించామన్నారు. కల్లుగీత కార్మిక సంఘం నిత్యం గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలు, పోరాటాలు నిర్వహిస్తుందని అభినందించారు. సంఘం తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారం కోసం కృషి చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేసి చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. లేనిపక్షంలో అన్ని సంఘాలను కలుపుకొని ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు.

మదరసాలపై అలహాబాద్ హైకోర్టు తీర్పును సవాలు చేసిన పిటిషన్లపై విచారణ


తీర్పును రిజర్వ్ చేసుకున్న సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ : మదరసాలపై అలహాబాద్ హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై తీర్పును సుప్రీం కోర్టు మంగళవారం రిజర్వ్ చేసుకుంది. మదరసాలపై 2004లో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టం లౌకికవాదం సూత్రాలను ఉల్లంఘిస్తున్నందున రాజ్యాంగ విరుద్ధమైనవని పేర్కొంటూ అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఆ తీర్పును సవాలు చేస్తూ 8 పిటిషన్లు దాఖలయ్యాయి. వారి తరపు న్యాయవాదులు, అలాగే యుపి ప్రభుత్వం తరపున అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజ్ వాదనలను దాదాపు రెండు రోజుల పాటు విన్న తర్వాత ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ నేతృత్వంలోని బెంచ్ తీర్పును రిజర్వ్ చేసుకుంది. ఈ పిటిషన్లపై తుది విచారణ ప్రారంభిస్తూ పిటిషనర్ల తరపున అభిషేక్ మను సింఘ్వి, సల్మాన్ ఖుర్షీద్, మేనకా గురుస్వామిలతో సహా సీనియర్ న్యాయవాదులు చేసిన వాదనలను బెంచ్ వింది. మంగళవారం ముకుల్ రోహత్గి, చిదంబరం, గురు కృష్ణ కుమార్‌లతో సహా మరికొందరు సీనియర్లు జరిపిన వాదనలు కూడా బెంచ్ వింది. చివరగా తన తీర్పును రిజర్వ్ చేసుకున్నట్లు బెంచ్ ప్రకటించింది. ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమైనదని, లౌకికవాద సూత్రాలను ఉల్లంఘిస్తోందని పేర్కొంటూ మార్చి 22న అలహాబాద్ హైకోర్టు తీర్పు ఇచ్చింది. సాధారణ స్కూలింగ్ వ్యవస్థలో మదరసా విద్యార్థులకు అవకాశం కల్పించాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. హైకోర్టు తీర్పుపై స్టే విధిస్తూ ఏప్రిల్ 5న సుప్రీం బెంచ్ 17లక్షల మదరసా విద్యార్థులకు ఉపశమనం కలిగించింది.

విశాఖ ఉక్కుపై విఆర్‌ఎస్ పిడుగు

- సర్వేకు సిద్ధమైన యాజమాన్యం
- ప్రైవేటీకరణ కోసం వేగంగా కేంద్రం చర్యలు



విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్ గురించి రాష్ట్రంలోని తెలుగుదేశం కూటమి నేతలు చెప్పే మాటలు ఎలా ఉన్నప్పటికీ, నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రైవేటీకరణ దిశలో వేగంగా చర్యలు తీసుకుంటోంది. తాజాగా ఉక్కు కార్మికులు, ఉద్యోగులపై స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వలంటరీ రిటైర్మెంట్ స్కీమ్ -విఆర్‌ఎస్) పిడుగు పడింది. సిబ్బంది సంఖ్యను గణనీయంగా తగ్గించడమే లక్ష్యంగా స్టీల్‌ప్లాంట్‌లోని మానవ వనరుల విభాగం మంగళవారం జారీ చేసిన సర్క్యులర్ కలకం రేపింది. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం తాము ఆందోళన చేస్తుంటే దానిని ఏమాత్రం పట్టించుకోకుండా విఆర్‌ఎస్ సర్క్యులర్‌ను జారీ చేయడం ఏమిటని కార్మికులు ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు.

'సర్వే ' నిజమేనా..?

సర్క్యులర్‌లో సర్వే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నప్పటికీ కార్మికులు, ఉద్యోగుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎంప్లాయ్ పోర్టల్ సపోర్ట్ సిస్టమ్‌లో 'సర్వే ఫర్ విఆర్‌ఎస్' పేరుతో ఒక మాడ్యుల్‌ను రూపొందించినట్లు సర్క్యులర్‌లో యాజమాన్యం పేర్కొంది. భాగస్వాములయ్యేవారి అభిప్రాయాలను తీసుకునేందుకు సర్వేలను నిర్వహించే సంగతి తెలిసిందే. ఈ తరహా సర్వేల్లో అవును, కాదు అని సమాధానం వచ్చేలా ప్రశ్నలు ఉంటాయి. అయితే, ఉక్కు యాజమాన్యం జారీ చేసిన సర్క్యులర్‌లో దీనికి భిన్నంగా అర్హులైన ఉద్యోగులు విఆర్‌ఎస్‌కు ఈ మాడ్యుల్ ద్వారా 'అంగీకారం (విల్లింగ్‌నెస్) తెలపాలని పేర్కొనడం చర్చనీయాంశమైంది. అయితే, సర్వేలో పాల్గొన్న వారు 'అంగీకారం' తెలిపినంత మాత్రాన దానికి విఆర్‌ఎస్‌కు దరఖాస్తుగా పరిగణించబోమని సర్క్యులర్‌లో తెలిపారు.

ఉద్యోగుల కుదింపు కుట్రలను ఆపాలి : సిపిఎం

విఆర్‌ఎస్ సర్వే పేరుతో విశాఖ ఉక్కు కార్మికులు, అధికారుల తగ్గింపు కుట్రలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒకవైపు స్టీల్‌ప్లాంట్‌ను అభివృద్ధి బాట పట్టిస్తామని, నవంబర్ నుంచి రెండో బ్లాస్ట్ ఫర్నేస్‌ను నడిపించే పనులు ప్రారంభిస్తామని ప్రకటనలు చేస్తూ.. మరో వైపు కార్మికులను, ఉద్యోగులను తగ్గించడానికి పూనుకోవడం దారుణమని పేర్కొన్నారు.

సర్క్యులర్‌లో ఏముంది?

10/24 నెంబర్‌తో జారీ అయిన ఈ సర్క్యులర్‌లో ఆర్ఐఎన్ఎల్ ఉద్యోగులు, ఎగ్జిక్యూటివ్‌లకు ఈ పథకాన్ని వర్తింపచేస్తున్నట్లు పేర్కొంది. ఎవరైనా విఆర్‌ఎస్ తీసుకోవాలని భావిస్తే యాజమాన్యం ఆ సౌకర్యం కల్పిస్తుందని, ఆ దిశలో ఆలోచించే వారు ముందుకు రావాలని ఆ సర్క్యులర్‌లో పేర్కొంది. రెగ్యులర్ ఉద్యోగు (ఎగ్జిక్యూటివ్‌లు, నాన్ ఎగ్జిక్యూటివ్‌లు)లకు ఈ విఆర్‌ఎస్ వర్తిస్తుందని తెలిపింది. 2024 సెప్టెంబర్ 30 నాటికి 45 ఏళ్లు నిండిన వారు (15 ఏళ్ల సర్వీసు పూర్తిచేసుకుని ఉంటే) విఆర్‌ఎస్‌కు అర్హులని పేర్కొంది. ఉద్యోగులు ఈ నెల 29లోగా తమ ఇష్టాన్ని వెల్లడించాలని డెడ్‌లైన్ విధించింది.

బెంగళూరులో కూలిన భవనం

- ఒకరి మృతి, 14 మందికి తీవ్రగాయాలు
- శిథిలాల్లో ఇద్దరు చిత్తూరు వాసులు?

బెంగళూరు : బెంగళూరు హెన్నూరు సమీపం లోని బాబు సాపల్యలో నిర్మాణంలో ఉన్న ఆరంతస్తుల భవనం కుప్పకూలింది. దీంతో, ఒక కార్మికుడు మరణించాడు. శిథిలాల కింద చిక్కుకున్న 14 మందిని సహాయక బృందాలు రక్షించాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరుసహా శిథిలాల కింద మరికొందరు చిక్కుకుపోయారని అధికారులు తెలిపారు. అంజనాద్రి లే అవుట్‌లోని ఈ భవనం భారీ వర్షాల వల్ల మంగళవారం కూలిపోయింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, అత్యవసర సేవల బృందం అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టి, బాధితులను రక్షించారు. వివిధ ఆసుపత్రులకు తరలించారు. సంఘటనా సమయంలో భవనంలో 20 మందికిపైగా కార్మికులున్నారని, మిగిలిన వారి ఆచూకీ కోసం సహాయక చర్యలు కొనసాగిస్తున్నామని అధికారులు తెలిపారు. భారీ వర్షాలు, నిర్మాణంలో నాణ్యత లేకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక విచారణలో వెల్లడైంది. మృతుడిని బీహార్‌కు చెందిన అర్మాన్ (26)గా గుర్తించారు. చిత్తూరు జిల్లాకు చెందిన తులసిరెడ్డి, గజేంద్ర, బీహార్‌కు చెందిన మొహమ్మద్, అర్షాద్, తిరుపాలి, సోలో పాశ్వాన్, తమిళనాడుకు చెందిన ఎలుమైల్ భవనం శిథిలాల్లో చిక్కుకున్నారని భావిస్తున్నారు.

'అనంత'లో వర్ష బీభత్సం

- నీటమునిగిన కాలనీలు, లోతట్టు ప్రాంతాలు
- పలు పంటలకు నష్టం
- 80 గొర్రెలు మృతి



కురువు సీమ ఉమ్మడి అనంతపురం జిల్లాలో కురిసిన కుండపోత వర్షం బీభత్సం సృష్టించింది. వాగులు, వంకలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. పలు పంటలకు నష్టం వాటిల్లింది. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు ప్రారంభమైన వర్షం మంగళవారం ఉదయం ఆరు గంటల వరకూ కొనసాగింది. శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి, రాప్తాడు, పెనుకొండ, కొత్తచెరువు మండలాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. అనంతపురంలోని పండమేరు వంక పొంగి పొర్లడంతో శివారు కాలనీలు నీటమునిగాయి. పండమేరువంక పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అర్ధరాత్రి మూడు గంటల సమయంలో ఒక్కసారిగా మోకాళ్లలోతు వరద నీరు రావడంతో కాలనీవాసులు కట్టుబట్టలతో అక్కడి నుంచి బయటకు వచ్చేశారు. కొందరు ప్రాణభయంతో మిద్దెలపైకి ఎక్కారు. ఇళ్లలోకి నీరు చేరి సామగ్రి మొత్తం తడిసిపోయింది. పలు ద్విచక్ర వాహనాలు నీటిలో కొట్టుకుపోయాయి. పోలీసులు, రెవెన్యూ అధికారులు ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టారు. మిద్దెలపై ఉన్న వారిని సురక్షితంగా కిందకు దించి పునరావాస కేంద్రాలకు తరలించారు. శ్రీసత్యసాయి జిల్లా కనగానపల్లి, రాప్తాడు మండల పరిధిలోని బండమీదపల్లి చెరువులు తెగాయి. వీటి కింద ఉన్న పంట పొలాలు నీటమునిగాయి. బండమీదపల్లి గ్రామంలో బోయ మాధవయ్యకు చెందిన 80 గొర్రెలు చనిపోయాయి. రాప్తాడు, రామగిరి, ఎన్ఎస్ గేటు, కనగానపల్లి, పెనుకొండ, పుట్టపర్తి, ధర్మవరం, కొత్తచెరువు ప్రాంతాల్లో రహదారులు జలమయం కావడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. రాప్తాడు మండలం పర్వతదేవరపల్లి వద్ద ఎన్‌హెచ్ 44పై వరద నీరు ప్రవహించడంతో బెంగళూరు-హైదరాబాద్‌కు వెళ్లే వాహనాలు ఉదయం 11 గంటల వరకు నిలిచిపోయాయి. అనంతపురం రూరల్, ధర్మవరం, కొత్తచెరువు, పుట్టపర్తి, రాప్తాడు, కనగానపపల్లి, బొమ్మనహాల్ తదితర మండలాల్లో పంటలు నీటమునిగాయి. రాయదుర్గం మండలంలో వర్షం ధాటికి పలు చెక్ డ్యామ్‌లు దెబ్బ తిని నీరు వృథాగా బయటకుపోయింది. చిత్రావతి నదికి భారీగా వరద నీరు పోటెత్తింది. ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిం చారు. ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి ప్రసాద్ ముంపు ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు పరిశీలించారు. వర్షం వల్ల నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఓ ప్రకటనలో ద్వారా తెలిపారు.

బహుదా నదిపై కల్వర్టు తెగిపోవడంతో రాకపోకలకు అంతరాయం

చిత్తూరు జిల్లాలో కురిసిన వర్షాలకు నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. కల్వర్టులు తెగి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

తవణంపల్లి మండలం అరగొండ-సరకల్లు మార్గంలోని తొడతర వద్ద బహుదా నదిపై కల్వర్టు తెగిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సోమల మండలం పెద్దఉప్పరపల్లి అటవీ ప్రాంతంలో కురిసిన భారీ వర్షానికి గార్గేయ నది ఉధృతంగా ప్రవహించడంతో కొర్లగుంటవారిపల్లి ప్రాజెక్టు నిండి మొరవ పారుతోంది.

ఉధృతంగా కట్టలేరు వాగు

ఎన్‌టిఆర్ జిల్లా గంపలగూడెం మండలం వినగడప వద్ద కట్టలేరు వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో, వినగడప వద్ద డైవర్షన్ రహదారిపై నుండి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. ఈ రహదారిపై నుండి లోడుతో వెళున్న టిప్పర్ నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాయంత్రానికి టిప్పర్‌ను రహదారి నుండి పక్కకు తీసుకొచ్చారు. అనంతరం వాహనాల రాకపోకలు కొనసాగాయి.